12-06Pg1exHMNWJQEBPRCKLT.qxd:12-06Pg1exHMNWJQEBPRCKLT.qxd 1/1/02 6:31 AM Page 1

రెండేళ్లలో ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం
అదే కూటమి ప్రభుత్వ విజయం
ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం...
తిరుగులేని సంక్షేమాన్ని, అభివృద్ధిని అందిస్తున్నాం

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
విశాఖపట్నం
: fb.com/vaartha Digital
Published from Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
12-6-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 132 పేజీలు: 16 వెల: 6.50

రెండేళ్లలో ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం
అదే కూటమి ప్రభుత్వ విజయం
ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం...
తిరుగులేని సంక్షేమాన్ని, అభివృద్ధిని అందిస్తున్నాం


రెండేళ్లలో ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం

అదే కూటమి ప్రభుత్వ విజయం

సత్యమేవ జయతే

స్వాగతం సుస్వాగతం



ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, అద్భుత సంక్షేమాన్ని అందిస్తూ, సాటిలేని అభివృద్ధిని సాధిస్తూ
ప్రజారంజక పాలన అందిస్తున్న మన కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న వేళ...

భారీ బహిరంగ సభ

గౌ॥ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి
శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు

గౌ॥ ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి
శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ గారు

గౌ॥ ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటి శాఖామాత్యులు
శ్రీ నారా లోకేష్ గారు

భాజపా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు
శ్రీ పి.వి.ఎన్. మాధవ్ గారు

స్థలం : దామినేడు గ్రామం, తిరుపతి | తేదీ : జూన్ 12, 2026 | సమయం : 11:00 గంటలకు

రెండేళ్లుగా పేదల ఆర్థిక ప్రగతికి బాటలు వేస్తున్న కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలు

రెండేళ్లలో రూ.65,000 కోట్లకు పైగా పింఛన్ల పంపిణీ (ఎన్టీఆర్ భరోసా పింఛన్లు)

ఆడపడుచులకు 4.26 కోట్ల ఉచిత వంట గ్యాస్ సిలిండర్లు

23+ లక్షల కోట్ల పెట్టుబడులు... 21+ లక్షల ఉద్యోగ అవకాశాలు

269 అన్న క్యాంటీన్లు 9.71 కోట్ల భోజనాలు (అన్న క్యాంటీన్)

2 లక్షల బంగారు కుటుంబాలకు మార్గదర్శులు (P4)

2.90 లక్షల మంది ఆటో, టాక్సీ డ్రైవర్లకు రూ.436 కోట్ల పంపిణీ (ఆటోడ్రైవర్ల సేవలో)

Mega DSC ద్వారా 15,941 టీచర్ పోస్టుల భర్తీ, 5,757 కానిస్టేబుల్ పోస్టుల నియామకాలు పూర్తి

2 ఏళ్ల నమ్మకం
అభివృద్ధి, సంక్షేమం

(తల్లికి వందనం) 67.27 లక్షల మంది విద్యార్థులకు రూ.10,090 కోట్లు

(అన్నదాత సుఖీభవ) 46 లక్షల అన్నదాతలకు రూ.8,985 కోట్లు

(మత్స్యకారుల సేవలో) 1.25 లక్షల మత్స్యకార కుటుంబాలకు రూ.250 కోట్లు

(మన ఇల్లు మన గౌరవం) 5 లక్షల ఇళ్ల పంపిణీ

(స్త్రీ శక్తి) 71 కోట్ల ఉచిత ప్రయాణాలు

(దివ్యాంగ శక్తి) 31 లక్షల ఉచిత ప్రయాణాలు

చేనేత మగ్గాలకు నెలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్

జారీచేసిన వారు: సంచాలకులు, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం... తిరుగులేని సంక్షేమాన్ని, అభివృద్ధిని అందిస్తున్నాం

12-06pg2exHMNWJQERKL.qxd:12-06pg2exHMNWJQERKL.qxd 1/1/02 6:43 AM Page 1





# ఖర్గ్‌ని స్వాధీనం చేసుకుంటాం

## వరుసగా మూడో రాత్రి భీకర దాడులుచేస్తాం...

## ట్రూత్ పోస్టులో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడి

**వాషింగ్టన్,జూన్ 11:** ఇరాన్‌పై సైనిక చర్యలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వరుసగా మూడో రాత్రి కూడా అమెరికా దాడులు కొనసాగుతాయని ఆయన తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో ప్రకటించారు. ఇరాన్ నౌకాదళం, వైమానిక దళం, రాడార్ వ్యవస్థలు, వైమానిక రక్షణ సామర్థ్యాలు దాదాపు నిర్వీర్యమయ్యాయని పేర్కొంటూ, ఈరాత్రి ఇరాన్‌పై అమెరికా చాలా తీవ్రంగా దాడి చేస్తుందని ట్రంప్ వెల్లడించారు. ఇరాన్ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన ఖర్గ్ దీవిని తమ ఆధీనంలోకి తీసుకుంటామని ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్ ముడి చమురు ఎగుమతుల్లో సుమారు 90శాతం ఈదీవి ద్వారానే జరుగుతుండటంతో దీనికి వ్యూహాత్మక ప్రాధాన్యం ఉంది. ఇరాన్ చమురు, గ్యాస్ మార్కెట్లపై పూర్తిస్థాయి నియంత్రణ సాధిస్తామని ఆయన అన్నారు. అమెరికా సెంట్రల్ కమాండ్ ఇరాన్‌లోని పలు లక్ష్యాలపై అదనపు ఆత్మరక్షణ దాడులు నిర్వహించినట్లు ధృవీకరించింది. దీంతో వరుసగా రెండో రోజు అమెరికా సైనిక చర్యలు కొనసాగినట్లైంది. మరోవైపు ఇరాన్‌లోని పలు ప్రాంతాల్లో వైమానిక రక్షణ వ్యవస్థలు యాక్టివేట్ అయ్యాయని, టెహ్రాన్ పశ్చిమ ప్రాంతాలు, ఫార్స్ ప్రావిన్స్, బందర్ అబ్బాస్, ఖేష్మ్, కిష్, ఇస్ఫహాన్ ప్రాంతాల్లో పేలుళ్లు సంభవించినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. అమెరికా దాడులకు ప్రతిగా ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ కువైట్, బహ్రెయిన్‌లలోని అమెరికా సైనిక స్థావరాలపై క్షిపణి దాడులు జరిపామనిప్రకటించింది. అలీ అల్ సలేం, అహ్మద్ అల్ జాబర్ వైమానికస్థావరాలతో పాటు బహ్రెయిన్ లోని షేక్ ఈసా ఎయిర్ బేస్‌ను లక్ష్యంగా చేసుకున్నట్లు ఇరాన్ వెల్లడించింది. అమెరికా ఆర్మీకి చెందిన అపాచీ హెలికాప్టర్ కూల్చివేత తర్వాత పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఏప్రిల్ 8నుంచి అమల్లో ఉన్న కాల్పుల విరమణ ఒప్పందం ఈ ఘటనతో దాదాపు కూలిపోయినట్లైందని విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికా, ఇరాన్ పరస్పర దాడులతో మళ్లీ యుద్ధవాతావరణం నెలకొంది. ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రాంతీయ దేశాలు దౌత్యపరమైన పరిష్కారానికి ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలో ఖతర్ ప్రతినిధి బృందం టెహ్రాన్‌కు వెళ్లి ఇరాన్ అధికారులతో చర్చలు జరిపింది. అమెరికా సమన్వయంతో జరిగిన ఈ చర్చలు గురువారం తెల్లవారుజాము వరకు కొనసాగినట్లు తెలిసింది. ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న సైనిక చర్యల నేపథ్యంలో శాంతి చర్చల భవిష్యత్తుపై అనిశ్చితి నెలకొంది.

# గృహిణులు దేశ నిర్మాతలు

>> ఇంట్లో చేసే పనులతో ఆదాయం సంపాదించక పోయినంత మాత్రాన వారి పనితనానినికి వెల కట్టలేమని కాదని, సగటున కనీసం రూ.30వేలు చెల్లించాలని ఆదేశించింది. సాధారణంగా గృహిణులు చేసే పనులకు పరిహారం తక్కువగా వస్తుంటుంది. ఎందుకంటే ఈ పనిని ఇటు కూలీ పనిలాగా కాకుండా, అటు స్కిల్డ్, నాన్ స్కిల్డ్‌పనిలాగా కాకుండాచూస్తారు. అందుకే పరిహారం విషయంలో గృహిణులకు తగిన న్యాయం జరగడం లేదు. సుప్రీంకోర్టు తాజా ఆదేశాలకు అనుగుణంగా ఇకపై గృహిణులు మరణిస్తే వారి కుటుంబాలకు ప్రతి నెలా కనీస పరిహారం అందే అవకాశం ఉంది. 2001లో పంజాబ్‌లో ఒక మహిళ రోడ్డు ప్రమాదంలో మరణించింది. ఆమె తరఫున పరిహారం కోరుతూ భర్త, ముగ్గురు పిల్లలు మోటార్ యాక్సిడెంట్స్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. అనంతరం ఈ అంశం వివిధ కోర్టుల్లో విచారణ జరుగుతూ.. చివరికి సుప్రీంకోర్టు వరకు చేరింది. తాజాగా కోర్టు వారికి అనుకూలంగా, పరిహారం చెల్లించాలని ఆదేశించింది.

# జీర్ణోద్ధరణ పనులకు శ్రీకారం

>> చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపైనా మంత్రి లోకేష్ పలు సూచనలు చేశారు. ఆలయాన్ని అభివృద్ధి చేసే అవకాశం జీవితంలో ఒక్కసారి మాత్రమే వస్తుందని, భక్తులు సంతృప్తి చెందేలా పకడ్బందీ ప్రణాళికతో ముందుకు వెళ్లాలని ఈ సందర్భంగా అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. రూ.6 కోట్ల వ్యయంతో మంగళగిరి శ్రీ లక్ష్మీ ్మ నరసింహస్వామి దేవాలయంలో పలు జీర్ణోద్ధరణ, అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. జులై 3వ తేదీన ఆయా పనులకు శంకుస్థాపన చేయనున్నారు. దాతల నుంచి విరాళాలా సేకరణపైనా సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్, ఆలయ ఇఒ కోగంటి సునీల్ కుమార్, ఎండోమెంట్ చీఫ్ ఇంజనీర్ జి.శేఖర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఇంజనీర్ మోహన్, వాస్తుశిల్పి పరమేశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

# వాసుదేవరెడ్డి అరెస్టు

>> శ్రీధర్‌రెడ్డి, మద్యం ముడుపుల వసూళ్లలో కీలకంగా వ్యవహరించిన రాజ్ కెసిరెడ్డి తోడల్లుడు ముప్పిడి అవినాష్‌రెడ్డి, వీరి అనుచరులు బూనేటి చాణక్య, టి.కిరణ్‌కుమార్‌రెడ్డి, సైఫ్ అహ్మద్‌తో పాటు మద్యం ముడుపుల సొత్తు రూటింగ్ కోసం వినియోగించిన పలు డొల్ల సంస్థల యాజమాన్యాలను నిందితులుగా ఇడి చేర్చింది. ఎపి బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి, ఆయన బంధువు నరసింహారెడ్డి ఇల్లు, కార్యాలయాల్లోనూ ఇడి అధికారులు సోదాలు చేశారు. ఈ క్రమంలో వాసుదేవరెడ్డిని ఇడి అరెస్ట్‌చేసింది. మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఇళ్లు, కార్యాలయాల్లో ఇడి అధికారులు తనిఖీలు చేసింది. ఎపి మద్యం కుంభకోణంలో రూ.వేల కోట్లు చేతులు మారాయన్న ఆరోపణలున్నాయి.

## తమిళనాడులో ఐదుస్థానాలకు ఉప ఎన్నికలు

**చెన్నై,జూన్ 11:** తమిళనాడులో ఖాళీగా ఉన్న ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఉప ఎన్నికలు నిర్వహించేందుకు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ప్రాథమిక ఏర్పాట్లు ప్రారంభించింది. ముఖ్యమంత్రి సహా పలువురు ఎమ్మెల్యేల రాజీనామాలతో ఈ స్థానాలు ఖాళీ అయ్యాయి. ఇటీవలి ఎన్నికల్లో తిరుచ్చి ఈస్ట్, పెరంబూర్ స్థానాల నుంచి గెలిచిన విజయ్ నిబంధనల ప్రకారం తిరుచ్చి ఈస్ట్ స్థానానికి రాజీనామా చేశారు. దీంతో ఆ స్థానం ఖాళీ అయింది. దీనికి తోడు, టీఎంసీ ప్రభుత్వానికి విశ్వాస పరీక్షలో మద్దతిచ్చిన నలుగురు అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేసి అధికార పార్టీలో చేరారు. దీంతో మరో నాలుగు స్థానాలు ఖాళీ అయ్యాయి.

# విస్తృత భాగస్వామ్యంతోనే వికసిత్ భారత్

>> టర్లను పర్యవేక్షిన్నాం అన్నారు. వాతావరణం, పంటల స్థితిగతులు, భూగర్భ జలాల వంటి 41 రకాల సమాచారాన్ని రియల్ టైమ్‌లో విశ్లేషించి ప్రజలకు సమాచారం ఇస్తున్నాం. మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ యాప్ ద్వారా ప్రభుత్వ సేవల్ని పారదర్శకంగా ప్రజల ఇంటివద్దనే అందిస్తున్నాం. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో గడచిన 2ఏళ్లలో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాం. పెట్టుబడుల్ని ఆకర్షించటంలో రాష్ట్రాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉండాలని, అదే సమయంలో అస్థిరమైన విధానాలు మేలు చేయవు అని పేర్కొన్నారు. అత్యుత్తమ స్థాయి మౌలిక సదుపాయాలు, వేగంగా అనుమతుల జారీ లాంటి స్థిరమైన వాతావరణం కల్పనపై దృష్టి పెట్టాలి అన్నారు. గృహ నిర్మాణం, పారిశుద్ధం, కుళాయి నీరు, వంటగ్యాస్, విద్యుత్, డిజిటల్ కనెక్టివిటీ, డిబిటి లాంటి ప్రజలకు అందించాలన్నదే తమ లక్ష్యం అన్నారు. పి4 లాంటి కార్యక్రమం ద్వారా సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గించే ప్రయత్నం చేస్తున్నామని సిఎం చంద్రబాబు వివరించారు. ప్రజల వైద్యారోగ్య పరిరక్షణకు సంజీవని అనే వినూత్న కార్యక్రమం ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డులు తయారు చేస్తున్నాం అన్నారు. ఆయుష్మాన్ భారత్‌తో అనుసంధానించటం ద్వారా ప్రతీ ఒక్కరికీ ఆరోగ్య రక్షణ అందించటమే లక్ష్యంగా వివరించారు. యోగా, మెడిటేషన్ లాంటి ఆరోగ్యకరమైన అలవాట్లను ప్రజల్లోకి తీసుకెళ్లేలా మానవ వనరుల అభివృద్ధిపై దృష్టిపెట్టాం. విద్యారంగంలో ప్రాథమిక అభ్యాసం నుంచి ఉన్నత విద్య వరకూ సమూల సంస్కరణలు చేపట్టాం. గ్యారంటీడ్ ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంతో పాటు ఎఐ ఆధారిత అడాప్టివ్ లెర్నింగ్ వ్యవస్థలతో ఫలితాలను మెరుగు పరుస్తున్నామని తెలిపారు. వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ మోడల్ విద్యార్థులు చదువుకుంటూనే నైపుణ్యాలు పొందుతున్నారు. నైపుణ్యం వెబ్ పోర్టల్, పిఎం సేతు ద్వారా ఎఐ, క్వాంటం టెక్నాలజీస్ లాంటి రంగాల్లో యువతను సిద్ధం చేస్తున్నాం. రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు 1.5 కంటే తక్కువకు పడిపోవడం వల్ల పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. భవిష్యత్తులో ఆర్థిక, మానవ వనరుల కొరత ఏర్పడకుండా ఎపిలో పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీ రూపొందిస్తున్నాం. దీనిపై జాతీయ స్థాయిలో కార్యాచరణ అవసరమని అభిప్రాయపడ్డారు. వికసిత్ భారత్ 2047 రూపకల్పనలో కేంద్ర, రాష్ట్రాల మధ్య నిరంతర భాగస్వామ్యం అవసరమని సిఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఈ లక్ష్య సాధనకు నీతి ఆయోగ్‌తో కలిసి పనిచేసేందుకు ఎపి సిద్ధంగా ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు.

# అక్టోబర్‌లో మెగా డిఎస్సీ

>> అమలులో పూర్తి చట్టబద్ధత, స్పష్టత, నిబంధనల అనుసరణను నిర్ధారించాల్సిన అవసరం ఏర్పడటంతో పాటు, టెట్-డిఎస్సీ ప్రక్రియలను సమన్వయంతో నిర్వహించి అభ్యర్థులకు ఎటువంటి గందరగోళం లేకుండా పరిపాలనా సౌలభ్యాన్ని కల్పించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ రెండు అంశాల నేపథ్యంలో నియామక ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాల్సి రావడంతో పోస్టుల భర్తీ ఆలస్యమైనట్లు ఆయన స్పష్టం చేశారు.

**డిఎస్సీ ప్రక్రియలో పేపర్ లీకేజీకి అవకాశమే లేదు:**

డిఎస్సీ నియామక ప్రక్రియ పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించబడిందని కోన శశిధర్ తెలిపారు. సిస్టమ్‌కు పరిమిత సంఖ్యలో మాత్రమే అధికారిక యాక్సెస్ ఉంటుందని, కేవలం ఇద్దరు నియమిత శాశ్వత ఉద్యోగులు మాత్రమే డేటా అప్‌లోడ్ చేసే అధికారం కలిగి ఉంటారని తెలిపారు. పాస్‌వర్డులు నిరంతరం మార్చబడుతూ ఉంటాయని, అనధికార ప్రవేశానికి అవకాశం లేదని స్పష్టం చేశారు. అందువల్ల డేటా లీకేజీ లేదా పేపర్ లీకేజీకి ఎటు వంటి అవకాశం ఉందన్నారు. డిఎస్సీ ఎంపికల్లో టెట్ మార్కులకు 20శాతం, డిఎస్సీ మార్కులకు 80శాతం వెయిటేజీ ఇచ్చి జనరల్ మెరిట్ లిస్ట్ రూపొందించినట్లు ఆయన తెలిపారు. టెట్ మార్కులను ఇప్పటికే అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. సర్టిఫికేట్ వెరిఫికేషన్ కోసం కాల్ లెటర్ రావడం అంటే అభ్యర్థి ఎంపికైనట్లుగా కాదని ఆయన మరోసారి స్పష్టం చేశారు. హారిజాంటల్ రిజర్వేషన్లు, సర్టిఫికేట్ వెరిఫికేషన్, అర్హత నిర్ధారణ తదితర అంశాల ఆధారంగా తుది ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. ఒక అభ్యర్థికి కాల్ లెటర్ వచ్చినప్పటికీ, వెరిఫికేషన్ సమయంలో అనర్హత తేలితే తదుపరి అభ్యర్థికి అవకాశం దక్కవచ్చని వివరించారు.

**గ్రీవెన్స్ పరిష్కారానికి మూడు స్థాయిల వ్యవస్థ:**

అభ్యర్థుల అభ్యంతరాల పరిష్కారం కోసం ప్రభుత్వం మూడు స్థాయిల్లో గ్రీవెన్స్ మెకానిజాన్ని ఏర్పాటు చేసినట్లు కోన శశిధర్ తెలిపారు. జిల్లా స్థాయి పరిశీలన, రాష్ట్ర స్థాయి కమిటీ, కమిషనర్ స్థాయి తుది పరిశీలనతో అభ్యర్థుల అభ్యంతరాల పరిష్కారించడం జరుగుచున్నదన్నారు. ఈ ప్రక్రియ ద్వారా ప్రతి ఫిర్యాదును నిష్పాక్షి కంగా పరిశీలించినట్లు ఆయన వెల్లడించారు.

**ఇంటర్ కాలేజియేట్ పోటీలకు ప్రస్తుత నియామకాల్లో ప్రాధాన్యం లేదు:**

ప్రస్తుతం అమల్లో ఉన్న జీఓ ఎంఎస్ నెం.4 ప్రకారం ఇంటర్‌కాలేజియేట్ పోటీల్లో పాల్గొనడం లేదా సాధించిన విజయాలను ఉద్యోగాల కోసం అర్హతగా పరిగణించలేదని ఆయన తెలిపారు. అయితే 2012 ఆగస్టు 9న జారీ చేసిన జీఓ ఎంఎస్ నెం.74 ప్రకారం నిర్వహించిన గత నియామకాలలో ఇంటర్ కాలేజియేట్ పోటీలు, ఇంటర్ డిస్ట్రిక్ట్ పోటీలు, రూరల్ స్పోర్ట్స్, మహిళా క్రీడా ఉత్సవాలు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలు వంటి విభాగాల్లో పాల్గొనడం లేదా పతకాలు సాధించడం కూడా ఉద్యోగ అర్హతకు పరిగణనలోకి తీసుకున్నట్లు వివరించారు. అదే విధానం 2019లో గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా చేపట్టిన సుమారు 1.20 లక్షల నియామకాలలో కూడా అమలులో ఉన్నట్లు ఆయన పేర్పొన్నారు.

**382 మంది స్పోర్ట్స్ కోటా అభ్యర్థుల వివరాలు ఆన్‌లైన్‌లోనే ఉన్నాయి:**

డిఎస్సీ-2025 స్పోర్ట్స్ కోటా కింద మొత్తం 382 మంది అభ్యర్థులు ఎంపిక ప్రక్రియలో భాగమయ్యారని ఆయన తెలిపారు. వీరిలో 22 మంది బంగారు పతక విజేతలు, 40 మంది రజత పతక విజేతలు, 43 మంది కాంస్య పతక విజేతలు, 275 మంది జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు ఉన్నారని తెలిపారు. ఖోఖో, బాల్ బ్యాడ్మింటన్, జూడో, సాఫ్టుబాల్, అథ్లెటిక్స్, వాలీబాల్, హ్యాండ్‌బాల్, హాకీ తదితర 34 క్రీడా విభాగాలకు చెందిన క్రీడాకారులు ఈ ఎంపికల్లో భాగమయ్యారని ఆయన తెలిపారు.

**దుర్గయ్య కేసుపై వివరణ:**

తూర్పు గోదావరి జిల్లాకు చెందిన అభ్యర్థి అనిగి దుర్గయ్య తనకు జాతీయ క్రీడల్లో సాధించిన విజయాలున్నప్పటికీ ఉద్యోగం రాలేదని చేసిన ఆరోపణలపై ఆయన వివరణ ఇస్తూ దుర్గయ్య 32వ నేషనల్ గేమ్స్‌కు సంబంధించిన సర్టిఫికెట్‌ను ఆన్‌లైన్ దరఖాస్తు సమయంలో అప్‌లోడ్ చేయలేదని, భౌతిక ధ్రువీకరణ సమయంలో మాత్రమే ఆ వివరాలను సమర్పించినట్లు తెలిపారు. అయితే జిఒ4, నోటిఫికేషన్ ప్రకారం నిర్దేశిత గడువులో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్లను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టమైన నిబంధన ఉన్నందున, అనంతరం సమర్పించిన పత్రాలను పరిగణనలోకి తీసుకోవడం సాధ్యపడలేదని ఆయన పేర్కొన్నారు. అభ్యర్థి ఆన్‌లైన్‌లో సరైన సర్టిఫికేట్‌ను సమర్పించి ఉంటే, అతని అర్హతను సంబంధిత ప్రాధాన్యత క్రమంలో పరిశీలించే అవకాశం ఉండేదని వివరించారు.

**క్రీడాకారులను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యం:**

స్పోర్ట్స్ కోటా ద్వారా ఉద్యోగాల కల్పన వెనుక ప్రధాన ఉద్దేశ్యం రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించడం, ప్రతిభావంతులైన క్రీడాకారులకు అవకాశాలు కల్పించడమేనని శాప్ వైస్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ భరణి తెలిపారు. క్రీడల్లో విశేష ప్రతిభ కనబరిచిన వారికి ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా మరింత మంది యువత క్రీడల వైపు ఆకర్షితులవుతారని ఆమె పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర విద్యా శాఖ కమినషర్ తమీమ్ అన్సారియా పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

12-06-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, మృగశిర కార్తె
ద్వాదశి రా.7.32, అశ్వని ఉ.6.28
భరణి తె.4.04
వర్జ్యం : మ.3.06-సా.4.33
దు.ఉ.8.11-ఉ.9.03
(2) మ.12.33-మ.1.25
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** నూతన ప్రయత్నాలు నిదానంగా నెరవేరుతాయి. విలాస జీవితం సాగిస్తారు. పాతబాకీలు వసూలవుతాయి.

**వృషభం:** వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. దేవాలయాలను సందర్శిస్తారు. ఇంటా బయటా సమస్యలు ఎదురైన అధిగమిస్తారు.

**మిథునం:** దూరపు బంధువుల నుండి ఆహ్వానాలు అందుకుంటారు. కోర్టు వివాదాల నుండి బయటపడతారు.

**కర్కాటకం:** భూ వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. చాకచక్యంగా వ్యవహరించి కార్యక్రమాలు పూర్తి చేస్తారు.

**సింహం:** కుటుంబ సభ్యులందరి ప్రోత్సాహం లభిస్తుంది. శుభకార్యాలలో చురుకుగా పాల్గొంటారు. గృహ కొనుగోలు.

**కన్య :** శ్రమకు తగిన ఫలితం ఉండదు. కొత్త కార్యక్రమాలు చేపట్టినా ముందుకు సాగవు. స్పెక్యులేషన్‌కు దూరంగా వుండండి.

**తుల :** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండదు. కుటుంబ సమస్యలు కొంతవరకు తీరుతాయి. బంధువుల కలయిక.

**వృశ్చికం:** ఇంటర్వ్యూలకు హాజరవుతారు. పట్టుదలతో ముందుకు సాగుతారు. ముఖ్య సమాచారం అందుకుంటారు.

**ధనుస్సు:** ప్రముఖులతో పరిచయాలు ఏర్పడుతాయి. ఆ పరిచయాలు భవిష్యత్తుకు బంగారు బాటలు అవుతాయి.

**మకరం:** చాకచక్యంగా వ్యవహరించి ఎంతటి వారినైనా ఆకట్టుకుంటారు. సమస్యల నుండి బయటపడతారు. వాహనసౌఖ్యం కలదు.

**కుంభం:** రాజకీయ రంగాలలోని వారికి యోగదాయకమైన కాలం. మధ్యవర్తిత్వం లాభించదు. శుభవార్తలు అందుకుంటారు.

**మీనం:** సంతానం నాకు విద్యావకాశాలు పొందుతారు. భూముల విషయంలో నూతన అగ్రిమెంట్లు చేసుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# నమ్మకాన్ని నిలబెట్టుకుంటా

>> తెలిపారు. పార్టీ తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ, రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజా సమస్యలను రాజ్యసభ వేదికగా సమర్థవంతంగా ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు కేంద్ర స్థాయిలో మరింత సహకారం అందేలా కృషి చేయడంతో పాటు, ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన అంశాలను పార్లమెంట్‌లో బలంగా వినిపిస్తానని విజయ్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చింతకాయల విజయ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. రాజ్యసభలో రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు, అభివృద్ధి అవసరాలు, ప్రభుత్వ ప్రాధాన్యతలను సమర్థవంతంగా ప్రతిబింబిస్తూ ప్రజా ప్రయోజనాల కోసం పనిచేయాలని ఆకాంక్షించారు. రాజ్యసభ సభ్యునిగా చింతకాయల విజయ్ ఎన్నిక కావడం పట్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ భేటీ సందర్భంగా పలువురు పార్టీ నేతలు, ముఖ్య అనుచరులు కూడా పాల్గొన్నారు.

# కోల్‌కతాలో అగ్నిప్రమాదం

## భద్రపరిచిన నాలుగువేల ఇవిఎంలు దగ్ధం

## కుట్రకోణం దిశగా పోలీసులు దర్యాప్తు



**కోల్‌కతా,జూన్ 11:** పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో ఉన్న ఒక ప్రభుత్వ భవనంలో సంభవించిన భారీ అగ్నిప్రమాదంలో సుమారు 4,000 ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు దగ్ధమయ్యాయి. అగ్నిప్రమాదంపై కేసు నమోదు చేసిన పోలీసులు, అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. ఇది విధ్వంసక చర్య కావొచ్చని బెంగాల్ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి చంద్రిమ భట్టాచార్య అనుమానం వ్యక్తం చేశారు. కోల్‌కతాలోని అలీపూర్ ప్రాంతంలో ఉన్న ఓ ప్రభుత్వ భవనంలో బుధవారం ఉదయం అగ్నిప్రమాదం సంభవించింది. మంటలు వేగంగా వ్యాపించడంతో భవనంలో ఉంచిన వేలాది ఈవీఎంలు కాలిపోయాయి. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది దాదాపు 24 గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈవీఎంలను ఉంచిన ప్రాంతంలోనే మంటలు తీవ్రంగా వ్యాపించడం పలు అనుమానాలకు తావిస్తోంది అగ్నిప్రమాదంలో దాదాపు 4 వేల ఈవీఎంలు కాలిపోయాయి. ఈ ఈవీఎంలను ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల సమయంలో పది నియోజకవర్గాల్లో ఉపయోగించారు. ఇది సాధారణ అగ్ని ప్రమాదంలా కనిపించడం లేదు. ఏదైనా కుట్ర జరిగిందా అనే అంశాన్ని దర్యాప్తు చేస్తున్నాం. ఫోరెన్సిక్ నివేదిక అనంతరం పూర్తి స్పష్టత వస్తుందని బెంగాల్ మంత్రి కౌశిక్ చౌధురీ తెలిపారు. దక్షిణ 24 పరగణాల యంత్రాంగం ఫిర్యాదుతో పోలీసులు కేసునమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘటన వెనుక కుట్రకోణం కొట్టిపారేయలేమని కేంద్ర మంత్రిసుకాంత మజుందార్ అన్నారు. ఫోరెన్సిక్ పరీక్షలు, శాస్త్రీయ ఆధారాలతోనే నిర్ధారణకు వస్తామన్నారు. ఆభవనంలో ఉన్న ప్రభుత్వ రికార్డులు మౌలిక సదుపాయాలు భద్రతా వ్యవస్థలకు వాటిల్లిన నష్టాన్ని కూడా అధికారులు అంచనావేస్తున్నారు.



ఎన్‌డీయే సంక్షేమ సభ భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు తదితరులు

# ఎన్‌డియే సంక్షేమ సభ

>> బహిరంగ సభకు తిరుపతి జిల్లా పోలీస్ శాఖ అన్ని రకాల భద్రతా, ట్రాఫిక్ ఏర్పాట్లను పూర్తి చేసినట్లు జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. సభకు విచ్చేసే వివిఐపీలు, విఐపీలు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఎన్‌క్లోజర్లు, ప్రత్యేక ప్రవేశ ద్వారాలు, పార్కింగ్ సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. సుమారు 30 వేల మంది వరకు ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున వారికి కూడా ప్రత్యేక పార్కింగ్, సులభ ప్రవేశ ఏర్పాట్లు కల్పించినట్లు పేర్కొన్నారు. సభను తిరుపతి నగర పరిధి వెలుపల నిర్వహించడం వల్ల నగర ప్రజలు, భక్తులకు ఎలాంటి అసౌకర్యం ఉండదని ఎస్పీ స్పష్టం చేశారు. నగరంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యేక ట్రాఫిక్ నిర్వహణ చర్యలు చేపట్టామని తెలిపారు. సభ నిర్వహణ, భద్రతా పర్యవేక్షణ కోసం దాదాపు వెయ్యిమంది పోలీసు సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. అనంతరం బందోబస్తు పోలీస్ అధికారులతో సమావేశం ఏర్పాటుచేసి బందోబస్తు, భద్రతపై సమీక్షి ంచారు.

# వికసిత్ భారత్‌లో యువత భాగస్వామ్యం

## నీతి ఆయోగ్ సమావేశంలో ప్రధాని పిలుపు


**న్యూఢిల్లీ,జూన్ 11:** ప్రపంచస్థాయిలో ప్రధాన ఆర్థికవ్యవస్థల్లో అధికశాతం అనిశ్చితి, సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ భారత్ ఆర్థికవృద్ధిప్రపంచానికి స్ఫూర్తిగా నిలుస్తోందని ప్రధాని నరేంద్రమోడీ పేర్కొన్నారు. స్వావలంబన లక్ష్యం మరింత బలోపేతం కావాలని, పునరుత్పాదక ఇంధన రంగంలో అంతర్జాతీయ పద్ధతులను అమలుచేయాలని కోరారు. నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశానికి అధ్యక్షత వహించి ప్రసంగించిన ప్రధాని కేంద్ర రాష్ట్రాలు కలిసి పనిచేస్తేనే వికసిత భారత్ లక్ష్యం సాధించగలమన్నారు. ప్రతిరాష్ట్రం, జిల్లా, మండలం, గ్రామస్థాయిలో ఉమ్మడి సంకల్పంగా వికసిత్‌భారత్ లక్ష్యం ఉండాలని అన్నారు. భారత్‌కు అత్యంత మేలుచేసే అంశం అతిపెద్ద సంపద యువతేనన్నారు. సుమారు 70 కోట్లమంది 25 ఏళ్లలోపు యువత ఉన్నారన్నారు. ఈజనాభాను అభివృద్ధికారకులుగా మార్చేందుకు విద్య, నైపుణ్యాభివృద్ధి, సామర్థ్య, నిర్మాణ కార్యక్రమాలపై రాష్ట్రాలు దృష్టిసారించాలనికోరారు. భారత్ పలుదేశాలతో ఏర్పరుచుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల ప్రయోజనాలను యువత ఎంఎస్ఎంఇ రంగం సద్వినియోగం చేసుకునేలా రాష్ట్రాలు చర్యలుతీసుకోవాలన్నారు. మహిళా సాధికారతకు ప్రాధాన్యం ఇస్తూ మూడు లకోట్లలఖ్‌పతి దీదీల సంఖ్యను ఆరుకోట్లకు పెంచేలక్ష్యంతో రాష్ట్రాలుపనిచేయాలన్నారు. వన్‌డిస్ట్రిక్ట్ వన్‌ప్రొడక్ట్ (ఒడిఒపి) కార్యక్రమాలు బలోపేతంచేసి ఎగుమతి ఆధారిత వ్యూహాలు అమలుచేయాలన్నారు. రక్షణరంగ తయారీలో భారత్‌ప్రత్యేక గుర్తింపును సాధించిందని, ఈరంగంలో అవకాశాలు సద్వినియోగం అయ్యేలా రాష్ట్రాలు ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఆశావహ జిల్లాల నమూనాలోనే వ్యవసాయ రంగంలో 100 జిల్లాలను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. వికసిత్‌భారత్ 2047 లక్ష్యసాధనకు 100 రోజుల, ఐదేళ్ల కార్యాచరణప్రణాళికలు, పర్యవేక్షణ వ్యవస్థలురూపొందించాలని రాష్ట్రాలనుకోరారు. పెట్టుబడుల సాధనకు సుపరిపాలన, పారదర్శకత, మౌలిక సదుపాయాల వృద్ధి కీలకమని పేర్కొన్న ప్రధాని డేటా సెంటర్లు, కృత్రిమ మేధను వంటి అభివృద్ధి చెందుతున్న రంగాల్లో అవకాశాలు వినియోగించుకోవాలన్నారు. ఎఐను సవాలుగా కాకుండా అవకాశంగామాత్రమే చూడాలన్నారు. ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే సవాళ్లపై దృష్టిపెట్టిన ప్రధాని జలసంరక్షనకు ప్రాదాన్యం ఇవ్వాలని, సహజ సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని రాష్ట్రాలనుకోరారు. ఖరీఫ్‌సీజన్‌లో రైతులు 11 లక్షల టన్నుల సేంద్రీయ ఎరువులను కొనుగోలుచేయడం స్థిరమైన వ్యవసాయంఐ పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమన్నారు. డ్రగ్స్ వినియోగం, సైబర్ మోసాలు వంటిసామాజిక సవాళ్ల ఎదుర్కొనేందుకు సమన్వయంతో చర్యలు అవసరమన్నారు. అవగాహన సదస్సులు, సుపరిపాలనద్వారా ఈసమస్యలు అధిగమించవచ్చన్నారు. దేశంలోని 28 రాష్ట్రాలముఖ్యమంత్రులు, ఐదు కేంద్రపాలితప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు, పరిపాలనాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మొత్తం 28 రాష్ట్రాలముఖ్యమంత్రులు పాల్గొనడం ఇదే మొదటిసారి. సమావేశంలో మోడీ 12 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భాన్నిపురస్కరించుకుని ఆయనకు ప్రత్యేక అభినందనలుతెలిపారు. దేశ ఆర్థిక, ఇంధనభద్రతను బలోపేతం చేయడంలో కేంద్రానికి సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

# రూ. 9.63 కోట్ల పన్ను చెల్లించండి

## జొమాటోకు ఎపి ప్రభుత్వం నోటీసు

**విజయవాడ, జూన్ 11 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రముఖ ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమాటోకు ఎపి జిఎస్‌టి (వస్తు సేవల పన్ను) విభాగం ఊహించని షాక్ ఇచ్చింది. పన్ను ఎగవేత ఆరోపణలపై ఏకంగా రూ.9.63 కోట్లు చెల్లించాలని డిమాండ్ చేస్తూ నోటీసులు జారీ చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిఎస్‌టి చెల్లింపుల్లో వ్యత్యాసాలు ఉన్నాయని, తక్కువ పన్ను చెల్లించినట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు జొమాటో మాతృసంస్థ అయిన 'ఎటెర్నల్' కు ఈ నోటీసు అందింది. వివరాల్లోకి వెళితే.. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి మధ్య కాలానికి సంబంధించిన జిఎస్‌టి లెక్కల్లో లోపాలు ఉన్నాయని ఎపి జిఎస్‌టి అధికారులు ఆరోపించారు. వాస్తవంగా చెల్లించాల్సిన దానికంటే తక్కువగా పన్ను చెల్లించారని పేర్కొన్నారు. ఈ మేరకు తమకు జూన్ 9న ఎపి డిప్యూటీ కమిషనర్ కార్యాలయం నుంచి ఆర్డర్ అందినట్లు జొమాటో మాతృసంస్థ ఎటెర్నల్ తన స్టాక్‌ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో అధికారికంగా వెల్లడించింది. జిఎస్‌టి అధికారులు జారీ చేసిన నోటీసు ప్రకారం, మొత్తం రూ.9.63 కోట్ల డిమాండ్‌లో అసలు పన్ను బకాయి రూ.6.49 కోట్లుగా ఉంది. దీనిపై వడ్డీగా రూ.2.50 కోట్లు, పెనాల్టీ కింద మరో రూ.64.87 లక్షలు కలిపి చెల్లించాలని ఆదేశించారు. ఈ నోటీసుపై కంపెనీ స్పందిస్తూ, తాము దీనిపై అప్పీల్‌కు వెళ్లనున్నట్లు స్పష్టం చేసింది. "2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి కాలానికి సంబంధించి జిఎస్‌టి డిమాండ్‌ను నిర్ధారిస్తూ కంపెనీకి 2026 జూన్ 9న ఒక ఆర్డర్ అందింది. అయితే, ఈ విషయంలో మా వాదనలో బలమైన అంశాలు ఉన్నాయని తాము విశ్వసిస్తున్నాము. కంపెనీ ఈ ఉత్తర్వుపై సంబంధిత అధికార సంస్థ ముందు అప్పీల్ దాఖలు చేస్తుంది" అని ఎటెర్నల్ సంస్థ తన ఫైలింగ్‌లో పేర్కొంది. ఈ నోటీసుల వల్ల కంపెనీ ఆర్థిక కార్యకలాపాలపై గానీ, ఇతర కార్యకలాపాలపై గానీ ఎలాంటి ప్రతికూల ప్రభావం పడబోదని కూడా స్పష్టం చేసింది.

# టెక్కీనిపుణుల హబ్‌గా భారత్




**వాషింగ్టన్,జూన్ 11:** ప్రపంచవ్యాప్తంగా నైపుణ్యం కలిగిన ఉద్యోగులకు భారత్ ఒక ప్రధాన కేంద్రంగా మారుతోంది. అగ్రరాజ్యం అమెరికా నుంచి యూరప్ దేశాల వరకు కీలకమైన స్కిల్డ్ వర్కర్ వీసా ప్రోగ్రామ్‌లలో భారతీయులే అగ్రస్థానంలో నిలుస్తున్నారని వర్క్‌ఫోర్స్ మేనేజ్‌మెంట్ సేవల సంస్థ డీల్ తాజా నివేదికలో వెల్లడించింది. చౌకగా లభిస్తారనే కారణంతో కాకుండా అరుదైన నైపుణ్యాల కొరత కారణంగానే కంపెనీలు భారత నిపుణులకు పెద్దపీట వేస్తున్నాయని ఈ నివేదిక స్పష్టం చేసింది. అమెరికా జారీ చేసే హెచ్1బీ వీసాల్లో భారత్ మొదటి స్థానంలో ఉండగా, యూకే స్కిల్డ్ వర్కర్ వీసాలు, యూరోపియన్ యూనియన్ ఈయూ బ్లూ కార్డ్‌ల జారీలో రెండో స్థానంలో నిలిచింది. యూఏఈ జారీ చేసే గోల్డెన్ వీసాలు, సాధారణ ఉపాధి వీసాల్లో కూడా భారతీయులదే ఆధిపత్యం. ఇప్పటికే యూఏఈ మొత్తం జనాభాలో భారతీయులు 38 శాతం ఉండటం గమనార్హం. భారత నిపుణులను నియమించుకోవడంలో ఆస్ట్రేలియా 724 శాతం, యూకే 142 శాతం, అమెరికా 139 శాతం భారీ వృద్ధిని నమోదు చేశాయి. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. పలు దేశాల్లో స్థానిక ఉద్యోగులతో పోలిస్తే భారత వీసాదారులే ఎక్కువ జీతాలు పొందుతున్నారు. అమెరికాలో హెచ్1బీ వీసాదారుల సగటు వార్షిక వేతనం 1,40,000 డాలర్లు కాగా, అక్కడి పౌరులకు సమానమైన పాత్రల్లో 1,30,000 డాలర్లుగా ఉంది. యూకేలో కూడా ఇదే ధోరణి కనిపిస్తోంది. ఇది నైపుణ్యానికి కంపెనీలు ఇస్తున్న విలువను సూచిస్తోందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. భారత నిపుణుల కోసం జర్మనీ వంటి కొత్త మార్కెట్లు కూడా తలుపులు తెరుస్తున్నాయి. ఉద్యోగ ఆఫర్ లేకపోయినా నైపుణ్యం ఆధారంగా వీసా ఇచ్చే జర్మనీ ఖిఆపర్చునిటీ కార్డ్ఖి ప్రోగ్రామ్‌లో ఇప్పటివరకు జారీ అయిన పర్మిట్లలో దాదాపు మూడో వంతు భారతీయులకే దక్కాయి. ఇంజనీరింగ్, సాఫ్ట్‌వేర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ సేవల రంగాల్లో భారత టెక్ నిపుణులకు ప్రపంచవ్యాప్తంగా భారీ డిమాండ్ ఉందని నివేదిక పేర్కొంది.

12-6Pg3exHMNWJQE.qxd:12-6Pg3exHMNWJQE.qxd 1/1/02 6:46 AM Page 1


ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
విశాఖపట్నం
fb.com/vaartha Digital
Published from Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
12-6-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 132 పేజీలు: 16 వెల: 6.50

రూ. 9.63 కోట్ల పన్ను చెల్లించండి 2లో

కోల్‌కతాలో అగ్నిప్రమాదం 4వేల ఇవిఎంలు దగ్ధం

## విస్తృత భాగస్వామ్యంతోనే
# వికసిత్ భారత్



కేంద్ర, రాష్ట్రాల మధ్య నిరంతర భాగస్వామ్యం అవసరం
నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో సిఎం
స్వర్ణాంధ్ర 2047 విజన్‌ను ఆవిష్కరించిన చంద్రబాబు
ఆర్‌టిజిఎస్‌తో కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ల పర్యవేక్షణ
పి4తో ఆర్థిక అసమానతలు తగ్గించే చర్యలు చేపట్టాం
'మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్' యాప్ ద్వారా ప్రభుత్వ సేవల్ని ప్రజల ఇంటివద్దకే అందిస్తున్నాం

వికసిత్ భారత్‌లో యువత భాగస్వామ్యం
నీతి ఆయోగ్ సమావేశంలో ప్రధాని పిలుపు 2లో

**విజయవాడ, జూన్ 11 ప్రభాతవార్త ప్రతినిధి:** సరళీకరణ, పాలనా సంస్కరణలు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లు భారతదేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేశాయని ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ఈ విధానాలకు అనుసరణగా ముందు అడుగులు వేస్తున్నందునే గత రెండేళ్ల కాలం తీవ్ర ఆర్థిక సంక్షోభాలను అధిగమిస్తూ అభ్యున్నతి దిశలో అడుగులు వేస్తుందన్నారు. నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. ప్రధానమంత్రిగా 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న ప్రధాని నరేంద్ర మోడీకి సమావేశంలో ముందుగా అభినందనలు తెలిపిన అనంతరం సిఎం చంద్రబాబు మాట్లాడుతూ పాలసీ పెరాలసిస్ నుంచి గత దశాబ్దకాలంగా భారత్ పాలసీ గ్రోత్ వైపుగా అడుగులు వేసిందన్నారు. ఇది అద్భుతమైన ప్రగతి సూచికగా భావించాలన్నారు. మోడీ హయాంలో డిజిటల్ ఇండియా, జన్ ధన్, ఆధార్, యుపిఐ, మేక్ ఇన్ ఇండియాలాంటి కార్యక్రమాలు వచ్చాయన్నారు. సరళీకరణ, పాలనా సంస్కరణలు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లు భారతదేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేశాయి. భౌగోళిక రాజకీయ అనిశ్చితి పరిస్థితులు ఉన్నా భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా ఎదుగుతున్న పెద్ద ఆర్థిక వ్యవస్థ అవతరించింది. ప్రధాని మోడీ రూపకల్పన చేసిన వికసిత్ భారత్ 2047కు ఎపి కూడా స్వర్ణాంధ్ర విజన్‌ను అనుసంధానం చేశాం. అభివృద్ధికి మానవ వనరులే పునాదిగా స్వర్ణాంధ్ర 2047 విజన్ రూపకల్పన జరిగింది. సేదరిక నిర్మూలన, నైపుణ్యం, ఉపాధి, నీటి ఇంధన భద్రత, అగ్రిటెక్, గ్లోబల్ లాజిస్టిక్స్, డీప్‌టెక్ లాంటి 10 సూత్రాలను భాగంచేశాం, ఈ లక్ష్యాలను చేరుకునేందుకు సాంకేతికత, పారదర్శక డేటా డ్రివెన్ పాలనా వ్యవస్థను ఏర్పాటు చేశాం. ఆర్టీజీఎస్ ద్వారా కీ పెర్ఫార్మెన్స్ ఇండికే >>2



## పశ్చిమాసియాలో మళ్లీ
# యుద్ధ మేఘాలు

• ఇరాన్‌పై అమెరికా భీకరదాడులు • మినాబ్, బందర్ అబ్బాస్, సిరిక్, టెహ్రాన్‌లపైనే • ట్రంప్ ఆదేశాలమేరకు ఆత్మరక్షణ కోసమే చేశాం • అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటన • ఇరాన్ ప్రతీకార దాడులు తీవ్రతరం • యుఎస్ సైనిక కేంద్రాలపై బాలిస్టిక్ మిస్సైళ్లు • జోర్డాన్‌లోని అమెరికా ఎయిర్‌బేస్ ధ్వంసం • గగనతలం మూసివేసిన కువైట్ • హార్ముజ్ జలసంధి మూసివేత • దాటేందుకు ప్రయత్నిస్తే కాల్చేస్తాం • ఐఆర్‌జిసి తీవ్ర హెచ్చరిక • చమురు సరఫరాకు ముప్పు • హార్ముజ్‌లో చమురు రవాణాకు 'సీక్రెట్ మిషన్': ట్రంప్



• ఒమన్ తీరంలో గల్లంతైన ముగ్గురు భారతీయుల మృతి • అమెరికా దాడిని తప్పుపట్టిన ఇండియా • నౌకలపై దాడులు ఆపాలని డిమాండ్ • బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం: కేంద్ర మంత్రి సర్బానంద సోనావాల్ • మరో వాణిజ్య నౌకపై దాడి • మంటల్లో భారత నౌక జల్‌వీర్ • రంగంలోకి దిగిన ఒమన్ నౌకాదళం • తీవ్రంగా ఖండించిన భారత్ • అమెరికా దౌత్యాధికారికి సమన్లు • దాడులు ఆందోళనకరం.. అంతర్జాతీయ నిబంధ నలకు విరుద్ధం • ఐరాస వేదికగా భారత్ నిరసన • ఇకపై దాడులు వద్దు.. శాంతి చర్చలు జరపాలి: ఐరాస చీఫ్ గుటెర్రెస్

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. తాజాగా ఇరాన్‌పై అమెరికా దాడులు చేయడం, ప్రతిగా ఇరాన్ కువైట్, బహ్రెయిన్‌లోని యుఎస్ సైనిక స్థావరాలు లక్ష్యంగా బాలిస్టిక్ క్షిపణులు ప్రయోగించింది. జోర్డాన్‌లోని అమెరికా ఎయిర్‌బేస్‌పైనా 12 బాలిస్టిక్ మిస్సైళ్లతో దాడి చేసి ధ్వంసం చేసింది. ఇలా ఉండగా, కువైట్ తన గగనతలాన్ని మూసివేసింది. మరోవైపు హార్ముజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. ఎవరైనా దాటాలనే ప్రయత్నిస్తే నౌకలను పేల్చివేస్తామని ఐఆర్‌జిసి తీవ్ర హెచ్చరికలు చేసింది. అటు ఒమన్ తీరంలో బుధవారం ఓ నౌకనుంచి అదృశ్యమైన ముగ్గురు భారతీయులు మృతి చెందినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ ఘటనపై భారత్ తీవ్రంగా స్పందించింది. న్యూఢిల్లీలోని అమెరికా రాయబారికి సమన్లు జారీ చేసింది. ఇదిలా ఉండగా, ఒమన్ తీరంలో భారత వాణిజ్య నౌక 'జల్‌వీర'పై దాడి జరిగింది. దీంతో నౌక అగ్నికీలల్లో చిక్కుకుంది. ఒమన్ నౌకాదళం రంగంలోకి భారత నావికులను రక్షించింది. మంటలను ఆర్పేందుకు యత్నిస్తోంది. వాణిజ్య నౌకలపై దాడులను ఐరాస వేదికగా భారత్ తీవ్రంగా ఖండించింది. దాడులు వద్దు, శాంతి కోసం చర్చలు జరపాలని ఐరాస చీఫ్ గుటెర్రెస్ విజ్ఞప్తి చేశారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలపై ఆందోళన వ్యక్తం చేశారు. - వివరాలు '5'లో

ఖర్గ్‌ను స్వాధీనం చేసుకుంటాం: ట్రంప్ 2లో

# గృహిణులు దేశ నిర్మాతలు

కుటుంబంలో వారే కీలక పాత్ర
వారు చేసే పనికి వెలకట్టలేం
పరిహారం విషయంలోనూ న్యాయం జరగడం లేదు
సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు



**న్యూఢిల్లీ,జూన్ 11:** దేశంలో గృహిణుల శ్రమపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. గృహిణులు దేశ నిర్మాతలు అని, వారు చేసే పనికి కనీసం రూ.30వేలు పరిహారం చెల్లించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. రోడ్డు ప్రమాదాల్లో గృహిణులు మరణించినా, వైకల్యం సంభవించినా నెలకు కనీస పరిహారం కింద ఈ మొత్తం చెల్లించాలని సూచించింది. సుప్రీంకోర్టు జడ్జీలు జస్టిస్ సంజయ్ కరోల్, కే కోటిశ్వర్ సింగ్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం తాజా ఆదేశాలు జారీ చేసింది. రోడ్డు ప్రమాదాల్లో ఎవరైనా మరణించినా లేదా వైకల్యం సంభవించినా బాధితుల ఆదాయం వంటి వివరాల ఆధారంగా కూడా ఇన్సూరెన్స్ కంపెనీలు పరిహారం అందిస్తాయి. ఈ నేపథ్యంలో ఒక కేసుకు సంబంధించి సుప్రీం కోర్టు తాజా ఆదేశాలు జారీ చేసింది. రోడ్డు ప్రమాదాల్లో గృహిణులు మరణిస్తే బాధితులకు నెలకు రూ.30వేల పరిహారం అందించాలని ఆదేశించింది. గృహిణులను దేశ నిర్మాతలుగా అభివర్ణించింది. వారు ఇంటి పని చేస్తూ, పిల్లల్ని, కుటుంబ సభ్యుల్ని చూసుకుంటారని, వారి అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తారని, అంతిమంగా దేశాభివృద్ధికి దోహదపడతారని కోర్టు అభిప్రాయపడింది. వారు >>2

## నేడే తిరుపతిలో ఎన్‌డియే సంక్షేమ సభ

సిఎం, డి.సిఎం, బిజెపి చీఫ్ రాక

**తిరుపతి,జూన్ 11 ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో రెండేళ్ళ కూటమి ప్రభుత్వం తిరుపతిలో శుక్రవారం ఉదయం నమ్మకం,అభివృద్ధి, సంక్షేమ సభజరగనుండటంతో భద్రత పరంగా అన్ని చర్యలు తీసుకున్నట్లు జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు తెలిపారు. గురువారం ఉదయం రాష్ట్రహోంమంత్రి అనిత, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగానీ సత్యప్రసాద్, రాష్ట్ర ముఖ్య మంత్రి కార్యక్రమాల కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేశ్ సభాస్థలిని పరిశీలించారు. శుక్రవారం ఉదయం 11గంటలకు తిరుపతికి ముఖ్యమంత్రి చంద్రబాబు, డి.సిఎం పవన్, మంత్రులు, రాయల సీమ నాయకులు హాజరుకానున్న భారీ >>2

# అక్టోబర్‌లో మెగా డిఎస్సీ



డిసెంబర్‌లో పరీక్షలు.. అభ్యర్థులు సన్నద్ధం కావాలి
2025 డిఎస్సీ ఎంపికల్లో ఎలాంటి అక్రమాలు లేవు
పారదర్శకతతోనే నియామక ప్రక్రియ నిర్వహించాం
రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ వెల్లడి

**విజయవాడ, జూన్ 11 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఉపాధ్యాయ నియామకాల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మంది నిరుద్యోగ యువతకు ప్రభుత్వం మరోసారి శుభవార్త అందించింది. ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌కు అనుగుణంగా అక్టోబర్ నెలలో మెగా డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు, డిసెంబర్ నెలలో పరీక్షలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించినట్లు రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో రాష్ట్ర క్రీడలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, శాప్ వైస్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ భరణితోకలసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. డిఎస్సీ 2025 నియామకాలపై మరొకసారి సమగ్ర వివరణ ఇచ్చారు. డిఎస్సీ 2025 నియామకాల్లో హారిజాంటల్ రిజర్వేషన్లు, స్పోర్ట్స్ కోటా, దివ్యాంగుల కోటా అమలుపై కొంత మంది అభ్యర్థులు వ్యక్తం చేస్తున్న సందేహాలు, సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాల్లో ఏమాత్రం నిజం లేదని ఆయన స్పష్టం చేశారు. 2024లో నోటిఫై చేసిన సుమారు 6,100 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తికాకపోవడానికి ప్రధానంగా రెండు కారణాలు ఉన్నాయని రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ తెలిపారు. సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పుల మేరకు హారిజాంటల్ రిజర్వేషన్ల >>2



గురువారం సిఎం చంద్రబాబుతో భేటీ అయిన రాజ్యసభ సభ్యుడు చింతకాయల విజయ్

## నమ్మకాన్ని నిలబెట్టుకుంటా

రాజ్యసభకు నూతనంగా ఎన్నికైన చింతకాయల విజయ్

**విశాఖపట్నం, జూన్ 11, ప్రభాతవార్త:** రాజ్యసభ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన తెలుగు దేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ గురువారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి నుంచి ఎన్నిక ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్న అనంతరం సిఎం నారా చంద్రబాబునాయుడును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా తనను రాజ్యసభ సభ్యునిగా ఎంపిక చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్‌లకు చింతకాయల విజయ్ హృదయపూర్వక కృతజ్ఞతలు >>2

## లిక్కర్ స్కాం కేసు
# రాజ్ కెసిరెడ్డి, వాసుదేవరెడ్డి అరెస్టు



24 వరకు రిమాండ్... చంచల్‌గూడకు తరలింపు
తెలుగు రాష్ట్రాల్లో ఇడి అధికారుల సోదాలు
మాజీ మంత్రి కారుమూరి ఇంట్లోనూ తనిఖీలు

**విజయవాడ, జూన్ 11 ప్రభాతవార్త ప్రతినిధి:** వైఎస్సార్సీ ప్రభుత్వ పరిపాలనా సమయంలో చోటు చేసుకున్న మద్యం కుంభకోణం కేసులో కీలక నిందితులు రాజ్ కెసిరెడ్డి, వాసుదేవరెడ్డిని ఎట్టకేలకు ఇడి అరెస్టు చేసింది. హైదరాబాద్‌లోని వారి ఇళ్లలో సోదాలు నిర్వహించిన అధికారులు ఇరువురిని అదుపులోకి తీసుకున్నారు. నాంపల్లి ఇడి కోర్టులో వారిని హాజరుపరిచారు. కోర్టు వారికి ఈ నెల 24 వరకు రిమాండ్ విధించింది. చంచల్ గూడ జైలుకు తరలించారు.

లిక్కర్ స్కామ్‌కు సంబంధించి తెలుగు రాష్ట్రాల్లో మరోసారి ఇడి అధికారులు సోదాలు చేపట్టారు. ఈ కేసులో కీలక సూత్రధారి రాజ్ కెసిరెడ్డి ఇళ్లతోపాటు హైదరాబాద్‌లోని 10 ప్రాంతాల్లో గురువారం తనిఖీలు నిర్వహించింది. వైఎస్సార్సీపి ప్రభుత్వ హయాంలో జరిగిన రూ.వేల కోట్ల విలువైన మద్యం కుంభకోణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) రంగంలోకి దిగింది. ప్రాథమిక విచారణ జరిపిన ఇడి అధికారులు మనీ లాండరింగ్ నిరోధక చట్టం(పిఎంఎల్‌ఎ) కింద అభియోగాలు మోపి, తాజాగా ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్టు (ఇసిఐఆర్) నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది. కేసులో మొత్తంగా 33 మందిని నిందితులుగా చేర్చారు. మద్యంకుంభకోణంలో అన్నీతానై వ్యవహరించిన రాజ్ కెసిరెడ్డితో పాటు వైఎస్సార్సీపి ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఆ పార్టీ మాజీ నేత విజయ సాయిరెడ్డి, జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నంత కాలం సిఎంఒ కార్యదర్శిగా పనిచేసిన విశ్రాంత ఐఎఎస్ అధికారి ధనుంజయరెడ్డి, జగన్ ఓఎస్డీ కృష్ణ మోహన్‌రెడ్డి, భారతి సిమెంట్స్ పూర్తికాలపు డైరెక్టర్ గోవిందప్ప బాలాజీలతో పాటు ఎపిఎస్‌బిసిఎల్ మాజీ ఎండీ డి.వాసుదేవరెడ్డి, ఎపిఎస్‌బిసిఎల్ ప్రత్యేకాధికారి సత్యప్రసాద్, ఎస్‌పివై ఆగ్రో ఇండస్ట్రీస్ పూర్వపు డైరెక్టర్ సజ్జల >>2

## మంగళగిరి లక్ష్మీ నరసింహాస్వామి ఆలయం
# జీర్ణోద్ధరణ పనులకు శ్రీకారం



గురువారం మంగళగిరిలో దేవాదాయ శాఖ అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి లోకేష్

శ్రీకృష్ణదేవరాయ మండపం పునరుద్ధరణ
యాగశాల, గంట మండపం పునర్నిర్మాణం
జులై 3న జీర్ణోద్ధరణ పనులకు శంకుస్థాపన
దేవాదాయ శాఖ అధికారులతో మంత్రి లోకేష్ సమీక్ష

**విజయవాడ, జూన్ 11 ప్రభాతవార్త ప్రతినిధి:** దేవాలయాల వైశిష్టత, ప్రాముఖ్యతను కాపాడు కోవాల్సిన బాధ్యత మనపై ఉందని ఎపి మానవ వనరుల శాఖమంత్రి లోకేష్ అన్నారు. ఈక్రమంలో పలు ప్రసిద్ధ దేవాలయాలకు జీర్ణోద్ధరణను చేపడుతున్నామని తెలిపారు. మంగళగిరి దిగువ సన్నిధిలోని ప్రసిద్ధ వైష్ణవ దివ్యక్షేత్రం శ్రీ లక్ష్మీ నరసింహాస్వామి దేవాలయం జీర్ణోద్ధరణ, పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు ఆలయ అభివృద్ధి కోసం చేపట్టాల్సిన చర్యలపై ఉండవల్లి నివాసంలో అధికారులతో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు తమ ప్రతిపాదనలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రి లోకేష్‌కు వివరించారు. ఆలయంలోని శ్రీకృష్ణదేవరాయ మండపం పునరుద్ధరణతో పాటు యాగశాల, గంట మండపం పునర్ నిర్మాణం, వాహనశాల నూతన నిర్మాణానికి సమావేశంలో మంత్రి ఆమోదం తెలిపారు. ఆయా జీర్ణోద్ధరణ, అభివృద్ధిపనులను ఆలయ సంప్రదాయాలకు అనుగుణంగా చేపట్టాలని ఈ సందర్భంగా మంత్రి ఆదేశించారు. ఆలయం వెలుపల >>2

## నేటినుంచి పాఠశాలలు పునఃప్రారంభం

**విజయవాడ జూన్ 11 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో విద్యార్థులకు బడి బాటకు వేళాయింది. శుక్రవారం నుంచి స్కూలు గంట మోగనుంది. విద్యార్థులు బ్యాగు తగిలించుకుని మళ్లీ తరగతులకు హాజరుకానున్నారు. నేటితో వేసవి సెలవులు ముగియడంతో ఇంతకాలం ఇంటి దగ్గర ఉన్న విద్యార్థులు మళ్లీ బడిబాట పట్టనున్నారు. అటు అధికారులు సైతం శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా స్కూళ్ల ప్రారంభంకానున్నట్లు ప్రకటించారు. 2026-2027 ఏడాదికి పాఠశాల క్యాలెండర్‌ను సైతం విడుదల చేశారు. ఈ విద్యా సంవత్సరంలో మొత్తం 229 రోజులు పాటు పని చేయనున్నట్లు వెల్లడించారు. మరో 87 రోజులు సెలవు రోజులగా తెలిపారు. పనిలో పనిగా పరీక్షల షెడ్యూల్స్‌నూ విడుదల చేశారు.

వార్త

ఇరవైయేళ్ల వయసుంటేనే యువకుడి కింద లెక్కకాదు. ప్రపంచంలో ఎక్కడ అన్యాయం జరిగినా స్పందించే వారే యువకులు.

న-థామస్ ఫుల్లర్

# పౌష్టికాహారలోపంలో భారతావని!

ఎన్ని పథకాలు ప్రవేశపెట్టినా, మరెన్ని లక్షల కోట్ల రూపాయలు వెచ్చించినా, వెచ్చిస్తున్నా పౌష్టికాహార లోపం నుండి దేశ ప్రజలను గట్టెక్కించలేకపోతున్నారు. స్వాతంత్య్రం వచ్చి దాదాపు ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా నేటికీ పౌష్టికాహార లోపంతో రకరకాల సమస్యలతో సతమతమవుతున్నవారు భారత్‌లో కోట్ల సంఖ్యలో ఉన్నారు.ప్రపంచ జనాభాలో పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న బాలల్లో ఇరవైఐదు శాతం పైగా భారతావనిలోనే ఉన్నారని ఐక్యరాజ్యసమితి నివేదికలు ఎంతో కాలంగా చెప్తూనే ఉన్నాయి.ఐదుసంవత్సరాల్లోపు పిల్లల్లో నలభైశాతం మంది తక్కువబరువుతో పుడుతున్నారని, వారిలో దాదాపు ఏడెనిమిది శాతం మంది పుట్టిన ఐదేళ్లలోపే మరణిస్తున్నారని ఎన్నోనివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ భూమ్మీద పుట్టిన వారు ఎవరికైనా జీవించే హక్కు రాజ్యాంగం కల్పించింది. అలాంటిది కన్నులైన సరిగ్గా తెరవని పసిగుడ్డులకు సరైన ఆహారం అందకపోతే అందుకు బాధ్యత వహించాల్సింది పాలక పెద్దలే. తల్లీ బిడ్డకు పౌష్టికాహారం అందివ్వలేకపోవడం కూడా పాలకుల బాధ్యతారాహిత్యం కిందికే వస్తుంది. అందుకోసం దేశవ్యాప్తంగా ఇప్పుడు కొత్తగాపథకాలు ప్రవేశపెట్టకపోతే పోయారు. ఉన్నపథకాలు ఏమేరకు అమలుచేస్తున్నారు? అర్హులైనవారిలో ఎంత మందికి అందిస్తున్నారు?అధ్యయనాలు, సమీక్షలు, సమావేశాలు నిర్వహించడమే కాదు. పర్యవేక్షణ కూడా అవసరం. ఆ పర్యవేక్షణ లోపం కారణంగానే తల్లీబిడ్డకు అందించాల్సిన పౌష్టికాహారం పక్కదారిపడుతున్న విషయం ఎన్నోసార్లు వెలుగుచూసినా పటిష్టమైన చర్యలు లేకపోవడంతో నిరాటంకంగా కొనసాగుతున్నది. దేశంలోనే కాదు ప్రపంచవ్యాప్తంగా కూడా పౌష్టికాహార లోపం పెచ్చరిల్లి పోతున్నదనే చెప్పొచ్చు. ఇటీవల ప్రపంచ ఆహారనివేదిక వెల్లడించిన సమాచారం ప్రకారం పౌష్టికాహారంతో బాధపడేవారి సంఖ్యప్రపంచంలో ఎనభైకోట్లకుపైగా ఉంటుందని అంచనా వేశారు. దేశంలో పౌష్టికాహార లోపాన్ని అధిగమించేందుకు ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారు. దేశ వ్యాప్తంగా లక్షలాది మంది ఉద్యోగులు నిరంతరం కృషి చేస్తున్నారు. రకరకాల నూతన పథకాలను ప్రవేశపెడు తున్నారు. 1975లోనే ఆరేళ్లలోపు పిల్లల్లో తల్లులకు పౌష్టికాహారం అందించేందుకు ఆనాటి కేంద్ర ప్రభుత్వం సమీకృత శిశుఅభివృద్ధి పథకాన్ని (ఐసిడిఎ) ప్రవేశపెట్టింది.ఈపథకం ప్రవేశపెట్టినప్పుడు దేశవ్యాప్తంగా ఎంతోమంది నిరుపేదలకుచేయూతనిచ్చింది.కానీ రానురాను అవకతవకలు, అవినీతి కారణంగా ఈపథకం పక్కదారి పట్టిందనే చెప్పొచ్చు. అర్హులైన వారికి ఎందరికో ఇది అందకుండాపోయింది. ఎన్నో ఆరోపణలు వచ్చాయి. విచారణలు జరిగాయి. కొన్ని సంఘటనలపై చర్యలు కూడా తీసుకున్నారు. పటిష్టమైన పర్యవేక్షణ, తనిఖీలు లేకపోవడంవల్లనే ఈ పథకం ఆశించిన మేరకుఫలితాలు ఇవ్వలేకపోతున్నదనే ఆరోపణలను కొట్టివేయలేం. ఇవేకాదు ఇంకెన్నో పథకాలు ప్రవేశపెట్టారు.ప్రధానమంత్రి మాతృవందన యోజన, పాఠశాలల్లో మధ్యాహ్నభోజనం, తదితర ఎన్నో కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈపథకాలను ఇంటర్మీడియేట్ కాలేజీల్లోకూడా ప్రవేశపెట్టాలని ఇటీవలనే తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించింది. దేశంలో కొన్నిప్రాంతాల్లో పౌష్టికాహార లోపాన్ని అధిగ మించేందుకు పిల్లలకు కోడిగుడ్లు కూడా అందిస్తున్నారు. అయినా భారత్‌లో పౌష్టికాహార లోపం ఎందరినో పట్టిపీడిస్తున్నది.ప్రపంచ ఆకలి సూచీలో మూడేళ్ల క్రితం వెల్లడించిన వివరాల ప్రకారం నూట ఇరవైఒక్క దేశాల్లో భారత్ నూట ఏడో స్థానంలో ఉంది. ఈపౌష్టికాహార లోపంకారణంగా ఆరోగ్యపరంగా ముఖ్యంగా మహిళలలో, చిన్నారుల్లో అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఐదేళ్లలోపు పిల్లల్లో దాదాపు ముప్పై శాతానికి పైగా వయసుకు తగిన ఎత్తు పెరగడం లేదు. మరో పంతొమ్మిది శాతం ఎత్తుకుతగిన బరువు ఉండడం లేదు. ముప్పైరెండు శాతం పిల్లలు ఎదుగుదల లోపాన్ని ఎదుర్కొంటున్నారు. జార్ఖండ్, మహారాష్ట్ర,అసోం, గుజరాత్,తదితర రాష్ట్రాల్లో ఈపౌష్టికాహార సమస్యఅధికంగా ఉంది. ఇంకోవైపు పదిహేనేళ్ల బాలికల నుండి యాభైఏళ్లలోపు ఉన్న మహిళలలో దాదాపు యాభైఏడుశాతం రక్తహీనతతో బాధపడుతున్నారు.ఎనభైశాతానికి పైగాసూక్ష్మ పోషకాల కొరతను ఎదుర్కొంటున్నట్లు అంతర్జాతీయ అధ్యాయనాలు వెల్లడిస్తున్నాయి. పౌష్టికాహార లోపాన్ని అధిగమించేందుకు ప్రజాపంపిణీ వ్యవస్థద్వారాపోషకాలు కలిగిన బియ్యాన్ని అందించే కార్యక్రమం కొనసాగిస్తూనే ఉన్నారు. 2030 నాటికి పిల్లల్లో తీవ్రమైన పౌష్టికాహార లోపాన్ని నియంత్రించేందుకు ప్రత్యేక పథకాల ద్వారా ఒడిశా ప్రభుత్వం కృషి చేస్తున్నది. మరికొన్ని రాష్ట్రాల్లో కూడా పలురకాల పథకాలు ప్రవేశపెడుతున్నారు. పథకాలు, ఉద్దేశ్యాలు సక్రమంగా ఉన్నా సంతృప్తి కలిగించే విధంగాకన్పిస్తున్నా ఆచరణకు వచ్చేసరికి చాలా వరకు కాగితాలకే పరిమితమవుతున్నాయి. వాస్తవంగా చూసినా భారత్‌లో గత దశాబ్దకాలంగా ఆహారధాన్యాల ఉత్పత్తులకు కొరత లేదు. రికార్డు స్థాయిలో దిగుబడులు వస్తున్నాయి.నిల్వలు చేసుకోవడానికి అవసరమైన గోదాములు లేని పరిస్థితులు నెలకొన్నాయి. ఇలా ఆహారోత్పత్తులు భారీగా పెరుగుతున్నా అందరికి రెండుపూటలా ఆకలి తీర్చుకునేందుకు తిండిగింజలు అందించలేకపోతున్నారు. మరొకపక్క పాఠశాలల్లో పారిశుద్ధ్య సౌకర్యంలేకపోవడం వల్ల అంటువ్యాధులకు కేంద్రాలుగా మారుతున్నాయి. ఇవన్నీ పాలకులకు తెలియనివికావు. ఇలాంటి పరిస్థితుల్లో కొత్తపథకాల గురించి ఆలోచించకపోయినా ప్రస్తుతం ఉన్న పథకాల్లో లోపాలను సవరించి పర్యవేక్షణ పెంచితే కొంతమేరకైనా లక్ష్యాన్ని చేరుకోగలుగుతాం.

అంతరాయాలు కలుగుతున్న కొద్దీ సంకల్పాన్ని దృఢతరం చేసుకుంటూ పోవాలి.



శ్రీ రమణ మహర్షి

అందరిలోనూ శక్తిసామర్థ్యాలు ఎంతో కొంత ఉంటాయి. వాటిని వినియోగించుకో వడంలోనే అసలు సమస్య ఉంటుంది.



బెంజిమెన్ ఫ్రాంక్లిన్

# నకిలీ విత్తనాల కాటుకు రైతాంగం బలి!

*జాతీయ నేర గణాంకాల బ్యూరో ప్రకారం దేశంలో ప్రతి సంవత్సరం వేలాదిమంది రైతులు, వ్యవసాయ కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. 2022లో దేశవ్యాప్తంగా 11 వేలకుపైగా రైతులు, వ్యవసాయ రంగానికి చెందిన వ్యక్తులు ఆత్మహత్యలు చేసుకున్నట్లు నమోదైంది. నకిలీ విత్తనాలకు రాష్ట్రాల సరిహద్దులు లేవు. ఒక రాష్ట్రంలో తయారై, మరోరాష్ట్రంలో ప్యాక్ అయి, ఇంకో రాష్ట్రంలో రైతు చేతికి చేరుతున్నాయి. అందుకే ఇది ఒక రాష్ట్ర సమస్య కాదు, జాతీయ వ్యవసాయ భద్రతకు సంబంధించిన సమస్య. తెలంగాణ, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలు తరచూ ఈకేసుల్లో ప్రస్తావనకు వస్తున్నప్పటికీ, దేశవ్యాప్తంగా నకిలీ విత్తనాల మాఫియా వేర్లు విస్తరించాయని దర్యాప్తులు సూచిస్తున్నాయి. నకిలీ విత్తనం పొలంలో పడితే పంట నష్టం, మార్కెట్‌లో అమ్మితే రైతుకు నష్టం, దాన్ని అరికట్టకపోతే దేశానికే నష్టం. అందుకే నకిలీ విత్తనాలపై యుద్ధం ప్రతి ఒక్కరి బాధ్యత.*

డాక్టర్ మోటె చిరంజీవి

వ్యవసాయ రంగంలో విత్తనం అత్యంత కీలకమైన ఉత్పాదక సాధనం. రైతు వేసే పంట భవిష్యత్తు, దిగుబడి, ఆదాయం అన్నీ విత్తనం నాణ్యతపై ఆధారపడి ఉంటాయి. ముఖ్యంగా వానాకాలం ప్రారంభమయ్యే సమయంలో రైతులు విత్తనాల కొనుగోలుకు పెద్ద ఎత్తున సిద్ధమవుతారు. ఈ అవకాశాన్ని కొందరు అక్రమ వ్యాపారులు నకిలీ విత్తనాలను మార్కెట్‌లోకి విడుదల చేయడానికి వినియోగిస్తుంటారు. ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోవడమే కాకుండా అప్పుల ఊబిలో కూరుకుపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. నకిలీ విత్తనాల వల్ల మొలక శాతం తగ్గిపోవడం, మొక్కల ఎదుగుదల సరిగా లేకపోవడం, తెగుళ్ల అధికంగా సోకడం, ఆశించిన దిగుబడి రాకపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయి. రైతు ఒకసారి నష్టపోతే ఆ ప్రభావం మొత్తం వ్యవసాయ చక్రంపై పడుతుంది. అందుకే నకిలీ విత్తనాల నివారణకు రైతులు, అధికారులు, విత్తన విక్రేతలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంది. రైతులు విత్తనాలను కొనుగోలు చేసే ముందు ప్రభుత్వం గుర్తింపు పొందిన డీలర్లు లేదా లైసెన్స్ కలిగిన విక్రయ కేంద్రాల నుంచే కొనుగోలు చేయాలి. విత్తన ప్యాకెట్‌పై కంపెనీ పేరు, బ్యాచ్ నంబర్, గడువు తేదీ, మొలకశాతం, ధృవీకరణ గుర్తులు ఉన్నాయో లేదోపరిశీలించాలి. ముఖ్యంగా కొనుగోలు చేసిన ప్రతి విత్తనానికి బిల్లు తీసుకోవడం తప్పనిసరి. భవిష్యత్తులో ఏదైనా సమస్య తలెత్తితే ఆ బిల్లు రైతుకు చట్టపరమైన ఆధారంగా ఉపయోగపడుతుంది. అదే విధంగా వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. రైతులకు నాణ్యమైన విత్తనాల గుర్తింపు, నకిలీ విత్తనాల వల్ల కలిగే నష్టాలపై శిక్షణ ఇవ్వాలి. మార్కెట్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి నకిలీ విత్తనాలను విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. చట్టాలను మరింత కఠినంగా అమలు చేయడం ద్వారా మాత్రమే ఈ అక్రమ వ్యాపారాన్నిఅరికట్టగలం. నేటి పరిస్థితుల్లో రైతు కేవలం పంట సాగు చేయడమే కాకుండా వినియోగదారుడిగా కూడా అప్రమత్తంగా ఉండాలి. తక్కువ ధరకు వస్తోందని నాణ్యతను విస్మరించడం ప్రమాదకరం. నాణ్యమైన విత్తనం కొనుగోలు చేయడం రైతు హక్కు మాత్రమే కాదు, అతని భవిష్యత్తుకు భరోసా కూడా. భారతదేశ వ్యవసాయ రంగం నేడు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ, వాటిలో అత్యంత ప్రమాదకరమైనది నకిలీ విత్తనాల వ్యాపారం. రైతు పొలంలో విత్తనం నాటే క్షణం నుంచే అతని భవిష్యత్తు నిర్ణయమవుతుంది.అలాంటి విత్తనమే నకిలీగా మారితే రైతు కష్టం, పెట్టుబడి, ఆశలు అన్నీ ఒక్కసారిగా కూలిపోతాయి. ఇది కేవలం పంట నష్టానికి మాత్రమే పరిమితం కాకుండా, అప్పుల భారానికి, మానసిక వేదనకు, చివరకు రైతు ఆత్మహత్యలకు కూడా దారి తీస్తున్న సామాజిక సమస్యగా మారింది.దేశంలో ప్రతి ఏటా లక్షలాది మంది రైతులు విత్తనాలపై భారీ మొత్తంలో పెట్టుబడులు పెడుతున్నారు. అయితే నాణ్యతలేని లేదా నకిలీ విత్తనాల కారణంగా పంటలు విఫలమైన సంఘటనలు అనేక రాష్ట్రాల్లో నమోదవుతున్నాయి. ముఖ్యంగా పత్తి, మొక్కజొన్న,సోయాబీన్, కూరగాయల పంటల్లో ఈసమస్య తీవ్రంగా కనిపిస్తోంది.విత్తనాలు మొలకెత్తకపోవడం, మొక్కల ఎదుగుదల సరిగా లేకపోవడం,దిగుబడి ఆశించిన స్థాయిలో రాకపోవడంవల్ల రైతులు తీవ్రనష్టాలను చవిచూస్తున్నారు. కేంద్ర ప్రభుత్వానికి సమర్పించిన వివరాల ప్రకారం,



గత కొన్నేళ్లలో పలు రాష్ట్రాల్లో భారీ మొత్తంలో నకిలీ విత్తనాలు స్వాధీనం అయ్యాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో నకిలీ విత్తనాల తయారీ, విక్రయాలపై కేసులు నమోదయ్యాయి. అయినప్పటికీ ఈ అక్రమ వ్యాపారం పూర్తిగా అరికట్టబడలేదన్నది వాస్తవం. అత్యంత ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, నకిలీ విత్తనాల వల్ల కలిగే పంట నష్టాలు రైతులను తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలోకి నెడుతున్నాయి. రైతు ఒక పంట కోసం అప్పులు చేసి పెట్టుబడి పెడతాడు. పంట విఫలమైతే అప్పు తీర్చలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఈ పరిస్థితుల్లో అనేక మంది రైతులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. దేశవ్యాప్తంగా నమోదవుతున్న రైతు ఆత్మహత్యల్లో నకిలీ విత్తనాలు ఒక పరోక్ష కారణంగా అనేక రైతు సంఘాలు, వ్యవసాయ నిపుణులు పేర్కొంటున్నారు. అయితే ప్రభుత్వ గణాంకాల్లో 'నకిలీ విత్తనాల వల్లే ఆత్మహత్య' అని ప్రత్యేకంగా నమోదు చేసే విధానం లేకపోవడం వల్ల అసలు సమస్య తీవ్రత పూర్తిగా బయటకు రావడం లేదు. జాతీయ నేర గణాంకాల బ్యూరో నివేదికలు ప్రతి సంవత్సరం వేలాది మంది రైతులు, వ్యవసాయ కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్లు చూపిస్తున్నాయి. ఈ మరణాల వెనుక అప్పులు, పంట వైఫల్యాలు, మార్కెట్ సమస్యలు, ప్రకృతి వైపరీత్యాలు వంటి అనేక కారణాలు ఉంటాయి. అయితే పంట వైఫల్యానికి నకిలీ విత్తనాలు కూడా ఒక ముఖ్య కారణంగా నిలుస్తున్నాయనే విషయాన్ని విస్మరించలేం. ఇలాంటి పరిస్థితుల్లో కేవలం రైతులను అప్రమత్తం చేయడం సరిపోదు. నకిలీ విత్తనాల తయారీ, నిల్వ, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలి. విత్తనాల విక్రయ కేంద్రాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి. నేరస్తులపై కఠిన శిక్షలు అమలు చేయాలి. అదే సమయంలో నష్టపోయిన రైతులకు త్వరితగతిన పరిహారం అందించే వ్యవస్థను బలోపేతం చేయాలి. రైతు దేశానికి అన్నదాత. అతని చేతిలోని విత్తనం నాణ్యంగా ఉంటేనే దేశ ఆహార భద్రత సురక్షి తంగా ఉంటుంది. నకిలీ విత్తనాల వ్యాపారం రైతు జీవితాలతో చేసే చెలగాటం మాత్రమే కాదు, దేశ వ్యవసాయ భవిష్యత్తుపై జరిగే దాడికూడా. ఈమౌన విప త్తును అరికట్టడం ప్రభుత్వాలు,అధికారులు,విత్తనకంపెనీలు, రైతు సంఘాలుసమాజం మొత్తం బాధ్యతగా గుర్తించాల్సిన సమయం ఆసన్నమైంది.వ్యవసాయ నిపుణుల అభిప్రాయం ప్రకారం ఒక పంట విజయంలో 20నుంచి25శాతం వరకు ప్రభావం విత్తన నాణ్యతపై ఆధారపడి ఉంటుంది. కేంద్ర వ్యవసాయశాఖ పార్లమెంట్‌లో వెల్లడించిన సమాచారం ప్రకారం, గత కొన్నేళ్లలో దేశవ్యాప్తంగా వేలాది క్వింటాళ్ల నకిలీ, నాణ్యతలేని విత్తనాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో నకిలీ విత్తనాల విక్రయాలపై వందలాది కేసులు నమోదయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లో 2015 -2022 మధ్య కాలంలో 21,724 టన్నుల నకిలీ లేదా నాణ్యతలేని విత్తనాలు స్వాధీనంకాగా, తెలంగాణలో 1.17 లక్షలటన్నులకు పైగా విత్తనాలు పట్టుబడినట్లు కేంద్ర ప్రభుత్వ సమాచారం. ఇది సమస్య తీవ్రతకు నిదర్శనం.జాతీయ నేరగణాంకాల బ్యూరోప్రకారం దేశంలో ప్రతి సంవత్సరం వేలాదిమంది రైతులు,వ్యవసాయ కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. 2022లో దేశవ్యాప్తంగా 11వేలకుపైగా రైతులు,వ్యవసాయ రంగానికి చెందిన వ్యక్తులు ఆత్మహత్యలు చేసుకున్నట్లు నమోదైంది. నకిలీ విత్తనాలకు రాష్ట్రాల సరిహద్దులు లేవు. ఒక రాష్ట్రంలో తయారై, మరోరాష్ట్రంలో ప్యాక్ అయి, ఇంకో రాష్ట్రంలో రైతుచేతికి చేరుతున్నాయి. అందుకే ఇదిఒక్క రాష్ట్ర సమస్య కాదు,జాతీయ వ్యవసాయ భద్రతకు సంబంధించిన సమస్య. తెలంగాణ, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలు తరచూ ఈకేసుల్లో ప్రస్తావనకు వస్తున్నప్పటికీ, దేశవ్యాప్తంగా నకిలీ విత్తనాల మాఫియా వేర్లు విస్తరించాయని దర్యాప్తులు సూచిస్తున్నాయి. నకిలీ విత్తనం పొలంలో పడితే పంట నష్టం,మార్కెట్‌లో అమ్మితే రైతుకు నష్టం, దాన్ని అరికట్టకపోతే దేశానికే నష్టం. అందుకే నకిలీ

# బాలల భవిత బంగారు బాట... సమాజ సంక్షేమం


రామకిష్టయ్య సంగనభట్ల

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం, వివిధ దేశాలలో చట్టాలు ఎన్ని చేసినా అవి అమలుకు నోచుకోవడం లేదు. ఐక్యరాజ్య సమితి ప్రత్యేక విభాగమైనఅంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) 2002లో ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవంను ప్రారంభించింది. ప్రపంచంలో అసంఘటిత రంగంలో బాల కార్మికుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. ఉదాహరణకు ఇళ్లలో పనిచేసే బాలలు. వాస్తవానికి అనేక సందర్భాల్లో బాలకార్మిక వ్యవస్థప్రభుత్వ లెక్కల్లోకి రాదని కూడా జాతీయ బాలల హక్కుల కమిషన్ పేర్కొంటోంది. యునిసెఫ్ ప్రకారం దాదాపు సగం మంది, ప్రణాళికా సంఘం అంచనా ప్రకారం సుమారు 43 శాతం మంది బాలబాలికలు ఎనిమిదో తరగతిలోపే బడి మానివేస్తున్నారు. షెడ్యూల్డ్ కులాల్లో ఇది 55శాతం షెడ్యూల్డ్ తెగల్లో 63శాతం దాకా ఉందని అంచనా. బడి మానేసిన ప్రతి పిల్లవాడూ అనివార్యంగా బాలకార్మికుడిగానే జీవిస్తున్నాడని వివిధ అధ్యయనాలు తెలియ జేస్తున్నాయి. ఫలితంగా బాలల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, లెంగిక వేధింపులు పెరుగుతున్నాయి. 2005 నాటికి జాతీయ బాలల కార్యాచరణలో భాగంగా బాల కార్మిక వ్యవస్థ నిషేధంతో పాటు బాల్య వివాహాలను పూర్తిగా నిరోధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ, ఈ లక్ష్య సాధనలో విఫలమయ్యాం. ప్రపంచ బాలలహక్కుల దినోత్సవం జరుపుకుంటున్నా ప్రయోజనం లేకుండాపో యింది. అందమైన బాల్యాన్ని లేకుండా చేయడం అతి పెద్ద మానవ హక్కుల ఉల్లంఘన. బాలకార్మిక వ్యవస్థను రద్దు చేయాలన్నా లేదా బాల్యవివాహాలను పూర్తిగా నిషే ధించాలన్నా ముందు జరగాల్సింది సార్వత్రిక ప్రాథమిక విద్యను అందుబాటులోకి తేవడం. అందుకే విద్యను ప్రాథ మిక హక్కుగాచేశారు. చట్టంఅమల్లో భాగంగా బడిబయట ఉన్న పిల్లలను, మధ్యలో మానేసిన వారిని తిరిగి బడిలో చేర్పించడం సవాలుగా మారింది.విద్యాహక్కు చట్టం హామీ ఇచ్చినవిధంగా వీరందరికీ వాళ్ల వయసుకు తగినతరగతిలో చేర్పించి విద్యనందించడమూ ఒక సవాలే. మధ్యలో బడి మానేయకుండా చూడటానికి ఎనిమిదో తరగతి వరకూ పిల్లలకు డిటెన్షన్ పద్ధతి ఉండకూడదని, వీరిని సమగ్ర, నిరంతర మూల్యాంకన పద్ధతిద్వారా పరీక్షి ంచాలని విద్యా హక్కు చట్టం చెబుతోంది. నాణ్యమైన విద్యనందించడం ద్వారా ప్రతిఒక్కరూ అవసరమైన స్థాయిలో చదువు నేర్చుకుని, తర్వాతి తరగతిలోకి ప్రవేశించగలిగేలా చేయా ల్సిన బాధ్యత పాఠశాలపై ఉంటుందనీ చట్టం పేర్కొంటోం ది. బాలలు బాలకార్మికులుగా మారకుండా చేసేందుకు విద్యాహక్కు చట్టంలో అనేక ఇతర నిబంధనలూఉన్నాయి. విద్యా సంవత్సరంలో ఏ సమయంలో వచ్చినా తగిన తరగతిలో చేర్చుకోవాలి. అవసరమైన అదనపు శిక్షణ ఇవ్వాలి. దండన లేనిబోధన అందించాలి.బడిలో ఉండాల్సిన పిల్లలు అందులో చేరకపోవడానికి, మధ్యలో బడి మానేసి బయట ఉండటానికి తల్లిదండ్రుల పేదరికం,సామాజిక వెనక బాటుతనం, పిల్లలకు అనుకూలంగా లేని బోధనాంశాలు,బోధనా ప్రణాళిక తదితర కారణాలున్నాయి.భారత రాజ్యాంగంలోని 24,39,45వ అధికరణలు పిల్లలకు శ్రమ దోపిడీ నుంచే కాకుండా ఇతర రక్షణలనూ కల్పిస్తున్నాయి.వయసుకుతగని ఆర్థిక కార్యకలాపాలు, వృత్తుల్లో పని చేయకుండా భారత రాజ్యాంగం పిల్లలకు రక్షణకల్పిస్తోంది. బాలకార్మిక వ్యవస్థను రూపుమాపడానికి భారత ప్రభుత్వం త్రిముఖవ్యూహాన్ని అమలుచేస్తోంది.బాలకార్మిక చట్టాల అమలు,బాలలసమగ్రాభివృద్ధికి అవసరమైన ప్రణాళికల రూపకల్పన,అమలు,

# ప్రభుత్వ బడులను బలోపేతం చేయాల్సిందేనా?

దాడిశెట్టి శ్యామ్ కుమార్

విద్య అనేది దేశ నాగరికత జీవన విధానాలపై ప్రభావాన్ని చూపిస్తూ ఉంటుంది. దేశం శాస్త్ర సాంకేతిక అభివృద్ధి పథంలో ముందుకు పురోగమించాలంటే అక్షర జ్ఞానం కూడా ప్రతిఒక్కరికి అందాల్సి ఉంటుంది.ఈక్రమంలో దేశంలో ప్రతి ఒక్కరికి విద్యను అందించే రీతిలో రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ప్రీ ప్రైమరీ మొదలు ప్రాథమిక ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాల విద్యాభివృద్ధికి ఉచిత విద్యాబోధనతో పాటు అనేక సదుపాయాలను కల్పిస్తున్నాయి. ప్రధానంగా ప్రాథమిక స్థాయి నుండి ఉచిత విద్యను అందించాలనే లక్ష్యంతో విద్యాహక్కు చట్టం అమలుకు ప్రభుత్వాలు ప్రాధా న్యతనిస్తూ దేశంలోని బడిఈడు పిల్లలందరికి నిర్బంధవిద్య ను అమలు పరుస్తున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో విద్యాహక్కు చట్టం పూర్తిస్థాయిలో అమలు జరగడం లేదనే విమర్శలు కూడా లేకపోలేదు.అయితే విద్యను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి జాబితాలో చేర్చడం జరిగింది. ఈ క్రమంలో అనేక రకాలైనటువంటి విద్యా ప్రయోజనాత్మక విలువలు గణనీ యంగా పెరుగుతున్నాయి. ప్రభుత్వాలు సైతం ప్రభుత్వ పాఠశాలలో నాణ్యత కలిగిన విద్య కోసం ఉత్తమమైన విష య బోధకులను నియమిస్తూ అత్యున్నతమైన నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించేందుకు ప్రయత్నిస్తుంది. ఆధునిక సాంకేతిక విధానాలను కూడా ప్రభుత్వ పాఠశాలలో వినియోగించుకునే రీతిలో ఇంటర్నెట్ సదుపాయం ఇంటరాక్ట్ ఫ్లాట్ ప్యానెల్ బోర్డులు డిజిటల్ బోధనతో పాటు సహ పాఠ్య కార్యక్రమాల నిర్వహణ కూడా చేపడుతుంది. ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల రూపకల్పనకు కావలసిన బడ్జెట్ సరిపోవడంలేదని భిన్న వాదనలు తరచుగా వినిపిస్తున్నాయి. అయినప్పటికీ ప్రభుత్వాలు ప్రతి సంవత్సరం పాఠశాల మౌలిక వసతులకు కొంత బడ్జెట్‌ను కేటాయిస్తూ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తూ మౌలిక సదుపాయాల అభివృద్ధిపరిచే దిశగా ప్రయత్నిస్తూనే ఉన్నప్పటికి కారణాలు ఏవైనా క్షేత్రస్థాయిలో ఎందుకో పరిపూర్ణంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు అనుకున్న స్థాయి చేరుకోలేకపోతుందనే సంశయం కలగక మానదు. ప్రభుత్వ పాఠశాలలో తెలుగు ఇంగ్లీష్ మాధ్యమాలలో విద్యాబోధన, సహ పాఠ్య కార్యక్రమాలు ఆధునిక శాస్త్ర సాంకేతిక భావన అభివృద్ధి పరిచే సైన్స్ ప్రయోగశాలల నిర్వహణతో పాటు విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని నైపుణ్యాలను పెంపొందించే విధంగా క్రీడలకు కూడా ప్రాధాన్యతనిస్తున్నాయి. అయితే ఇన్ని విధాలుగా ప్రభుత్వాలు ప్రభుత్వ పాఠశాల నిర్మాణాత్మక విధానాలకు ప్రత్యేక కార్యచరణ చేపడుతున్నప్పటికీ, ప్రభుత్వ పాఠశాలలో అనుకున్న స్థాయిలో విద్యార్థులు నమోదు కాకపోవడం గమనార్హం.దీనికి ప్రధానంగా స్థానికంగా ప్రభుత్వపాఠశాలపై పూర్తి అవగాహన లేకపోవడమా లేక ప్రభుత్వ పాఠశాల ఔన్నత్యాన్ని పూర్తిస్థాయిలో స్థానికులు గుర్తించలేకపోతున్నారా అనిపిస్తుంది. ప్రభుత్వాలు నడిపే ప్రాథమిక ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలల్లో చాలా వరకు విశాలమైన



ఆటస్థలాలు అనుకూలమైన నీటివసతి, శానిటేషన్ వ్యవస్థ విద్యార్థులకు అడపాదడపా ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించడం, సరైనవిద్యార్హతలు కలిగిన బోధనా సిబ్బందిని నియమించడంతోపాటు ఉచిత మధ్యాహ్న భోజనం పాఠ్య పుస్తకాలు నోటు పుస్తకాలు,స్కూల్ యూనిఫార్మ్ ఇలాంటిఎన్నో పథకాలు ప్రభుత్వాలు అమలుచేస్తుండడం ఒక ఎత్తు అయితే ప్రభుత్వ పాఠశాలలో అనుకున్న స్థాయిలో విద్యార్థులు తగినంతగా లేకపోవడం మరో ఎత్తుగా ఉంటుంది. నాణ్యత ప్రమాణాలు పుష్కలంగా ఉన్నటువంటి విద్యావ్యవస్థగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో అన్ని వర్గాల వారితో పాటు ఎక్కువగా పేద, బడుగు బలహీన వర్గాలు ఆర్థికంగా వెనుకబడి ఉన్న విభిన్నవర్గాల వారికి ఉపయోగకరంగా ఉంటున్నప్పటికీ, విద్యార్థుల సంఖ్య అనుకున్న స్థాయిలో లేకపోవడం ఆర్థికంగా వెనుకబడిన వారు దారిద్ర్యరేఖకు దిగువ ఉన్నటువంటి కుటుంబాల నుండివస్తున్న విద్యార్థుల సంఖ్యనే ఎక్కువగా ప్రభుత్వ పాఠశాలలో ప్రస్తుతం గోచరిస్తుంది. గత రెండు దశాబ్దాల నుండి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు తగ్గిపోతుండడం ప్రధానంగా ప్రభుత్వాలే కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాలు మోడల్ స్కూల్స్, సాంఘిక సంక్షేమ గురుకుల వ్యవస్థలను ఏర్పాటు చేయడంతో చాలా వరకు ఆయా విద్యాలయాల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతూ వస్తున్నది. తద్వారా స్థానికంగాఉన్నటువంటి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు సంఖ్య తగ్గిపోతుందా అనిపిస్తుంది. ప్రతి విద్యా సంవత్సరం ప్రభుత్వ పాఠశాలలో కనీస స్థాయిలో నిరంతరం నమోదు శాతం పెరుగుతూ ఉండాలి. అయితే ప్రస్తుతం కొన్ని రాష్ట్రాల్లో ప్రీప్రైమరీ స్కూళ్లను ప్రారంభించడం ద్వారా కొంతవరకు ప్రభుత్వ పాఠశాలలో క్రమంగా విద్యార్థుల సంఖ్య పెరుగుదలకు ఆస్కారం ఉంటుందని అనుకుంటున్నారు. ప్రాథమిక స్థాయి నుండే మౌలిక వసతులు మరింత ఉన్నతీకరించబడి తరగతి గదుల సంఖ్యతోపాటు అవసరమైన విషయ బోధకులు ఉన్నట్లయితే ప్రాథమిక స్థాయి నుండే విద్యార్థులు ప్రభుత్వ పాఠశాల వైపు గణనీయంగా ఆకర్షింపబడతారని అంచనా. ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక స్థాయిలో ఐదు తరగతులకు ఎక్కువగా ఒకటి నుండి రెండు తరగతి గదులు ఉండడమే కాకుండా ఒకరు లేదా ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉంటున్నారు. ఇలా కాకుండా ప్రాథమిక స్థాయి పటిష్టంగా ఉండాలంటే విషయ బోధకులు సరిపడా ఉండాలనే వాదనలు వినిపిస్తున్నాయి . ప్రాథమిక స్థాయి పటిష్టంగా ఉంటే తద్వారా ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయడానికి అవకాశం ఏర్పడుతుందనే భిన్న అభిప్రాయాలు లేకపోలేదు. ఏది ఏమైనప్పటికీ విద్యా లక్ష్యాలకువిద్యార్థుల అభ్యసన సామర్థ్యాలకు ప్రభుత్వ పాఠశాలలు చాలా ప్రాధాన్యతను ఇస్తూనేఉన్నాయి.విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో సాంకేతికతను కూడా వినియోగించుకుని విద్యా బోధన పద్ధతులతో బాధ్యతగా విషయ బోధకులు నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీ కేంద్రాలతోపాటు ప్రీప్రైమరీ ప్రాథమిక ప్రాథమికోన్నత ఉన్నత స్థాయి తరగతులలో విద్యార్థులను అధికంగా నమోదు చేయించడానికి స్థానికంగా ఉన్నటువంటి పాఠశాలవిద్యా కమిటీలతో సహా అన్నివర్గాల ప్రజలు సంయుక్తంగాప్రభుత్వ సహకారంతో బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే విద్యను అభ్యసించేందుకు అవసరమైన అన్ని చర్యలను

# ప్రజావాక్కు

## విద్యార్థులకు శాస్త్రీయ విద్యను అందించండి

చాగంటి, నాగపని శర్మలాంటి వారిని దూరం పెట్టండి. విద్యార్థులకువిలువలు పెంచేందుకుఒకటవతరగతి నుండి చాగంటి వారి ప్రవచనాలు బోధించేందుకు ప్రభుత్వం సిలబసు ఇచ్చింది. అయ్యా ..విద్యాశాఖామంత్రి గారు మీరు విదేశాలలో చదువుకొని వచ్చారు, మీలో శాస్త్రీయ ఆలోచనలు మెండుగా ఉంటాయి అనుకున్నాము.మరి మీరేమో విలువల కొరకు చాగంటి వారిని ఆశ్రయిస్తున్నారు.ప్రజాకవి వేమనపద్యాలు సిలబస్‌లోచేర్చండి. విద్యార్థులకు..చాగంటి సూక్తులు కాదు. సూర్యుడు చంద్రుడు భూమి తమ చుట్టూ తాము అలా అలా తిరిగే క్రమంలో ఒకదాని నీడఒకదాని మీదపడి గ్రహణాలు ఏర్పడతాయి. పాఠశాలలో ఇవి చెప్పే సైన్స్ పంతులు గ్రహణం రోజు కదలకుండా దుప్పటి కప్పుకొని పడుకునే వాళ్ళు కూడా ఉన్నారు. ఆచరణ ముఖ్యం. అలాంటి విద్యను విద్యార్థులకు నేర్పండి. శాస్త్రీయ సమాజం నిర్మించండి.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

## ఫిరాయింపుదారుల సభ్యత్వాన్ని రద్దుచేయాలి

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరు తీర్పు అత్యంత పవిత్రమైనది. ప్రజలు ఒకసిద్ధాంతాన్ని నమ్మి తమ ప్రతినిధులను ఎన్నుకుంటారు. అయితే ఇటీవల రాజకీయాల్లో చోటు చేసుకుంటున్న ఫిరాయింపులు ఓటర్ల నమ్మకాన్ని వమ్ము చేస్తున్నాయి. ప్రజాప్రతినిధులు ప్రలోభాలకు గురై పక్షాలు మార్చడం ప్రజాస్వామ్య విలువలకే గొడ్డలి పెట్టు.ప్రస్తుతం ఉన్నఫిరాయింపు నిరోధకచట్టం ఆశించిన ఫలితాలను ఇవ్వడం లేదు. ఈ చట్టంలోని లొసుగులను వాడుకుని ప్రతినిధులు స్వార్థ ప్రయోజనాల కోసం పక్షాలు మారుతున్నారు. ఒక గుర్తుపై గెలిచి మరో పక్షంలోకి వెళ్లడం ఓటర్లను మోసం చేయడమే. ఫిరాయింపులకు పాల్పడినప్పుడు సభ్యత్వం తక్షణమే రద్దు అయ్యేలా కఠిన నిబంధనలు ఉండాలి.

- కె.నాగరాజు, నల్గొండజిల్లా

## చెత్త సేకరణలో నిర్లక్ష్యం

పట్టణాలలో, గ్రామాలలో నిరంతరం ప్రయాణిస్తూ రోడ్ పైన ఎక్కడబడితే నిరుపయోగమైన ప్లాస్టిక్ కవర్లు, తినుబండారాలు, తడి చెత్త పొడి చెత్త వేస్తుంటాం. దీని వలన దానికి దగ్గరగా ఉన్న కుటుంబాలు అనారోగ్యాల పాలు అవుతూ ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ ప్రాణాలు పోగోటుకుంటున్నాం.కావున సిబ్బంది ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్‌లలోమాత్రమే చెత్తవేసి ప్రాణాలను కాపాడుదాం.

- ఎం. శంకర్‌రావు, హైదరాబాద్

## ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో పెనుముప్పు

మానవ మనుగడలో సాంకేతిక పరిజ్ఞానం భాగమైన వేళ ఎల క్ట్రానిక్ వ్యర్థాలు పర్యావరణానికి పెను సవాలుగా మారాయి. పాతమొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు, రిఫ్రిజిరేటర్లు, టెలివిజన్ల వంటి పరికరాలు పనికిరాకుండా పోయినప్పుడు అవి ఇవ్యర్థాలుగా మారుతాయి. భారతదేశంలో ఈసమస్య తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. గణాంకాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఇవ్యర్థాల ఉత్పత్తిలో అమెరికా,చైనా తర్వాత భారతదేశం మూడవ స్థానంలో ఉంది.భారతదేశం ఏటాసుమారు 3.2మిలియన్ టన్నులఎలక్ట్రానిక్ వ్యర్థాలనుఉత్పత్తి చేస్తోం ది. ఇందులో కేవలం పది శాతం మాత్రమే శాస్త్రీయంగా పున ర్వినియోగం అవుతోంది.మిగిలిన వ్యర్థాలు అసంఘటిత రంగం చేతుల్లోకి వెళ్లడంవల్ల విషపూరితమైన సీసం, పాదరసం, కాడ్మియం వంటి మూలకాలు నేలలోకి, నీటిలోకి చేరు తున్నాయి. దీనివల్ల శ్వాసకోశ వ్యాధులు, నాడీవ్యవస్థ దెబ్బతినడం వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. కనుక ఎలక్ట్రానిక్ వ్యర్థాలు ఎంత తక్కువగా ఉంటే అంత మంచిది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## బాధితులకు ఉపశమనం

ప్రకృతి విపత్తులు ఊహించుకుని సమయంలోనే కాకుండా ఎప్పుడైనా సంభవించి జనజీవితం అతలాకుతలం అవుతుంది. దీనికితోడు తుఫానుకు, అగ్నిప్రమాదాలకు నివాస గృహాలుపోయి గూడులేక, పనులు స్తంభించి కుటుంబాల రోదనతో బాధ వర్ణనాతీతం. ప్రభుత్వ పరిహారం అందేలోపున రిజర్వ్ బ్యాంక్ ప్రభావిత ప్రాంతాల అభ్యర్థులకు వారు అడగక ముందే రుణ ఉపశమన చర్యలు అమలు చేయొచ్చునని మార్గదర్శకాలు వెలువడినవి. ఈ నిర్ణయం బాధలతో ఉన్న వారిని దయతో,బ్యాంకులు ఆదుకోవడం మానవత్వంతో తీసుకున్న ఉత్తర్వు. దీనితోపాటు బ్యాంకుల సేవలను తాత్కాలిక ప్రాంగణం నుండిచేస్తారు. ఇంటిని పునర్నిమాణం చేయుటకు బాధితులకు ఎంతో ఉపశమనం కల్గించే విషయం.

- బి మేఘనాదం, విశాఖపట్నం

## సర్ పై అప్రమత్తంగా ఉందాం..

ఎలక్షన్ కమిషన్ ప్రవేశపెడుతున్న ఓటర్ సవరణ చట్టం పై నిరంతరం అవగాహన కలిగి ఉండి మనం అప్రమత్తంగా అర్హులుగా ఉన్న కూడా మన ఓటును తొలగించే అవకాశాలు లేకపోలేదు.అప్రమత్తంగా ఉంటేనే ప్రజాస్వామ్యాన్ని కాపాడిన వ్యక్తులవుతాము. మన ఓటు హక్కును మనమే కాపాడుకోవాలి. తప్పులు చూపించి తప్పించుకునే అవకాశాలు ఉన్నాయి.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు

## ఇరాన్‌పై అమెరికా దాడులు

## యుఎస్ సైనిక స్థావరాలు లక్ష్యంగా ఇరాన్ ప్రతికారదాడులు



**వాషింగ్టన్, జూన్ 11:** ఇరాన్‌పై భారీ స్థాయిలో దాడులు చేస్తామని ట్రంప్ చెప్పిన కొద్దిసేపటికే ఆ హెచ్చరికలు వాస్తవ రూపం దాల్చాయి. దీంతో పశ్చిమాసియాలో యుద్ధపు మంటలు తీవ్రమయ్యాయి. ఇరాన్‌లోని పలు లక్ష్యాలపై దాడులు చేసినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. ఇవి ట్రంప్ ఆదేశాల మేరకు కేవలం ఆత్మరక్షణ కోసమే చేశామని పేర్కొంది. ఇరాన్‌లోని దక్షిణ ప్రాంతంలో భారీగా పేలుళ్ల జరిగాయి. మినాబ్, బందర్ అబ్బాస్, సిరిక్, టెహ్రాన్ ప్రాంతాలపై అమెరికా దృష్టి సారించింది. మరోవైపు కాల్పుల విరమణ కోసం ఇరాన్ ప్రతినిధులు ప్రాధేయపడ్డారని ట్రంప్ వ్యాఖ్యానించారు. దీనిని ఇరాన్ కొట్టిపారేసింది. ఈ విడతలో దాడులు ముగిసినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించింది.

**సంతకం చేయకపోతే దాడులే**

అమెరికా ప్రతిపాదిత ఒప్పందంపై ఇరాన్ సంతకం చేయకపోతే రేపు రాత్రి దాడులు చేస్తామని అధ్యక్షుడు ట్రంప్ చెప్పినట్లు ఆ దేశ జాతీయ మీడియా సంస్థ పేర్కొంది. దీనికి తగినట్లే ఇరాన్‌లోని స్థావరాలను లక్ష్యంగా చేసుకొంది. మొత్తం 49 తోమహాక్ క్షిపణులను ఈ దాడుల్లో వినియోగించినట్లు పేర్కొంది. ఇరాన్‌కు 64 కి.మీ. దూరంలోని కొన్ని లక్ష్యాలను ధ్వంసం చేసినట్లు తెలిపింది. దీంతోపాటు ఫైటర్ జెట్లు కూడా దాడుల్లో పాల్గొని పర్షియన్ గల్ఫ్ వద్ద ఇరాన్ రాడార్, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను దెబ్బతీసినట్లు వెల్లడించింది.

**హార్ముజ్ మూసివేత.. బహ్రాయిన్, కువైట్‌పై ప్రతిదాడులు**

అమెరికా దాడులకు ఇరాన్ దీటుగా స్పందించింది. హార్ముజ్ జలసంధిని అన్నిరకాల నౌకలకు మూసివేసినట్లు ప్రకటించింది. రెండు చమురు ట్యాంకర్లపై కూడా ఐఆర్‌జిసి దళాలు దాడులు చేశాయి. వాటికి అమెరికా యుద్ధనౌకలు సాయపడుతున్నట్లు ఆరోపించాయి. మరోవైపు కువైట్, బహ్రెయిన్‌లోని అమెరికా స్థావరాలను ఇరాన్ టార్గెట్ చేసింది. బహ్రెయిన్‌లోని షేక్ ఇసా ఎయిర్‌బేస్, కువైట్‌లోని అలీఅల్‌సలీమ్ ఎయిర్‌బేస్‌లపై డ్రోన్లు దాడి చేసినట్లు ఐఆర్‌జిసి పేర్కొంది.



## మరో భారత్ ట్యాంకర్ జల్‌వీర్‌పై అమెరికా క్షిపణి దాడులు

**న్యూఢిల్లీ,జూన్ 11:** ఇరాన్‌అమెరికా మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ భారతీయ సిబ్బందితో ప్రయాణి స్తున్న మరో వాణిజ్య నౌక దాడికి గురైంది. ఒమన్‌లోని షినాస్ పోర్టు సమీపంలో ఈ ఘటన జరిగింది. ఈ విషయాన్ని ఒమన్‌లోని భారత రాయబార కార్యాలయం ధృవీకరించింది. ఘటనపై స్థానిక అధికారులతో సంప్రదింపులు జరుపుతూ పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నట్లు వెల్లడించింది. ప్రాథమిక సమాచారం ప్రకారం గినియాబిస్సావు జెండాతో ప్రయాణిస్తున్న జలవీర్ ట్యాంకర్‌లో భారతీయ సిబ్బంది ఉన్నారు. దానిపై దాడి జరిగినప్పటికీ అందులోని సిబ్బంది క్షేమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. వారం రోజుల్లో భారతీయ సిబ్బందితో ఉన్న నౌకలపై దాడి జరగడం ఇది మూడోసారి. ముందురోజేసెట్టెబెల్లోఅనే ట్యాంకర్‌పై అమెరికా జరిపిన దాడిలో ముగ్గురు భారతీయ నావికులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. పశ్చిమాసియాలో పరిస్థితులు మళ్లీ ఉద్రిక్తంగా మారుతున్నాయి. అమెరికా సైనిక హెలికాప్టర్‌ను కూల్చివేయడంతో అమెరికా బలగాలు ప్రతీకార దాడులు చేపట్టాయి. దానికి ప్రతిగా ఇరాన్ క్షిపణులు, డ్రోన్లతో ఎదురుదాడులు చేసింది. దీంతో గల్ఫ్ ప్రాంతంలో భద్రతా పరిస్థితులు మరింత క్లిష్టంగా మారాయి. జోర్డాన్, కువైట్, బహ్రెయిన్‌లో ఉన్న అమెరికా స్థావరాలపై దాడి చేసినట్లు ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ప్రకటించింది. జోర్డాన్ అల్ అజ్రక్ ఎయిర్ బేస్‌పై 12 బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించినట్లు ఐఆర్జీసీ తెలిపింది. అక్కడ అమెరికా తన జెట్స్‌ను స్టేషన్ చేసింది. ఎఫ్15, ఎఫ్16, ఎఫ్35 విమానాలు అక్కడ ఉన్నట్లుతెలిసింది.

తమ దాడిలో అమెరి కాకు చెందిన అనేక యుద్ధ విమానాలు ధ్వంసం అయినట్లు ఇరాన్ పేర్కొన్నది. బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లతో ఆపరేషన్ చేపట్టినట్లు ఇరాన్ తెలిపింది. భారత సిబ్బందితో ఉన్న నౌకలపై దాడులను కేంద్ర విదేశాంగ శాఖ తీవ్రంగా ఖండించింది. అంతర్జాతీయ జలమార్గాల్లో స్వేచ్ఛాయుత రాకపోకలకు భంగం కలగకూడదని స్పష్టం చేసింది. ఉద్రిక్తతలను తగ్గించి, దౌత్య పరమైన పరిష్కారం దిశగా వెంటనే చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చింది.



## మీనాక్షి నటరాజన్ ఆశలు గల్లంతు

### మధ్యప్రదేశ్‌లో ముగ్గురు బిజెపి అభ్యర్థులు ఎన్నిక: ఇసి ప్రకటన

**భోపాల్,జూన్ 11:** రాజ్యసభ ఎన్నికల్లో బిజెపికి భారీ విజయం దక్కింది. మధ్యప్రదేశ్‌లోని మూడు రాజ్యసభ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో మూడింటినీ బిజెపి కైవసం చేసుకుంది. 2026 రాజ్యసభ ఎన్నికల్లో మధ్యప్రదేశ్ నుంచి ముగ్గురు బిజెపి అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రజనీష్ అగర్వాల్, తరుణ్‌చుగ్, మహేశ్ కేవత్. ఈ మూడింటిలో ఒక స్థానం నుంచి కాంగ్రెస్ మహిళా నేత మీనాక్షి నటరాజన్ రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేశారు. ఆమె నామినేషన్‌ను ఇసి తిరస్కరించిన సంగతి తెలిసిందే. మీనాక్షి నామినేషన్ తిరస్కరణకు గురికావడంతో ఆ స్థానం బిజెపికి దక్కింది. నామినేషన్ల తిరస్కరణ ప్రక్రియ పూర్తి కావడంతో పోటీలో మూడు స్థానాలకు ముగ్గురు బిజెపి అభ్యర్థులు మాత్రమే మిగిలారు. దీంతో వారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఇసి ప్రకటించింది. వారికి నియామకపత్రాల్ని కూడా ఇసి అందించింది. నిజానికి ఈ ఎన్నిక ఈ నెల 18న జరగాల్సి ఉంది. కానీ, కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నామినేషన్‌ను ఇసి తిరస్కరించింది. తెలంగాణలో నమోదైన ఒక కేసుకు సంబంధించి ఆమె వివరాలు పేర్కొనలేదని చెబుతూ మీనాక్షి నామినేషన్‌ను తిరస్కరించింది. ఈవిషయంపై బిజెపి తగిన ఆధారాల్ని ఇసికి సమర్పించింది. వాటిని పరిశీలించిన ఇసి మీనాక్షి అఫిడవిట్‌లో తప్పుడు వివరాలు ఉన్నాయని భావించి, ఆమె నామినేషన్ రద్దు చేసింది. ఈ అంశంలో బిజెపి, ఇసి కలిసి కుట్ర పన్నారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. దీనిపై కాంగ్రెస్ పార్టీ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. 12వ తేదీన సుప్రీంకోర్టులో దీనిపై విచారణ జరగనుంది.

## హార్ముజ్‌లో అమెరికా రహస్య ఆపరేషన్



### 100 మిలియన్ బ్యారెళ్ల చమురును తరలించాం

### ట్రూత్‌లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడి

**వాషింగ్టన్, జూన్ 11:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒక సంచలన విషయాన్ని వెల్లడించారు. ఇరాన్‌తో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, వ్యూహాత్మకంగా హార్మూజ్ జలసంధిలో తమ సైన్యం ఓ రహస్య ఆపరేషన్ నిర్వహించిందని ప్రకటించారు. గత నెలలో జరిగిన ఈ ఆపరేషన్‌లో భాగంగా 100 మిలియన్ బ్యారెళ్లకు పైగా చమురును సురక్షితంగా తరలించామని, ఈ విషయం ఇరాన్‌కు ఇప్పుడే తెలిసిందని ఆయన పేర్కొన్నారు. ఈ చర్యతో అంతర్జాతీయ మార్కెట్లో చమురు సరఫరాకు అంతరాయం కలగకుండా చూశామని తెలిపారు. ఓవల్ ఆఫీసులో మాట్లాడిన ట్రంప్, ఆ తర్వాత తన ట్రూత్ సోషల్ ప్లాట్‌ఫామ్‌లో మరిన్ని వివరాలు పంచుకున్నారు. గత నెలలో హార్మూజ్ జలసంధి గుండా ఆయిల్ ట్యాంకర్లు, ఇతర వాణిజ్య నౌకలు ప్రయాణించేందుకు సహకరించాలని మన గొప్ప యూఎస్‌సైన్యాన్ని నేను ఆదేశించాను. ఈ ప్రయత్నం ఫలితంగా 100 మిలియన్ బ్యారెళ్లకుపైగా చమురు జలసంధిని దాటి బహిరంగ మార్కెట్‌లోకి చేరిందని ప్రకటించడానికి నేను సంతోషిస్తున్నాను. 200కు పైగా వాణిజ్య నౌకలు సురక్షితంగా ప్రయాణించాయని ట్రంప్ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ ఆపరేషన్ కారణంగానే అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు (ప్రస్తుతం బ్యారెల్‌కు 8590 డాలర్లు) భారీగా పెరగకుండా నిలకడగా ఉన్నాయని ట్రంప్ తెలిపారు. ఇరాన్ ఆంక్షల కారణంగా చమురు సరఫరాకు ఆటంకం కలగకుండా ఈ చర్యలు తీసుకున్నామని, మిషన్‌కు ప్రమాదం కలగకూడదనే ఉద్దేశంతోనే ఈ విషయాన్ని ఇప్పటివరకు గోప్యంగా ఉంచామని ఆయన వివరించారు.

## భారతీరాజా మృతిపట్ల ప్రధాని మోడీ సంతాపం



### స్వగ్రామంలో భారతీరాజాకు అంత్యక్రియలు పూర్తి

**న్యూఢిల్లీ,జూన్ 11:** దక్షిణాది చలనచిత్రరంగ దర్శకుడు భారతీరాజా మరణం పట్ల ప్రధాని నరేంద్ర మోడీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. భారతీయ సినిమా రంగంలో, ముఖ్యంగా తమిళ చిత్ర పరిశ్రమలో ఆయన ఒక దిగ్గజమని, తన అద్భుతమైన సృజనాత్మకతతో తమిళ సినిమా గమనాన్నే మార్చేశారని ప్రధాని కొనియాడారు. సోషల్‌మీడియాలో మోడీ తన సంతాప సందేశాన్ని పంచుకున్నారు. భారతీరాజా గ్రామీణ జీవనాన్ని, పల్లెటూరి వాతావరణాన్ని వెండితెరపై ఆవిష్కరించిన తీరు అద్భుతమని, అది ఎప్పటికీ ప్రశంసనీయంగా నిలిచిపోతుందని మోడీ పేర్కొన్నారు. ఈ కష్టసమయంలో ఆయన కుటుంబ సభ్యులకు, అభిమానులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఓం శాంతి అంటూ ప్రధాని నివాళులర్పించారు. మరోవైపు భారతీరాజా అంత్యక్రియలు ఆయన స్వగ్రామమైన తేనిలో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు పూర్తి ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించారు. 1977లో వచ్చిన క్లాసిక్ హిట్ 16 వయతినిలే సినిమాతో దర్శకుడిగా ప్రస్థానాన్ని ప్రారంభించిన భారతీరాజా దాదాపు నాలుగు దశాబ్దాల పాటు సాగిన సినీ ప్రస్థానంలో 40కిపైగా చిత్రాలను తెరకెక్కించారు.

తమిళ చిత్రసీమలో ఆయన అందించిన విశేష సేవలకుగానూ ఇయక్కునర్ ఇమయంఅంటే దర్శక శిఖరం అనే బిరుదును దక్కించుకు న్నారు. తమిళనాడు దిండుగల్ జిల్లా కొడైకెనాల్ సమీపాన వత్తలగుండు ఘాట్‌రోడ్డులోని ఆయన సొంత ఎస్టేట్‌లో భారతీ రాజా అంత్యక్రియలు పూర్తిచేసినట్లు ఆయన కుమార్తె జనని తెలిపారు. తండ్రి మరణవార్త తెలియగానే మలేసియా నుంచి చెన్నైకు చేరుకున్న ఆమె భారతీరాజా కోరిక మేరకే ఆయన అంత్యక్రియలను ఆయన స్వగ్రామంలో నిర్వహించామని తెలిపారు.

## సెట్టెబెల్లో ట్యాంకర్‌పై దాడి ఘటనలో ముగ్గురు భారతీయ సిబ్బంది మృతి

**న్యూఢిల్లీ,జూన్ 11:** ఒమన్ తీరానికి సమీపంలో అమెరికా బలగాలు జరిపిన దాడిలో ముగ్గురు భారత నావికులు మరణించినట్లు కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ వెల్లడించారు. తొలుత వీరు గల్లంతైనట్లు సమాచారం వచ్చినా ఇప్పుడు వారి మరణాన్ని అధికారికంగా ధ్రువీకరించారు. ముగ్గురిలో ఇద్దరి మృతదేహాలు మాత్రమే ఇప్పటివరకు లభ్యమైనట్లు తెలిపారు. పలావు జెండాతో ప్రయాణిస్తున్న సెటెబెల్లో ఆయిల్ ట్యాంకర్‌పై ఈ దాడి జరిగినట్లు సమాచారం. నౌకలో మొత్తం 28 మంది సిబ్బంది ఉండగా వారిలో 24 మంది భారతీయులు ఉన్నారు. మిగిలిన వారిలో ఇద్దరు పాకిస్థాన్‌కు చెందిన వారు, ఓ ఉక్రెయిన్ పౌరుడు, ఓ రష్యా పౌరుడు ఉన్నారు. దాడి తర్వాత 21 మంది భారత నావికులను సురక్షితంగా రక్షించారు. అయితే డెక్ క్యాడెట్ ఆదిత్య శర్మ, ఇంజిన్ ఫిట్టర్ శివానంద్ చౌరాసియా, చీఫ్ ఇంజినీర్ పట్నాల సురేశ్ కనిపించకుండా పోయారు. తాజాగా వీరు మరణించినట్లు నిర్ధారణ అయింది. రక్షించిన సిబ్బందిని వెంటనే స్వదేశానికి తీసుకురావాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. మృతదేహాలను కూడా త్వరగా భారత్‌కు తరలించే చర్యలు చేపట్టాలని సూచించారు. ఇరాన్ చమురు రవాణాపై అమల్లో ఉన్న ఆంక్షలను ఉల్లంఘించిందనే ఆరోపణలతో అమెరికా సెంట్రల్‌కమాండ్ ఈ నౌకపై దాడి చేసినట్లు తెలుస్తోంది. హార్మూజ్ జలసంధి మీదుగా ప్రయాణించే సమయంలో ఈ ఘటన జరిగినట్లు సమాచారం. ఈఘటనను భారత్ తీవ్రంగా ఖండించింది. భారతీయులు ప్రయాణిస్తున్న నౌకపై దాడి జరగడం ఆందోళన కలిగించే విషయమని తెలిపింది. ఉద్రిక్త పరిస్థితులు మరింత పెరగకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చింది. ఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయ ప్రతినిధిని పిలిపించి నిరసన వ్యక్తం చేసింది.

## మాట వినకుంటే బాంబులతో జవాబిస్తాం

### అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్

**వాషింగ్టన్,జూన్ 11:** అణు కార్యక్రమంపై అమెరికా ప్రతిపాదించిన ఒప్పందాన్ని ఇరాన్ అంగీకరించకపోతే దాడులు కొనసాగుతాయని ఆ దేశ రక్షణ మంత్రి హెగ్సెత్ హెచ్చరించారు. అవసరమైతే బాంబులతోనే చర్చలు జరుపుతాం అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

ఆ విషయంలో తమ కంటే మెరుగైన వారు ఎవరూ లేరని వ్యాఖ్యానిం చారు. ఇరాన్‌కు ఇంకా ఒప్పందం చేసుకునే అవ కాశం ఉందని హెగ్సెత్ తెలిపారు. అమెరికా అధ్య క్షుడు ట్రంప్ ప్రతిపాదించిన అణు ఒప్పందాన్ని అంగీకరిస్తే పరిస్థితి మారుతుందని ఇరాన్ చర్చలను ఆలస్యం చేస్తోందని ఆరోపించారు. ఫలితంగా అమెరికాఒత్తిడి కొనసాగుతూనే ఉంటుందని స్పష్టం చేశారు. దౌత్యపరమైన ప్రయత్నాలకు మద్దతుగా సైనిక చర్యలు చేపడుతున్నామని చెప్పారు. అధ్యక్షుడు ఆశిస్తున్న ఒప్పందాన్ని సాధించేందుకు అవసరమైన పరిస్థితులు సృష్టించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఇరాన్‌తో ఉద్రిక్తతల మధ్య హార్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకల రాకపోకలు కొనసాగేం దుకు అమెరికా చర్యలు చేపడుతోందని హెగ్సెత్ తెలిపారు.

## భార్యనే కాడెద్దుగా మార్చిన చిన్నరైతు



### వైరల్ విడియోపై స్పందించిన మహారాష్ట్ర సిఎం

**ముంబయి,జూన్ 11:** మహారాష్ట్రలోని మారుమూలగ్రామంలో ఒక సన్నకారురైతు పిడుగు పాటుకు తన ఎద్దుమృతిచెందడంతో ఒక్క ఎద్దుతోపాటు రెండోపక్క తన భార్యనే పెట్టి పొలం దున్నుతున్న వైనం చూపరులను కలిచివేసింది. ఈ దృశ్యాన్ని సోషల్ మీడియాలో వైరల్ చేయడంతో రాష్ట్ర సిఎం దేవేంద్ర ఫడ్నవిస్ తక్షణమే స్పందించడంతో ఆమె కుటుంబానికి న్యాయం జరిగింది. మహిళే ఎద్దు స్థానంలో కాడి మోయాల్సి వచ్చింది. ఖరీఫ్ సాగు నిమిత్తం తన భర్తతో కలిసి పొలాన్ని దున్నేందుకు ఆమె సిద్ధపడింది. ఈ హృదయ విదారక దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో, ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తక్షణమే స్పందించి ఆ కుటుంబాన్ని ఆదుకున్నారు. లాతూర్ జిల్లాలోని దేవని తాలూకా బొంబాలి గ్రామానికి చెందిన కౌలు రైతు కాశీనాథ్ గైక్వాడ్‌కు రెండు ఎద్దులు ఉండగా, ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పిడుగు పడటంతో వాటిలో ఒకటి మరణించింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో, కొత్త ఎద్దును కొనుగోలు చేసే స్తోమతలేక ఆ దంపతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఈ క్రమంలో కాశీనాథ్ భార్య హౌసాబాయి గైక్వాడ్, మిగిలిన ఒక్క ఎద్దుతో కలిసి తానూ కాడి మోసింది. తమ ఎనిమిది ఎకరాల పొలాన్ని దున్నడానికి ఆమె సిద్ధమైంది. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో నాయకులు స్పందించారు. ఎన్సీపీ (ఎస్పీ) ఎమ్మెల్యే రోహిత్ పవార్, శివసేన (యూబీటీ) ఎమ్మెల్సీ అంబదాస్ దాన్వే ఈ ఘటనపై ఆందోళన వ్యక్తం చేస్తూ ప్రభుత్వ సాయం కోరారు. విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, తక్షణమే చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో బుధవారం లాతూర్ కలెక్టర్ భరత్ నేతృత్వంలో అధికారులు ఆ గ్రామాన్ని సందర్శించి, గైక్వాడ్ కుటుంబానికి కొత్త ఎద్దును అందజేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సుమారు రూ.32,000 నష్టపరిహారాన్ని వారి బ్యాంకు ఖాతాలో జమ చేశారు. ప్రభుత్వ సాయం అందడంతో హౌసాబాయి ఊపిరి పీల్చుకుంది.




## కేరళలో నిఫావైరస్ కలకలం

### కోజికోడ్‌లో ఒకరికి పాజిటివ్

**కోజికోడ్,జూన్ 11:** కేరళ రాష్ట్రంలో నిఫా వైరస్ కలకలం రేపింది. కోజికోడ్ జిల్లాకు చెందిన 43 ఏండ్ల వ్యక్తికి ప్రాథమిక పరీక్షలో వైరస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. ఆవ్యక్తికి గిడ్డంగిని శుభ్రం చేస్తున్న ప్పుడు ఈ ఇన్ఫెక్షన్ సోకి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తు న్నారు. అతడిని పరీక్షించిన వైద్యులు రోగి శాంపిల్స్‌ను నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపించారు. పరీక్ష ఫలితాలు నేడు వెలువడే అవకాశం ఉందని, ప్రస్తుతం రోగి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన ప్రభుత్వం కోజికోడ్ జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేక సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. నిఫా పరిస్థితులపై అంచనా వేసి మెడికల్ బోర్డు ఆధ్వర్యంలో తీసుకోవాల్సిన చర్యలపై నేడు చర్చించనున్నారు. ఎన్‌ఐవి పరీక్ష ఫలితాల ఆధారంగా కంటైన్‌మెంట్ జోన్‌లను ఏర్పాటు చేయడం, రాష్ట్రంలో ఆంక్షలు విధించడంపై నిర్ణయం తీసుకుంటామని అధికారులు తెలిపారు. రోగి పలువురితో కలిసి తిరిగినందున ఆరోగ్య శాక అధికారులు ఇప్పటికే కాంటాక్ట్ ట్రేసింగ్ ప్రారంభించారు. కేరళ ఆరోగ్య మంత్రి కె. మురళీధరన్ మాట్లాడుతూ నిఫాపై ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

## ఆ నలుగురి కోసం పాకిస్థాన్ ఆర్మీ వేట

**ముజఫరాబాద్,జూన్ 11:** పాక్ ఆక్రమిత కశ్మీర్ పివొకెలో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇటీవల జరిగిన హింసాత్మక నిరసనల నేపథ్యంలో, ఆందోళనలకు నాయకత్వం వహించిన నలుగురు కీలక నేతలను పట్టుకునేందుకు అక్కడి ప్రభుత్వం వేట మొదలుపెట్టింది. వారిని అరెస్ట్ చేయడానికి సమాచారం ఇచ్చిన వారికి రూ.కోటి రివార్డును ప్రకటించింది. ఈ ఘర్షణల్లో భద్రతా సిబ్బందితోపాటు పలువురు పౌరులు మరణించడంతో పరిస్థితి మరింత జటి లంగా మారింది. ధరల పెరుగుదల, నిరుద్యోగం, తీవ్రమైన విద్యుత్ కోతలు, రాజకీయపరమైన అంశాలపై స్థానికుల్లో చాలాకాలంగా అసంతృప్తి పేరుకు పోయింది. ఈ సమస్యలపై పోరాడేందుకు 2023లో ఏర్పాటైన జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జెఎఎసి) ఆధ్వర్యంలో ప్రజలు ఆందోళన బాట పట్టారు. ముజఫరాబాద్ వైపు భారీ పాదయాత్రకు పిలుపునివ్వడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. వెంటనే జాక్ సంస్థను ఉగ్రవాద నిరోధక చట్టాల కింద నిషేధించి, దాని నేతలపై దేశద్రోహం కేసులు నమోదు చేసింది. షౌకత్ నవాజ్ మీర్, ఉమర్ నజీర్ కశ్మీరీ, ఖవాజా మెహ్రాన్ అర్షద్, సర్దార్ అమన్ ఖాన్ అనే నలుగురు ముఖ్య నేతలను పట్టుకోవడమే లక్ష్యంగా అధికారులు గాలిస్తున్నారు. పివొకెలోని రావల్‌కోట్ వంటి ప్రాంతాల్లో నిరసనకారులకు, భద్రతా బలగాలకు మధ్య తీవ్ర ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఈ హింసలో సుమారు 7 నుంచి 11 మంది మరణించినట్లు అల్ జజీరా, రాయిటర్స్ వంటి అంతర్జాతీయ మీడియా సంస్థలు నివేదించాయి. మృతుల్లో నలుగురు భద్రతా సిబ్బంది కూడా ఉన్నారని తెలిపాయి.

**భారత్ స్పందన.. ప్రస్తుత పరిస్థితి:** పివొకెలో పోలీసుల దౌర్జన్యాలపై వస్తున్న వార్తలపై భారత విదేశాంగ శాఖ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. మానవ హక్కుల ఉల్లంఘనపై అంతర్జాతీయ సమాజం దృష్టి సారించాలని కోరింది. శాంతియుత నిరసనలను అణచివేయ డాన్ని పలు హక్కుల సంఘాలు కూడా ఖండించాయి. ప్రస్తుతం పీవోకే వ్యాప్తంగా ఉద్రిక్త వాతావరణం నెలకొని ఉంది.

Ref B1/128/2025 dt.10.06.2026

స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) వారి కార్యాలయం
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు.
రాజమహేంద్రవరం

భూసేకరణ చట్టం, 2013 లోని సెక్షన్ 93 (1) ప్రకారం

(ఉపసంహరణ)

2013 భూసేకరణ చట్టంలోని సెక్షన్ 93లోని సబ్-సెక్షన్ (1) ప్రకారం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, బుట్టాయిగూడెం మండలం, దొరమామిడి గ్రామంలోని ఆర్.ఎస్.నెం.లోని మొత్తం Ac.5.72 సెంట్లు భూమి క్రింద పేర్కొన్న షెడ్యూల్లోని భూములు భూ సమస్యలు ఉన్నవి. కావున ఇందుమూలంగా ఉపసంహరించుకుంటుంది. పోలవరం ఇరిగేషన్ ప్రోజెక్ట్ క్రింద ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం ద్వారా 2013 నాటి భూసేకరణ, పునరావాసం మరియు పునరావాసంలో న్యాయమైన పరిహారం మరియు పారదర్శకత చట్టం 30 యొక్క సెక్షన్ -11(1) క్రింద ప్రాధమిక ప్రకటన నోటిఫికేషన్ నిమిత్తం Ac.24.60 సెంట్లు విస్తీర్ణంలో సర్వేనెం.261 మొ.. అంటే, పోలవరం ఇరిగేషన్ ప్రోజెక్ట్ క్రింద వారి నుండి సేకరించిన భూములకు బదులుగా పునరావాసం మరియు పునరావాసం కింది వి.ఆర్.పురం మండలంలోని శబరిరావిగూడెం గ్రామంలోని గిరిజన భూమిని కోల్పోయిన వారికి ప్రజాప్రయోజనం కోసం భూమిని కేటాయించడం కోసం అవసరమైనట్లుగా రెండు దినపత్రికలలో మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసాధారణ గెజిట్ నెంబర్. PIP/62/2025, తేది: 29.11.2025లో ప్రచురించబడింది.

షెడ్యూలు

| జిల్లా: ఏలూరు | | | మండలం: బుట్టాయిగూడెం | | | గ్రామం : దొరమామిడి | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| క్రమ సంఖ్య | PN ప్రకటనలో క్రమ సంఖ్య | సర్వే నెంబరు | భూసేకరణ క్రింది విస్తీర్ణం (య.సెంట్లు) | భూమి తరగతి | సంబంధిత ఆసామి పేరు/భూమితో సంబంధం ఉన్న వ్యక్తి పేరు /ఆసక్తి గల వారు మరియు చిరునామా | సరిహద్దులు | | | | చెట్లుకట్టడములు ఇతరముల వివరములు |
| | | | | | | [illegible] | [illegible] | [illegible] | [illegible] | |
| 1 | 1 | 260-6 | 3.50 | మెరక | తగరం అరుణాచలం | 259 | 262 | 261 | 260 | తాడి చెట్లు-16 |
| 2 | 2 | 152-2A | 2.22 | మెరక | సోయం గంగా రత్నం | 152-1 | 150, 151 | 152-3 | 153 | ........ |
| మొత్తం | | | 5.72 | | | | | | | |

Place: వి.ఆర్.పురం యూనిట్ - 2
Date : 10-06-2026

కె.ఆంజనేయులు
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే)
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు,
వి.ఆర్.పురం యూనిట్ - 2,
చింతూరు.

వి.అభిషేక్ ఐ.ఎ.ఎస్
స్పెషల్ కలెక్టర్ (భూ.సే) (ఎఫ్.ఎ.సి),
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు,
రాజమహేంద్రవరం

12-06pg6exHMNWJQETCL-ff.qxd:12-06pg6exHMNWJQETCL-ff.qxd 1/1/02 6:51 AM Page 1



## రాష్ట్రంలో కాక్రోచ్ రాజకీయం.. మేము కూడా అంటూ మాజీ సిఎం జగన్ ప్రకటన

**విజయవాడ జూన్ 11 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశవ్యాప్తంగా కాక్రోచ్ పార్టీ సంచలనం సృష్టించింది.. కేంద్రప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ ఈ పార్టీ చేసిన రచ్చ అంతా ఇంత కాదు. ఆఖరికి కాక్రెచ్ పార్టీ అఫీషియల్ ట్విట్టర్ సైతం బ్యాన్ వరకూ వెళ్లింది. అయినా సరే వేరే నేమ్‌తో మళ్లీ తన పోస్టులను కాక్రోచ్ పార్టీ కొనసాగించింది. ఇదిలా ఉంటే కాక్రోచ్ రాజకీయం ఏపీని కూడా తాకింది. కాక్రోచ్ పార్టీపై స్పందించాలంటూ మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిని అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం చెప్పారు. రాష్ట్రంలో తామే కాక్రోచ్ అనిఅన్నారు. తప్పు ఒప్పుకోకుండా ప్రశ్నించిన వారిని ఇబ్బంది పెడితే కాక్రోచ్‌లు లేస్తాయని ప్రభుత్వాన్ని ఉద్దేశించి ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాదు ఈ విషయాన్ని చంద్రబాబు గుర్తు పెట్టుకోవాలంటూ హెచ్చరించారు.

# రాజ్యసభకు నలుగురూ ఏకగ్రీవం

### ధ్రువీకరణ పత్రాలు అందచేసిన ఎన్నికల అధికారి



**విజయవాడ,జూన్ 11, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రం నుంచి రాజ్యసభ సభ్యులుగా సానా సతీశ్ , చింతకాయల విజయ్, భాష్యం రామకృష్ణ, లింగమనేని రమేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నామినేషన్ల ఉపసంహారణ గడువు ముగియడంతో నలుగురూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఈసీ ధ్రువీకరించింది. నాలుగు ఖాళీలకు నాలుగు నామినేషన్లే దాఖలు కావడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించింది. అనంతరం ఎన్నికైన సభ్యులకు ధ్రువపత్రాలు జారీ చేసింది. రాష్ట్రం నుంచి నాలుగు రాజ్యసభ స్థానాలు ఖాళీకాగా ముగ్గురు టీడీపీ తరఫున, ఒకరు జనసేన తరఫున ఎన్నికయ్యారు. ఏపీ నుంచి ఖాళీ అయిన 4 రాజ్యసభ స్థానాలకు కూటమి ఒప్పందం మేరకు 4 రాజ్యసభ స్థానాల్లో 1 జనసేన, 3 టీడీపీకి ఖరారయ్యాయి.రాజ్యసభ అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ గడువు సోమవారంతో ముగిసింది. మంగళవారం నామినేషన్ల పరిశీలన, బుధవారం ఉపసంహరణకు చివరి తేదిగా గడువు పెట్టారు. చివరికి నాలుగు ఖాళీలకు నాలుగు నామినేషన్లే దాఖలవడంతో గురువారం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఈసీ ప్రకటించింది.

అభ్యర్థుల ఎంపికను అధికారికంగా ప్రకటించిన రిటర్నింగ్ అధికారిణి వనితాకుమారిన నేరుగా ఎంపీ ఎన్నిల ధృవీకరణ పత్రాలను టీడీపీ అభ్యర్థు చింత కాయల విజయ్, భాష్యం రామకృష్ణకు అందించారు.

టీడీపీ అభ్యర్థి సానా సతీష్, జనసేన అభ్యర్థి లింగమనేని రమేష్‌ల ఎంపిక దృవీకరణ పత్రాలను వారి ప్రతినిధులు అందుకున్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

# ఎక్సైజ్, మైనింగ్ రంగాల్లో పారదర్శకతకు ప్రభుత్వం కట్టుబడి ఉంది: మంత్రి కొల్లు రవీంద్ర

**మదనపల్లె, జూన్ 11 ప్రభాతవార్త :** ఎక్సైజ్ మైనింగ్ రంగాల్లో పారదర్శకత సంస్కరణలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర గనుల, భూగర్భ,ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. గురువారం అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లెకు వచ్చిన సందర్భంగా కలెక్టరేట్‌లో అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి ఉమ్మడి జిల్లాల ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులతో సమీక్ష సమావేవం నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరుజిల్లాలోని అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాలకు సంబందించిన ఎక్సైజ్ అధికారులతో సమగ్రంగా సమీక్ష నిర్వహించి, ప్రస్తుత పరిస్థితులపై చర్చించినట్లు తెలిపారు. ఈ శాఖలో గతంలో నెలకొన్న పరిస్తితులను సరిదిద్దుతూ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. మద్యం విక్రయాల్లో డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడంతో ప్రసుత్తం 60నుండి 70శాతం వరకు డిజిటల్ లావాదేవీలు జరుగుతున్నాయని వాటిని వందశాతానికి పెంచే లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. అక్రమ మద్యం విక్రయాలు, బెల్టుషాపులు, గంజాయి రవాణా వంటి అంశాలపై కఠినచర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వారిపై అవసరమైన పీడి యాక్టు పెట్టి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మద్యం ఎంఆర్‌పి ధరలు ఉల్లంఘనలు, విక్రయ సమయాలు అమలు తదితర అంశాలపై పర్యవేక్షణను కొనసాగించాలన్నారు. విధి నిర్వహణలో ఎక్సైజ్‌శాఖ ఉద్యోగి మరణిస్తే రూ.5లక్షలు, ప్రభుత్వ తరపున మరో రూ.5లక్షలు మొత్తం రూ.10లక్షలు ఆర్థికసాయం అందజేశామని తెలిపారు. ఆయన భార్యకు ఉద్యోగం కల్పిస్తామన్నారు. మదనపల్లె వైట్ ఇస్కాన్ వైట్, కలర్ గ్రానైట్ వంటి ఖనిజాలకు డిమాండ్ ఉందన్నారు. ఖనిజ తవ్వకాలలో భద్రతా ప్రమాణాలు, నిబంధనలు అమలను పరిశీలించేందుకు క్వారీలను సందర్శిస్తున్నామని తెలిపారు. ఎక్కడైన అవకతవకలు జరిగిప విజిలెన్స్ తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఖనిజ సంపదను సమర్థవంతంగా వినియోగించి వాల్యూ అడిషన్ ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఖనిజ వనరులను సద్వినియోగంచేసుకుంటూ ఆదాయం పెంచే దిశగా ప్రభుత్వం ముంఉదకు సాగుతోందన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ, ఎక్సైజ్‌శాఖ అధికారులు, తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్‌చినబాబు, ఇతర అదికారులు పాల్గొన్నారు.



## శ్రీకాళహస్తీశ్వరాలయంలో రాజస్థాన్ మంత్రి

**శ్రీకాళహస్తి,జూన్ 11 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వ రాలయంలో నిర్వహించే మహిమాన్విత రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకున్నారు. గురువారం రాజస్టాన్‌కు చెందిన వాటర్ రిసోర్స్‌స్ శాఖ మంత్రి సురేష్ సింగ్ రావత్ కుటుంబసభ్యులతో ఆలయానికి వచ్చారు. వారికి దక్షిణ గోపురం వద్ద వేద పండితులతో ఆలయ ఇఓ బికె వెంకటేశులు ,ప్రోటోకాల్ ఎఇఓ లోకేష్‌బాబు ఎపిఆర్‌ఓ రవిలు స్వాగతం పలికారు. ఆలయంలోని సహస్రలింగేశ్వరుని ఆలయం వద్ద వారికి రాహుకేతుదోష నివారణ పూజలు ప్రత్యేక వేదపండితులతో ఏర్పాటు చేసారు. ఉత్తర భారత దేశంలో ఇ లాంటి ఆలయం లేదని ఈ ఆలయంలో శిల్ప, నిర్వహణ చక్కగా ఉందని మంత్రి ప్రసంశించారు.ఆలయ చరిత్ర గురించి మంత్రికి ఆలయ ఇఓ బికె వెంకటేశులు వివరించారు. స్వామిఅ మ్మవార్ల అంతరాలయ దర్శనం తరువాత మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు.స్వామి అమ్మవార్ల చిత్రపటాలను,తీర్థ ప్రసాదాలను అందించారు. ఏర్పాట్లును ఆలయ ఇన్స్పెక్టర్ హరియాదవ్, ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డిలు పర్యవేక్షించారు.

# విజయవంతంగా 'యోగ - టిటిడి ఆరోగ్యానంద'

**తిరుమల,జూన్ 11ప్రభాతవార్తప్రతినిధి:** అంతర్జాతీయ యోగ దినోత్సవానికి టిటిడి భారీ ఏర్పాట్లు చేస్తోంది. 17 కేంద్రాల్లో ప్రతిరోజూ యోగాభ్యాసం: చేయిస్తూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం, ఉద్యోగుల్లో శారీరకమానసిక దృఢత్వం పెంపొందించాలనే లక్ష్యంతో టిటిడి నిర్వహిస్తున్న "యోగ-టిటిడి ఆరోగ్యానంద" కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. జూన్ 7 నుండి 21వ తేదీ వరకు జరుగుతున్న ఈ ప్రత్యేక యోగ శిక్షణలో టిటిడి ఉద్యోగులు, విద్యార్థులు, విశ్రాంత ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొంటూ యోగాసనాలను అభ్యసిస్తున్నారు. 14 రోజుల పాటు యోగ శిక్షణ టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఇఒ ముద్దాడ రవిచంద్ర ఆదేశాల మేరకు ఉద్యోగులు, విద్యార్థులు ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవడంతో పాటు కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణకు దోహదపడేలా 14 రోజులపాటు ప్రతిరోజూ గంటసేపు యోగాభ్యాసాన్ని నిర్వహిస్తున్నారు. టిటిడి జెఇఒ డాక్టర్ ఎ. శరత్ పర్యవేక్షణలో తిరుపతిలోని 17 కేంద్రాల్లో యోగ శిక్షణ కొనసాగుతోంది. పరిపాలనా భవనం, ఎస్వీ ఆయుర్వేద కళాశాల, స్విమ్స్, బర్డ్ క్యాంపస్, శ్వేత క్యాంపస్, ఎస్వీ సంగీత నృత్య కళాశాల, గోవిందరాజస్వామి ఆలయం, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల, ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల, ఎస్వీడబ్ల్యూ డిగ్రీ, జూనియర్, పాలిటెక్నిక్ కళాశాలలు, ఎస్వీ జూనియర్ కళాశాల, కోదండరామస్వామి హైస్కూల్, ఎస్వీ బాలికల ఉన్నతపాఠశాల, వినాయకనగర్, గోవిందరాజనగర్, ఎల్.ఎస్. నగర్ క్వార్టర్స్ ప్రాంతాల్లో ప్రతిరోజూ యోగాభ్యాసం నిర్వహిస్తున్నారు. యోగతో మానసిక ప్రశాంతత - శారీరక దృఢత్వం నిత్య




యోగాభ్యాసం ద్వారా ఉద్యోగులు మానసిక ఒత్తిడిని అధిగమించి భక్తులకు మరింత సమర్థవంతంగా సేవలందించగలరని టిటిడి భావిస్తోంది. యోగ సాధన శారీరక దృఢత్వం, మానసిక వికాసం, ఏకాగ్రత, అంతర్గత చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు కుటుంబ సభ్యుల ఆరోగ్య సంరక్షణకు కూడా ఎంతో దోహదపడుతుందని అధికారులు పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 7న తిరుపతి మహతి ఆడిటోరియంలో "యోగ-టిటిడి ఆరోగ్యానంద" కార్యక్రమాన్ని ప్రారంభించారు. జూన్ 18, 19, 20 తేదీలలో యోగ పోటీలను నిర్వహించనుండగా, జూన్ 21న టిటిడి పరిపాలనా భవనంలోని పరేడ్ గ్రౌండ్‌లో అంతర్జాతీయ యోగ దినోత్సవ వేడుకలను భారీ ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

# గుమ్మడి గోపాలకృష్ణకు కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారం

### సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్, మంత్రుల అభినందన

**విజయవాడ,జూన్ 11,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ నాటక అకాడమీ ఛైర్మన్, ప్రముఖ రంగస్థల నటుడు కళారత్న గుమ్మడి గోపాలకృష్ణకు కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు లభించిన నేపథ్యంలో సీఎం చంద్రబాబు నాయుడు ఆయనకు " ఎక్స్" వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు రంగస్థల ఖ్యాతిని విశ్వవిఖ్యాతం చేసిన గుమ్మడి నటన అపూర్వమన్నారు.పద్యనాటకాల్లో శ్రీకృష్ణునిగా, శ్రీనాధునిగా, హరిశ్చంద్రునిగా ఆయన నటన,గానం మరువలేని వన్నారు. డీసీఎం పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేష్, కందుల దుర్గేష్‌లు గుమ్మడికి అభినందనలు తెలిపారు. పద్య నాటక గానగంధర్వుడిగా ప్రసిద్ధి చెందారు. ఆయన కృష్ణా జిల్లా మేడూరు గ్రామంలో 1955లో జన్మించారు. మచిలీపట్నంలో ప్రాథమిక విద్యను అభ్యసించారు..1982లో ప్రముఖ నాటకకర్త ఆచంట వెంకటరత్నం నాయుడు మేడూరులో నాటకం వేసేందుకు వచ్చారు. ఆ సందర్భంగా గోపాలకృష్ణను చూసి తన బృందంలో చేర్చుకుని, హార్మోనిస్ట్ చింతా ఆంజనేయులు వద్ద శిక్షణకు పంపారు. ఒకటి, రెండు నాటకాలు వేసిన తర్వాత కుటుంబ సభ్యులు, వారి కోరిక మేరకు ఉపాధి కోసం గోపాలకృష్ణ హైదరాబాద్ వెళ్లారు. అక్కడ ఓ హౌసింగ్ సొసైటీలో ఉద్యోగం చేస్తూనే, గురువు విద్వాన్ రామచంద్ర ప్రోత్సాహంతో మళ్లీ రంగస్థలంపై అడుగుపెట్టారు.గోపాలకృష్ణ పౌరాణిక, చారిత్రక నాటకాల్లో విభిన్న పాత్రలు పోషించి ప్రేక్షకుల మన్ననలు పొందారు. శ్రీనాథ కవిరాజు పాత్రలో వందకు పైగా ప్రదర్శనలు ఇచ్చారుశ్రీకృష్ణ రాయబారంలో శ్రీకృష్ణుడిగా, శ్రీరాముడిగా, హరిశ్చంద్రుడిగా,"చింతామణిలో బిల్వమంగళుడిగా ఆయన నటనకు విశేష ఆదరణ లభించింది. 1983 నుంచి గోపాలకృష్ణ ప్రస్థానం మలుపు తిరిగింది. 1991లో తిరుపతి పరిషత్‌లో తొలిసారిగా ఉత్తమ నటుడి పురస్కారం అందుకున్నారు. 1999లో నంది నాటకోత్సవాల్లో ఉత్తమ నటుడిగా,"శ్రీనాథుడు నాటకానికి నంది అవార్డు పొందారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ పురస్కారంతోనూ సత్కరించింది."శ్రీనాథుడుతో అమెరికా వరకు: 2003లో విజయనగరంలో ప్రదర్శించిన "శ్రీనాథుడు నాటకాన్ని వీక్షించిన అప్పాజోస్యుల ఫౌండేషన్ అమెరికాలో ప్రదర్శనలు ఏర్పాటు చేసింది. ఈ నాటకాన్ని డాక్టర్ సి.నారాయణరెడ్డి వీక్షించి గోపాలకృష్ణ నటనను అభినందించారు."శ్రీనాథుడు నాటకం వందకు పైగా ప్రదర్శనలు పూర్తిచేసుకుంది. 2024 డిసెంబర్ లో ఏపీ నాటక అకాడమీ ఛైర్మన్‌గా రెండోసారి బాధ్యతలు చేపట్టిన గోపాలకృష్ణ, తెలుగు పద్య నాటకానికి పూర్వవైభవం తీసుకురావడానికి కృషి చేస్తున్నారు.

# రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో అన్నీ అక్రమాలే!

### - నేడు రాష్ట్రవ్యాప్తంగా వైసిపి నిరసన ర్యాలీలు :మాజీ సిఎం వైఎస్ జగన్



**విజయవాడ,జూన్ 11, ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌లో ఎన్నో అక్రమాలు జరిగాయని, చంద్రబాబు ప్రభుత్వం రెండేళ్ళలో అనేక అవకతవకలకు పాల్పడగిందని వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆరోపించారు.చంద్రబాబు రెండేళ్ల వెన్నుపోటు పాలనపై నిరసనగా రేపు రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గ స్థాయిలో వైసిపి ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. డీఎస్సీ అవకతవకల అంశంపై గురువారం తాడేపల్లిలోని పార్టీ కేం ద్ర కార్యాలయంలో వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడుతూ . పేపర్ లీకుల్లో చంద్రబాబుదే రికార్డు అని చెప్పారు. డీఎస్సీ పరీక్షల పేరుతో చంద్రబాబు, మంత్రి లోకేష్ కలిసి అక్రమాలకు పాల్పడ్డారనీ, తప్పులను ఎత్తిచూపుతుంటే చంద్రబాబుకు నరాలు తెగిపోయేంత బీపీ వస్తోందని ఎద్దేవా చేశారు. ఇది జెన్‌జీ కాలం.. దేన్నీ చంద్రబాబు ఆపలేరనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. చంద్రబాబు రెండేళ్ల వెన్నుపోటు పాలనపై నిరసనగా రేపు రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గ స్థాయిలో వైసిపి ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. డీఎస్సీ విషయంలో ఇవాళ వెలుగులోకి వస్తున్న విషయాలన్నీ చూస్తుంటే ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయన్నారు. లక్షల మంది అభ్యర్థుల నమ్మకాన్ని చంద్రబాబు ప్రభుత్వం వమ్ము చేసిందని మండిపడ్డారు. డీఎస్సీ అంటే లక్షల మంది యువత ఆశ. వారి భవిష్యత్తు అని, అలాంటి ఉద్యోగ నియామక ప్రక్రియలో కూడా అవినీతి, అక్రమాలకు పాల్పడటం అత్యంత దారుణమన్నారు. 16వేల పోస్టులకే ఇన్ని స్కామ్‌లు, లీకులు కనిపిస్తున్నాయన్నారు. మెగా డీఎస్సీ అనడానికి అర్హత లేదు.. అని చెప్పారు. తమ ప్రభుత్వంలో ఒకే సమయంలో ఒకే నోటిఫికేషన్ ఇచ్చామని జగన్ చెప్పారు. 1లక్షా 30 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేశామన్నారు. 2019 మే 30న సిఎంగా ప్రమాణం చేసిన 50 రోజుల్లోనే ఇచ్చామని తెలిపారు. 19 లక్షల మంది పరీక్షలు రాస్తే ఒక్క తప్పు కూడా జరగలేదు అని అన్నారు. నాలుగు నెలల్లోనే ఉద్యోగాల భర్తీ ప్రక్రియ భర్తీ పూర్తి చేశామన్నారు. ఇప్పుడు మాత్రం డీఎస్సీ పేరుతో అభ్యర్థులకు ఆవేదన మిగిల్చారు అని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనంతా దగా, మోసం, అబద్ధాలు, స్కాములతోనే సాగుతోందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పరీక్షలను "మెగా డీఎస్సీ అనడానికి వీలు లేదన్నారు. ప్రస్తుత డీఎస్సీలో జరిగిన అవకతవకలు తీవ్ర దిగ్భ్రాంతిని కలిగిస్తున్నాయని జగన్ పేర్కొన్నారు. కేవలం 16 వేల పోస్టుల భర్తీకే ఎన్నో అక్రమాలు, లీకులు, స్కాములు కనిపిస్తున్నాయని ఆరోపించారు. డీఎస్సీ ప్రశ్నాపత్రాల తయారీ, పరీక్షల నిర్వహణ బాధ్యతలను నిబంధనలకు విరుద్ధంగా పూర్తిగా ఎస్‌సిఇఆర్‌టీఅప్పగించారని మండిపడ్డారు. అత్యంత రహస్యంగా జరగాల్సిన ప్రశ్నాపత్రాల తయారీ, వాటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే కీలకమైన పనులను ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో చేయించారని దుయ్యబట్టారు. రేపు ఏదైనా తప్పు బయటపడితే ఆ నెపాన్ని సులువుగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులపై నెట్టేయవచ్చనే కుట్రతోనే ఇలా చేశారని విమర్శించారు.

## స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల

**విజయవాడ,జూన్ 11, ప్రభాతవార్తప్రతినిధి:** స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. 419 స్టాఫ్ నర్సుల పోస్టులను భర్తీ చేయనుంది. 110 మల్టీ రిహాబిలిటేషన్ వర్కర్, ఫార్మసిస్టుల పోస్టులకు కూడా నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పోస్టులను ఒప్పంద విధానంలో భర్తీ చేయనున్నట్లు విడుదల చేసిన నోటిఫికేషన్‌లో వైద్య ఆరోగ్య శాఖ స్పష్టం చేసింది.జూన్ 13వ తేదీ నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని అర్హులైన అభ్యర్థులకు సూచించింది. జూన్ 30వ తేదీ దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ అని ప్రకటించింది. ఈ స్టాఫ్ నర్సుల పోస్టులను పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వాసుపత్రుల్లో ఎన్సీడీ క్లినిక్‌లు, న్యూట్రిషన్ రికవరీ సెంటర్లు, నియోనేటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్లు, డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్లతోపాటు వివిధ విభాగాల్లో భర్తీ చేయనున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ వివరించింది.

## కొండవీటివాగు, పాలవాగులలో జరుగుతున్న అభివృద్ధి పనులు పరిశీలించిన ఎడిసి ఛైర్‌పర్సన్

**విజయవాడ,జూన్ 11,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధానిలో కొండవీటివాగు, పాలవాగు అభివృద్ధి పనులకు ఎక్కడా అవాంతరాలు లేకుండా చర్యలు చేపట్టాలని అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడీసీ) ఛైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డి.లక్ష్మీపార్థసారథి వారు అధికారులను ఆదేశించారు. వర్షాల దృష్ట్యా గురువారం రాజధాని అమరావతిలోని కొండవీటివాగు, పాలవాగులలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. గత తనిఖీలలో సూచించిన విధంగా వరద నియంత్రణ పనులకు సబంధిత ప్రదేశాలలో సమీక్షించారు. రాయపూడి నుంచి వెంకటపాలెం వరకు పాలవాగులో నీటి పారుదలకు గల అడ్డంకుల తొలగింపులను పరిశీలించారు. అదేవిధంగా కొండవీటివాగులో ఈ 11 రోడ్డు వెస్ట్‌బైపాస్ జంక్షన్ వద్ద ఎదురు ప్రవాహం, దిగువ ప్రవాహాల వద్ద చురుగ్గా జరుగుతున్న పనులను పరిశీలించారు. ముఖ్యంగా వెస్ట్‌బైపాస్ వద్ద రెండు వాగులు దాటే ప్రదేశాలలో అవసరమైన చోట చైన్‌మిషన్లను అధిక సంఖ్యలో ఏర్పాటు చేసి అడ్డంకులను తొలగించాలని ఆదేశించారు. ఈ 4, ఈ 10, ఈ 11, ఈ 12 వెస్ట్‌బైపాస్ బ్రిడ్జిల వద్ద వాగుల ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఇంజినీరింగ్ అధికారులను ఖచ్చితమైన ఆదేశాలు జారీచేశారు.

# భవిష్యత్ వైద్య విధానాల్లో క్వాంటం బయాలజీ కీలకం

### - ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం విసి డాక్టర్ పులాల చంద్రశేఖర్ - వైద్య విద్యా ప్రణాళికలో క్వాంటం బయాలజీని చేర్చేలా ఎన్‌ఎంసికి ప్రతిపాదనలు - డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సుల రూపకల్పనపై పై దృష్టి

**విజయవాడ,జూన్ 11,ప్రభాతవార్తప్రతినిధి:** వైద్య పరిశోధనలు, చికిత్సా విధానాల్లో వస్తున్న విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా రాబోయే రోజుల్లో క్వాంటం బయాలజీ కీలకపాత్ర పోషించనుందని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ పులాల చంద్రశేఖర్ స్పష్టం చేశారు. క్వాంటం బయాలజీ అనేది వైద్యం, రోగ నిర్ధారణ మరియు బయోమెడికల్ పరిశోధనలలో విప్లవాత్మక మార్పులు తీసుకురాగల అభివృద్ధి చెందుతున్న రంగమని ఆయన పేర్కొన్నారు.డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో గురువారం "క్వాంటం బయాలజీ: అణువుల నుండి వైద్యం వరకు" అనే అంశంపై వెబెక్స్ ద్వారా ప్రతిష్ఠాత్మక ఈ వెబ్ నార్ సెమినార్‌ను ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి ప్రద్యుమ్న సూచనల మేరకు నిర్వహించామని, ఇందులో ప్రద్యుమ్న తమ అమూల్యమైన సలహాలు క్వాంటం ప్రాముఖ్యతలను అందించారన్నారు. క్వాంటం బయాలజీకి సంబంధించిన డిప్లొమా మరియు సర్టిఫికేట్ కోర్సులను త్వరలో ప్రవేశపెట్టవలసిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తుకు సిద్ధంగా ఉండే ఆరోగ్య సంరక్షణ విద్యను ప్రోత్సహించడానికి గాను, దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో క్వాంటం బయాలజీ విద్య, శిక్షణా మాడ్యూళ్లను పాఠ్యాంశాల్లో చేర్చేలా జాతీయ వైద్య కమిషన్ కు విశ్వవిద్యాలయం తరపున ప్రతిపాదనలు పంపుతామని ఆయన వెల్లడించారు. తమకు మరియు విశ్వవిద్యాలయానికి నిరంతరం మద్దతు ఇస్తూ, మార్గనిర్దేశం చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రికి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి మరియు ఆరోగ్య, విద్యా శాఖా కార్యదర్శులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. క్వాంటం సాంకేతికతతో ఆరోగ్య వ్యవస్థల బలోపేతం పై ముఖ్యమంత్రి కార్యదర్శి పి.ఎస్. ప్రద్యుమ్న ఈ సెమినార్‌కు ఆన్‌లైన్ ద్వారా హాజరయ్యారు. ఈ వెబ్ నార్ లో పి.ఎస్. ప్రద్యుమ్న ప్రారంభోపన్యాసం చేశారు. ఆరోగ్య సంరక్షణ, పరిశోధన మరియు ఆవిష్కరణల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో క్వాంటం సాంకేతికతల ప్రాముఖ్యతను గురించి ఆయన వివరించారు. ప్రజా ఆరోగ్య వ్యవస్థలలో క్వాంటం సైన్స్‌ను ప్రోత్సహించడానికి ప్రభుత్వ పరంగా చేపడుతున్న చర్యలను ఆయన వివరించారు.ఐఐటీ తిరుపతి డైరెక్టర్ కె.ఎన్. సత్యనారాయణ ఆన్‌లైన్ ద్వారా మాట్లాడుతూ, ఆధునిక ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో క్వాంటం భౌతికశాస్త్రం యొక్క ఆవశ్యకతను మరియు దాని అనువర్తనాలను వివరించారు. అణువుల నుండి వైద్యం వరకు.. ఈ సెమినార్‌కు ఐఐటి ఢిల్లీ ఎయిమ్స్ ఢిల్లీకి చెందిన ప్రొఫెసర్ ఆరత్ కల్రా ఖిరిసోర్స్ పర్సన్‌ఖిగా వ్యవహరించారు. ఆయన "క్వాంటం జీవశాస్త్రం: అణువుల నుండి వైద్యం వరకు" అనే అంశంపై సుదీర్ఘమైన, విపులమైన ఉపన్యాసం ఇచ్చారు. వైద్య, జీవశాస్త్ర రంగాలలో క్వాంటం బయాలజీ తీసుకువస్తున్న ఇటీవలి పురోగతులను ఆయన సోదాహరణంగా వివరించారు.

ఈ సెమినార్ ద్వారా జీవ ప్రక్రియలలో క్వాంటం దృగ్విషయాల పాత్రను వైద్య వర్గాలు అర్థం చేసుకోవడానికి ఒక అద్భుతమైన వేదిక లభించింది. అనుబంధ వైద్య కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపక సభ్యులు చురుకుగా పాల్గొని వక్తతో తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ టి. సాయి సుధీర్, పబ్లికేషన్స్ డైరెక్టర్ డాక్టర్ కె. సుధ, ఏక్యూవీ ) డైరెక్టర్ శ్రీధర్, మరియు తిశిళీతిబీశిది కార్యదర్శి శ్రీమతి సుమైలా సహా పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

# మీ అసహానం.. అతి స్పందన ఏంటి?

### బిజెపి నేతలపై వైఎస్ షర్మిల ఆగ్రహం

**విజయవాడ జూన్ 11 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిలకు రాజ్యసభ సీటుఇస్తున్నట్లు ప్రచారం జరిగింది. కర్ణాటక స్థానం నుంచి ఆమెను రాజ్యసభకు కాంగ్రెస్ అధిష్టానం పంపుతున్నట్లు వార్తలు విస్తృతంగా ప్రచారంలోకి వచ్చాయి.చివరి క్షణంలో అది జరుగలేదు, అసలు ఆమెకు రాజ్యసభ ఇస్తున్నట్లు అధికారికంగా ప్రకటించకుండానే ప్రచారం జరిగిపోయిందంటూ షర్మిలకు రాజ్యసభ ఇవ్వకపోవడంపై బీజేపీ నేతలు విమర్శలు కురిపించారు. మీనాక్షి నటరాజన్ నామినేటర్ తిరస్కరణ బీజేపి కక్ష సాధింపు చర్య అంటూ వైఎస్ షర్మిల చేసిన వ్యాఖ్యలపై బీజేపి ఈ రకంగా స్పందించింది కాంగ్రెస్ అధిష్టానం షర్మిలకు రాజ్య సీటు ఇవ్వకపోవడంతోనే ఆ అసహనంలో షర్మిల వాస్తవాలను పూర్తి విస్మరించినట్టున్నారంటూ బీజేపి నేతలు అవహేళన చేసారు. దీనికి కౌంటర్‌గా వైఎస్ షర్మిల 'ఎక్స్' వేదికగా బీజేపీ నేతలపై మరోసారి మండిపడ్డారు. రాజ్యసభ సీటు మాట ఇచ్చిన వాళ్లకు, మాట తీసుకున్న వాళ్లకు మాత్రమే సంబంధించిన విషయం. మధ్యలో మీ అసహనం ఏంటి ? ఈ అతి స్పందన ఎందుకు? 12 ఏళ్ల వైఫల్యాలను ప్రజల ముందు పెడితే, సమాదానం చెప్పే దమ్ములేక, అర్థం పర్థం లేని అంశాలను మాట్లాడే మీ సంస్కారం ఏపాటితో అర్థమైంది. అంటూ ఆమె పేర్కొన్నారు. ప్రజా ఉద్యమ గొంతుకగా ఎవరిని ఆరాటమో ఎవరిది అసహనమో రాష్ట్ర ప్రజలకు అంతా తెలుసు. రాష్ట్ర అభివృద్ధికి అంకితభావం మాది. సహానాన్ని కోల్పోయి పిచ్చిప్రేలాపనలు మీవి. నిజంగా బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే పుండుమీద కారం చల్లే చేష్టలు బంద్‌పెట్టి, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ పక్షాన లేవనెత్తిన 12 వైఫల్యాల మీద సమాధానం చెప్పాలి. మీద మెరుగులు చూపించడం ఆపి లోపల పురుగుల సంగతి తేల్చాలి అని వైఎస్ షర్మిల సవాల్ విసిరారు.

# యోగాంధ్రలో భాగస్వాములు కావాలని అసోసియేషన్లకు పిలుపునిచ్చిన ప్రభుత్వం

**విజయవాడ,జూన్ 11,ప్రభాతవార్తప్రతినిధి:** కూటమి ప్రభుత్వం ప్రతిష్టాకరంగా తీసుకున్న యోగాంధ్ర2026 కార్యక్రమాల నిర్వహణలో భాగస్వాములు కావాలని ప్రముఖ యోగా అసోసియేషన్లను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కోరింది. ప్రభుత్వ సంకల్పానికి తగ్గట్లు ఆర్ట్ ఆఫ్ లివింగ్, ఈశా ఫౌండేషన్, పతంజలి భారత్ స్వాభిమాన్ ట్రస్టు, బ్రహ్మ కుమారీస్, యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, [illegible] ఇన్స్టిట్యూట్, భారత్ స్వాభిమాన్ ట్రస్టు/పతంజలి యోగా సమితి, హాబిల్డ్ (ఏఐ డెవలపర్స్), గిప్సి (ఏఐ డెవలపర్స్), యోగాంత స్టారప్ ఇతర సంస్థల ప్రతినిధులతో వర్చువల్ గా ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి ప్రద్యుమ్న, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీర పాండియన్, ఆయుష్ డైరెక్టర్ రోణంగి గోపాల కృష్ణ ప్రభృతులు యోగా సంస్థల ప్రతినిధులతో చర్చించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ తామిచ్చే లాగిన్ల ద్వారా యోగాంధ్ర 2026 పోర్టలులో సదరు అసోసియేషన్లకు చెందిన వారి పేర్లను నమోదుచేసి, యోగా కార్యక్రమాల్లో భాగస్వాములు చేయాలని కోరారు. యోగాంధ్ర కార్యక్రమాలను జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మాత్రమే కాకుండా ఏడాది పొడవునా నిరాటంకంగా కొనసాగించే విషయమై సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. బ్రహ్మకుమారీలు యోగా కార్యక్రమాల్లో ధాన్యం చేయడాన్ని కూడా జోడించాలని కోరారు. గత ఏడాది 400కిపైగా గ్రామాల్లో ఉచిత శిక్షణ కార్యక్రమాలను జరిపామని, ఈ ఏడాది కూడా అదేవిధంగా చేస్తామని ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధులు చెప్పారు.

# ఆ హోర్డింగ్‌తో సిఎంఆర్‌కు ఎలాంటి సంబంధం లేదు

**విశాఖపట్నం, ప్రభాతవార్త:** సోషల్ మీడియా వేదికలలో ఒక తప్పుడు, దురుద్దేశపూర్వకమైన పోస్ట్ లేదా స్క్రీన్‌షాట్ విస్తృతంగా ప్రచారంలో ఉన్నట్లు ప్రజల దృష్టికి తీసుకువస్తున్నామని ఆ చిత్రంలో ఒక హోర్డింగ్ కనిపిస్తుండగా, దాని కింద "హిందూ యువతి/మహిళతో కలిసి వచ్చే ముస్లిం పురుషుడికి 10 నుండి 50 వరకు తగ్గింపు లభిస్తుంది" అనే వాక్యం ఉందని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, ఒడిశా, భారతదేశంలోని ఇతర రాష్ట్రాల ప్రజలకు మేము తెలియజేయునది ఏమనగా, ఆ చిత్రంలో చూపిన విధంగా సిఎంఆర్ గ్రూప్ ఎప్పుడూ ఎటువంటి హోర్డింగ్‌ను ఏర్పాటు చేయలేదు లేదా అటువంటి ప్రకటనను విడుదల చేయలేదని గత 4 దశాబ్దాలకు పైగా అత్యంత ప్రతిష్టాత్మకంగా వ్యాపారాన్ని నిర్వహిస్తున్న మా సంస్థ, సమాజంలో మతపరమైన విభేదాలకు లేదా అశాంతికి దారితీసే ఇటువంటి ప్రకటనలను ఎప్పుడూ చేయలేదు, భవిష్యత్తులో కూడా చేయదు అని కాబట్టి, సిఎంఆర్ గ్రూప్ తరపున మేము ఈ తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తూ, ఇందుకు కారకులైన వారి మీద తగు క్రిమినల్ చర్యలు తీసుకోవలసిందిగా సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లోనూ, వివిధ జిల్లాల పోలీస్ స్టేషన్లలోనూ ఫిర్యాదు చేయడం కూడా జరిగిందనికావున, ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయడమేమిటంటే సోషల్ మీడియా వేదికలలో ఎవరికైనా ఇటువంటి తప్పుడు పోస్ట్‌లు కనిపిస్తే లేదా వస్తే, దయచేసి వాటిని ఇతరులకు షేర్ చేయవద్దని లేదా ప్రచారం చేయవద్దని ప్రజలను కోరుతూ... ఈ హెచ్చరికను గమనించిన తర్వాత కూడా వాటిని ప్రచారం చేస్తే తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవలసి వస్తుందని తెలియజేస్తున్నామన్నారు.





## ఢిల్లీలో ఏపీ గళాన్ని
# బలంగా వినిపిస్తాం

### సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసిన
## రాజ్యసభ సభ్యులు విజయ్

**పార్టీ నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడతా: చింతకాయల విజయ్**

విశాఖపట్నం, జూన్ 11, ప్రభాతవార్త:

రాజ్యసభ సభ్యునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ గురువారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి నుంచి ఎన్నిక ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్న అనంతరం సీఎం నారా చంద్రబాబునాయుడును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తనను రాజ్యసభ సభ్యునిగా ఎంపిక చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ లకు చింతకాయల విజయ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ, రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజా సమస్యలను రాజ్యసభ వేదికగా సమర్థవంతంగా ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన (తరువాయి 8వ పేజీలో)

### బీసీ యువతకు పెద్దపీట వేయడం చారిత్రాత్మకం : రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్



విశాఖపట్నం, ప్రభాతవార్త, జూన్ 11:

ఆంధ్రప్రదేశ్ నుంచి రాజ్యసభకు ఎన్డీయే కూటమి తరపున నామినేషన్లు వేసిన నలుగురు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి అధికారికంగా ప్రకటించి వారికి ఎన్నికల ధృవీకరణ పత్రాలను అందజేశారు. టీడీపీ నుంచి సానా సతీష్, భాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్, అలాగే జనసేన నుంచి లింగమనేని రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికైన అనంతరం మీడియాతో మాట్లాడిన చింతకాయల విజయ్, తమపై నమ్మకంతో ఈ అవకాశం కల్పించిన టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఎన్టీఆర్ సిద్ధాంతాలను కొనసాగిస్తూ, బీసీ యువతకు మరియు పార్టీ కోసం కష్టపడిన వారికి మెరిట్ (తరువాయి 8వ పేజీలో)



### స్టీల్ ప్లాంట్ ప్రమాదంపై
## ఎన్‌హెచ్‌ఆర్‌సీ సీరియస్

**ఏపీ చీఫ్ సెక్రటరీకి నోటీసులు**

విశాఖపట్నం, జూన్ 11, ప్రభాతవార్త :

విశాఖ స్టీల్ ప్లాంట్లో జరిగిన ప్రమాదంపై జాతీయ మానవ హక్కుల కమిషన్ సుమోటోగా స్పందించింది. జూన్ 8వ తేదీన ప్లాంట్లోని 'స్టీల్ మెల్టింగ్ షాప్'లో సుమారు 1600 డిగ్రీల ఉష్ణోగ్రత కలిగిన 150 టన్నుల ద్రవ ఉక్కును తీసుకెళ్తున్న లాడిల్ ఒక్కసారిగా పేలిపోయింది. ఈ ప్రమాదంలో 9 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. యాజమాన్యం భద్రతా ప్రమాణాలను నిర్లక్ష్యం చేయడం వల్లే ఈ ఘోర ప్రమాదం జరిగిందని కార్మిక (తరువాయి 8వ పేజీలో)



### నేటి నుంచి మోగనున్న
## స్కూల్ బెల్..!

- వేసవి సెలవులకు ముగింపు
- కొత్త ఆశలు, కొత్త లక్ష్యాలతో విద్యార్థులకు విద్యాలయాల స్వాగతం

8లో

### వీఎంఆర్డీఏ ఆధ్వర్యంలో
## ఫిట్ ఇండియా జిమ్

**ప్రారంభించిన విశాఖ కలెక్టర్ అభిశిక్త్ కిశోర్**

విశాఖపట్నం, జూన్ 11, ప్రభాతవార్త :

వీఎంఆర్డీఏ ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకునేందుకు ఇక్కడి ఉద్యోగ భవన్లో నూతనంగా ఆధునీకరించిన 'ఫిట్ ఇండియా జిమ్'ను విశాఖ కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ చేతుల మీదుగా ప్రారంభించారు (తరువాయి 8వ పేజీలో)



### 'వెన్నుపోటుకు రెండేళ్లు' కార్యక్రమాన్ని
## విజయవంతం చేయాలి

**నేడు పెదగంట్యాడ జంక్షన్ నుంచి భారీ ర్యాలీ: తిప్పల శ్రీనివాస దేవన్ రెడ్డి**



విశాఖపట్నం, జూన్ 11, ప్రభాతవార్త:

వైఎస్సార్సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల శ్రీనివాస దేవన్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించనున్న "వెన్నుపోటుకు రెండేళ్లు" కార్యక్రమం విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం పెదగంట్యాడలోని గాజువాక నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిప్పల శ్రీనివాస దేవన్ రెడ్డి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తైన నేపథ్యంలో ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. రాష్ట్ర (తరువాయి 8వ పేజీలో)

### విఎంఆర్డీఏ నిర్వహిస్తున్న పార్కుల్లో
## సైక్లింగ్ ట్రాక్‌లు అభివృద్ధి చేయాలి

- మున్సిపాలిటీల అభివృద్ధిలో విఎంఆర్డిఎ కీలక పాత్ర పోషిస్తుంది
- కైలాసగిరి తరహాలో గాజువాక దయాళ్ నగర్ కొండ అభివృద్ధి
- ఇంజినీరింగ్ విభాగ అధికారులతో విఎంఆర్డిఎ చైర్మన్, మెట్రోపాలిటన్ కమిషనర్ సమీక్ష



విశాఖపట్నం, ప్రభాతవార్త, జూన్ 11:

విశాఖ నగర పరిధిలో విఎంఆర్డిఎ కు చెందిన అన్ని పార్కుల్లో సైక్లింగ్ ట్రాక్ లు అభివృద్ధి చేయాలని విఎంఆర్డిఎ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్, మెట్రో పాలిటన్ కమిషనర్ ఎన్.తేజ్ భరత్ ఆదేశించారు. గురువారం ఉదయం ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి ద్దరూ నర్సీపట్నం, నెల్లిమర్ల, యలమంచిలి మున్సిపాలిటీ అధికారుల తో, జీవీఎంసీ, జాతీయ రహదారుల, రహదారులు భవనాల శాఖ అధికారులతో మాట్లాడి, ఆయా ప్రాంతాల్లో విఎంఆర్డిఎ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి ప్రగతి పై సమీక్షించారు. విఎంఆర్ డిఎ పరిధిలో అన్ని మున్సిపాలిటీల్లో మౌలిక సదుపాయాలు కల్పన కోసం నిధులు కేటాయించటం జరిగిందని, ప్రతీ మున్సిపాలిటీ అభివృద్ధిలో విఎంఆర్డిఎ కీలకంగా (తరువాయి 8వ పేజీలో)

**నౌకపై దాడి ఘటన..**
## మృతుల్లో విశాఖ వాసి పట్నాల సురేష్

విశాఖపట్నం, జూన్ 11, ప్రభాత వార్త



ఒమన్ తీరంలో భారతీయులున్న నౌకపై అమెరికా దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో చనిపోయిన ముగ్గురు భారతీయుల్లో విశాఖ వాసి కూడా ఉన్నట్లు దిల్లీలోని ఆంధ్రా భవన్ అధికారులు ధ్రువీకరించారు. మృతుడిని 44 ఏళ్ల మెరైన్ ఇంజినీర్ సురేశ్ పట్నాలగా గుర్తించారు. జూన్ 24న ఆయన వివాహ 15వ వార్షికోత్సవం ఉందని.. అంతలోనే ఈ ప్రమాదం జరిగిందని కుటుంబ సభ్యులు తెలిపారు. సురేశ్‌కు భార్య, ఇద్దరు కుమారులున్నారు.

## గీతం ఆధ్వర్యంలో 'బయోమెడ్ భారత్ 2026'



విశాఖపట్నం, జూన్ 11 ప్రభాతవార్త :

ఆరోగ్య సంరక్షణ రంగంలో ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి మరియు భారతదేశ వైద్య రంగ సవాళ్లకు తక్కువ ఖర్చుతో కూడిన ప్రభావవంతమైన బయోమెడికల్ పరిష్కారాలను అభివృద్ధి చేసేలా యువతను ప్రోత్సహించడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం "బయోమెడ్ భారత్ 2026" (బయోమెడికల్ డివైస్ ఇన్నోవేషన్ హ్యాకథాన్) ను నిర్వహించనుంది. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్సర్) ఆధ్వర్యంలో (తరువాయి 8వ పేజీలో)

### విశాఖ అభివృద్దే ధ్యేయంగా
## ప్రాజెక్టులు చేపట్టాలి

- బృహత్ ప్రణాళిక రహదారుల నిర్మాణం రెండో విడత చేపట్టాలి
- విస్టా యాప్ లో సందర్శకుల అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇవ్వాలి
- విఎంఆర్డిఎ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించిన విశాఖ ఎం పి ఎం. శ్రీ భరత్




విశాఖపట్నం, జూన్ 11, ప్రభాతవార్త :

విశాఖ అభివృద్దే ధ్యేయంగా మరిన్ని మెరుగైన ప్రాజెక్టులు చేపట్టాలని విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీభరత్ అన్నారు. బుధవారం విఎంఆర్డిఎ సమావేశ మందిరంలో విఎంఆర్డిఎ అభివృద్ధి పనులపై ఆయన సమీక్షించారు. విఎంఆర్డిఎ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై, నూతనంగా చేపడుతున్న లే అవుట్ల అభివృద్ధి, స్థలాల విక్రయాలు, బృహత్ ప్రణాళిక రహదార్లు, పర్యాటకాభివృద్ధి కార్యక్రమాలు, నూతనంగా ప్రవేశపెట్టిన పలు యాప్‌ల నిర్వహణ, బే సిటీ ప్రతిపాదనలు, సెమీ రింగ్‌రోడ్డు ప్రతిపాదనలు వంటి అంశాలను విఎంఆర్డిఎ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్.తేజ్ భరత్, ఎం.పి.శ్రీభరత్ గారికి వివరించారు. ఎం.పి.శ్రీభరత్ మాట్లాడుతూ ప్రస్తుతం బృహత్ ప్రణాళిక ప్రాధాన్యత రహదారుల నిర్మాణం దాదాపుగా పూర్తి అయిన నేపథ్యంలో మిగిలిన ప్రతిపాదిత రహదారుల నిర్మాణం చేపట్టాలని సూచించారు. నూతనంగా ప్రవేశపెట్టిన విస్టా యాప్ ద్వారా ఆదాయం మెరుగు పడిందని, ఈ యాప్ సహాయంతో సందర్శకుల అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విఎంఆర్డిఎ అభివృద్ధి చేసిన లేఅవుట్లో మిగులు స్థలాల విక్రయాలు చేపట్టాలని సూచించారు. సెమీ రింగ్‌రోడ్డు నిర్మాణంపై చర్చించారు. పర్యాటకాభివృద్ధి కోసం ప్రత్యేక ప్రాజెక్ట్ లు చేపట్టాలని సూచించారు. యాప్ ల నిర్వహణ బాగుందని చైర్మన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్ గారిని, మెట్రోపాలిటన్ కమిషనర్ శ్రీ తేజ్ భరత్ గారిని ప్రశంసించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ శ్రీమతి దాట్ల కీర్తి, ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్ గారు, కార్యదర్శి శ్రీ మురళీ కృష్ణ గారు, ముఖ్య గణాంక అధికారి శ్రీ హరి ప్రసాద్ గారు, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీమతి దివ్య లత గారు, ఓఎస్‌డి శ్రీ కృష్ణా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### నేవల్ డాక్‌యార్డ్‌లో
## యోగాంధ్ర కార్యక్రమం



విశాఖపట్నం, జూన్ 11 ప్రభాతవార్త :

యోగాంధ్ర కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొనాలని, 21వ తేదీన ఆర్కే బీచ్ లో నిర్వహించే ప్రపంచ యోగ దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ తెలిపారు. 12 అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పరిష్కరించు కొని యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం నేవల్ డాక్‌యార్డ్ నందు యోగా కార్యక్రమం భారత నౌకా దళం మరియు జిల్లా యంత్రాంగం, ఆయుష్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తూర్పు నౌకా దళ వైస్ అడ్మిరల్ సుశీల్ మీనన్, జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, జాయింట్ కలెక్టర్ విద్యాధరి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆంధ్ర యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ తులసిరావు, ఆయుష్ బృందం ఆధ్వర్యంలో యోగాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అభిషిక్త్ కిషోర్ ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్న 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని నిర్వహిస్తున్న కార్యక్రమాలలో భాగంగా ఈరోజు నేవల్ డాక్‌యార్డ్ నందు యోగా కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. అదేవిధంగా 12వ తేదీన రుషికొండ బీచ్ నందు, 15వ తేదీన ముడసర్లోవ గోల్ఫ్ కోర్ట్ నందు యోగ కార్యక్రమాలు నిర్వహించబడతాయని, 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం ఆర్కే బీచ్ (తరువాయి 8వ పేజీలో)

## టెక్స్‌టైల్స్ అండ్ జ్యువెలర్స్ (పి) లిమిటెడ్ ద్వారా ప్రజలకు హెచ్చరిక

విశాఖపట్నం-ప్రభాతవార్త

సోషల్ మీడియా వేదికలలో ఒక తప్పుడు, దురుద్దేశపూర్వకమైన పోస్ట్ లేదా స్క్రీన్‌షాట్ విస్తృతంగా ప్రచారంలో ఉన్నట్లు ప్రజల దృష్టికి తీసుకువస్తున్నామని ఆ చిత్రంలో ఒక హోర్డింగ్ కనిపిస్తుండగా, దాని కింద "హిందూ యువతి/మహిళతో కలిసి వచ్చే ముస్లిం పురుషుడికి 10% నుండి 50% వరకు తగ్గింపు లభిస్తుంది" అనే వాక్యం ఉందని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, ఒడిశా, భారతదేశంలోని ఇతర రాష్ట్రాల ప్రజలకు మేము తెలియజేయునది ఏమనగా, ఆ చిత్రంలో చూపిన విధంగా సిఎంఆర్ గ్రూప్ ఎప్పుడూ ఎటువంటి హోర్డింగ్‌ను ఏర్పాటు చేయలేదు లేదా అటువంటి ప్రకటనను విడుదల చేయలేదని గత 4 దశాబ్దాలకు పైగా అత్యంత ప్రతిష్టాత్మకంగా వ్యాపారాన్ని నిర్వహిస్తున్న మా సంస్థ, సమాజంలో మతపరమైన విభేదాలకు లేదా అశాంతికి దారితీసే ఇటువంటి ప్రకటనలను ఎప్పుడూ చేయలేదు, భవిష్యత్తులో కూడా చేయదు అని కాబట్టి, (తరువాయి 8వ పేజీలో)

## ఢిల్లీలో ఏపీ గళాన్ని బలంగా వినిపిస్తాం

(7వ పేజీ తరువాయి)

ప్రాతిపదికన అత్యున్నత చట్టసభల్లో స్థానాలు కల్పించడం చారిత్రాత్మక నిర్ణయమని ఆయన కొనియాడారు. పార్టీ ఆదేశాల మేరకు ఢిల్లీలోని పెద్దల సభలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గళాన్ని బలంగా వినిపిస్తామని, రాష్ట్రానికి అవసరమైన మద్దతు కూడగట్టేలా పని చేస్తామని స్పష్టం చేశారు. ఇదే క్రమంలో ప్రతిపక్షాలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడిన విజయ్, వాస్తవాలను వక్రీకరిస్తూ ఫేక్ నెరేటివ్స్ తో మోసపూరిత రాజకీయాలు చేస్తున్నారని, లిక్కర్ స్కామ్ తదితర వ్యవహారాల్లో అసలు షాడో బాస్ ఎవరో నేటి యువతకు స్పష్టంగా తెలుసని విమర్శించారు. నాయకత్వం తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, జీవితాంతం వారికి రుణపడి ఉంటామని, ఎన్డీయే ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా నిజాయితీగా తమ బాధ్యతలు నిర్వర్తిస్తామని చింతకాయల విజయ్ ఉద్ఘాటించారు.

## సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసిన రాజ్యసభ సభ్యులు విజయ్

(7వ పేజీ తరువాయి)

పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు కేంద్ర స్థాయిలో మరింత సహకారం అందేలా కృషి చేయడంతో పాటు, ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన అంశాలను పార్లమెంట్‌లో బలంగా వినిపిస్తానని విజయ్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చింతకాయల విజయ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. రాజ్యసభలో రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు, అభివృద్ధి అవసరాలు, ప్రభుత్వ ప్రాధాన్యతలను సమర్థవంతంగా ప్రతిబింబిస్తూ ప్రజా ప్రయోజనాల కోసం పనిచేయాలని ఆకాంక్షించారు.

## స్టీల్ ప్లాంట్ ప్రమాదంపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ సీరియస్

(7వ పేజీ తరువాయి)

సంఘాలు ఆరోపించాయి. ఈ వార్తా కథనాలపై స్పందించిన ఎన్హెచ్ఆర్సీ ఇది తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనేనని అభిప్రాయపడింది. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, రెండు వారాల్లోగా వివరణాత్మక నివేదిక సమర్పించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (చీఫ్ సెక్రటరీ)కి కమిషన్ నోటీసులు జారీ చేసింది. ప్రభుత్వం సమర్పించే నివేదికలో గాయ పడిన కార్మికుల ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి, వారికి అందుతున్న వైద్య సహాయం గురిం చిన వివరాలు ఉండాలని ఎన్హెచ్ఆర్సీ స్పష్టం చేసింది. వీటితో పాటు మరణించిన కార్మికుల కుటుంబాలకు, గాయపడిన బాధితులకు చెల్లించిన ఎక్స్గ్రేషియా వివరాలను కూడా ఆ నివేదికలో పొందుపరచాలని కమిషన్ ఆదేశించింది.

## 'వెన్నుపోటుకు రెండేళ్లు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

(7వ పేజీ తరువాయి)

ప్రయోజనాలను దెబ్బతీసే విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేయడమే లక్ష్యంగా "వెన్నుపోటుకు రెండేళ్లు" పేరుతో నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం 8.30 గంటలకు పెదగంట్యాడ జంక్షన్ నుంచి భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో 86వ వార్డు అధ్యక్షుడు చేగొండి శ్రీనివాసరావు, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి వాడపల్లి రామచంద్రరాజు, విశాఖ జిల్లా శిష్టకరణ విభాగం అధ్యక్షుడు మానాపురం శ్రీనివాస్ పట్నాయక్, గాజువాక నియోజకవర్గ తూర్పు కాపు అధ్యక్షుడు వెలుగుల పరశురాముడు, వార్డు ఉపాధ్యక్షుడు భూపతిరాజు శ్రీనివాస్ రాజు, చిట్టి బాలకృష్ణతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలపై ఉద్యమ కార్యాచరణ, రేపటి నిరసన కార్యక్రమం నిర్వహణ తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించినట్లు నాయకులు తెలిపారు.

## టెక్స్‌టైల్స్ అండ్ జ్యువెలర్స్ (పి) లిమిటెడ్ ద్వారా ప్రజలకు హెచ్చరిక

(7వ పేజీ తరువాయి)

సిఎంఆర్ గ్రూప్ తరపున మేము ఈ తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తూ, ఇందుకు కారకులైన వారి మీద తగు క్రిమినల్ చర్యలు తీసుకోవలసిందిగా సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లోనూ, వివిధ జిల్లాల పోలీస్ స్టేషన్లలోనూ ఫిర్యాదు చేయడం కూడా జరిగిందని కావున, ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయడమేమిటంటే సోషల్ మీడియా వేదికలలో ఎవరికైనా ఇటువంటి తప్పుడు పోస్టులు కనిపిస్తే లేదా వస్తే, దయచేసి వాటిని ఇతరులకు షేర్ చేయవద్దని లేదా ప్రచారం చేయవద్దని ప్రజలను కోరుతూ... ఈ హెచ్చరికను గమనించిన తర్వాత కూడా వాటిని ప్రచారం చేస్తే తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవలసి వస్తుందని తెలియజేస్తున్నామన్నారు.

## వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలి




విశాఖపట్నం, జూన్ 11, ప్రభాతవార్త :

జిల్లా వ్యాప్తంగా ఉన్న బీసీ సంక్షేమ శాఖ కి చెందిన వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని బీసీ సంక్షేమ శాఖ ఉప సంచాలకురాలు కే.రాజేశ్వరి ఆదేశించారు. గురువారం ఉదయం ఎం వి పి కాలనీ సెక్టార్ 6 లోని బీసీ స్టడీ సర్కిల్ ఆవరణ లో జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖలో పనిచేస్తున్న అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ ఆఫీసర్స్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్, నాలుగవ తరగతి సిబ్బంది పాల్గొన్నారు. ప్రధానంగా వసతి గృహాల నిర్వహణ, విద్యార్థి ప్రవేశాలు, విద్యా ప్రగతి, మెనూ నిర్వహణ, ఇతర విషయాలపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా డీడీ కే.రాజేశ్వరి మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరము 2026-2027 లో వసతి గృహాలు తెరవనున్న నేపథ్యంలో వసతి గృహాల పరిసరాలు పరి శుభ్రంగా ఉంచాలని, నీటి ట్యాంకులు శుభ్రం చేయించాలని, మెనూ ప్రకారం పిల్లలకు ఆహారము పెట్టాలని ఆదేశించారు. ఎప్పటిలానే విశాఖపట్నం జిల్లాని మొదటి స్థానంలో ఉంచాలని సూచించారు. వసతి గృహాల్లో ఇప్పటికే ఆర్ .ఓ. ప్లాంట్స్, ఇన్వర్టర్లు వంటి సదుపాయాలు బీసీ సంక్షేమ శాఖ వసతి గృహాల్లో సమకూర్చడం జరిగిందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను తూ.చ తప్పకుండా పాటించాలని, బీసీ వసతి గృహములలో ఉన్న పిల్లలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని కోరారు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ మరియు నాల్గవ తరగతి సిబ్బంది వారి విధులను సక్రమంగా నిర్వహించి హాస్టల్లో ఉన్న పిల్లలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని కోరియున్నారు .ఈ సమావేశంలో అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ ఆఫీసర్స్ , హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, నాల్గవ తరగతి సిబ్బంది మరియు ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నేటి నుంచి మోగనున్న స్కూల్ బెల్..!

(ప్రభాతవార్త-విశాఖపట్నం)

దాదాపు రెండు నెలల వేసవి సెలవుల అనంతరం రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. కొత్త విద్యా సంవత్సరానికి శ్రీకారం చుడుతూ లక్షలాది మంది విద్యార్థులు మరోసారి పాఠశాల బాట పట్టనున్నారు. దీంతో విద్యాలయాలు విద్యార్థుల కేరింతలు, సందడితో కళకళలాడేందుకు సిద్ధమవుతున్నాయి.

ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాయి. తరగతి గదుల పరిశుభ్రత, తాగునీటి సదుపాయం, ఫర్నిచర్, విద్యుత్, మరుగుదొడ్లు తదితర మౌలిక వసతులను సిద్ధం చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు.

### వేసవి సెలవులకు ముగింపు

### కొత్త ఆశలు, కొత్త లక్ష్యాలతో విద్యార్థులకు విద్యాలయాల స్వాగతం

కొత్త విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకుని పలు పాఠశాలల్లో విద్యార్థులకు ప్రత్యేక స్వాగత కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. పుష్పాలు, బెలూన్లు, సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులను ఆహ్వానించేందుకు యాజమాన్యాలు సిద్ధమయ్యాయి. ముఖ్యంగా మొదటిసారిగా పాఠశాలల్లో అడుగుపెట్టనున్న చిన్నారులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంల పంపిణీ ప్రక్రియను కూడా వేగవంతం చేశారు. మధ్యాహ్న భోజన పథకం అమలుకు అవసరమైన ఏర్పాట్లను సంబంధిత అధికారులు పూర్తి చేసినట్లు సమాచారం. తొలి రోజు నుంచే బోధన కార్యక్రమాలు ప్రారంభించేందుకు ఉపాధ్యాయులు సిద్ధమయ్యారు. ఇక వేసవి ఉష్ణోగ్రతలు ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్య భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. తాగునీరు, ప్రథమ చికిత్స, నీడ ఏర్పాట్లు తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా చూడాలని సూచించింది. కొత్త తరగతులు, కొత్త పుస్తకాలు, కొత్త స్నేహితులు, కొత్త లక్ష్యాలతో విద్యార్థులు రేపటి కోసం ఆసక్తిగా ఎదురుచూస్తుండగా, తల్లిదండ్రులు కూడా తమ పిల్లల భవిష్యత్ విజయాల కోసం ఆశాభావంతో ఉన్నారు.

# గీతం ఆధ్వర్యంలో 'బయోమెడ్ భారత్ 2026'

(7వ పేజీ తరువాయి)

చేపట్టిన ఈ జాతీయ స్థాయి హ్యాకథాన్ సంబందించిన బ్రోచర్‌ను గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎరోల్‌డిసౌజా, జిమ్‌సర్ ప్రోవైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి మరియు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ గురువారం తేది: 11-06-2026న విడుదల చేశారు. ఇంజనీరింగ్ మరియు వైద్య రంగాల మధ్య సమన్వయాన్ని పెంచుతూ విద్యార్థులు మరియు పరిశోధకుల బహుముఖ ప్రతిభ గల బృందాలను ఒకే వేధిక పైకి తీసుకురావడమే ఈ జాతీయ స్థాయి హ్యాకథాన్ యొక్క ముఖ్య ఉద్దేశ్యమని వారు తెలిపారు.

ఈ జాతీయ స్థాయి హ్యాకథాన్‌లో పాల్గొనేవారికి భారతదేశంలోని వైద్య రంగ సవాళ్లను పరిష్కరించేలా బయోమెడికల్ పరికరాలను రూపొందించడానికి మరియు వాటి నమనాలను (ప్రోటోటైప్స్) తయారు చేయడానికి ఒక అధ్బుతమైన అవకాశాన్ని కల్పించనున్నారు. దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన విద్యాసంస్థల్లో అండర్ గ్రాడ్యుయేటర్ (యుజి), పోస్ట్ గ్రాడ్యుయేటర్ (పిజి) మరియు పిహెచ్‌డి చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనడానికి అర్హులు.

ఆసక్తి గల అభ్యర్థులు ముగ్గురు సభ్యులతో కూడిన బృందాలుగా ఏర్పడి గీతం అధికారిక వెబ్‌సైట్ ద్వారా ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవల్సి ఉంటుంది. ఆన్‌లైన్ ద్వారా జరిగే పలు విడతల కఠినమైన మల్యాంకనం మరియు నిపుణుల మార్గదర్శకత్వం తర్వాత ఎంపిక చేసిన బృందాలను ఈ ఏడాది సెప్టెంబర్ 2026లో జరిగే తుది ప్రోటోటైప్ డెవలప్‌మెంట్ దశ మరియు గ్రాండ్ ఫినాలే కోసం గీతం విశాఖపట్నం క్యాంపస్‌కు ఆహ్వానిస్తారు. ఉత్తమ ఆలోచనలను ప్రోత్సహించ దానికి మరియు వాటికి ఊతమివ్వడానికి పోటీలో విజేతలకు మొత్తం రూ. 4.5 లక్షల బహుమతిని అందించనున్నారు. నగదు బహుమతులతో పాటు తుది దశకు ఎంపికైన బృందాలకు నిపుణుల మార్గదర్శకత్వం, అనువాద పరిశోధన మార్గదర్శకత్వం మరియు పరిశ్రమ రంగ నిపుణులతో పరిచయాలు పెంచుకునే అవకాశాలు లభిస్తాయి. విద్యార్థుల ప్రయాణ సౌకర్యార్థం, గ్రాండ్ ఫినాలే సమయంలో ప్రయాణ ఖర్చుల రీయింబర్స్ మెంట్ మరియు వసతి సౌకర్యాలను కూడా గీతం సంస్థ కల్పించనుంది. అంతేకాకుండా అత్యుత్తమ ప్రాజెక్టులకు గీతంలో "బ్లాక్‌చైన్ ఫర్ ఇంపాక్ట" సంస్థ భాగస్వామ్యం తో ఏర్పాటు చేయబోతున్న గీతం బయోటెక్ ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్ ద్వారా ఇంక్యుబేషన్ మద్దతు లభించే అవకాశం ఉంది. గీతం బయోమెడ్ భారత్-2026 అనేది కేవలం ఒక కీలకమైన వైద్య సాంకేతికతలను తయారు చేసే ఒక గొప్ప వేధిక అని గీతం విశ్వవిద్యాలయం తెలిపింది.

### వీఎంఆర్‌డీఏ నిర్వహిస్తున్న పార్కుల్లో

# సైక్లింగ్ ట్రాక్‌లు అభివృద్ధి చేయాలి

(7వ పేజీ తరువాయి)

వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికే పలు దఫాలుగా కేటాయించిన నిధులతో రహదార్లు, కాలువలు, సామాజిక భవనాలు, దీప స్తంభాలు ఏర్పాటు, కల్వర్టుల నిర్మాణ పనులు ఆగస్టు నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయా మున్సిపాల్టీల్లో తగినంత స్థలాలు ఎవీ=ణూా కి కేటాయిస్తే, విశాఖలోని ఉడా పార్క్ తరహాలో అధునాతన సదుపాయాలతో మోడల్ పార్కులను నిర్మించేందుకు నిధులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. అన్ని నియోజకవర్గాల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని, ఇందుకోసం ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.90 కోట్ల రూపాయల నిధులు కేటాయించడం జరిగిందన్నారు. గాజువాక నియోజకవర్గంలో వి ఎం ఆర్ డి ఎ ద్వారా అభివృద్ధి చేయనున్న స్పోర్ట్స్ విలేజ్ నిర్మాణానికి శాప్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని, కైలాసగిరి తరహాలో గాజువాక దయాళ్ నగర్ కొండ ను అభివృద్ధి చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలి ఆదేశించారు. ఎవీ=ణూా కు చెందిన అన్ని పార్కుల్లో వాకర్స్ కోరిన విధంగా ట్రాక్ లు మరమత్తులు చేసి, బెంచీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బృహత్ ప్రణాళిక రహదార్లు నిర్మాణంలో భాగంగా విభాగిని మధ్యలో పచ్చదనం పెంపొందించాలని ఆదేశించారు. ఇప్పటికే ఉన్న మంచి పేరుని మరింత ఇనుమడించే విధంగా ఇంజినీరింగ్ విభాగ అధికారులు వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధాన ఇంజనీర్ శ్రీ వినయ్ కుమార్ గారు, ఓ ఎస్ డి శ్రీ కృష్ణా నాయక్ , పర్యవేక్షక ఇంజనీర్లు మధు, రాంబాబు, కార్యనిర్వాహక ఇంజనీర్లు సుధీర్, దుర్గా ప్రసాద్, రామరాజు, వరుణ్ కార్తీక్, జీజూ సింగ్, విశ్వనాథ్, ఇతర ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు. వర్చువల్ గా విజయనగరం, నర్సీపట్నం, యలమంచిలి, నెల్లిమర్ల మున్సిపల్ కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు. _

### పంచ గ్రామాల్లో మైనర్ రిపేర్లకే అనుమతులు

# కొత్త నిర్మాణాలు, విస్తరణలకు నో

సింహాచలం, జూన్ 11, ప్రభాతవార్త :

**అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తప్పవని ఈఓ జల్లేపల్లి వెంకట్రావు హెచ్చరిక**

శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానం పంచగ్రామాల పరిధిలో దేవస్థానం భూముల్లో చిరకాలంగా నివాసముంటున్న గృహ యజమానులకు దేవస్థానం కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. పాత ఇళ్లకు అవసరమైన స్వల్ప మరమ్మతులు (మైనర్ రిపేర్లు) నిర్వహించుకోవడానికి మాత్రమే అనుమతులు మంజూరు చేయనున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావు తెలిపారు. ఇంటి నిర్మాణ స్వరూపాన్ని మార్చే విధంగా ఎటువంటి విస్తరణలు, మాడిఫికేషన్లు, అదనపు గదులు, అంతస్తులు లేదా కొత్త నిర్మాణాలకు అనుమతులు ఇవ్వబోమని స్పష్టం చేశారు. దేవస్థానం భూముల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

మైనర్ రిపేర్లు చేపట్టాలనుకునే వారు దేవస్థానం ఏర్పాటు చేసిన ల్యాండ్ గ్రీవెన్స్ సెల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. టీటీడీ సత్రంలో పనిచేస్తున్న ఈ సెల్‌లో ప్రతిరోజూ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

దరఖాస్తుతో పాటు పూర్తి చేసిన అప్లికేషన్ ఫారం, దేవస్థానం అందజేసే హామీ పత్రం, ఇంటి ప్రస్తుత పరిస్థితిని చూపించే ఫోటోలు, హౌస్ ట్యాక్స్ రసీదులు, విద్యుత్ బిల్లు, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులను జతచేయాల్సి ఉంటుందని వివరించారు.

దరఖాస్తులు అందిన అనంతరం 7 నుంచి 10 రోజులలోపు దేవస్థానం టెక్నికల్, నాన్-టెక్నికల్ బృందాలతో పాటు ప్రత్యేక కమిటీ సభ్యులు క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహిస్తారని తెలిపారు. వాస్తవ పరిస్థితులు, దరఖాస్తులో పొందుపరిచిన వివరాలను పరిశీలించిన తర్వాతే అనుమతి లేదా తిరస్కరణపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

దేవస్థానం అనుమతులకు విరుద్ధంగా మైనర్ రిపేర్ల పేరుతో కొత్త నిర్మాణాలు, అదనపు గదులు, అంతస్తులు లేదా ఇతర శాశ్వత నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటువంటి అక్రమ నిర్మాణాలను దేవస్థానం ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ ద్వారా తొలగిస్తామని స్పష్టం చేశారు.

దేవస్థానం భూముల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్న ఈఓ జల్లేపల్లి వెంకట్రావు, పంచగ్రామాల ప్రజలు నిబంధనలు పాటిస్తూ దేవస్థానానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అక్రమ నిర్మాణాలు, భూ ఆక్రమణలు, భూ వినియోగ మార్పులకు పాల్పడకుండా జాగ్రత్త వహించాలని సూచించారు._

## నేవల్ డాక్‌యార్డ్‌లో యోగాంధ్ర కార్యక్రమం

(7వ పేజీ తరువాయి)

నందు నిర్వహించబడుతుం దన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరు ప్రతిరోజు యోగా సాధన చేయాలని, తద్వారా ఆరోగ్యం మెరుగుపరచుకోవాలని తెలిపారు. యోగా ప్రాముఖ్యతను అందరికీ తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విద్యాధరి, ఆర్ డి ఒ దిలీప్ చక్రవర్తి,రిటైర్డ్ వింగ్ కమాండర్ పి సి శేఖర్, ఆయుష్ శాఖ ఆర్ డి డి శ్రీనివాసులు, నోడల్ అధికారి డా. చంద్రశేఖర్, నావల్ అధికారులు, జిల్లా అధికారులు, మాజీ సైనికులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వీఎంఆర్డీఏ ఆధ్వర్యంలో ఫిట్ ఇండియా జిమ్

(7వ పేజీ తరువాయి)

ఆరోగ్యంపై అవగాహన పెంచడం, రోజువారీ జీవితంలో వ్యాయామం, శారీరక దృఢత్వాన్ని ప్రోత్సహించడమే దీని ముఖ్యోద్దేశ్యమన్నారు. ఈ జిమ్ము ఉద్యోగులంతా సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్. తేజ్ భరత్ మాట్లాడుతూ ఫిట్ ఇండియా ఉద్యమాన్ని కేంద్ర ప్రభుత్వం 2019లో ప్రారంభించారని, ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ప్రధాని మోడీ ప్రారంభించారన్నారు. ఉద్యోగుల్లో ఆరోగ్యం, ఫిట్నెస్, శ్రేయస్సు కోసం సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు 'ఫిట్ ఇండియా ఛాలెంజ్-2026'ను ప్రారంభిస్తున్నామ న్నారు. ఉద్యోగస్తుల మధ్య పోటీతత్వం పెంచేందుకు వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ సూచనల మేరకు బరువు తగ్గడం, పెరగడం, బీఎంఐ మెరుగుదల తదితర అంశాలపై గాంధీ జయంతి వరకు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఛాలెంజ్లో పాల్గొన్నవారికి ప్రశంసా పత్రాలందజేస్తామని, విజేతలకు నగదు పురస్కారం ఇస్తామన్నారు. ఉద్యోగులకు ఈ జిమ్ ఉచితమేనని, ఇతర ప్రభుత్వ ఉద్యోగులకు 30శాతం రాయితీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ దాట్ల కీర్తి, ఓఎస్ కృష్ణా నాయక్, కార్యదర్శి మురళీ కృష్ణ, ముఖ్య ఇంజినీర్ వినయ్ కుమార్, ముఖ్య గణాంక అధికారి హరి ప్రసాద్, డీఎఫ్ ఓ శిరీష తదితరులు పాల్గొన్నారు.

## 15 నుంచి పీజీ స్పెషల్ డ్రైవ్ పరీక్షలు ప్రారంభం

విశాఖపట్నం, జూన్ 11, ప్రభాతవార్త :

ఆంధ్రవిశ్వవిద్యాలయం పరిధిలోని పీజీ, ప్రొఫెషనల్ కోర్సుల స్పెషల్ డ్రైవ్ పరీక్షలు ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభం అవుతాయని ఇంచార్జి కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ జె.రత్నం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులు ఈ నెల 12వ తేదీ నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చునన్నారు. పరీక్షలు ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలోని పరీక్షల భవనంలో నిర్వహిస్తామని తెలిపారు. సబ్జెక్టుల వారీగా పరీక్షల తేదీలు ఇతర సమాచారం కోసం ఏయూ వెబ్‌సైట్ www.aucoeonline.com ను సంప్రదించవ్చును. బిఆర్క్, బిటెక్, ఎంటెక్, ఎంప్లానింగ్, ఎంఫార్మశీ, ఎం.ఎస్సీ అప్లయిన్ కెమిస్ట్రీ, ఎం.ఏ అన్ని గ్రూపులు, ఎంకాం, ఎం.హెచ్.ఆర్.ఎం, ఎంబిఏ(బి.ఎఫ్.ఎస్), ఎంబిఏ(ఎఫ్.టి), బిబిఏ-ఎంబిఏ(ఐదు సంవత్సరాల సమీకృత కోర్సు,ఎంబిఏ(సిబ్), బిఫార్మశీ, ఫార్మ్.డి, ఎమ్మెస్సీ(అన్ని సబ్జెక్టులు), ఎం.సి.ఏ, ఎల్.ఎల్.బి మూడు, ఐదు సంవత్సరాల కోర్సులు, ఎల్.ఎల్.ఎం, బిఈడి, ఎం.ఇడి, స్పెషల్ బిఇడి, డిపిఇడి, డిపిఇడి, బిపిఇడి, ఎంపిఇడి, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్, ఎమ్మెస్సీ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ తదితర కోర్సులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు ఇంచార్జి కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ జె.రత్నం తెలిపారు.

# పేదల ఇంటి స్థలాల క్రమబద్ధీకరణకు చర్యలు

**రాష్ట్ర ముఖ్యమంత్రి చేతులు మీదుగా పట్టాలు పంపిణీ చేస్తాం**

విశాఖపట్నం, జూన్ 11, ప్రభాతవార్త :

ప్రభుత్వ స్థలాలలో ఇళ్లు నిర్మించుకున్న పేదల స్థలాలను క్రమబద్దీకరణ చేసి హక్కులు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టరు అభిషిక్త్ కిషోర్ అన్నారు. గురువారం ఉదయం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాకు సంబంధించిన శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులతో జిల్లాకలెక్టరు అభిషిక్త్ కిషోర్ జాయింటు కలెక్టరుతో కలిసి రెవిన్యూ సంబంధిత అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయా నియోజకవర్గాలలో ఉన్న రెవిన్యూ ఇతర సమస్యల పై చర్చించారు. భూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ప్రజాప్రతి నిధులు కలక్టర్ ను కోరారు. ఈ సమావేశంలో కలక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో ఉన్న రెవిన్యూ సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. రేగ్యులరైజేషణ్ చేసిన స్థలాల పట్టాలను రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆగస్ట్ నెలలో పంపిణీ చేయటానికి ప్రయత్నం చేస్తున్నామని కలక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో పేదలు నిర్మించుకున్న ఇళ్ళ స్థలాల క్రమబద్ధీకరణ, 22ఎ భూముల సమస్యలు, వాటర్ బాడీస్, పంచ గ్రామాల సమస్యలు, ఇళ్ళ స్థలాలకు సంబంధించిన విషయాలు సమావేశంలో చర్చించారు.

సమావేశంలో శాసనసభ్యులు లేవనెత్తిన అంశాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని జిల్లా కలక్టరు రెవిన్యూ అధికారులను ఆదేశించారు. శాసనసభ్యులు




తెలియజేసే సమస్యలను గూర్చి తహసిల్దార్లకు పూర్తి అవగాహన ఉండాలని, తదుపరి సమావేశానికి వాటికి సంబంధించిన రికార్డులు, వివరాలతో హాజరు కావాలని తెలిపారు.

గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాస రావు మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాల్లో ఇల్లు నిర్మించుకున్న పేదలకు జీవో నెం.130 మరియు 45 ద్వారా క్రమబద్ధీకరణ చేయాలని, వారికీ నిరభ్యంతర ధృవపత్రం అందించాలని తెలిపారు. 22ఎ సమస్యలను పరిష్కరించాలని కోరారు. యారాడ కొండమీద 450 ఎకరాల స్థలం అందుబాటులో ఉందని ఐటి పార్కు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. అదేవిధంగా అగనంపూడి వద్ద పరిశ్రమ స్థాపనకు కేటాయించిన 175 ఎకరాల స్థలం అందుబాటులో ఉందని దానిని ఇతర అవసరాలకు వినియోగించాలని అన్నారు. ప్రభుత్వ భూములకు సంబంధించిన కోర్ట్ కేసులు త్వరగా పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు.

తూర్పు నియోజకవర్గం శాసన సభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను ఇతరుల నుండి కొనుక్కొని ప్రస్తుతం నివాశముంటున్న వారి వివరాలు సంక్షేమ పథకాల ఆధారంగా యాజమాన్యం నిర్ధారించి వారి పేరునే స్థలాలను క్రమబదీకరణ చేయాలని తెలిపారు. ప్రభుత్వ భూముల వివరాలను ల్యాండ్ బ్యాంకు లో నమోదు చేయాలని, స్మశాన వాటికలను ప్రభుత్వ రికార్డులలో స్మశాన వాటికలుగా నమోదు చేయాలని తెలిపారు.

విశాఖ పశ్చిమ నియోజకవర్గం శాసన సభ్యులు పివిజిఆర్ నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాల్లో ఇళ్ళు నిర్మించుకున్న వారికి ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్స్ అందజేయాలని కోరారు. గోపాలపట్నం ములగాడలో పోర్టు భూములలో ఇళ్ళు కట్టుకున్న వారికి క్రమబద్ధీకరణ చేయాలని, పోర్టుకు ప్రత్యామ్నాయ స్థలం కేటాయించాలని కోరారు.

విశాఖ దక్షిణ నియోజకవర్గం శాసన సభ్యులు వంశీ కృష్ణ శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ తహశిల్దార్ కార్యాలయానికి శాశ్వత బిల్డింగ్ నిర్మించాలని, గ్రంధాలయ స్థలంలో గ్రంధాలయ భవనం నిర్మించాలని ప్రహ్లాద కళ్యాణ మండపం ప్రజలకు అందుబాటులోనికి తీసుకురావాలని తెలిపారు.

విశాఖ ఉత్తర నియోజకవర్గం శాసన సభ్యులు విష్ణు కుమార్ రాజు మాట్లాడుతూ చినముషిడివాడలో రెవిన్యూ సిబ్బందికి, గంభీరంలో మాజీ సైనికులకు కేటాయించిన భూములను 22ఎలో నమోదు చేశారని, విచారణ చేసి వారికి న్యాయం చేయాలని అన్నారు.

ఈ సమావేశంలో శాసన మండలి సభ్యులు వేపాడ చిరంజీవి రావు, పెందుర్తి శాసన సభ్యులు పంచాకర్ల రమేష్ బాబు, కార్పోరేషన్ చైర్మేన్లు గండి బాబ్జి, వి. సతీష్ కుమార్, జాయింట్ కలక్టర్ గొబ్బిళ్ళ విద్యాదరి, డిఆరోఓ విశ్వేశ్వర నాయుడు ఆర్డిఒలు దిలీప్ చక్రవర్తి, సంగీత్ మాథుర్, తహసిల్దార్లు పాల్గొన్నారు.

## వాకపాడు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



ఎస్.రాయవరం, జూన్ 11, ప్రభాతవార్త

మండలంలో వాకపాడు గ్రామంలో రోడ్డు భవనాల శాఖ సంబంధించి రోడ్డు నిర్మాణానికి మండల టిడిపి అధ్యక్షులు అమలకంటి అబద్దం శంకుస్థాపన చేశారు. గ్రామంలో సిమెంట్ రోడ్డు తో పాటు మిగతా భాగంలో నేవీ గేటు వరకు తారు రోడ్డు నిర్మాణం చేసేందుకు సుమారు కోటి రూపాయలు మంజూరు అయినట్లు ఏఈ సత్యవేణి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు గంపా రమణ,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు వాటర్ బాటిళ్లు, హాట్‌బాక్స్‌ల పంపిణీ

అచ్యుతాపురం, జూన్ 11, ప్రభాతవార్త



మునగపాక ఎండ తీవ్రత దృష్ట్యా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో పాల్గొంటున్న కూలీలకు వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు, అనకాపల్లి పార్లమెంట్ నియోజక వర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ తన సొంత నిధులతో వాటర్ బాటిల్లు, హాట్‌బాక్స్‌లను పంపిణీ చేశారు. మునగపాక మండలం మునగపాక గ్రామ పరిధిలోని చెరువు కాలువ ప్రాంతంలో మూడో రోజు ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్న కూలీలను గురువారం ఆయన కలిశారు. వేసవి ఎండల నేపథ్యంలో కూలీల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సౌకర్యం కోసం వాటర్ బాటిల్లు, భోజనాన్ని భద్రంగా ఉంచుకునేందుకు హాట్‌బాక్స్‌లను అందజేశారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడిన బొడ్డేడ ప్రసాద్, శ్రమజీవుల సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాదా రామకృష్ణ కుటుంబాన్ని పరామర్శించిన ఎంపీ గొల్ల బాబురావు



పాయకరావుపేట, ప్రభాతవార్త

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాదా రామకృష్ణ కుటుంబాన్ని రాజ్యసభ సభ్యులు గొల్ల బాబురావు గురువారం పరామర్శించారు. కాదా రామకృష్ణ కుమార్తె మృతి చెందిన విషయం తెలుసుకున్న బాబురావు పాయకరావుపేటలో ఉన్న ఇంటికి చేరుకొని రామకృష్ణకు ధైర్యం చెప్పారు. చాలా బాధాకరమైన విషయం అని ధైర్యంగా ఉండమని, మీకు పార్టీ అండగా ఉంటుందని ఎంపీ బాబూరావు భుజం తట్టి రామకృష్ణ కు ధైర్యం చెప్పారు. ముందుగా సత్యవరం గ్రామానికి చేరుకొని గ్రామంలో ఉన్న మాజీ సర్పంచ్ సకిరెటి రాము మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆయన వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ మేరకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మాజీ మండల శాఖ అధ్యక్షులు ధనిశెట్టి బాబూరావు కుటుంబాన్ని పరామర్శించారు బాబూరావు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



ఆయనతోపాటు పరామర్శించిన వారిలో మాజీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ చైర్మన్ కొయ్య ప్రసాద్ రెడ్డి, రాష్ట్ర పార్టీ నాయకులు సతీష్ వర్మ, వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావు, మండల అధ్యక్షులు గడ్డమూరి శ్రీనివాసరావు, వైఎస్ఆర్సిపి నాయకులు జగతా శీను, ధనిశెట్టి మహేష్, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి శీరం నరసింహమూర్తి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు గొర్ల నరసింహమూర్తి, రాష్ట్ర పార్టీ నాయకులు లొడగల చంద్రరావు, పోలిశెట్టి పేద ఈశ్వరరావు, ఎంపీపీ తాతబాబు, గొర్ల బాబూరావు, వైఎస్ఆర్సిపి నాయకులు ఎరుసల్లి నగేష్, ముసలయ్యసెట్టి బత్తుల సూరిబాబు, గొర్ల నాగ అప్పలరాజు, అల్లు రమణ, జగతా శీను, ఎంపీటీసీ బచ్చల రాజు, దేవరపు రాజా కన్న, రమేష్, తదితరులు ఉన్నారు.

## ఉత్తమ సేవలతో అందరి హృదయాలను దోచుకుంటారు




అనకాపల్లి జూన్ 11, ప్రభాతవార్త

సేవలు శాశ్వతంగా, స్థిరస్థాయిగా నిలిచి ఉండేలా చేసేవారే అందరి హృదయాలను దోచుకుంటారు చరిత్రలో స్థిర స్థాయిగా నిలుస్తారని అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాల గౌరవ కార్యదర్శి కొణతాల లక్ష్మీనారాయణ (పెదబాబు) అన్నారు. బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గెల్లా జయ బాబు రిటైర్మెంట్ సత్కార కార్యక్రమం ఘనంగా జరిగింది. కళాశాలకు ఈ స్థాయిలో కీలకమైన నాక్ గ్రేడింగ్ బి డబుల్ ప్లస్ గ్రేడింగ్ రావడంలో కీలక పాత్ర పోషించి నందుకు గాను వారిని సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి నిత్యం చేస్తున్న సేవలను కొనియాడారు. కళాశాలలో ఆయన స్వంత నిధులు రెండు లక్షల రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారని వివరించారు. ఆయన సారథ్యంలోనే కళాశాల మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నాక్ తర్వాత పరిశీలనలో ఏ గ్రేడ్‌ను సాధించుకుందామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన భార్య, ఉపాధ్యాయురాలు రాణి కళాశాలలో ఉత్తమ విద్యార్థుల పారితోషికం కోసం డిపాజిట్‌గా లక్ష రూపాయలను ఆర్థిక సాయం అందజేశారు. ఉద్యోగాలు, విధులు సేవలు, అందరూ ఏదోలా నిర్వహిస్తారన్నారు. కానీ మన సేవలు శాశ్వతంగా, చిరస్థాయిగా నిలిచి ఉండేలా చేసే వారే చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తారన్నారు. ఉత్తమ సేవలతో అందరి హృదయాలను సంపాదించు కోవడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. కొత్త సంఘం అధ్యక్షులు తమ్మన రఘుబాబు, ఉపాధ్యక్షులు దాడి శ్రీనివాసరావు, ఏ ఎమ్ ఏ ఎల్ కళాశాల అధ్యక్ష, కరస్పాండెంట్లు శ్రీధరాల కృష్ణ పేర్రాజు, పెంటకోట వెంకట రామారావు (శ్రీను), వైస్ ప్రిన్సిపాల్ నిరంజన్ కుమార్, పర్యవేక్షకులు పెంటకోట అనురాధ, పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొడ్డేడ అప్పారావు, పెనుమత్స కృష్ణంరాజు, కోశాధికారి వై జగదీశ్వరరావు, యాజమాన్య కమిటీ సభ్యులు, అధ్యాపకులు, సిబ్బంది, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## పాతకృష్ణాదేవిపేటలో స్వచ్ఛపదం..

గొలుగొండ మే 11 ప్రభాతవార్త



స్వచ్ఛ పదం ద్వారా పోర్టు గ్రామాలు పరిశుభ్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎంపీడీవో ఉదయ శ్రీనివాసరావు అన్నారు. పాతకృష్ణాదేవిపేటలో పంచాయతీలో స్వచ్ఛ పదం కార్యక్రమంలో ప్రధాన రహదారులు, వీధి రోడ్లు, గ్రామం, చెత్త నుండి సంపద కేంద్రం వద్ద రోడ్లు శుభ్రపరిచే కార్యక్రమం చేపట్టారు. గ్రామాలు స్వచ్ఛంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇళ్ల వద్ద నుండి ఉత్పత్తయ్యే చెత్తను నిర్దేశిత ప్రదేశాల్లో వేయాలన్నారు. తడి పొడి చెత్తను వేరు చేసి సంపద కేంద్రానికి అందిస్తే తద్వారా పంచాయతీకి ఆదాయం అందేలా కృషి చేస్తామన్నారు. ప్రస్తుతం వేసవిలో ఎండ తీవ్రతకు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ అవసరాన్ని బట్టి పనులను అనుకూల కాలంలో పూర్తి చేసుకోవాలన్నారు. అలాగే వచ్చే వర్షాకాలంలో ప్రతి ఇంట్లో నీటిని కాచి వడపోసుకుని తాగాలని సూచించారు. ప్రధాన రహదారులన్నీ పరిశుభ్రంగా ఉండేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. విరివిగా చెత్తను ఎక్కడపడితే అక్కడ వెయ్యి వద్దని అన్నారు. పంచాయతీ ద్వారా నేపథ్యంలో తాగునీరు ట్యాంకులు వద్ద పరిశుభ్రతను పాటించాలని, తాగునీటి సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా చూసు కోవాలన్నారు. స్వచ్ఛ పదం ద్వారా ప్రధాన రహదారులతో పాటు వీధి రోడ్లు ఖాళీ ప్రదేశాలను స్వచ్ఛంగా ఉంచాలని అన్నారు. అనంతరం సంపద్ కేంద్రాన్ని సందర్శించి సిబ్బందికి పలు సూచనలు సలహాలు అందజేశారు. వ్యర్థాలను మార్చాలని ఎంపీడీవో అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఈవో పిఆర్ డి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి అశోక్ కుమార్, పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణపై టీడీపీ సదస్సు

గాజువాక,జూన్ 11,ప్రభాతవార్త



జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్‌లో ఓటర్ లిస్ట్ ప్రత్యేక సమగ్ర సవరణ (సర్ పై) అవగాహన సదస్సు, వార్డు స్థాయి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు, ప్రభుత్వ విప్ గణబాబు మార్గదర్శకత్వంలో వార్డు అధ్యక్షులు మజ్జి మాని నాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఓటరు వివరాలు జాబితాలో నమోదయ్యేలా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చురుగ్గా శ్రమించాలని పిలుపునిచ్చారు. ఓటరు హక్కుల పరిరక్షణతో పాటు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రధాన కార్యదర్శి కామరాజు, బూత్ కన్వీనర్లు, మహిళా ప్రతినిధులు, క్లస్టర్ ఇంచార్జిలు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా పరమ ఏకాదశి మహోత్సవం



విశాఖపట్నం జూన్ 11 ప్రభాత వార్త

వన్ టౌన్ రాజప్ప నాయుడు వీధిలో గల శ్రీ గీతా భవనంలో శ్రీ గీతా ప్రచార సమితి వారి ఆధ్వర్యంలో శ్రీ గీతా మందిరంలో వేంచేసి యున్న శ్రీ కృష్ణార్జున సహిత విశ్వరూప భగవానుని సన్నిధిలో అధిక జేష్ట మాసం పురు షోత్తమ మాసం పరమ ఏకాదశి సందర్భంగా స్వామివారికి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు అర్చనలు నిర్వహించడం జరిగింది అనంతరం భక్తులచే సామూహికంగా శ్రీమద్భగవద్గీత శ్లోకాలతో పారాయణం శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం శ్రీ లలితా సహస్రనామ పారాయణం నిర్వహించడం జరిగింది ఇటీవల సంస్థ తరఫున నిర్వహించిన సుదర్శన సహిత కోటి విష్ణు సహస్రనామ పారాయణంలో పాల్గొన్న భక్తులకు, సహకరించిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవి రాజశేఖర్, అధ్యక్షులు చావలి విశ్వేశ్వరరావు, కార్యదర్శి ఎం వనజాదేవి, కోశాధికారి జివిఆర్ ప్రసాద్, జి లక్ష్మీనరసింహ స్థానికులు, పరిసర ప్రాంతవాసులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానం హుండీ ఆదాయం రూ.5.11 లక్షలు

### -80 రోజుల్లో భక్తుల కానుకలుగా రూ.5,11,502 సమర్పణ

విశాఖపట్నం, జూన్ 11, ప్రభాతవార్త :



వన్‌టౌన్ ఇసుకకొండపై వెలసిన దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలోని శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానం హుండీలను గురువారం ఉదయం 11 గంటలకు తెరిచి లెక్కింపు నిర్వహించారు. ఈ సందర్భంగా గత 80 రోజుల కాలానికి గాను భక్తులు సమర్పించిన కానుకల రూపంలో రూ.5,11,502 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖ పర్యవేక్షణలో నిర్వహించారు. పర్యవేక్షణాధికారిగా గ్రేడ్-1 ఈఓ కె. గోవింద హాజరై లెక్కింపు ప్రక్రియను పరిశీలించారు. అలాగే ప్రధాన అర్చకులు ఫణిహారం నరసింహామూర్తి, సేవా సంఘం సభ్యులు, ఆలయ సిబ్బంది హుండీ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొని సహకరించారు. భక్తుల విశ్వాసానికి నిదర్శనంగా ఈ ఆదాయం లభించిందని, ఆలయ అభివృద్ధి, నిత్యపూజలు, ధార్మిక కార్యక్రమాల నిర్వహణకు ఈ నిధులు వినియోగించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి టి. రాజగోపాల్ రెడ్డి తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకుంటూ హుండీల్లో కానుకలు సమర్పిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు చైర్మన్ కోరుకొండ సూర్య ప్రసాద్ తో పాటు ట్రస్టు సభ్యులు పెంటపల్లి వెంకట అప్పారావు, బొట్టా సరోజిని, వేదుల హనుమంతరావు, గడదసు నరసయ్యమ్మ, కుందాటి పావని, మట్టపల్లి హనుమంతరావు, జెర్రిపోతుల ప్రసన్న, నల్లబిల్లి వెంకటలక్ష్మి, ఉప్పిలి అప్పలకొండ పాల్గొన్నారు.

## ఉక్కు బాధిత కుటుంబాలకు టిఎన్‌టియుసి పరామర్శ



గాజువాక,జూన్ 11,ప్రభాతవార్త

విశాఖ స్టీల్ ప్లాంట్ దుర్ఘటనలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలను టిఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు గురువారం పరామర్శించారు. జిల్లా నాయకులు నక్క లక్ష్మణరావు, కొర్రాయి నాగార్జునరావులతో కలిసి అగనంపూడి, డొంకాడ, మదీనాబాద్, గంగవరం ప్రాంతాల్లోని మృత కార్మికులు భానుకుమార్, అప్పలరాజు, రమణ, పైడిరాజుల నివాసాలకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా రఘురామరాజు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు బాధిత కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు ఒకరికి శాశ్వత ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు టిఎన్‌టియుసి శ్రేణులు బాధితులకు ఎల్లప్పుడూ అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు విల్లా రామ్మోహన్ కుమార్, అప్పల నాయుడు, బాబుజి, తారక రామారావు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ, వామపక్షాలవి చిల్లర రాజకీయాలు: ప్రసాదుల శ్రీనివాస్

గాజువాక,జూన్ 11,ప్రభాతవార్త



విశాఖ ఉక్కు ప్రమాద బాధితులకు అండగా ఉండాల్సింది పోయి వైసీపీ, వామపక్ష నేతలు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని తెదేపా గాజువాక సమన్వయ కర్త ప్రసాదుల శ్రీనివాసరావు మండి పడ్డారు. పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బాధితుల పరామర్శ పేరుతో మాజీ సీఎం జగన్ ఆసుపత్రి వద్ద హంగామా చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మళ్లీ అధికారంలోకి వస్తే కోటి రూపాయల పరిహారం ఇస్తామనడం జగన్ పగటి కలలకు నిదర్శనమన్నారు. వైసీపీకి వామపక్ష నేతలు తొత్తులుగా మారి కూటమి ప్రభుత్వంపై బురదజల్లుతున్నారని ధ్వజమెత్తారు. ప్రమాదం జరిగిన కొద్ది గంటల్లోనే కేంద్ర మంత్రి కుమారస్వామి స్పందించి, కాంట్రాక్టు కార్మికుని కుటుంబానికి పర్మినెంట్ ఉద్యోగం ప్రకటిస్తూ సాహసోపేత నిర్ణయం తీసుకున్నారని శ్రీనివాసరావు గుర్తుచేశారు. నష్టాల్లో ఉన్న ప్లాంట్‌ను ఆర్థిక ప్యాకేజీతో అభివృద్ధి పథంలోకి తెస్తున్న ప్రభుత్వంపై విషం చిమ్మడం మానుకోవాలని, తప్పుడు ప్రచారాలు ఆపకుంటే ప్రజల్లో విశ్వసనీయత కోల్పోతారని హితవు పలికారు. ఈ సమావేశంలో తెదేపా నాయకులు నల్లూరు సూర్యనారాయణ, బొడ్డేడ రమణ, కర్రి దశేంద్ర, పంచదార్ల ఉగ్రం, పోతిన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## స్టీల్ ప్లాంట్ అగ్ని ప్రమాదంలో మృతి చెందిన త్రినాథ్ కుటుంబానికి

## వైఎస్సార్సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుడివాడ లతీష్ పరామర్శ



గాజువాక,జూన్ 11,ప్రభాతవార్త

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో మృతి చెందిన కార్మికుడు గొట్టపు త్రినాథ్ కుటుంబాన్ని రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సంయుక్త కార్య దర్శి గుడివాడ లతీష్ గురువారం పరా మర్శిం చారు. గాజువాక అప్పన్న కాలనీలోని వారి నివాసానికి వెళ్లిన లతీష్.. త్రినాథ్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత భార్య, కుమారులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కష్టసమ యంలో వైఎస్సార్సీపీ కుటుంబానికి అండగా ఉంటుందని, భవిష్యత్తులో ఎలాంటి సమస్య వచ్చినా సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్టీల్ ప్లాంట్ బాధిత కుటుంబాల పక్షాన ఉంటారని, వారి న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పార్టీ నిరంతరం పోరాడు తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఈటీ శ్యామల రావు, 68వ వార్డు పార్టీ అధ్య క్షులు సంద్ర నూకరాజు, గుర్రం తిరునాథ్, కోటి, బొడ్డేటి గోవిందు, శ్రీరామ్ మూర్తి, ఛత్రపతి ఈశ్వరరావు, అంబటి విజయ్, గున్నా బత్తుల ఆనందరావు, గొంతెన శ్రీనివాసరావు, నేలపాటి శ్యాంబాబు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయ నమూనా క్షేత్రాల పరిశీలన

ఆనందపురం, జూన్ 11, ప్రభాతవార్త



ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్ కార్యక్రమాల అమలును పరిశీలించేందుకు అనకాపల్లి సెర్ప్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.సచ్చిదేవి ఆనంద పురం మండలం తర్లువాడ గ్రామంలోని ప్రకృతి వ్యవసాయ నమూనా క్షేత్రాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ బుసాల శ్యామల ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలు, రైతులు అమలు చేస్తున్న వివిధ నమూనాలు మరియు వాటి ప్రయోజనాలను వివరించారు. హెచ్‌ఆర్, జెండర్ థీమాటిక్ బి. శ్రీనివాస్ చక్రవర్తి తన 66 సెంట్లలో ఏర్పాటు చేసిన "ఎనీ టైమ్ మనీ" నమూనా క్షేత్రాన్ని పరిచయం చేస్తూ, తక్కువ విస్తీర్ణంలోనే ఏడాది పొడవునా ఆదాయం పొందే విధానాన్ని వివరించారు. అలాగే ఫీల్డ్ మాస్టర్ ట్రైనీ రామారావు పొలంలో అమలు చేస్తున్న 365 రోజుల గ్రీన్ కవర్, ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్, పంటల వైవిధ్యం, నేల సారవంతత పెంపు, పశుగ్రాస భద్రత వంటి అంశాలను ప్రాజెక్ట్ డైరెక్టర్ పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా కలుగుతున్న ప్రయోజనాలను రైతులు వివరించగా కె.సచ్చిదేవి ఈ నమూనాలను అభినందిస్తూ రైతులు విస్తృతంగా అమలు చేసి స్థిరమైన వ్యవసాయాన్ని సాధించాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు, సెర్ప్ సీసీలు, యాంకర్లు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

## రైల్వే వేగన్ వర్క్‌షాప్‌లో నిర్వాసితులకు 50శాతం ఉద్యోగాలివ్వాలి

### ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం



గాజువాక, జూన్ 11,ప్రభాతవార్త

రైల్వే వేగన్ రిపేర్ వర్క్‌షాప్‌లో స్థానిక ఎపిఐఐసి నిర్వాసితులకు 50శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని గాజువాక శాసనసభ్యులు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం ఎపిఐఐసి నిర్వాసిత సంఘం నాయకుడు ఇల్లపు రాము ఆధ్వర్యంలో నిర్వాసితులు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం సమర్పించారు. దీనిపై తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే.. నిర్వాసితులను స్వయంగా జిల్లా కలెక్టర్ వద్దకు తీసుకెళ్లి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాలుగు దశాబ్దాల క్రితం వడ్లపూడి, ఫకీర్తక్యా, యాదవ్ జగ్గరాజుపేట, తుంగ్లాం గ్రామాల ప్రజల నుండి ఎకరాకు కేవలం రూ. 800 చొప్పున ఎపిఐఐసి వారు సేకరించిన 203 ఎకరాల భూమిని స్టీల్ ప్లాంట్ ద్వారా రైల్వే వేగన్ వర్క్‌షాప్ నిమిత్తం బదలాయించారని కలెక్టర్‌కు వివరించారు. ప్రస్తుతం కొంకణ్ రైల్వే కార్పొరేషన్ లిమిటెడ్ మూడు నోటిఫికేషన్ల ద్వారా భర్తీ చేస్తున్న మొత్తం 187 ఉద్యోగాలలో (ఇంజనీర్లు, టెక్నీషియన్లు, వెల్డర్లు, ఫిట్టర్లు, ఖలాసీలు తదితర పోస్టులు) స్థానిక నిర్వాసితులకు చట్టబద్ధంగా రావాల్సిన 50 శాతం ఉపాధి కల్పించాలని కోరారు. దీనిపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ.. నిర్వాసితులకు న్యాయం జరిగేలా డివిజనల్ రైల్వే మేనేజర్‌కి లేఖ పంపుతానని హామీ ఇచ్చారు. అనంతరం నిర్వాసిత సంఘం నాయకులు ఇల్లపు రాము ఆధ్వర్యంలో డీఆర్ఎంతో పాటు విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎమ్. శ్రీభరత్‌కు కూడా వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాసిత సంఘం నాయకులు ప్రగడ వేణుబాబు, కర్ణం వెంకట్రావు, కర్రి నాగేశ్వరరావు, కర్రి సన్యాసిరావు, ఈర్ల శ్రీరాములు, మింది గోవిందు, కర్ణం శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



## అదృశ్యమైన అర్చకుడు.. విగత జీవయ్యాడు..!

### కొండ దిగువున మృతదేహం లభ్యం.. గుడిలోవలో అలముకున్న విషాదం



ఆనందపురం, జూన్ 11, ప్రభాతవార్త

గుడిలోవ గ్రామాన్ని విషాదంలో ముంచెత్తిన ఘటనలో, మంగళవారం నుంచి కనిపించ కుండా పోయిన గుడిలోవ శ్రీ రంగనాథస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు కోట్రా కామేశ్వరరావు శర్మ (65) మృతదేహం బుధవారం ఉదయం లభ్యమైంది. గ్రామ ప్రజలకు ఆధ్యాత్మిక మార్గదర్శకుడిగా, ప్రతి శుభకార్యానికి తొలి ఆహ్వానితుడిగా పేరుగాంచిన ఆయన అకాల మరణం స్థానికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా, గుడిలోవ ఆలయం కొండ దిగువున ఉన్న వినాయకస్వామి ఆలయం సమీపంలోని తోటలో ఆయన మృతదేహాన్ని గుర్తించారు. అనంతరం స్థానిక పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమునిపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.స్థానికుల కథనం ప్రకారం గత కొంతకాలంగా కుటుంబ సమస్యలతో ఆయన మానసికంగా కలత చెందారని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పలు కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది. ఆయన మరణ వార్త తెలియగానే గుడిలోవతో పాటు పరిసర గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చి నివాళులర్పించారు. గ్రామం లో ఎప్పుడూ ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పేందుకు కృషి చేసిన అర్చకుడు ఇక లేరనే విషయాన్ని జీర్ణించుకోలేక స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై ఆనందపురం సీఐ వాసు నాయుడు పర్యవేక్షణలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు."ఒక అర్చకుడి మరణం మాత్రమే కాదు.. గ్రామానికి ఆధ్యాత్మిక బంధాన్ని అందించిన ఓ పెద్దమనిషిని గుడిలోవ కోల్పోయింది" అని గ్రామ పెద్దలు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని సొంట్యాంకి చెందిన ఆయనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## ఉత్కంఠ పోరులో అమరావతి అద్భుత విజయం

### వైజాగ్ బ్యాటర్లను కోలుకోలేని దెబ్బతీసిన అమరావతి బౌలర్స్ -ఎస్‌డిఎన్‌వి ప్రసాద్ సూపర్ బ్యాటింగ్, తోషిత్ యాదవ్ అద్భుత బౌలింగ్ తో అమరావతి వరుసగా రెండో విజయం

### -మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎస్‌డిఎన్‌వి ప్రసాద్



విశాఖపట్నం, జూన్ 11 ప్రభాతవార్త

విశాఖపట్నం(ఏసిఏవిడిసిఏ స్టేడియం) విశాఖపట్నంలో జరుగుతున్న ఆంధ్ర ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ 5 మూడవరోజు తొలి మ్యాచ్లో సింహాద్రి వైజాగ్ లయన్స్, క్యాపిటల్ అమరావతి రాయల్స్ మధ్య ఉత్కంఠ భరితమైన మ్యాచ్ జరిగింది తొలుతగా టాస్ గెలిచిన క్యాపిటల్ అమరావతి రాయల్స్ జట్టు ముందుగా ఫీల్డింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్కు దిగిన క్యాపిటల్ అమరావతి రాయల్స్ కు ఆది నుంచి కష్టాలు ప్రారంభమయ్యాయి ఓపెనర్లను జట్టు కోల్పోవడంతో పాటు పవర్ ప్లే లో నాలుగు వికెట్ల నష్టానికి 37 పరుగులు మాత్రమే అమరావతి జట్టు చేసింది ఒక దశలో 100 పరుగులు కూడా సాధ్యమేనా అన్న పరిస్థితి నుండి వరుణ్ సాత్విక్ మరియు ప్రసాద్ బ్యాటింగ్ను కొంత ముందుకు తీసుకు వెళ్లిన తరువాత బం డారు అయ్యప్ప శశి కాంత్ ఇద్దరు వేగంగా ప్రసాద్తో జత కలిసి టీం స్కోర్‌ను 20 ఓవ ర్లలో 9 వికెట్ల నష్టానికి 181 పరుగులు అమ రావతి జట్టు చేసింది. దీంట్లో ఎస్ఎన్‌డి వి ప్రసాద్ 45 బంతుల్లో 54 పరుగులు రెండు ఫోర్లు నాలుగు సిక్సర్ల తో టీంకు అండగా నిలబడ్డాడు మరొక వైపు చివరిలో అద్భుత బ్యాటింగ్ ప్రదర్శన చేసిన శశికాంత్ 14 బంతుల్లో 32 పరుగులు ఒక ఫోర్ నాలుగు సిక్సర్లతో బౌలర్లపై ఎదురు దాడి చేశారు. దీంతో ఆ జట్టు మంచి స్కోరు చేయగలిగింది. అటు వైజాగ్ లయన్స్ జట్టు బౌలర్లలో గిరి నాథ్ రెడ్డి ఢిల్లీ గణేష్ ప్రమోద్ రెండేసి వికెట్లు తీశారు. అనంతరం లక్ష చేదనతో బ్యాటింగ్ దిగిన సిం హాద్రి వైజాగ్ లయన్స్ జట్టుకు ఆది నుంచి ఎదురు దెబ్బలు తగల డం ప్రారంభ మయ్యా యి జట్టు ఓపెనర్లతో పాటు మిడిల్ ఆర్డర్ వరకు ఒక్కసారిగా టీం బ్యా టింగ్ కుప్ప కూలింది తొలి ఓవర్ నుంచే అమరావతి జట్టు పేస్ బౌలర్ తోషిత్ యాదవ్ వైజాగ్ జట్టును ఇబ్బంది పెట్టాడు దీంతో ఆ జట్టు పవర్ ప్లే ముగిసే సమ యానికి ఐదు వికెట్ల నష్టానికి 55 పరు గులు మాత్రమే చేయ గలిగింది. దీంతో అంత 100 పరుగుల లోపే వైజాగ్ జట్టు ఆల్ అవుట్ అవుతుందని భావించిన సమయం లో ధనుష్, త్రిపు రన విజయ్, ఇద్దరు వేగం గా పరుగులు సాధిస్తూ టీమ్ ను లక్ష్యసాధనకు దగ్గరగా తీసుకెళ్లిన విజయ్ తీరాల వైపు చేర్చలేక పోయారు విజయ్ 31 బంతుల్లో 40 పరుగులు మూడు ఫోర్లు ఒక సిక్సర్, ధనుష్ 27 బంతుల్లో 33 పరుగులు ఐదు ఫోర్లు మినహాయించి వైజాగ్ జట్టులో ఎవరో చెప్పుకోదగ్గ పరుగులు చేయలేకపోయారు చివరిలో ఒకరిద్దరు బ్యాటర్స్ అడపాదడపా బౌండరీలు బాదిన విజ యానికవి సరిపోలేదు దీంతో ఆ జట్టు వరుస గా రెండో ఓటమిని చూడక తప్పలేదు అటు అమరావతి బౌలర్లలో తోషిత్ యాదవ్, మూడు వికెట్లు సాధించగా బండారు అయ్యప్ప శశి కాంత్ రెండేసి వికెట్లు తీసి టీంను విజయ పదం వైపు నడిపిం చారు మ్యాచ్లో అద్భు తంగా బ్యాటింగ్ చేసిన ఎస్ఎన్డివి ప్రసాద్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.


వార్త VAARTHA CLASSIFIEDS CLASSIFIEDS వార్త VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, MAJJI BHANOJIRAO S/O MAJJI GOVINDA RAO previously called MAJJI BANOJEERAO R/O 2-150/N, SOPERU MAIN STREET, VIZIANAGARAM, now changed my name from MAJJI BANOJEERAO to MAJJI BHANOJIRAO. Hence forth I will be called as MAJJI BHANOJIRAO for all purposes. (Ro.No.10070)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.



కెనరా బ్యాంక్ Canara Bank

ప్రాంతీయ కార్యాలయం : విశాఖపట్నం-1 #9-29-15/7, పద్మావతి టవర్స్, బాలాజీ నగర్, సిరిపురం, విశాఖపట్నం-530003.

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు

టు:

1. M/s ధనలక్ష్మి ఎలక్ట్రికల్ పైప్స్ అండ్ జంక్షన్ బాక్స్‌స్, యస్.వై. 95 13, వాలిమెరక గ్రామం, పెందుర్తి, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్ – 531173.
2. శ్రీ బర్నాడ్ శేఖర్ (ప్రొప్రయిటర్), తండ్రి: బలరామన్, డి.నెం. 12 536, శ్రీరామ్ నగర్, ఆరిలోవ ఓల్డ్ డైరీ ఫారం, శ్రీ గణపతి దుర్గా దేవి టెంపుల్, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్- 530040.
3. శ్రీమతి బర్నాడ్ లక్ష్మి (హామీదారు), భర్త: శేఖర్, డి.నెం. 12 541, ప్రభుత్వ డెయిరీ ఫారం, విశాఖపట్నం అర్బన్, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్ – 530040.

డియర్ సర్/మేడమ్,

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం డిమాండ్ నోటీసు.

మా కెనరా బ్యాంక్, పెందుర్తి బ్రాంచ్ నుండి M/s ధనలక్ష్మి ఎలక్ట్రికల్ పైప్స్ అండ్ జంక్షన్ బాక్స్‌స్, శ్రీ బర్నాడ్ శేఖర్ (ప్రొప్రయిటర్), తండ్రి: బలరామన్, శ్రీమతి బర్నాడ్ లక్ష్మి (హామీదారు), భర్త: శేఖర్ గార్లు పొందిన లోన్/ఋణసౌకర్యాల వివరములు:

| లోన్ స్వభావం & లోన్ అకౌంట్ నెం. | లోన్ మొత్తం మరియు లోన్ తేది | తేది 08.06.2026 నాటికి బకాయి వడ్డీతో | వడ్డీ రేటు |
|---|---|---|---|
| టర్మ్ లోన్ అకౌంట్ నెం. 170007134507 | తేదీ 05.01.2023 న రూ. 21,75,000/- | రూ. 10,29,256.68/- | 11.50% |
| MSME-OD / OCC అకౌంట్ నెం. 125003336110 | తేదీ 05.01.2023 న రూ. 2,00,000/- | రూ. 2,01,690.19/- | 9.65% |

మాకు తనఖా పెట్టిన వ్యక్తి / వ్యక్తులచే వ్రాసి ఇవ్వబడిన సంబంధిత డాక్యుమెంట్ల ద్వారా ఈ నోటీసును షెడ్యూలులో వివరించిన ఆస్తుల తనఖా ద్వారా పైన తెలిపిన ఋణాలు / ఋణసౌకర్యాలకు తగు విధంగా హామీ కల్పించబడినది. పేర్కొన్న నియమ నిబంధనల ప్రకారం తమ ఋణాలను చెల్లించడంలో పైన తెలిపిన మీరు విఫలమైనందున బ్యాంక్ సదరు ఋణాన్ని 05/06/2026 తేదీన నిరర్థక ఆస్తి (ఎన్.పి.ఎ) గా వర్గీకరించింది. అందువలన ఈ నోటీసు తేది నుండి 60 రోజులలోగా రూ.12,30,946.87 (అక్షరాల పన్నెండు లక్షల ముప్పై వేల తొమ్మిది వందల నలభై ఆరు రూపాయలు మరియు ఎనభై ఏడు పైసలు మాత్రమే) + తదుపరి వడ్డీ, ఖర్చులు కలిపి మొత్తమును చెల్లించవలసిందిగా కోరుతూ సంబంధిత చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద మీకు ఇందుమూలముగా ఈ నోటీసు జారీ చేయుచున్నాము. చెల్లించడంలో విఫలమైతే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అన్ని లేదా ఏవేని హక్కును మేము వినియోగించుకుంటాము. ఇంతే కాకుండా మా ముందస్తు సమ్మతి లేకుండా ఏ విధంగానూ షెడ్యూలులో తెలిపిన ఏ సెక్యూర్డ్ ఆస్తులతో ఏ రకంగానూ వ్యవహరించకుండా మీరు నిరోధింపబడుచున్నారు. సదరు చట్టం మరియు/ లేదా అమలులో ఉన్న చట్టం క్రింద లభించే ఏవేని ఇతర హక్కుకు ఎటువంటి ప్రతికూల అభిప్రాయం లేకుండా ఈ నోటీసు ఇవ్వబడింది.

SARFAESI చట్టం నందలి సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8) ప్రకారము మీరు తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది. మా బ్రాంచ్ రికార్డులో అందుబాటులో ఉన్న మీ చిరునామాకు తిరుగు రశీదుతో కూడిన రిజిష్టర్ పోస్టు ద్వారా డిమాండ్ నోటీసు పంపించడం జరిగింది.

తనఖా / తాకట్టు వుంచిన ఆస్తి యొక్క నిర్దిష్ట వివరాలు దిగువ పేర్కొనబడినవి

అసెట్ ఐడి: 200101193351: విశాఖపట్నం జిల్లా, పెందుర్తి యస్.ఆర్.ఓ. పరిధి, పెందుర్తి మండలం, వాలిమెరక గ్రామం మరియు పంచాయతీ, సర్వే నెం. 95/13 లో ప్లాట్ నెం. 479 నందు 200 చ॥గ॥ల లేదా 167.227 చ॥మీ॥ల ఖాళీ స్థలం. హద్దులు: తూర్పు: 40 అ॥ల రోడ్డు, దక్షిణం: 40 అ॥ల రోడ్డు, పడమర: ఖాళీ ప్లాట్, ఉత్తరం: ఖాళీ ప్లాట్.

టైటిల్ హోల్డర్ పేరు : శ్రీమతి బర్నాడ్ లక్ష్మి.

తేది: 09-06-2026, ప్రదేశం: విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

## భూ సర్వే అడ్డుకున్న సుజాల స్రవంతి నిర్వాసితులు



అనకాపల్లి జూన్ 11, ప్రభాతవార్త

2013 చట్టం ప్రకారం ప్రసూతం రిజిస్ట్రేషన్ వేల్యూ ధర ప్రకారం ఒకటికి నాలుగు రెట్లు ఇవ్వాలని అప్పటివరకు సర్వే పనులు నిలిపివేయాలి అని సుజాల స్రవంతి నిర్వాసిత రైతులు గురువారం డిమాండ్ చేశారు. ఐదు సంవత్సరాలు రైతుల భూములను నిషేధిత జాబితాలో పెట్టి భూములు రిజిస్ట్రేషన్ అమ్మకాలు నిలిపివేశారు అన్నారు. దీని వల్ల రైతులకు చాలా ఇబ్బంది పడ్డారని అన్నారు. ఉత్తరాంధ్ర సుజాల స్రవంతి నిర్వాసితు రైతులు ఎటువంటి సర్వేలు చేయొద్దని ముందుగా 2013 చట్ట ప్రకారం ప్రస్తుత రిజిస్ట్రేషన్ మార్కెట్ వాల్యూ ప్రకారం ఒకటికి నాలుగు రెట్లు రేటు నిర్ణయించిన తర్వాతే సర్వే పనులు మొదలు పెట్టాలని.. గత నాలుగు సంవత్సరాలు కిందట సర్వే చేసి రైతులకు నష్టపరహార ఇస్తామని చెప్పి నేటికీ ఇవ్వలేదని కేవలం ప్రాథమిక నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత ప్రభుత్వ వారు రెండు సంవత్సరాలలోపు నష్టపరిహారం రైతులకి 2013 చట్ట ప్రకారం చెల్లించవలసి ఉండగా నేటి వరకు చెల్లించలేదని రైతులకు ఇబ్బంది పెట్టి విధంగా రిజిస్ట్రేషన్ ఆఫీసులో అమ్మకాలు కొనుగోలు నిలిపేశారని ఆరోపించారు. దీనివల్ల అత్యవసరమైన రైతులు పెళ్లిళ్ల కోసమో కుటుంబాల అవసరం కోసం చదువులు కోసమో భూములు అమ్ముకోవడానికి అవసరాలు తీర్చుకోవడానికి ఇబ్బంది పడి జీవిస్తున్నారని దీనివల్ల రైతు కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఉన్నట్లుగా సర్వే అధికారులకు తెలియజేశారు. 2013 చెట్టు ప్రకారం ఒకటికి నాలుగు రెట్లు ప్రస్తుతం మార్కెట్ వాల్యూ ప్రకారం ఇవ్వాలని ప్రతి ఇంటికి ఉద్యోగం ఇవ్వాలని అలాగే భూమికి భూమి ఇచ్చిన తర్వాతే రైతులతో సమావేశం పెట్టి చట్టప్రకారం అన్ని నష్టపరిహారాలు ఇచ్చిన తర్వాత మాత్రమే సర్వే పనులు చేయాలని రైతులు రాతపూర్వకంగా రాసి అనకాపల్లి మండలం సత్యనారాయణపురం గ్రామానికి విచ్చేసిన మూలపేట గ్రామంలో సర్వే అధికారులు పోలవరం ప్రాజెక్టు ఏఈ సుప్రీతకి వినతి పత్రాన్ని పీఎం కిసాన్ జిల్లా కన్వీనర్ రైతు నాయకులు పిలా మురళి, చిన్ని నాయుడు, ఊట శ్రీను, శిరసపల్లి రామకృష్ణ, పిలా వెంకటరమణ కలిసి వినత పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పోలవరం ప్రాజెక్టు ఏఈ సుప్రీత మాట్లాడుతూ రైతులకు నష్టపరహారం 2013 చట్టం ప్రకారం వచ్చేలాగ పై అధికారులకు తెలియజేస్తామని రైతులకు ఆమె తెలిపారు.

## మరిడి మాంబా అమ్మవారికి గాజులతో అలంకరణ



కశింకోట, జూన్ 11, ప్రభాతవార్త

మండలంలోని తాళ్లపాలెం జాతీయ రహదారికి అనుకుని ఉన్న శ్రీ మరిడి మాంబా అమ్మవారి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన అమ్మవారిని 5116 గాజులతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా దేవతా మూర్తుల విగ్రహాలను పూలమాలలతో అలంకరించి, అర్చన, అష్టోత్తరములు వంటి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు మధిర శ్రీరామూర్తి, ఫణి శర్మలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన అతిథులను ఆలయ కమిటీ చిన్ని కోటేశ్వరరావు,పొన్నం రమణ,సహాయకులు ఆధ్వర్యంలో సత్కరించారు.

## క్రీడాకారులకు అండగా నిలిచిన ఎంవిఆర్ ట్రస్ట్ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావు



అనకాపల్లి జూన్ 11, ప్రభాతవార్త

అనకాపల్లి నియోజకవర్గంలో యువతను క్రీడల వైపు ప్రోత్సహించడంలోనూ, వారికి అవసరమైన సదుపాయాలు కల్పించడంలోనూ ఎంవిఆర్ ట్రస్ట్ అధినేత, బీజేపీ ముఖ్య నాయకులు ముత్యాల వెంకటేశ్వరరావు (ఎంవిఆర్) మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. ఆయన అందించిన ఆర్థిక సహాయ సహకారాలతో నిర్వహించిన బాక్సింగ్ సమ్మర్ క్యాంప్ ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ పోటీలలో స్థానిక యువ బాక్సర్లు ఏకంగా 18 బంగారు పతకాలు సాధించి అనకాపల్లి కీర్తిని చాటారు. గత నెల మే 1వ తేదీ నుండి మే 30వ తేదీ వరకు జరిగిన ఈ బాక్సింగ్ సమ్మర్ క్యాంప్‌కు ముత్యాల వెంకటేశ్వరరావు ప్రత్యేకంగా మద్దతునిచ్చి, క్రీడాకారుల శిక్షణకు అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆయన ప్రోత్సాహంతో రింగులోకి దిగిన యువ బాక్సర్లు అద్భుత ప్రదర్శనతో పతకాల పంట పండించారు. విజేతలకు బహుమతులు అందజేసేందుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ముత్యాల వెంకటేశ్వరరావుకు క్రీడాకారులు, నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. తాము సాధించిన బంగారు పతకాలను ఆయన చేతుల మీదుగా అందుకోవడం పట్ల యువ బాక్సర్లు ఆనందం వ్యక్తం చేశారు. తమ ప్రతిభను గుర్తించి, క్యాంప్ నిర్వహణకు అండగా నిలిచిన ఆయనపై క్రీడాకారులు తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మన ప్రాంతంలో ఎంతోమంది ప్రతిభావంతులైన యువతీ యువకులు ఉన్నారని వారికి సరైన వేదిక, ప్రోత్సాహం లభిస్తే జాతీయ స్థాయిలోనే కాకుండా ఒలింపిక్స్ వంటి అంతర్జాతీయ వేదికలపై కూడా రాణించగలరన్నారు. యువతను క్రీడల్లో ప్రోత్సహించడానికి ఎం వి ఆర్ ట్రస్ట్ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలియజేశారు . దీనిలో భాగంగా,క్రీడల పట్ల, యువత భవిష్యత్తు పట్ల ఎం వి ఆర్ చూపిస్తున్న ప్రత్యేక శ్రద్ధను, ఆయన అందిస్తున్న నిరంతర సేవలను స్థానిక ప్రజలు, క్రీడా సంఘాల ప్రతినిధులు కొనియాడారు.

## గూడుపమ్మను దర్శించుకున్న జిల్లా నోడల్ అధికారిణి



నక్కపల్లి/అడ్డు రోడ్డు, ప్రభాతవార్త

మండలంలోని రేబాక గూడుపమ్మతల్లి ఆలయాన్ని గురువారం మధ్యాహ్నం యోగాంధ్ర జిల్లా నోడల్ అధికారిణి, ఆయుష్ వైద్యాధికారిణి డాక్టర్ లావణ్య దర్శించుకున్నారు. ఆమె ఆలయం లో అమ్మవారిని దర్శించుకుని పసుపు, కుంకుమలు సమర్పించారు. ఆమె గోత్రనామాలతో పూజలు చేశారు. అమ్మవారి ఆలయం ప్రకృతి సోయగాలమధ్య ఎంతో అద్భుతంగా వుందని, ఎన్నో విశిష్టతలకు నిలయంగా మారిందన్నారు. ఈ సందర్భంగా ఆమెను ఆలయం తరపున శేషవస్త్రంతో సత్కరించారు. ఆమె వెంట ఆయుష్ ఫార్మసిస్టు భీశెట్టి రామకృష్ణ, గణేశ్ వున్నారు.

## ఉపమాకలో యోగాంధ్రకు విస్తృత ఏర్పాట్లు..

### కలిసికట్టుగా పనిచేయాలి : ఆయుష్ జిల్లా నోడల్ అధికారిణి డా.లావణ్య



నక్కపల్లి, జూన్ 11, పభాతవార్త

అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం ఉపమాక గ్రామంలో టెంపుల్ టూరిజం కార్యక్రమంలో భాగంగా ఈ నెల 16న నిర్వహించనున్న సామూహిక యోగా ప్రదర్శన కార్యక్రమానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని అనకాపల్లి జిల్లాయోగాంధ్ర నోడల్ అధికారిణి డాక్టర్ లావణ్య చెప్పారు. గురువారం మధ్యాహ్నం నక్కపల్లిలో టీడీపీ నియోజకవర్గం కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్, ఉపమాకలో పీఏసీఎస్ పర్సన్ ఇన్చార్జి కొప్పిశెట్టి బుజ్జిని కలిశారు. 16వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకూ ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో చేపట్టే సామూహిక యోగాసనాల ప్రదర్శనకు రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్, జేసీ, తదితరులు హాజరవుతారని చెప్పారు. ఈ విషయమై 12 సాయంత్రం నక్కపల్లి ఎంపీడీవో కార్యాలయంలో అన్ని ప్రభుత్వశాఖల అధికారులతో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహణపై సమీక్ష జరుగుతుందని వెంకటేశ్ చెప్పారు. ఈ మేరకు యోగాంధ్ర కార్యక్రమ నిర్వహణపై జిల్లా ఎండోమెం ట్స్ అసిస్టెంట్ కమిషనర్ కేఎల్ సుధారాణి ఉపమాక ఆలయంలో యోగా ప్రదర్శన జరిగే ప్రాంతాన్ని పరిశీలించారు. ఆయుష్ వైద్యాధికారులు కె.రఘు, సుజాత, ఎండోమెంట్స్ శివాలయం ఈవో మురళీ పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌కు ఏపీయుడబ్ల్యూజే వినతి



(అనకాపల్లి, ప్రభాతవార్త)

అనకాపల్లి జిల్లా పరిధిలో అక్రిడేషన్లు కలిగిన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ఇతర డస్క్‌లో పనిచేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని కోరుతూ ఏపీయూడబ్ల్యూజే, ఏపీ ఈఎంజేఏల అనకాపల్లి జిల్లా కమిటీల నాయకత్వం బుధవారం జిల్లా కలెక్టర్ చాంబర్లో కలసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ఎల్ బి స్వామి, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల కిషోర్‌ల నాయకత్వంలో అనకాపల్లి జిల్లా కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పెంటకోట జోగినాయుడు, కోరాడ చంద్రరావుతోపాటు ఏపీయూడబ్ల్యూజే అక్రిడేషన్ కమిటీ సభ్యులు అప్పారావు ,ప్రసాద్, నాగేశ్వరరావు, వైయస్ సన్యాసి నాయుడు ,గిరిబాబు తోపాటు ఏపీ ఈఎంజేఏ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ సత్యనారాయణ, యూనియన్ నాయకులు దేవరపు నాగేశ్వరరావు, జిల్లా సహాయ కార్యదర్శి శ్రీమాన్, చిన్న పత్రికల రాష్ట్ర స్థాయి నాయకులు బాలు తదితరులు ఉన్నారు. స్పందించిన జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అక్రిడేషన్ కలిగిన పాత్రికేయ మిత్రులకు ప్రైవేట్ విద్యా సంస్థల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారికి ఆదేశించారు. స్పందించిన జిల్లా కలెక్టర్‌కి ఏపీ యుడబ్ల్యూజే నాయకత్వం కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జిల్లాలో అక్రిడేషన్ పాత్రికేయులకు ఉషా ప్రేమ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించాలని, అక్రిడేషన్ జర్నలిస్టులందరికీ హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని పునరుద్ధరించాలని కోరుతూ పలు సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన కలెక్టర్ తక్షణమే డిఎం అండ్ హెచ్ఓతో పాటు ఐఎన్ పిఆర్ జిల్లా అధికారి రమణలకు పరిశీలించి చర్యలు తీసుకోమని ఆదేశించారు.

## గ్రామదర్శిని కార్యక్రమంలో కేంద్ర పథకాలను ప్రజలకు వివరిస్తున్న పిల్లా రమాకుమారి



ఎలమంచిలి, జూన్ 11, ప్రభాతవార్త

భారతీయ జనతా పార్టీ పిలుపు మేరకు, విశాఖ డైరీ చైర్మన్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆడారి ఆనంద్ కుమార్ ఆదేశాలతో బుధవారం రామారాయుడుపాలెం గ్రామంలో 'గ్రామదర్శిని' కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్, బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యురాలు పిల్లా రమాకుమారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లా రమాకుమారి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అనేక రకాల పథకాలను ప్రవేశపెట్టిందని వివరించారు. గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాలను గుర్తించి, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ లబ్ధి నేరుగా ప్రజలకే చెందేలా ఈ కార్యక్రమాలు రూపొందాయని పేర్కొన్నారు. అనంతరం బీజేపీ నేతలు నక్కా శివశంకర్ ప్రసంగిస్తూ.. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న మరిన్ని సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి ప్రజలకు సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఆడారి శ్రీధర్, మళ్ల కొండబాబు, కర్రిస్వామి, బొడ్డేటి సురేష్, సుంకర చిన్ని నాయుడు, ఆడారి రాంప్రసాద్, తుంపాల శ్రీనివాస్, పందూరి హరినాధ్, తదితరులు పాల్గొన్నారు.

## వంగలపూడి కుటుంబాన్ని పరామర్శించిన ఎంపీ గొల్ల బాబురావు



యస్.రాయవరం, ప్రభాతవార్త

మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన వంగలపూడి రాంబాబు మృతి చెందిన విషయం తెలుసుకున్న రాజ్యసభ సభ్యులు గొల్ల బాబురావు గురువారం ఉదయం ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులు పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయనతోపాటు పరామర్శించిన వారిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శీరం నరసింహమూర్తి, మాజీ మండల పార్టీ అధ్యక్షులు పోలిశెట్టి పెదేశ్వరరావు, ఎంపీటీసీ బోండా దిమానం, మాజీ సర్పంచ్ కర్రీ సత్యనారాయణ, మాజీ జడ్పీటిసి కసింకోట నీలేంద్ర, సీనియర్ పార్టీ నాయకులు నూక నాయుడు, విశ్రాంతి ఉపాధ్యాయులు కర్రీ ధర్మారావు, మండగుద్దిర రమణ, గరికిన నాగరాజు, తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలు తీరును పరిశీలించిన ప్రత్యేక అధికారి సత్యనారాయణ



ఎలమంచిలి, జూన్ 11, ప్రభాతవార్త

మండలంలోని షేకిళ్ళపాలెం గ్రామంలో జిల్లా స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు ప్రత్యేక అధికారి బి.వి. సత్యనారాయణ గురువారం ఆకస్మికంగా పర్యటించారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలు తీరును స్వయంగా పరిశీలించారు. ఈ పర్యటనలో భాగంగా గ్రామంలో కొనసాగుతున్న 'తల్లికి వందనం' పథకం పురోగతి, యు.ఎఫ్.ఎస్ సర్వే వివరాలు, చిన్నారుల ఆధార్ నమోదు ప్రక్రియ, వాట్సాప్ గవర్నెన్స్ నిర్వహణ వంటి కీలక అంశాలపై సచివాలయ సిబ్బందితో ఆయన సుదీర్ఘంగా సమీక్షించారు. పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా, నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామ పర్యటన అనంతరం జిల్లా అధికారి బి.వి.సత్యనారాయణ మండల పరిషత్ కార్యాలయంలోని మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో పైన పేర్కొన్న అంశాలపై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో అందేలా పంచాయతీ కార్యదర్శులు నిరంతరం పర్యవేక్షించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమీక్షా కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి దీపిక, ఎం.ఎస్.జి.ఓ ఎం.అనంతనాగ్, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆలయ భూములు ఆక్రమిస్తే చర్యలు : ఎండోమెంట్స్ ఏసీ కేఎల్ సుధారాణి



నక్కపల్లి, జూన్ 11,ప్రభాతవార్త

జిల్లాలో ఎక్కడైనా దేవదాయ, ధర్మదాయశాఖ పరిధిలో వున్న భూములను ఎవరైనా ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదని ముందుగా నోటీసులు జారీ చేసి, ఆక్రమణలు తొలగిస్తామని, అవసరమైతే కేసులు నమోదు చేస్తామని దేవాదాయ ధర్మా దాయ శాఖ ఏసి సుధారాణి హెచ్చరించారు. గురువారం మండలంలోని నక్కపల్లి, ఉపమాక గ్రామాల్లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా తనను కలిసిన విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలో ఎండోమెంట్స్ పరిధిలో సుమారు 710 వరకూ ఆలయాలుండగా, ఇందులో 6ఏ పరిధిలో అనకాపల్లి నూకాలమ్మ ఆలయం ఒక్కటే వుందని, 6బీలో 12 ఆలయాలు న్నారు.మిగిలినవన్నీ 6సీలో వున్నాయని చెప్పారు. ఏడాదికి రూ.5 లక్షలు ఆదాయం మించి వున్న ఆలయాలకు ట్రస్టుబోర్డులను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పాయకరావుపేట పాండురంగస్వామి ఆలయం ట్రస్టుబోర్డు ని యామకానికి కూడా నోటిఫికేషన్ జారీ చేసినట్టు ఆమె చెప్పారు. జిల్లాలో ధూప, దీప నైవేద్యాల పథకం ద్వారా 67 దేవాలయాల నిర్వహణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎండోమెంట్స్ పరిధిలో 5500 ఎకరాల భూములున్నాయని చెప్పారు. ఆమె వెంట ఈవోలు మురళీ, తేజ తదితరులున్నారు.

## ఈదురు గాలులకు పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

### రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలరాజు



ఎస్.రాయవరం, జూన్ 11, ప్రభాతవార్త

మండలంలో ధర్మవరం అగ్రహారం గ్రామంలో బుధవారం సాయంత్రం వచ్చిన ఈదురు గాలులకు, రైతులు వేల రూపాయలు పెట్టుబడి పెట్టి వారం, పది రోజుల్లో పంట కోతకు వచ్చే సమయంలో ఈదురు గాలులు కారణంగా అరటి తోటలు నెలమట్టమయ్యి యని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం అప్పలరాజు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేల రూపాయలు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి,పంట చేతికి వచ్చే సమయంలో ఈవిధంగా రైతులు నష్టపోవడం చాలా బాధాకరం అన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి, క్షేత్ర స్థాయిలో పరిశీలించి, ఏ రైతు ఎంత పంట నష్టపోయిన నమోదు చేసి అరటి తోట ఎకరానికి యాభై వేల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా తమలపాకుల తోటలు, మామిడి తోటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. నాయకులు, రైతులు కర్రి శ్రీను, పోలిశెట్టి శ్రీను, చందక రమణ,పెనుమత్స సంగరాజు,ప్రసాదుల రమణ, కర్రి తాతారావు,శీరం సాయి,కుప్పిన సూర్య భాస్కర్, కర్రి శేఖర్,గొర్ల ప్రసాద్ పాల్గొన్నారు.

## బూత్ స్థాయి నుంచే పార్టీని బలోపేతం చేయాలి : ప్రగడ నాగేశ్వరరావు



ఎలమంచిలి, జూన్ 11, ప్రభాతవార్త

మండలంలోని లాలం కోడూరు గ్రామంలో రాంబిల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు లాలం భరత్ అధ్యక్షతన గురువారం మండల స్థాయి కీలక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రోడ్లు, రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, కూటమి నియోజక వర్గ ఇన్‌ఛార్జ్ ప్రగడ నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ?ఈ సందర్భంగా ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా (ఎస్.ఐ.ఆర్) సవరణ ప్రక్రియను క్షేత్రస్థాయిలో బూత్ లెవెల్ ఏజెంట్లు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఎలాంటి సాంకేతిక లేదా మానవ పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నాయకులు, కార్యకర్తలు ఎల్లప్పుడూ సన్నద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలు నిరంతరం ఓటర్లతో మమేకమవుతూ, తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఆయన కోరారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలనను, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఒక్కరికీ వివరించాలని ప్రజాప్రతినిధులకు, పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కరేడ్ల ఈశ్వరరావు, క్లస్టర్ ఇంచార్జిలు చోడపల్లి సత్యనారాయణ, జల్లి ఆదిరెడ్డి, చొచ్చపట్ల చిన్న, రాంబిల్లి పీఏసీఎస్ చైర్మన్ ఎరిపిల్లి చిట్టిబాబు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గరికిన గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

## బడి పిలుస్తోంది'కు విశేష స్పందన



అచ్యుతాపురం, జూన్ 11, ప్రభాతవార్త

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచే లక్ష్యంతో నిర్వహిస్తున్న 'బడి పిలుస్తోంది' కార్యక్రమానికి ఎం.జె.పురంలో విశేష స్పందన లభించింది. మండల విద్యాశాఖ అధికారి సీ.కే. దేవరాయలు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న ఐదుగురు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక సదుపాయాలు, డిజిటల్ బోధన, అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి తల్లిదండ్రులకు వివరించారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు అన్ని విధాలా మెరుగైన అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కరెడ్ల బుల్లెమ్మ ప్రకాష్, పాఠశాల నిర్వహణ కమిటీ (ఎస్ఎంసీ) చైర్‌పర్సన్ ఉషా, ప్రధానోపాధ్యాయులు రాజా రత్నకుమార్, ఫిజికల్ డైరెక్టర్ రాజు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.




## ఉపాధి కూలీలకు పోలీసుల అవగాహన

### మహిళల భద్రత, సైబర్ నేరాలపై సూచనలు



అచ్యుతాపురం, జూన్ 11 ప్రభాతవార్త

మహిళలు, పిల్లల భద్రతతో పాటు సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల దుష్పరిణామాలపై అప్రమత్తంగా ఉండాలని అచ్యుతాపురం పోలీసులు సూచించారు. కొండకర్ల గ్రామ పరిధిలో గురువారం ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) కూలీలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు మహిళలు, పిల్లల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సైబర్ మోసాలకు గురికాకుండా వ్యక్తిగత, బ్యాంకు వివరాలను ఎవరికీ వెల్లడించరాదని సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే సామాజిక, ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. ఇటీవల పరిసర ప్రాంతాల్లో చోటుచేసుకున్న ఆలయ చోరీ ఘటనలను ప్రస్తావిస్తూ, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. గ్రామాల్లో రాత్రి వేళల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసు సహాయం కోసం 112 హెల్ప్‌లైన్, సైబర్ నేరాల ఫిర్యాదుల కోసం 1930 నంబర్‌ను వినియోగించాలని వివరించారు. ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని అచ్యుతాపురం ఎస్ఐ తెలిపారు.

## కొత్త మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న కర్రి సాయికృష్ణ



అచ్యుతాపురం జూన్ 11, ప్రభాతవార్త

మునగపాక మండలం మునగపాక గ్రామ పరిధిలోని పెదపాడు-కసింకోట రహదారి సమీపంలో వేంచేసియున్న శ్రీ శ్రీ శ్రీ కొత్త మహాలక్ష్మి అమ్మవారిని తెలుగుదేశం పార్టీ యువ నాయకులు, ధర్మ ఫౌండేషన్ చైర్మన్ కర్రి సాయికృష్ణ దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమ్మవారి కృపాకటాక్షాలతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, సంతోషాలతో జీవించాలని మనస్ఫూర్తిగా ప్రార్థించినట్లు తెలిపారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని, రైతులు, కార్మికులు, యువతతో పాటు అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు దాడి ముసిలినాయుడు, ఐటీడీపీ మండల అధ్యక్షులు పెంటకోట శ్రీరామమూర్తి, టీడీపీ సీనియర్ నాయకులు వేగి ప్రకాష్, బుద్ధ వెంకటి, స్థానిక రైతులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కారం కోరుతూ ఆర్టీసీ ఉద్యోగులు నిరసన



అనకాపల్లి, జూన్ 11, ప్రభాతవార్త

సమస్యలు పరిష్కారం కోరుతూ ఆర్టీసీ ఉద్యో గులు స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. డిపో జోన్ వ్యాపితముగా ఉన్న సమస్యల మీద, జోన్ వ్యాప్తంగా రెండు రోజుల నిరసన కార్యక్రమంలో భాగంగా గురువారం ఆర్టీసీ ఉద్యోగులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. రాష్ట్ర ప్రచార కార్యదర్శి జి.శంకర్రావు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు పథకం ద్వారా పని ఒత్తిడి పెరిగిందని, ప్రయాణికులకు అనుగుణంగా కొత్త బస్సులు ఏర్పాటు చేయాలని, ఇలా తదితర సమస్యలపై గేట్ మీటింగ్ నిర్వహించి డిపోలో కార్మికులందరూ మొదటి షెడ్యూల్ నుండి ఎర్ర బ్యాడ్జీలు ధరించి విధులకుహాజరై నిరసన వ్యక్తం చేశారు. డిపో అధ్యక్షులు కెఎన్‌వి రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డిపో సెక్రెటరీ ఏఎన్ రావు, డిపో కమిటీ, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పోలీస్ అధికారులను సత్కరించిన జనసేన పార్టీ నాయకులు



నక్కపల్లి, రూరల్, ప్రభాతవార్త

శ్రీ ఉపమాక వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన హుండీ చోరీ కేసు విషయంలో నక్కపల్లి పోలీస్ అధికారులు నాలుగు రోజుల వ్యవధిలోనే నిందితులను పట్టుకొని స్వామివారి ఆస్తులను కాపాడిన సందర్భంగా మండలం లోని జనసేన పార్టీ నాయకులు కలిసి ఘనంగా సత్కరించారు. ఈ కేసు విషయంలో సీఐ జూరెడ్డి మురళితో పాటు దర్యాప్తులో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నామని జనసేన పార్టీ నాయకులు చెబుతూ సీఐ మురళిని ఎస్ఐలు సన్నీ బాబు, మహిళా ఎస్సై సాహిబా అంజుమ్‌లను సత్కరించారు. సత్కరించిన వారిలో జనసేన పార్టీ మండల శాఖ అధ్యక్షులు వెలగా సుధాకర్, మాజీ ఎంపీటీసీ గింజల వెంకటరమణ, కర్రీ నానాజీ, నల్లల రత్నాజీ, ఉప్పుండపురం ట్రాక్టర్ రమణ, టిడిపి నాయకులు మీగడ సత్యనారాయణమూర్తి, తోట అప్పారావు, తదితరులు ఉన్నారు.

## ట్రాన్స్‌ఫారం ఏర్పాటు చేయాలని వినతి



నక్కపల్లి, జూన్ 11, ప్రభాతవార్త

నక్కపల్లి మండలంలో గల డీఎల్ పురం గ్రామంలో మత్స్యకారి ఏరియాలో లో వోల్టేజ్ కారణంగా పంచాయితీకి సంబంధించిన ఆర్డబ్ల్యూఎస్ స్కీంలో బోర్లు పనిచేయడానికి ఇబ్బందిగా ఉంది. అలాగే ఇళ్లకు వచ్చే కరెంటు కూడా తక్కువగా ఉండటం వల్ల ప్రజలు రాత్రి సమయాల్లో చాలా ఇబ్బంది పడుతున్నారు. కావున దీనికి ట్రాన్స్ఫారం వేయించి తక్షణమే ఈ సమస్యను పరిష్కరించవలసిందిగా ఎలక్ట్రికల్ ఏఈని మండల కమిటీ తరపున కోరడమైనది. ఏఈ స్పందిస్తూ వీలైనంత తొందరలోనే పై అధికారులకు తెలియజేసి ట్రాన్స్‌ఫారం ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది.మండల జనసేన పార్టీ అధ్య క్షులు వెలగా సుధాకర్‌రావు ఉపాధ్యక్షులు రత్నాజీ ఎక్స్ ఎంపీటీసీ రమణ సతీషు అప్పారావు బాబ్జి పాల్గొన్నారు.

## దాడిశెట్టి రాజాతో సమావేశమైన ఎంపీ గొల్ల బాబురావు



పాయకరావు పేట, ప్రభాతవార్త

రాష్ట్ర మాజీ మంత్రి కాకినాడ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దాడిశెట్టి రాజాతో గురువారం కాకినాడ జిల్లా తునిలో తన ఇంటి వద్ద రాజ్యసభ సభ్యులు గొల్ల బాబురావు మర్యాద పూర్వకంగా కలిసిన కొంతసేపు పార్టీకి సంబంధించిన పలు కార్యక్రమాల విషయమై చర్చించారు. ఆయనతోపాటు దాడిశెట్టి రాజాలను కలిసిన వారిలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావుతోపాటు గెడ్డమూరి శ్రీనివాసరావు అనకాపల్లి జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి శీరం నరసింహమూర్తి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు గొర్ల నరసింహమూర్తి, ఎంపీటీసీ బచ్చల రాజు, మాజీ ఉప సర్పంచ్ జగతా శ్రీను, పన్నీరు పాపారావు, నూకతాత ఎలమంచిలి తాతారావు, గోవిందు, దేవర సత్తిబాబు, రమేష్, తదితరులు ఉన్నారు.

## అచ్యుత్ కుమార్ సొంత నిధులతో చెట్టు కొమ్మలు తొలగింపు



ఎస్.రాయవరం,జూన్ 11, ప్రభాతవార్త

మండలంలో బుధవారం సాయంత్రం సంభవించిన గాలి వాన బీభత్సవానికి ధర్మవరం-అగ్రహారం ఆంజనేయ స్వామి వారి ఆలయం, వైబోయిన అంజలి పెంకుటిల్లు మీద చెట్టు కొమ్మలు పడి ఆలయం, ఇల్లు దెబ్బతినడం జరిగింది. గురువారం ఉదయం అచ్యుత్ కుమార్ ఆధ్వర్యంలో తన సొంత నిధులతో దార్లపూడి నుంచి రంపపు మిషన్ తెప్పించి అక్కడ మొత్తం క్లియర్ చేయించారు. ఈ కార్యక్రమంలో బండి నాగేశ్వరరావు, గజివెల్లి గణేష్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ నాగరాజు, స్థానికులు సహాయ, సహకారాలు అందించారు.




## రాజముద్రతో కూడిన పట్టా పాస్ పుస్తకాలు పంపిణీ

దుంబ్రిగుడ, జూన్ 11 ప్రభాతవార్త:



రాజముద్రతతో కూడిన భూహక్కు పత్రాలను గిరిజనులకు కూటమి ప్రభుత్వం అందిస్తుందని రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ టి. సుబ్బారావు అన్నారు. మండలంలోని సొవ్వా నపంచాయతీ చమడపాడు, ఒడియలవలస గ్రామాల్లో మీ భూమి- మీ హక్కు కార్యక్రమంలో భాగంగా రెవెన్యూ శాఖ ఆధ్వర్యాన పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమం గురువారం జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో రీ సర్వే పేరుతో కోట్లాది ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందన్నారు. దీనికితోడు రాజముద్ర కాకుండా జగన్ ఫోటోతో పట్టాదారు పాసు పుస్తకాలను జారీ చేయడం సిగ్గు చేటన్నారు. కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో కూడి పారదర్శకంగా రీసర్వే చేయడంతోపాటు పట్టాలను పంపిణీకి శ్రీకారం చుట్టిందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో ప్రజలు భాగస్వాములు కావాలన్నదే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు ఆనందరావు, నాయకులు స్వామి, సీతారాం, కమలాకర్, రెవెన్యూ సిబ్బంది, గిరిజన రైతులు పాల్గొన్నారు.

## అమ్మవారిని దర్శించుకున్న జిసిసి డైరెక్టర్ కన్నప్పరాజు

పాడేరు,జూన్11, ప్రభాతవార్త:



ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్య దైవం మన్య ప్రజల ఇలవేల్పు పాడేరు శ్రీ మోదకొండమ్మ అమ్మవారిని పలువురు ప్రముఖులు గురువారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన గిరిజన సహకార సంస్థ (జిసిసి) డైరెక్టర్ ఎం.కన్నప్పరాజు,టిడిపి పోలవరం మండల పార్టీ అధ్యక్షులు మశీగిన వెంకట రమణ,పోలవరం నీటి సంఘం అధ్యక్షులు పాదం ప్రసాద్,తెలుగు యువత నాయకులు పాదం హరి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్న వీరికి టిడిపి సీనియర్ నాయకులు, జిసిసి డైరెక్టర్ బొర్రా నాగరాజు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు.అమ్మవారి దర్శనం అనంతరం వీరికి డైరెక్టర్ నాగరాజు అమ్మవారి చిత్రపటాన్ని అందజేసి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.

## నేడు పాడేరు కాఫీ హౌస్‌లో మెగా రక్తదాన శిబిరం

పాడేరు,జూన్11, ప్రభాతవార్త:

ఒక చుక్క రక్తం - పది ప్రాణాలకు ఆశ...ఈ నెల 14వ తేదీన ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. 'రక్తదానం మహాదానం' అనే నినాదంతో యువత పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.పాడేరు ప్రభుత్వ కాఫీ హౌస్ స్టేట్ బ్యాంక్ ఎదురుగా శుక్రవారం ఉదయం 9 గంటల నుండి ఈ శిబిరం ప్రారంభించనున్నారు.జిల్లా కలెక్టర్ రెడ్ క్రాస్ అధ్యక్షులు, కలెక్టర్ రెడ్ క్రాస్ చైర్మన్, పాఠశాల మేరకు జిల్లా అధికారులు స్పైస్ బోర్డు కళ్యాణి అధ్యక్షతన ఈ రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నారు.ముందుగా రిజిస్ట్రేషన్, బీపీ, హీమోగ్లోబిన్ పరీక్షల అనంతరం అర్హులైన దాతల నుండి రక్తం సేకరిస్తారు.ప్రతి సంవత్సరం జూన్ 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవం జరుపుకుంటామని, 14వ తేదీ ఆదివారం రావడంతో శుక్రవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని నిర్వాహకులు పేర్కొన్నారు. రక్తం కృత్రిమంగా తయారు చేయలేమని ఒక యూనిట్ రక్తం 3 మంది ప్రాణాలను కాపాడుతుందన్నారు. 50యూనిట్ల సేకరణ లక్ష్యంతో ఈ మెగా క్యాంప్ పెట్టనున్నామని తెలిపారు.యువత ముందుకు రావాలని,రక్తదానం పట్ల దాతలు ఎలాంటి అనారోగ్య రాదని తెలిపారు. దాతలందరూ రక్త దానం చేసేందుకు ముందుకు రావాలని నిర్వాహకులు కోరారు.

## డైలీ వేజ్ కార్మికులు, సిహెచ్ డబ్ల్యూల సమస్యలు పరిష్కరించాలి

### ఐటీడీఏ అడిషనల్ డైరెక్టర్ పివోకు వినతి

పాడేరు,జూన్11,ప్రభాతవార్త:



ఐటీడీఏ పరిధిలో పనిచేస్తున్న డైలీ వేజ్ కార్మికులు, సిహెచ్ డబ్ల్యూల సమస్యలపై అమరావతిలో ఐటీడీఏ అడిషనల్ డైరెక్టర్ పివో ఏరియాస్‌ను కలిసిన ఐటీడీఏ వర్కర్స్ యూనియన్ సిఐటియు ప్రతినిధులు. గురువారం కలిశారు. ఈ సందర్భంగా అల్లూరి జిల్లా పాడేరు కేంద్రంగా ఐటీడీఏ పరిధిలో పనిచేస్తున్న డైలీ కార్మికులు సంవత్సరాల నుండి పనిచేస్తున్నారని పిహెచ్ ఈఎన్‌లో పర్మినెంట్ చేయాలని అడిషనల్ కమిషనర్ని కోరారు. వైద్యఆరోగ్య శాఖ ఐటీడీఏ పరిధిలోపనిచేస్తున్న 700 మంది కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశ కార్యకర్తలుగా గుర్తించి వారికి సమానంగా జీతాలు ఇతర సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు, పై సమస్యల పరిష్కారం చెయ్యని యెడల కార్మికులతో కలిసి పోరాటం నిర్వహిస్తామని పేర్కొన్నారు, అనంతరం సమస్యలను కూడిన వినతి పత్రాన్ని, ఎం సరస్వతి, ఐటీడీఏ అడిషనల్ డైరెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ వర్కర్స్ యూనియన్ అల్లూరి జిల్లా గౌరవ అధ్యక్షులు, జిల్లా ప్రధాన కార్యదర్శి, వి ఉమామహేశ్వరరావు, అల్లూరి జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ కలిసిన వారిలో ఉన్నారు.

## 90% రాయితీపై వరి విత్తనాల పంపిణీ



గూడెం కొత్తవీధి, జూన్ 11 (ప్రభాతవార్త):

మండల కేంద్రంలో రైతులకు 90 శాతం రాయితీపై వరి విత్తనాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ ఏడాది మండలానికి ప్రభుత్వం వివిధ రకాల నాణ్యమైన వరి విత్తనాలను కేటాయించిందని మండల వ్యవసాయ అధికారి గిరిబాబు తెలిపారు. మండలానికి మొత్తం ఏడు రకాల వరి విత్తనాలు వచ్చాయని అందులో 2537, 1121, 1224, = 5204, 15048, 34449, 1318 పేర్కొన్నారు. కూటమి నాయకులు కొండలరావు, శేఖర్, స్థానిక ఎమ్మెల్సీ రాజేశ్వర్, వైస్ ఎంపీపీలు ఆనందరావు, దేముడు పాల్గొన్నారు. అలాగే పీఏసీఎస్ డైరెక్టర్ సూరకాంతం, పీసా అధ్యక్షుడు బలరాం, పీసా సభ్యుడు రామచంద్రంతో పాటు పెద్ద సంఖ్యలో స్థానిక రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## విశిష్ట ప్రతిభ కనబరిచిన అధికారులకు నగదు బహుమతి

పాడేరు,జూన్11,ప్రభాతవార్త:



అల్లూరి సీతారామరాజు జిల్లాలో వివిధ కేసుల దర్యాప్తు, ఇంటెలిజెన్స్ సేకరణ, కార్యాలయ ఉత్తర ప్రత్యుత్తరాల నిర్వహణ, నేరాల ఛేదన, శాంతిభద్రతల పరిరక్షణ తదితర రంగాల్లో విశిష్ట ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ అభినందిస్తూ నగదు బహుమతులను అందజేశారు. గురువారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, ఈగల్ బృందం అధికారులు ,జిల్లా పోలీసు శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సబ్సిడీ విత్తనాలను రైతులు సద్వినియోగపరుచుకోవాలి

### కొయ్యూరు ఎంపీపీ బడుగు రమేష్‌బాబు

కొయ్యూరు, జూన్ 11 ప్రభాతవార్త:



ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న విత్తనాలను రైతులు సద్వినియోగపరచుకొని, మంచి దిగుబడి సాధించాలని ఎంపీపీ బడుగు రమేష్ బాబు రైతులకు సూచించారు. గురువారం జీడిపాలెం రైతు సేవా కేంద్రంలో 90 శాతం సబ్సిడీ పై రైతులకు వరి విత్తనాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ బడుగు రమేష్ బాబు, మండల వ్యవసాయ అధికారి శివరాం ప్రసాద్ మాట్లాడుతూ - మండలంలో ఉన్న 17 రైతు సేవా కేంద్రాలలో వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు..బీపీటీ 5204, ఎంటియు 1318, ఆర్ఎన్ఆర్ 15048, ఎంటియు 1121, ఎం టి యు 1064 విత్తనాలు వచ్చాయన్నారు , రైతులు వారి పట్టా జిరాక్స్ కాపీ , ఆధార్ కార్డు తో సంబంధిత సహాయ వ్యవసాయ/ ఉద్యాన అధికారిని కలిసి విత్తనాలు పొందాలని కోరారు. వైస్ ఎంపీపీ అంబటి నూకాలమ్మ, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ మంగతల్లి , కె. తహసిల్దార్ ప్రసాద్ రావు , మండల వ్యవసాయ అధికారి పి శివ రామప్రసాద్, అసిస్టెంట్ స్టాటిస్టికల్ అధికారి చైతన్య, అన్ని రైతు సేవా కేంద్రం అధికారులు పాల్గొన్నారు.

## జిల్లాలో ఘనంగా మెగా యోగా ఈవెంట్

### గిరిజన సంస్కృతి ఉట్టిపడేలా ప్రత్యేక కార్యక్రమం

పాడేరు,జూన్11, ప్రభాతవార్త:





ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం.. 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో భాగంగా అల్లూరి జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఈరోజు అనగా గురువారం ఉదయం పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో "మెగా యోగా ఈవెంట్" అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ఈ నెల 7వ తేది నుండి జూన్ 21 వరకు నిర్వహిస్తున్న "యోగా మాసోత్సవాల" లో భాగంగా, జిల్లా కలెక్టర్ టి.నిశాంతి ఆదేశాలు మేరకు ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఏడాది యోగా దినోత్సవాల ముఖ్య ఇతివృత్తం "గిరిజన సమాజం" కావడంతో, జిల్లాలోని గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబించేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. ప్రజల భాగస్వామ్యంతో ఈ మెగా యోగా వేడుకలో



జిల్లా నలుమూలల నుండి భారీ సంఖ్యలో వచ్చిన ప్రజలు, అధికారులు తరలివచ్చారు. ప్రజాప్రతినిధులు ఏఎస్ఆర్ జిల్లా ఉన్నతాధికారులు,గిరిజన ప్రాంత విద్యార్థులు, యువత, వైద్య ఆరోగ్య శాఖ, ఐసీడీఎస్ సిబ్బంది,పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సిబ్బంది, ?డీఆర్‌డీఏ, స్వయం సహాయక సంఘాల మహిళలు,ఉపాధి హామీ పథకం కూలీలు, గిరిజన కాఫీ రైతు సోదరులు,ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన గిరిజన సాంస్కృతిక బృందాలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యోగాంధ్ర 2026"తోనే ఆరోగ్యవంతమైన సమాజం. జిల్లా కలెక్టర్ పిలుపుయోగా కేవలం వ్యాయామం కాదు,శరీరం, మనసుల సమతుల్యత,విద్యార్థులు యోగాను దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలి.ప్రతి ఇంటికి యోగాను చేర్చడమే లక్ష్యంగా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ యోగాను తమ జీవితంలో ఒక భాగంగా మార్చుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. స్థానికంగా నిర్వహించిన "యోగాంధ్ర 2026" కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి విచ్చేసిన అతిథులకు, ప్రజలందరికీ ఆమె నమస్కారాలు తెలియజేస్తూ, సాదర స్వాగతం పలికారు.యోగా అనేది - ఒక కళ, సైన్స్ యోగా అనేది కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదని, అది మనసును, శరీరాన్ని అనుసంధానిస్తూ వాటి మధ్య అద్భుతమైన సమతుల్యతను తీసుకువస్తుందని కలెక్టర్ వివరించారు. యోగా అనేది విజ్ఞాన శాస్త్రం అని కొనియాడారు.ప్రపంచవ్యాప్త గుర్తింపు, ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు యోగా సాధన ద్వారా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను పొందుతున్నారని, రోజురోజుకూ యోగా పట్ల ఆదరణ మరియు సాధన పెరుగుతోందని ఆమె సంతోషం వ్యక్తం చేశారు.'యోగాంధ్ర 2026" రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "యోగాంధ్ర 2026" కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికి, ప్రతి వ్యక్తికి యోగాను చేర్చడమే ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ఈ సంకల్పం వెనుక ఉన్న అసలు ఉద్దేశమన్నారు.విద్యార్థులు తమ దైనందిన జీవితంలో యోగాను ఒక అలవాటుగా మార్చుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రతిరోజూ కొంత సమయం యోగా కోసం కేటాయించడం వల్ల విద్యార్థుల్లో ఏకాగ్రత పెరుగుతుందని, చదువులో మంచి ఇంప్రూవ్‌మెంట్ కనిపిస్తుందని, అలాగే ఒత్తిడి తగ్గి మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆమె హితవు పలికారు. ఆరోగ్యవంతమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, "యోగాంధ్ర" లక్ష్య సాధన కోసం అందరూ కృషి చేయాలని కలెక్టర్ కోరారు. యోగా యొక్క గొప్పతనాన్ని కేవలం తమకే పరిమితం చేయకుండా, కుటుంబ సభ్యులకు, స్నేహితులకు తెలియజేస్తూ, ప్రతిరోజూ యోగా సాధన చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ యోగా ప్రాముఖ్యత, ఉచిత ఆన్‌లైన్ క్లాసులు అందరికీ ఉపయోగకరంగా మానసిక లేదా శారీరక రుగ్మతలు ఉన్నవారికైనా, ప్రతి ఒక్కరి శరీర తత్వానికి,ఆరోగ్య సమస్యలకు సరిపోయే ఆసనాలు ఉంటాయని ఆమె తెలిపారు.సులభమైన సాధన,కష్టపడి ఆసనాలు వేయాల్సిన లేదా ప్రాణాయామం చేయాల్సిన అవసరం లేదని, ఎవరికి ఏది సెట్ అవుతుందో తెలుసుకుని రోజువారీ జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు.ప్రభుత్వ పోర్టల్ ద్వారా ఉచిత పాఠాలు, రాష్ట్ర ప్రభుత్వం యోగా పోర్టల్ ద్వారా ఉచితంగా ఆన్‌లైన్ పాఠాలను అందుబాటులోకి తెచ్చిందని, వీటిని సచివాలయాల స్థాయి వరకు సర్క్యులేట్ చేయడం జరిగిందని చెప్పారు.ఇంట్లోనే ప్రాక్టీస్ చేయవచ్చునని ప్రజలంతా ఈ ఆన్‌లైన్ ఉచిత క్లాసులను చూస్తూ, ప్రతిరోజూ ఇంట్లోనే సులభంగా యోగా సాధన చేయవచ్చని ఆమె కోరారు.యోగ కార్యక్రమాలు, ఈ రోజు ప్రారంభమైన ఈ ఈవెంట్‌తో పాటు, ఆధ్యాత్మిక ప్రదేశాలలో నిర్వహించే "టెంపుల్ యోగా" టూరిజం వంటి మరో నాలుగు ప్రధాన కార్యక్రమాలు కూడా ఉన్నాయని వక్త పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఐ.టి.డి.ఎ. ప్రాజెక్ట్అధికారి ఆదిత్య వర్మ మాట్లాడుతూ..యోగతోనేసంపూర్ణ ఆరోగ్యమని, గిరిజన ప్రాంత ప్రజల శారీరక, మానసిక ఆరోగ్యానికి, శారీరక దృఢత్వానికి యోగా ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. నిత్య జీవితంలో యోగాను ఒక భాగం చేసుకోవడం ద్వారా ఒత్తిడి లేని, ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ తిరుమాని పూజ,ఐ టి డి ఏ ఆటలు అధికారి ఆదిత్య వర్మ,ఆర్టీసీ చైర్మన్ దొన్నుదొర,జిసీసీ డైరెక్టర్ బొర్ర నాగరాజు, టూరిజం డైరెక్టర్ కిల్లో వెంకట్ నాయుడు, యోగ నోడల్ అధికారి, ఐటిడిఏ ఏపిఓ వెంకటేశ్వరరావు, జిల్లా ఎన్ ఎస్ ఎస్ నోడల్ అధికారి జి గౌరీ శంకర్, డిఎల్పిఓ కుమార్, యోగ గురువు దీపిక బలగ, డా.మోనిక శ్రీ, ఆయుష్ మెడికల్ ఆఫీసర్ పి డి స్,జిల్లా అధికారులు , ఉద్యోగస్తులు, విద్యార్థులు, గిరిజన, డ్వాక్రా, మహిళలు,ఆశ వర్కర్స్,గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.కార్యక్రమం





విజయవంతం చేయడానికి సహకరించిన ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు, జిల్లా అధికారులకు, ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి,జిల్లా కలెక్టర్,జిల్లా యంత్రాంగం తరపున జిల్లా జాయింట్ కలెక్టర్ వందన సమర్పణ చేశారు.అలాగే ఈ కార్యక్రమ ఏర్పాటు చేసిన ఐ.టి.డి.ఎ. పాడేరువారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## మూడేళ్లుగా మూలన పడ్డ వాటర్ ప్లాంట్




గూడెంకొత్తవీధి, జూన్ 11 (ప్రభాతవార్త):

మండలంలోని ఆర్‌వి నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పిహెచ్సి)లో ఏర్పాటు చేయాల్సిన వాటర్ ప్లాంట్ గత మూడేళ్లుగా నిరుపయోగంగా మూలన పడివుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రిలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తే రోగులకు అవసరమైన స్థలం తగ్గిపోతుందనే కారణంతో అధికారులు ఇప్పటివరకు దానిని వినియోగంలోకి తీసుకురాలేదని తెలిపారు.ఈ సందర్భంగా వైసీపీ నాయకుడు అరికట్ల ఆంజనేయులు మాట్లాడుతూ, ఆసుపత్రి ఆవరణలో అనువైన ప్రదేశంలో వాటర్ ప్లాంట్ నిర్మాణం చేపడితే రోగులతో పాటు గ్రామ ప్రజలందరికీ స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి వస్తుందని అన్నారు. కోట్ల రూపాయల వ్యయంతో కొనుగోలు చేసిన పరికరాలు నిరుపయోగంగా పడి పాడైపోవడం కంటే ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని కోరారు.అధికారులు వెంటనే స్పందించి వాటర్ ప్లాంట్‌ను వాడుకలోకి తీసుకురావడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంచాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రస్తుతం మూలన పడివున్న ప్లాంట్‌ను సద్వినియోగం చేస్తే ప్రజారోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని వారు అభిప్రాయపడ్డారు.

## ఆ ఎంపీపీ సూపర్... అందుకే ఆయనకు ప్రజల్లో అంత పవర్..!

### క్షేత్రస్థాయి సమస్యలపై స్వయంగా స్పందిస్తున్న ఎంపీపీ బడుగు రమేష్‌బాబు

కొయ్యూరు, జూన్ 11 ప్రభాతవార్త :



క్షేత్రస్థాయి సమస్యలను సైతం తన సొంత సమస్యలుగా భావించి, స్పందిస్తున్న కొయ్యూరు ఎంపీపీ బడుగు రమేష్ బాబు తీరుపై ప్రజలు సానుకూలంగా స్పందిస్తూ, ఆయన సూపర్, అందుకే ఆయనకు ప్రజల్లో అంత పవర్ అంటూ కొనియాడుతున్నారు.గ్రామాల్లో జరుగుతున్న చిన్న చిన్న సమస్యలను వివాదాస్పదంగా చూడకుండా తన దృష్టికి తీసుకువస్తే ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని గురువారం ఎం. మాకవరం గ్రామంలో నివాస గృహాల విషయంలో జరుగుతున్న సమస్యలను స్వయంగా పరిశీలించిన కొయ్యూరు ఎంపీపీ బడుగు రమేష్ బాబు అభిప్రాయ వ్యక్తం చేయడంపై స్థానికులు హర్షిస్తున్నారు. కొయ్యూరు మండల ఎంపీపీ బడుగు రమేష్ బాబు ప్రజల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉంటూ స్పందిస్తున్నారు. ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న చింతలపూడి ఎంపీటీసీ పొడుగు రత్నంను పరామర్శించిన ఆయన, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని మెరుగైన చికిత్స కోసం అవసరమైన సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.అలాగే ఎం. మాకవరం గ్రామంలో నివాస గృహాలకు సంబంధించిన సమస్యలు ఉన్నాయని తెలుసుకున్న ఎంపీపీ స్వయంగా గ్రామాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. గ్రామాల్లో తలెత్తే చిన్నచిన్న సమస్యలను వివాదాస్పదంగా మార్చకుండా తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన భరోసానిచ్చారు.ప్రజల నుంచి వచ్చే వినతులను విని స్పందించడం, సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు గ్రామాలను సందర్శించడం ద్వారా ఎంపీపీ బడుగు రమేష్ బాబు స్థానిక ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజాప్రతినిధిగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు పేర్కొన్నారు. ఇటువంటి ప్రజాప్రతినిధి పార్టీలకతీతంగా అన్ని రాజకీయ పార్టీలలో ఉండాలని స్థానిక ప్రజల అభిప్రాయపడుతున్నారు.

## గంజాయి, మత్తుపదార్థాల నిర్మూలనకు చర్యలు : ఎస్పీ

పాడేరు,జూన్11,ప్రభాతవార్త:



గంజాయి, మత్తుపదార్థాల నిర్మూలనకు కట్టుది ట్టమైన చర్యలు, మహిళలపై నేరాలు, రోడ్డు భద్రత ,సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించా లని జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ అమిత్‌బర్దర్ అధ్యక్షతన పాడేరు జిల్లా పోలీసు కార్యాల య కాన్ఫరెన్స్ హాల్‌లో మంత్లీ క్రైమ్ రివ్యూ సమావేశం గురువారం నిర్వహించారు.ఈ సమావేశంలో పెండింగ్ కేసులు, దర్యాప్తుల పురోగతి, మహిళలపై నేరాలు, మాదకద్రవ్యాల నియంత్రణ, సైబర్ నేరాలు, శాంతిభద్రతలు, రోడ్డు భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, శిక్షల సాధన, పోలీసింగ్‌లో సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై సమగ్ర సమీక్ష ఎస్పీ నిర్వహించారు.గంజాయి మరియు ఇతర మత్తుపదార్థాల సాగు, రవాణా, విక్రయాలు, వినియోగాన్ని అరికట్టేందుకు కఠిన చర్యలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. డ్రగ్ డిటెక్షన్ కిట్లను సమర్థవంతంగా వినియోగిస్తూ, డ్రోన్లు, సీసీ కెమెరాలు మరియు ఇతర ఆధునిక సాంకేతిక పరికరాల ద్వారా నిఘాను మరింత పటిష్టం చేయాలని ఆయన సూచించారు.మహిళలపై జరిగే నేరాల నివారణ, బాధితులకు తక్షణ సహాయం, కేసుల సత్వర దర్యాప్తు ,నేరస్థులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, గ్రామాలు మరియు గిరిజన ప్రాంతాల్లో క్రింది అంశాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు:మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, మాదకద్రవ్యాల దుష్పరిణామాలు, బాలికల రక్షణ, శక్తి యాప్ వినియోగం, రోడ్డు భద్రత,ట్రాఫిక్ నిబంధనలు,జిల్లాలో రోడ్డు ప్రమాదాల పరిస్థితినిఎస్పీ సమీక్షించారు. ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాలను గుర్తించడం, ట్రాఫిక్ తనిఖీలు నిర్వహించడం, హెల్మెట్ మరియు సీటుబెల్ట్ వినియోగాన్ని ప్రోత్సహించడం, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలన్నారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించడం లేదా బాధితులకు న్యాయం అందించడంలో అలసత్వం ప్రదర్శించడం సహించబోమని, అటువంటి అధికారులపై కఠిన శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. సమావేశంలో అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, ఈగల్ బృందం అధికారులు మరియు జిల్లా పోలీసు శాఖ అధికారులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య సమరయోధుడు మాగ కీర్సానీ విగ్రహ ఏర్పాటుకు వినతి

### కీర్సానీ శిలాఫలకం వద్ద జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ పీవో సంద

### స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియంలో మాగ కీర్సానీ విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తానన్న జేసి

### ముంచంగిపుట్టు మండల కేంద్రంలో జరిగిన పిజిఆర్ఎస్‌లో మాగ వారసులు విజ్ఞప్తి

ముంచంగిపుట్టు, జూన్ 11 (ప్రభాతవార్త):



భారత స్వాతంత్ర్య సమరయోధుడు మాగ కీర్సానీ విగ్రహం ఏర్పాటుకు కృషి చేయాలని అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ కు వినతి పత్రాన్ని సమర్పించినట్లు మాగ కీర్సానీ వారసులు కిరసాని రామదాసు, కిరాసాని జీనబంధు కిరాసాని లైకొన్, కిరసాని పద్మనాభం తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం మాగ వారసుడు లైకోన్ మాట్లాడుతూ.. తమ తాతయ్య మాగ కీర్సానీ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని బ్రిటిషర్ల దురాగతలపై తిరుగుబాటు చేయడంతో అనేక మార్లు జైలు జీవితం గడిపారన్నారు. 1920 దశకంలో గిరిజన ప్రాంతంలో భారత స్వాతంత్ర వీరులు అల్లూరి సీతారామరాజు, మల్లుదొర్ర, గంటందొర, మర్రి కామయ్య వంటి వీరులతో కలిసి బ్రిటిష్ వారిపై పోరాటం చేశారన్నారు. 1922 లో అల్లూరి సీతారామరాజు ఆధ్వర్యంలో చింతపల్లి పోలీస్ స్టేషన్ పై జరిగిన దాడుల్లో పాల్గొన దళంలో మాగ కీర్సానీ కూడ ఒకరని తెలిపారు. నాటి నుండి పోలీసులు ఆయనపై ముమ్మరంగా గాలించడంతో కొండల్లోనీ గుహలలో తలదాచుకునే వారనీ తెలిపారు. ఈ క్రమంలో ఆంధ్ర ఒడిస్సా సరిహద్దు గ్రామమైన వల్లాయిబీరులో మాగ కీర్సానీ దాగి ఉన్నా తరుణంలో బ్రిటిష్ పోలీసులు ఆయనను బంధించి జైలుకు తరలించారన్నారు. నాటి తమ స్వగ్రామం ముంచంగిపుట్టు మండలంలోని అల్లంగిపడ నుండి కుటుంబం మొత్తం చెల్లాచెదురు అయినట్లు ఆయన తెలిపారు. మాగ కీర్సానీ జైలు పాలు కావడంతో కుటుంబానికి లబ్బూరు గ్రామంలో గల బంధువులు చేరదీశారని, నాటి నుండి నేటి వరకు లబ్బూరు గ్రామంలోనే తాము స్థిర నివాసం ఉంటున్నట్లు లైకోన్ పేర్కొన్నారు. తమ తాతయ్య మాగ కీర్సానీ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనడంతో స్వాతంత్ర్య అనంతరం 1970 దశకంలో ఆయన పేరిట ఓ శిలాఫలకాని ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. అప్పటి నుండి నేటి వరకు కూడా స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబముగా తమను ప్రభుత్వం గుర్తించలేదని, ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లా లంబసింగిలో ఏర్పాటు చేస్తున్న స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియంలో మాగ కీర్సానీ విగ్రహం ఏర్పాటుకు ప్రభుత్వం చొరవ చూపలన్నారు. గతంలో కూడా అల్లూరి జిల్లా కలెక్టర్ కు మాగ కీర్సానీ విగ్రహం ఏర్పాటుకు వినతి పత్రాన్ని సమర్పించమన్నారు. ఈ నేపథ్యంలోనే బుధవారం జరిగిన పిజిఆర్ఎస్ లో వినతి పత్రానీ జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ కు సమర్పించినట్లు లైకోన్ తెలిపారు. సదరు విషయమై జిల్లా జాయింట్ కలెక్టర్, పాడేరు ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి ఆదిత్య వర్మ మాగ కీర్సానీ యొక్క శిలాఫలకాని సందర్శించి పరిశీలించారు. ముంచంగిపుట్టు మండల కేంద్రంతో పాటు, లంబసింగిలో విగ్రహము ఏర్పాటుకు కృషి చేస్తామని జాయింట్ కలెక్టర్ హామీ ఇచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబానికి ప్రభుత్వం గుర్తించాలని, స్వాతంత్ర్య సమర యోధులకు ప్రభుత్వం ఇచ్చే బెనిపిట్స్ కల్పించాలని ప్రభుత్వాని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. కార్యక్రమంలో ముంచంగిపుట్టు టీడీపీ మండల అధ్యక్షురాలు కిల్లో సన్యాసమ్మ సంధ్య, టిడిపి మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు,టీడీపీ మండల కార్యదర్శి జగత్ రాయ్, వైసిపి నేత దశరథ్, బాబుజీ, రాంబాబు , తదితరులు పాల్గొన్నారు.

## "చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు" నిరసన ర్యాలీకి వైసీపీ పిలుపు

గూడెం కొత్తవీధి,జూన్ 11 (ప్రభాతవార్త):




కూటమి ప్రభుత్వం చంద్రబాబు నాయుడు 2024 ఎన్నికల మ్యానిఫెస్టో లో అనేక హామీలు గుప్పించి, అధికారంలోకి వచ్చి ఏ హామీ కూడా సక్రమంగా అమలు చేసిన పరిస్థితి లేదు. రాష్ట్రం లో ఉన్న ప్రతీ రైతు కు రైతు భరోసా క్రింద ఒక ఏడాదికి ఇస్తానన్న 20,000 ఎక్కడ ఇచ్చారు? రెండేళ్ల లో 6 ఉచిత గ్యాస్ కనెక్షన్లు ఎవరికీ ఇచ్చారు?ఆడబిడ్డ నిధి పథకం కింద రాష్ట్రంలో ప్రతీ మహిళ కు నెలకు 1500 చొప్పున రెండేళ్ల కు గాను 36000 ఎక్కడ? రాష్ట్రంలో చదువు తున్న ప్రతీ విద్యార్థికి తల్లికి వందనం పథకం ద్వారా 15000 ఎక్కడ? గ్రామ వాలంటీర్ లకు ప్రభుత్వం అధికారం లోకి వచ్చాకా 10000 ఇస్తాను అని చెప్పి, అధికారం చేతిలోకి వచ్చాకా "నీ వెన్నుపోటు తనం "ఏకంగా వాలంటీర్ ఉద్యోగాన్నే తీసేసావు.20 లక్షలు మంది యువత కు ఉద్యోగం,ఉపాధి అన్నావు మీకు,మీ అబ్బాయి లోకేష్,మీ దత్త పుత్రుడు పవన్ కి మంత్రి పదవులు ద్వారా ఉద్యోగం,ఉపాధి వచ్చింది తప్పితే ప్రజలకు, యువత కు ఎవరికీ వచ్చింది ఉపాధి.నేను అధికారం లో కి వస్తే సంపద సృష్టి స్తా అన్నావ్. ఎవరికీ సంపద సృష్టించావ్ బాబు,మీ పార్టీ నాయకులు సంపద సృష్టించావు తప్ప ప్రజలు సంపద సృష్టించావా? అధికారం లోకి వస్తే డీజిల్,పెట్రోల్, నిత్యావసర ధరలు తగ్గిస్తాను అన్నావు. ఎక్కడ తగ్గించారు బాబు ? చంద్రబాబు నాయుడు మోసపు,అబద్ధాల ప్రభుత్వం పోయి,2029 లో జగన్ అన్నను రెండోసారి ముఖ్య మంత్రి ని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది. కాబట్టి ప్రతీ ఒక కార్యకర్త పెద్ద ఎత్తున అన్నీ వర్గాల ప్రజల అందరి సహకారం తో రేపు "చంద్రబాబు వెన్నుపోటుకి రెండేళ్లు" పూర్తి అవుతున్న సందర్భంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో పాడేరు శాసన సభ్యులు,అల్లూరి జిల్లా అధ్యక్షులు మత్స్య రాస విశ్వేశ్వర రాజు ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 11:00 గంటలకు ,"చంద్రబాబు వెన్నుపోటు కు రెండేళ్లు " నిరసన ర్యాలీ కార్యక్రమానికి పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు కంకిపాటి గిరిబాబు, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు కంకిపాటి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల సమాచారం

## రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

### - శ్రీవారి సేవలో గవర్నర్ అబ్దుల్ నజీర్



**తిరుమల,జూన్ 11ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని గురువారం ఉదయం రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ దర్శించుకున్నారు. ఉదయం ఆయన ఆలయం వద్దకు చేరుకోగానే టిటిడి ఇఒ రవిచంద్ర, అదనపు ఇఒ వెంకయ్య చౌదరి, డిప్యూటీ ఇఒ లోకనాథం, సివిఎస్ఒ మురళీకృష్ణ అర్చక బృందం సంప్రదాయ ఇస్తికఫాల్‌తో స్వాగతం పలికారు. ఆలయంలోపల తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించారు. శ్రీవారిని దర్శించుకుని కానుకలు సమర్పించారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో గవర్నర్ అబ్దుల్ నజీర్‌కి వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఇఒ, అదనపు ఇఒ స్వామివారి తీర్థప్రసాదాలు, శ్రీవారి చిత్రపటం అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇఒలు లోకనాథం, భాస్కర్, విఎస్ఒ సురేంద్ర, గిరిధర్ పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వానికి శ్రీవారి ఆశీస్సులుండాలి: మంత్రి శ్రీనివాస్



**తిరుమల,జూన్ 11ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రాభివృద్ధికి, కూటమి ప్రభుత్వానికి ఏడుకొండల వేంకటేశ్వర స్వామి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, కూటమి ప్రభుత్వానికి రెండేళ్లుగా మద్దతుగా నిలిచిన రాష్ట్ర ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్. కూటమి పాలన విజయవంతంగా రెండేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో అలిపిరి మెట్లమార్గం ద్వారా తిరుమల శ్రీవారి దర్శనానికి విచ్చేసినట్లు ఆయన తెలిపారు. గురువారం సాయంత్రం తిరుపతి అలిపిరి నుండి కాలినడకన తిరుమలకు బయలు దేరి వెళ్ళారు. రాష్ట్ర ప్రజల శ్రేయస్సును, రాష్ట్రాభివృద్ధిని కాంక్షిస్తూ కాలినడక యాత్ర చేస్తున్నట్లు తెలిపారు. రెండేళ్లలో శ్రీవారి ఆశీస్సులతో ప్రజలకు ఎంతో మంచి జరిగిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని మరింతగా అభివృద్ధి చేసేలా ఆయనకు మరింత శక్తి నివ్వాలని శ్రీవారిని వేడుకున్నారు. భవిష్యత్తులోనూ రాష్ట్ర ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేలా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో ముందుకు వెళతామని మంత్రి తెలిపారు.

## జూన్ 26నుండి శ్రీవారి జ్యేష్టాభిషేకం



**తిరుమల,జూన్ 11ప్రభాతవార్తప్రతినిధి:** నిత్యకల్యాణంపచ్చతోరణంగా విరాజిల్లుతున్న కలియుగ వైకుంఠం తిరుమలలో కొలువైన వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులు అరిగిపోకుండా పరిరక్షణకు మూడురోజులపాటు జ్యేష్టాభిషేకాలు నిర్వహిస్తారు. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతి ఏడాది జూన్‌మాసంలో జ్యేష్టా నక్షత్రానికి ముగిసేలా జరిపించే ఈ జ్యేష్టాభిషేకాల్లో ఉత్సవమూర్తులకు ఉన్న బంగారు కవచాలు తొలగించి రోజుకో కవచం ధరింపజేస్తారు. మళ్ళీ మూడవరోజు బంగారుకవచంలోనే ఉత్సవమూర్తులను అలంకరింపజేసి ఏడాది పూర్తిగా అలాగే ఉంచుతారు. దేవదేవుడు శ్రీవేంకటేశ్వరస్వామికి ప్రతిరోజూ ఎన్నో రకాల సేవలు, కైంకర్యాలు నిర్వహిస్తారు. వీటివల్ల ఉత్సవమూర్తులు అరిగిపోకుండా జాగ్రత్తలు తీసుకునేందుకు వైఖానస ఆగమోక్తంగా జ్యేష్టాభిషేకాలు జరిపిస్తారు. సంపంగి ప్రాకారంలోని కల్యాణోత్సవ మండపంలో జరిగే ఈ ఉత్సవాల్లో తొలిరోజు జూన్ 26వతేదీ శుక్రవారం రుత్వికులు శాంతి హోమం నిర్వహిస్తారు. హోమాలు, అభిషేకాలు, శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామికి పంచామృత స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఉత్సవమూర్తులకు వజ్రకవచం అలంకరిస్తారు. ఆలయ మాఢవీధుల్లో ఊరేగిస్తారు. రెండవరోజు యధావిధిగా కైంకర్యాలు నిర్వహించి ఉత్సవమూర్తులకు ముత్యాలకవచం ధరింపజేస్తారు. చివరగా మూడవరోజు జూన్ 28వతేదీ ఆదివారం విశేష పూజలు, అభిషేకాలు జరిపించి మళ్ళీ బంగారుకవచం ధరింపజేస్తారు. బంగారుకవచంలోనే ఏడాదంతా విశేష పూజలు, ఉత్సవాలు జరిపించుకుంటారు. ఇప్పటికే జూన్‌నెలలో జరిగే ఈ మూడురోజుల జ్యేష్టాభిషేకాలకు ఆన్‌లైన్‌లో సేవా టిక్కెట్లు విడుదల చేశారు.

## శ్రీవారి వైద్యసేవ నిపుణులకు చక్కటి వసతి

### - టిటిడి జెఇఒ డాక్టర్ శరత్



**తిరుమల,జూన్ 11ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని అన్ని ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలందించేందుకు వస్తున్న శ్రీవారివైద్యసేవ నిపుణులకు చక్కటి వసతి కల్పించాలని టిటిడి జెఇఒ డాక్టర్ ఎ.శరత్ అధికారులకు ఆదేశాలిచ్చారు. శ్రీవారి వైద్య సేవ నిపుణుల కోసం కేటాయించిన అతిథి గృహాల్లో మౌలిక సదుపాయాల ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. గురువారం సాయంత్రం సంబంధిత అధికారులతో కలిసి వసతి కేంద్రాలను జెఈఒ పరిశీలించారు. ఈ నెల 17వ తేదీ తొలి విడత వైద్య నిపుణులు రానున్న నేపథ్యంలో వశిష్ఠ అతిథి గృహం, ఆయుర్వేద కళాశాల అతిథి గృహం, స్విమ్స్ అతిథి గృహాల్లో అవసరమైన అన్ని సౌకర్యాలు సిద్ధంగా ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వైద్యులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా భక్తులకు సేవలందించే విధంగా వసతి గృహాల్లో పరిశుభ్రత, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం తదితర మౌలిక వసతులను సమృద్ధిగా కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఎస్ఇలు మనోహరం, వేంకటేశ్వర్లు, ముఖ్య వైద్యాధికారి డాక్టర్ కుసుమ కుమారి, ఎస్వీ గోశాల డైరెక్టర్ డాక్టర్ ఏవిఎన్ శివకుమార్, బర్డ్ సూపరింటెండెంట్ వెంకట రెడ్డి, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, పిఆర్ఒ నీలిమ, టిటిడి, స్విమ్స్ అధికారులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో ఎపి గళాన్ని బలంగా వినిపిస్తాం

### బిసి యువతకు పెద్దపీట వేయడం చారిత్రాత్మకం: చింతకాయల విజయ్



**అనకాపల్లి, జూన్ 11 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ నుంచి రాజ్యసభకు ఎన్‌డియే కూటమి తరఫున నామినేషన్లు వేసిన నలుగురు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి అధికారికంగా ప్రకటించి వారికి ఎన్నికల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. టిడిపి నుంచి సానా సతీష్, భాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్, అలాగే జనసేన నుంచి లింగమనేని రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చింతకాయల విజయ్ మీడియాతో మాట్లాడుతూ, తమపై నమ్మకంతో ఈ అవకాశం కల్పించిన టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావులకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఎన్టీఆర్ సిద్ధాంతాలను కొనసాగిస్తూ, బిసి యువతకు, పార్టీ కోసం కష్టపడిన వారికి మెరిట్ ప్రాతిపదికన అత్యున్నత చట్టసభల్లో స్థానాలు కల్పించడం చారిత్రాత్మక నిర్ణయమని ఆయన కొనియాడారు. పార్టీ ఆదేశాల మేరకు ఢిల్లీలోని పెద్దల సభలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గళాన్ని బలంగా వినిపిస్తామని, రాష్ట్రానికి అవసరమైన మద్దతు కూడగట్టేలా పని చేస్తామని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడిన విజయ్.

# ఎఫ్‌సివి పొగాకు కొనుగోళ్లలో గణనీయమైన పురోగతి : మంత్రి అచ్చెన్నాయుడు

**సచివాలయం,జూన్ 11,ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్‌లో ఎఫ్‌సివి పొగాకు వేలం ప్రక్రియ గత 10రోజులుగా మెరుగుదల సంకేతాలను చూపుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. కొనుగోలుదారుల భాగస్వామ్యం పెరగడం, మార్కెట్‌లో లిక్విడిటీ మెరుగుపడడం, వేలం కేంద్రాల్లో తిరస్కరణలు గణనీయంగా తగ్గడం సానుకూల పరిణామాలని ఆయన పేర్కొన్నారు. పొగాకు కొనుగోళ్ళ పరిస్థితిపై గురువారం సహచర మంత్రులు గొట్టిపాటి రవికుమార్, ఆనం రామనారాయణరెడ్డి, డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, అలాగే పొగాకు పండించే జిల్లాల ప్రజాప్రతినిధులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడారు. జూన్ 11 నాటికి టుబాకో బోర్డు ఆధ్వర్యంలోని వేలం వేదికల ద్వారా మొత్తం15.65మిలియన్ కిలోగ్రాముల ఎఫ్‌సివి పొగాకు మార్కెటింగ్ జరిగిందని తెలిపారు. రాష్ట్రంలోని 16వేలం కేంద్రాలకు ప్రస్తుతం రోజుకు సుమారు 8000బేళ్ళ పొగాకు వస్తుండటంతో మార్కెటింగ్ ప్రక్రియ సజావుగా సాగడమే కాకుండా కొనుగోలుదారులు పాల్గొనడం కూడా మెరుగుపడిందన్నారు. ఇటీవల కాలంలో అత్యంత ముఖ్యమైన పరిణామం తిరస్కరణలు "నోబిడ్" స్థాయిలు గణనీయంగా తగ్గడమేనని మంత్రి తెలిపారు. గతంలో 30 నుంచి 37శాతం మధ్య ఉన్న తిరస్కరణల శాతం ప్రస్తుతం సుమారు 20శాతానికి తగ్గిందని చెప్పారు. ఇది మార్కెట్‌లో పొగాకుకు మెరుగైన ఆదరణ లభిస్తుందనే విషయాన్ని సూచిస్తుందని, అలాగే వ్యాపార అవసరాలకు అనుగుణంగా పొగాకు సరఫరా జరుగుతోందని పేర్కొన్నారు. ప్రస్తుతం నెలకొన్న మార్కెట్ పరిస్థితులపై సమగ్ర అవగాహన కోసం టుబాకో బోర్డు అన్ని వర్గాల భాగస్వాములతో నిరంతరం సంప్రదింపులు జరుపుతుందన్నారు. ఈ నేపథ్యంలో జూన్ 8న వ్యాపార వర్గాలు, ఎగుమతిదారులు, కొనుగోలుదారులు, రైతు ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలు, సమస్యలను తెలుసుకొని మార్కెట్‌లో లిక్విడిటీ పెంచేందుకు ఆచరణాత్మక వ్యూహాలపై చర్చించామని తెలిపారు. పొగాకు రైతుల ప్రయోజనాల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం, టుబాకో బోర్డు పూర్తిస్థాయిలో కట్టుబడి ఉన్నాయని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టంచేశారు. రైతులు, వ్యాపార వర్గాలు,

కొనుగోలుదారుల సహకారం కొనసాగడంతో పాటు టుబాకో బోర్డు చేపడుతున్న చర్యల ఫలితంగా రానున్న వారాల్లో మార్కెట్‌లో లిక్విడిటి మరింత మెరుగుపడి కొనుగోలు, మార్కెటింగ్ కార్యకలాపాలు మరింత వేగవంతమవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## రాష్ట్ర పునర్నిర్మాణానికి రెండేళ్లలోనే బలమైన పునాది: మంత్రి అనగాని

**తిరుపతి,జూన్ 11ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం సాధించిన విజయాలు, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలు తీరు, రాష్ట్ర పునర్నిర్మాణ దిశగా చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు శుక్రవారం తిరుపతిలో విజయోత్సవ సభను పండుగ వాతావరణంలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ స్టాంపుల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. గురువారం సాయంత్రం తిరుపతి జిల్లా దామినేడు సమీపంలో జరగనున్న రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం కార్యక్రమంకు సంబంధించి ఏర్పాట్లను పరిశీలించారు. రాష్ట్ర విభజన అనంతరం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్న ఆంధ్రప్రదేశ్, గత ప్రభుత్వ పాలనలో అనేక రంగాల్లో వెనుకబడిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అయితే 2024 ఎన్నికల్లో ప్రజలు కూటమి ప్రభుత్వంపై ఉంచిన విశ్వాసానికి అనుగుణంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు.

ఎన్నికల సమయంలో ప్రకటించిన సూపర్ సిక్స్ హామీల అమలుతో పాటు ప్రమాణ స్వీకారం అనంతరం చేసిన కీలక నిర్ణయాలను ప్రభుత్వం క్షేత్రస్థాయిలో విజయవంతంగా అమలు చేసిందన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో నిర్వహించిన మెగా డీఎస్సీ నియామక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరిగిందని తెలిపారు. ఎటువంటి అవకతవకలకు తావులేకుండా నిర్వహించిన ఈ నియామక ప్రక్రియ రాష్ట్ర ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమన్నారు. రాష్ట్రానికి భారీ స్థాయిలో పెట్టుబడులు ఆకర్షించడంలో ప్రభుత్వం విజయవంతమైందని, దేశవ్యాప్తంగా వచ్చిన పెట్టుబడుల్లో గణనీయమైన వాటా ఆంధ్రప్రదేశ్‌కు రావడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. అలాగే అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, భూముల హక్కులను రక్షించే చర్యలు, సంక్షేమం మరియు అభివృద్ధి కార్యక్రమాల అమలు ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని వివరించారు రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేస్తూ స్థిరమైన అభివృద్ధి దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు.

కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ "కంట్రీ ఫస్ట్" సిద్ధాంతంతో పనిచేస్తుండగా, రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ "స్టేట్ ఫస్ట్" లక్ష్యంతో ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని మంత్రి తెలిపారు.

రాష్ట్ర పునర్వైభవం, తెలుగు జాతి గౌరవ ప్రతిష్టతను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని, ఈ రెండేళ్ల విజయాలను ప్రజలతో పంచుకునేందుకు నిర్వహిస్తున్న విజయోత్సవ సభను

# భూ వివాదంలో వ్యక్తి దారుణ హత్య


### పదునైన ఆయుధాలతో నరికి చంపిన దుండగులు

### కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు

**పుల్లల చెరువు, జూన్ 11 ప్రభాతవార్త :** పుల్లలచెరువు మండలం శతకోడు గ్రామ సమీపంలో భూ వివాదం ఓ వ్యక్తి ప్రాణాన్ని బలిగొంది. భూముల కొనుగోలు, అమ్మకాలు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన విభేదాల నేపథ్యంలో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారిని ప్రత్యర్థులు అత్యంత దారుణంగా హత్య చేసిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఈ సంఘటనతో శతకోడు గ్రామం ఒక్కసారిగా ఉలిక్కిపడగా, మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు విషాదంలో మునిగిపోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఒడ్డేశ్వరం గ్రామంలోని రాధారంగనగర్‌లో ఉన్న ఎంసీఏఆర్‌కేఏ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న మొలబంటి రవికుమార్ అలియాస్ బుల్లెబ్బాయి (52) రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహిస్తూ ఉండేవాడు. భూముల కొనుగోలు, అమ్మకాలకు సంబంధించిన వ్యవహారాల్లో శతకోడు గ్రామానికి చెందిన కొందరితో ఆయనకు పరిచయాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో భూముల లావాదేవీలు, ఆర్థిక విషయాలపై తలెత్తిన విభేదాల నేపథ్యంలో బుధవారం రవికుమార్‌ను శతకోడు గ్రామానికి పిలిపించినట్లు సమాచారం. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల మధ్య వ్యవసాయ భూముల ప్రాంతంలో ఈ ఘటన జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. అక్కడకు వెళ్లిన రవికుమార్‌పై దుండగులు పదునైన ఆయుధాలతో విచక్షణారహితంగా దాడి చేసి హత్య చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. గురువారం తెల్లవారుజామున 1.30 గంటల సమయంలో మృతుడి అన్న మొలబంటి ఉమామహేశ్వరరావు (63), దుగ్గిరాల మండలం పెద్దకొండూరు గ్రామానికి చెందిన వ్యక్తి, పుల్లలచెరువు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన తమ్ముడు రవికుమార్‌ను శతకోడు గ్రామానికి చెందిన వరికూటి చినపోలిరెడ్డి మరియు అతని సహచరులు భూముల కొనుగోలు, అమ్మకాల, లావాదేవీల విషయంలో పిలిపించి హత్య చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఘటన విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా రవికుమార్ మృతదేహం రక్తపు మడుగులో పడి ఉండటం చూసి కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహంపై మెడ కుడివైపు, తల వెనుక భాగంలో తీవ్ర గాయాలు ఉండటంతో దుండగులు అత్యంత క్రూరంగా దాడి చేసినట్లు తెలుస్తోంది. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం యర్రగొండపాలెం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి అన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు పుల్లలచెరువు ఎస్ఐ సాంబశివరావు కేసు నమోదు చేశారు. యర్రగొండపాలెం సీఐ కె అజయ్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు. హత్యకు గల ఖచ్చితమైన కారణాలపై పోలీసులు వివిధ కోణాల్లో విచారణ జరుపుతున్నారు. భూముల లావాదేవీలు, ఆర్థిక వ్యవహారాలు, వ్యక్తిగత విభేదాలు వంటి అంశాలను పరిశీలిస్తూ నిందితుల కోసం గాలింపు.

# పేదల పాలిట సిఎంఆర్ఎఫ్ సంజీవిని: మంత్రి నారాయణ

### - సిటీ నియోజకవర్గంలో రెండేళ్లలో 4 కోట్ల భారీ సాయం



**నెల్లూరు, జూన్ 11, ప్రభాతవార్త** - వైద్యం ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సీఎం సహాయనిధి ద్వారా పేదలకు ముఖ్యమంత్రి నిధులు మంజూరు చేస్తున్నారని, సీఎంఆర్‌ఎఫ్ అనేది పేదల పాలిట సంజీవినిగా పనిచేస్తోందని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పేర్కొన్నారు. నెల్లూరు సిటీ నియోజకవర్గంలోని 49 మంది లబ్ధిదారులకు 32,17,600 విలువైన సీఎం సహాయనిధి చెక్కులను మంత్రి నారాయణ చేతులమీదుగా క్యాంపు కార్యాలయంలో గురువారం పంపిణీ చేశారు. గత రెండేళ్ల కాలంలో నియోజకవర్గంలో 433 మందికి 4,04,98,692 విలువైన చెక్కులను అందజేసి ఆదుకున్నామని మంత్రి వెల్లడించారు. పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందించడమే లక్ష్యంగా తాము ప్రారంభించిన నారాయణ నేత్రజ్యోతి, దంత సురక్ష ద్వారా కేవలం 4 నెలల్లోనే 10 వేల మందికి వైద్య పరీక్షలు చేసి, ఐదు వేల మందికి ఉచితంగా కంటి అద్దాలు, మరో ఐదు వేల మందికి దంత పరీక్షలు నిర్వహించామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధికి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను డిసెంబర్ కల్లా వంద శాతం పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్ళపాక అనూరాధ, మాజీ జెడ్పీటీసీ విజేతా రెడ్డి, టీడీపీ నగర పార్టీ అధ్యక్షులు మామిడాల మధు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు :కలెక్టర్ లక్ష్మీశా



విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ లక్ష్మీశా

**విజయవాడ, జూన్ 11, ప్రభాతవార్త :** ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధిస్తున్నారని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా పేర్కొన్నారు. విజయవాడలోని కలెక్టర్ కార్యాలయంలో గురువారం ఉదయం విద్యాశాఖ ఏర్పాటు చేసిన ఎక్స్‌పోను కలెక్టర్ ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని మౌలికవసతులు, విద్యాబోధన, సాధించిన ఫలితాలు, నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం ఆధారిత అభ్యాసానికి ప్రాధాన్యత తదితర అంశాలను తల్లిదండ్రులకు తెలియచేసి వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చేలా ప్రోత్సహించేందుకు ఎక్స్‌పోలు నిర్వహిస్తున్నామన్నారు. గత ఏడాది పదవ తరగతి ఫలితాల్లో జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదివిన 31 మంది విద్యార్థినీవిద్యార్థులు 580కి పైగా మార్కులు సాధించారని గుర్తుచేసారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని ఇందుకు గత ఏడాది ఫలితాలే ఉదాహరణగా పేర్కొన్నారు. ఈసందర్భంగా విద్యార్థులకు స్కూల్ యూనిఫాం, బ్యాగులను కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేసారు. ఈకార్యక్రమంలో డిఈఓ ఎల్.చంద్రకళ, అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఆర్.రమేష్‌బాబు, డిప్యూటి డిఈఓలు డి.సాంబశివరావు, జి.గుర్నాథం, ఏ.శ్యాంసుందర్, తదితరులు పాల్గొన్నారు.

**అకస్మాత్తు వర్షాలకు అప్రమత్తంగా ఉండాలి :** జిల్లాలో అకస్మాత్తుగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా సూచించారు. విజయవాడ నగరపాలకసంస్థ, ఇతర మున్సిపాలిటీలు, పంచాయతీలు డ్రైనేజిలు శుభ్రం చేయించి వర్షపునీరు నిలువ కుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపకశాఖ, విద్యుత్, ఆర్అండ్‌బి తదితరశాఖల అధికారులు, సిబ్బంది అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో స్థానిక అధికారులకు తెలియచేయాలని లేదా కలెక్టర్ కార్యాలయంలోని సెల్ 9154970454 కు ఫోన్‌చేయాలని సూచించారు. వర్షాలకు ప్రాణ, ఆస్తినష్టం నివారించేందుకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు.

## విద్యార్థులకు విద్యతోపాటు నైతిక విలువలు నేర్పించాలి : మంత్రి డోలా

**విజయవాడ, జూన్ 11, ప్రభాతవార్త :** విద్యార్థినీవిద్యార్థులకు విద్యతోపాటు నైతిక విలువలు, సామాజిక విలువలు నేర్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని రాష్ట్ర సాంఘీక సంక్షేమశాఖా మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయులు అన్నారు. విజయవాడ విఆర్.సిద్దార్థ కళాశాలలో గురువారం అంబేద్కర్ గురుకులాల డిసీవోలు, ప్రిన్సిపాళ్ళు, డీడీలకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ పేదలు విద్యద్వారా సాధికారత సాధించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేదవిద్యార్థుల సంక్షేమానికి ఇతోధికంగా నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. కార్పోరేట్ పాఠశాలలకు ధీటుగా అంబేద్కర్ గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్యాబోధన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలని సూచించారు. వందరోజుల యాక్షన్‌ప్లాన్, ముస్తాబు కార్యక్రమాన్ని ప్రతి పాఠశాలలో ఖచ్చితంగా అమలు చేయాలని మంత్రి ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక శ్రద్దపెట్టాలన్నారు. విద్యార్థులకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. ఐఐటి, నీట్‌లో ఎక్కువ మంది విద్యార్థులు ర్యాంకులు సాధించేలా కృషిచేయాలని ఉపాధ్యాయులను కోరారు. గురుకులాలు, సంక్షేమహాస్టళ్ళ నిర్వహణ పట్ల తల్లిదండ్రులు వందశాతం సంతృప్తి చెందేలా అందరూ సమిష్టిగా పనిచేయాలని మంత్రి డోలా సూచించారు.

## నౌకపై దాడి ఘటన.. మృతుల్లో విశాఖ వాసి

**విశాఖపట్నం, జూన్ 11 ప్రభాతవార్త:** ఒమన్ తీరంలో భారతీయులున్న నౌకపై అమెరికా దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో చనిపోయిన ముగ్గురు భారతీయుల్లో విశాఖ వాసి కూడా ఉన్నట్లు ఢిల్లీలోని ఆంధ్రా భవన్ అధికారులు ధ్రువీకరించారు. మృతుడిని 44 ఏళ్ల మెరైన్ ఇంజినీర్ సురేశ్ పట్నాలగా గుర్తించారు. జూన్ 24న ఆయన వివాహ 15వ వార్షికోత్సవం ఉందని.. అంతలోనే ఈ ప్రమాదం జరిగిందని కుటుంబ సభ్యులు తెలిపారు. సురేశ్‌కు భార్య, ఇద్దరు కుమారులున్నారు.

## దుర్గమ్మవారి ఆలయంలో పారదర్శక డిజిటల్ సేవలు



ఆలయ ప్రాంగణంలో కియోస్క్ పరిశీలిస్తున్న ఇఓ

**ఇంద్రకీలాద్రి, జూన్ 11, ప్రభాతవార్త :** దుర్గమ్మవారి ఆలయంలో పారదర్శకంగా డిజిటల్ సేవలు, అత్యుత్తమ మర్యాదలతో కూడిన సౌకర్యాలు కల్పించడమే ధ్యేయంగా దేవస్థాన యంత్రాంగం పనిచేస్తుందని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. గురువారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దేవస్థానంలో ఒకే అధికారిక క్యూఆర్ కోడ్ వుంచాలని పాత బోర్డులన్నింటిని తొలగించాలని అధికారులను ఆదేశించారు. అలాగే దేవస్థానంలోని ప్రసాదం, ఇతర స్టాల్స్‌పై మైక్ ప్రచారం ద్వారా భక్తులకు తెలపాలన్నారు. దేవస్థానంలోని బస్సుల్లో నిరంతరం దుర్గమ్మవారి నామస్మరణ వుండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## రాష్ట్రంలో భారీ వర్షాలు నేడు కూడా పడే అవకాశం

**విజయవాడ,జూన్ 11,ప్రభాతవార్తప్రతినిధి:** నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో నైరుతి రుతుపవనాలు గురువారం ఆంధ్రప్రదేశ్‌లోని మరిన్ని ప్రాంతాలకు విస్తరించాయని, రాబోయే 23 రోజుల్లో అల్లూరి, మన్యం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని మరికొన్ని ప్రాంతాలకు విస్తరించేందుకు అనుకూల వాతావరణ పరిస్థితులు ఉన్నాయని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. నేటి సాయంత్రం 5 గంటల నాటికి గుంటూరు జిల్లా వంగిపురంలో 27.5మిమీ, చిత్తూరు జిల్లా గంగవరంలో 23.5, పలమనేరులో 23.2, మార్కాపురం జిల్లా గొట్లగట్టులో 15.7 మిమీ వర్షపాతం రికార్డైందన్నారు. గడిచిన 24 గంటల్లో (10.06.2026 ఉదయం 8.30 గంటల నుండి 11.06.2026 ఉదయం 8.30 గంటల వరకు) రాష్ట్ర సగటు వర్షపాతం 8.8మిమీ నమోదైందని ప్రఖర్ జైన్ తెలిపారు. అత్యధికంగా ఎన్టీఆర్ జిల్లాలో 57.1 మి.మీ. వర్షపాతం, ఏలూరు జిల్లాలో 37 మి.మీ., బాపట్ల జిల్లాలో 34.9 మి.మీ., కృష్ణా జిల్లాలో 32.4 మి.మీ., గుంటూరు జిల్లాలో 30.3 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైందన్నారు. పశ్చిమమధ్య బంగాళాఖాతం, ఉత్తరాంధ్ర తీరప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని. దక్షిణ కోస్తాంధ్ర దాని పరిసర ప్రాంతాలపై మరో ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందన్నారు. శుక్రవారం పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. పోలవరం, అనకాపల్లి, కాకినాడ, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, రాయలసీమ జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

12-6Pg7exHMNWJQE.qxd:12-6Pg7exHMNWJQE.qxd 1/1/02 6:37 AM Page 1

12skl13:12skl13.qxd 11-06-2026 23:17 Page 1



## బొబ్బిలి జంక్షన్ .. ప్రమాదాలకు నిలయం



**రాజాం, జూన్ 11 ప్రభాతవార్త:**

రాజాం పట్టణంలో ట్రాఫిక్ సమస్య నిరంతరం వేధిస్తూ ఉంది. రహదారులు విస్తరణ చేపట్టినప్పటికీ వాహనాలు వినియోగం అధికమవుతున్న తరుణంలో ముఖ్య కూడళ్ళు వద్ద తరచూ ప్రమాదాలు జరిగే ఆస్కారాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా బొబ్బిలి కూడలి మీదుగా విశాఖపట్నం, సాలూరు, శ్రీకాకుళం వైపు ద్విచక్ర వాహనాలు నుంచి భారీ వాహనాలు నిత్యం ప్రయాణం సాగిస్తుంటాయి. ఇటువంటి కూడళ్ళు వద్ద ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ ప్రమాదాలు నివారణపై పోలీసు అధికారులు చొరవ చూపి ముఖ్య కూడళ్ళ వద్ద స్టాపర్లు పెట్టే విధంగా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## ఖరీఫ్‌కు సన్నద్ధం...రైతులకు విత్తనాలు పంపిణీ



**కంచిలి, జూన్ 11 ప్రభాతవార్త**

ఖరీఫ్ సీజన్‌కు రైతులు సన్నద్ధమవుతున్న సమయంలో మండలం అంపురం పంచాయతీలో గురువారం రైతులకు విత్తనాలు పంపిణీ కార్యక్రమం తెదేపా నాయకులు నిర్వహించారు. తెదేపా మండల పార్టీ అధ్యక్షులు మాదిన రామారావు చేతుల మీదుగా రైతులకు విత్తనాలను పంపిణీ చేసి సాగు పనులకు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా మాదిన రామారావు మాట్లాడుతూ రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. నాణ్యమైన విత్తనాలతో సాగు చేపట్టడం ద్వారా అధిక దిగుబడులు సాధించే అవకాశాలు మెరుగవుతాయని చెప్పారు. రైతులు శాస్త్రీయ సాగు పద్ధతులను అనుసరిస్తూ అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఖరీఫ్ సీజన్‌లో మెరుగైన పంట దిగుబడులు సాధించాలని రైతులకు ఆకాంక్షలు తెలియజేస్తూ, వ్యవసాయ రంగానికి అవసరమైన సహకారం అందించడంలో తాము ఎల్లప్పుడూ ముందుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పైల రామారావు, పిలక చిన్నబాబు, ఎ.కూర్మారావు, జి.కృష్ణారావు, ఎం.పోలయ్య, ఎన్.పాపయ్య తదితర కూటమి నాయకులు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

## చిరు వ్యాపారులకు పీఎం స్వానిధి లోక్ కళ్యాణ్ మేళా



**ఇచ్ఛాపురం, జూన్ 11 ప్రభాతవార్త**

ఇచ్ఛాపురం పురపాలక సంఘం పరిధిలో మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ అధ్యక్షతన మున్సిపల్ సమావేశ మందిరంలో మెప్మా విభాగం చిరువ్యాపారు లకు గురువారం పీఎం స్వానిధి లోక్ కళ్యాణ్ మేళా నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి చిరు వ్యాపారికి బ్యాంకు ద్వారా రుణాలు మొదటి రుణం 15 వేలు, 2వ రుణం 25వేలు, 3వ రుణం 50 వేలు ఇప్పించాలి. వీధి విక్రయ దారులకు క్రెడిట్ కార్డులు ఇప్పించాలి. అలాగే ప్రతి నెలా రుణాలు తిరిగి చెల్లింపులు జరిగే విధంగా కమ్యూనిటి ఆర్గనైజర్‌లు, ఆర్‌పిలు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వై.లక్ష్మి దివ్యాంగురాలు బ్యాంకు ద్వారా మూడవ విడత 50 వేలు రుణం తీసుకుని డ్రై ఫ్రూట్స్ వ్యాపారం నిర్వహించినందున కమీషనర్ బ్యాంకు వారు సన్మానం చేశారు. కార్యక్రమం లో యూనియన్ బ్యాంకు మేనేజర్ లాల్టెండ్ మిశ్రా, ఎస్‌బిఐ ఫీల్డ్ ఆఫీసర్ నాగరాజు, కెనరా బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ సంతోష్, ఏపీజీబీ మేనేజర్ డి.శోభన్, ఇండియన్ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ రేనీత్ రాజ్, మెప్మా లవ్లీహుడ్ సాంకేతిక నిపుణులు జి.కిషోర్, బ్యాంకు లింకేజీ సాంకేతిక నిపుణులు వై.శారదావాణి, టౌన్ మిషన్ కో ఆర్డినేటర్ భాస్కరరావు, సీఓ బాలరాజు, సంతోష్, డీఈఓ శ్రీను, ఆర్‌పీలు, వీధి విక్రయదారులు పాల్గొన్నారు.

## పార్వతీ మాత ఆలయ నిర్మాణానికి రామారావు ఆర్థిక సహాయం

### రూ.లక్ష విలువైన నగదు, బియ్యం, సామగ్రి విరాళం



**కంచిలి, జూన్ 11 ప్రభాతవార్త**

గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి స్థానిక దాతల సహకారం ఎంతగానో అవసరమవుతున్న తరుణంలో కంచిలి పంచాయతీ పరిధిలోని బల్యాపుట్టుగ గ్రామంలో నిర్మించనున్న పార్వతీ మాత దేవాలయానికి దుబ్బ రామారావు అందించిన విరాళం గ్రామస్తుల ప్రశంసలు అందుకుంది. గ్రామస్తుల అభ్యర్థన మేరకు దేవాలయ శంకుస్థాపన కార్యక్రమం, నిర్మాణ పనులకు అండగా నిలిచిన మాజీ పీఏసీఎస్ చైర్మన్ గుమ్మడి రాందాస్ అల్లుడు దుబ్బ రామారావు రూ.50 వేల నగదుతో పాటు అన్నదాన కార్యక్రమం కోసం 40 బస్తాల 25 కిలోల బియ్యం ప్యాకెట్లు, ఇతర అవసరమైన సామగ్రిని అందజేశారు. ఈ విరాళాల మొత్తం విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని గ్రామ పెద్దలు వెల్లడించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, యువకులు, భక్తులు దుబ్బ రామారావుకు కృతజ్ఞతలు తెలిపారు. దేవాలయ నిర్మాణం పూర్తయి భక్తులకు ఆధ్యాత్మిక నిలయంగా, గ్రామ ఐక్యతకు ప్రతీకగా నిలవాలని ఆకాంక్షించారు. సమాజ సేవతో పాటు ధార్మిక కార్యక్రమాలకు నిరంతరం అండగా నిలుస్తున్న రామారావు సేవాభావం ఆదర్శప్రాయమని పలువురు అభిప్రాయపడ్డారు.

## బారువ బీచ్‌లో ఘనంగా 'యోగాంధ్ర-2026' నిర్వహణ

### అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా వేలాది మందితో యోగాసనాల ప్రదర్శన



**సోంపేట, జూన్ 11 ప్రభాతవార్త :**

సోంపేట మండల పరిధిలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బారువ బీచ్ ఒడ్డున, రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'యోగాంధ్ర--2026' కార్యక్రమం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఘనంగా నిర్వహించబడింది. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా పర్యాటక శాఖ, ఆయుష్ శాఖ మరియు మత్స్య శాఖల సంయుక్త సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సామూహిక యోగా ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. యోగా ద్వారా ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అలవరుచుకోవాలని, శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా ఎంతగానో దోహదపడుతుందని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్ మరియు ఇచ్ఛాపురం శాసనసభ సభ్యులు బెందాళం అశోక్, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అమ్మద్ ఖాన్ పలాస ఆర్‌డీవో బి.అప్పలరాజు. యోగా శిక్షకులు, సోంపేట తహసీల్దార్ బి.అప్పలస్వామి, సోంపేట ఎంపీడీవో సి.హెచ్ ఈశ్వరమ్మ మండలంలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, యువత మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. సముద్ర తీరంలోని ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించిన ఈ 'యోగాంధ్ర-2026' కార్యక్రమం బారువ బీచ్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, యోగా పట్ల ప్రజల్లో మరింత అవగాహన కల్పించిందని నిర్వాహకులు తెలిపారు.

## మున్సిపాలిటీలు ఎస్సీ కాలనీలకు రూ.57 లక్షలు మంజూరు


### ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన



**ఆమదాలవలస, జూన11 (ప్రభాతవార్త)**

ఆమదాలవలస మున్సిపాలిటీలకు సంబంధించి ఎస్సీ కాలనీలో మౌలిక వసతులు కల్పించడానికి రూ.57 లక్షలు నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పురపాలక సంఘంలో ఎస్సీ ఏరియాలలో అభివృద్ధి పనులు చేపట్టడానికి నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ పనులను ఆయా వార్డులలో త్వరగా పూర్తి చేసి ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు ఎమ్మెల్యే రవికుమార్ ఆదేశించారు. మౌలిక వసతులను నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపట్టాలన్నారు. ఈ నిధులు మంజూరు సహకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, పురపాలన శాఖ మంత్రి పి.నారాయణ ఎమ్మెల్యే రవికుమార్ ధన్యవాదములు తెలిపారు.

## ఎమ్మెల్యే 'కూన' సమక్షంలో టీడీపీలోకి భారీ చేరికలు



**ఆమదాలవలస, జూన్ 11 (ప్రభాతవార్త)**

ఆముదాలవలస మండలంలోని కొర్లకోట గ్రామ సభలో బూర్జ మండలం సుంకరపేట గ్రామానికి చెందిన సుమారు 30 కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరాయి. వీరిని ఎమ్మెల్యే రవికుమార్ శాలువ కప్పి టిడిపి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారికి పూర్తి స్థాయిలో అండగా ఉంటామని, గ్రామ అభివృద్ధి మరియు ప్రజా సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అమలు అవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆకర్షితులై అనేక మంది టీడీపీ వైపు వస్తున్నారని రవికుమార్ అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఇప్పటికే కోట్లది రూపాయల నిధులతో సీసీ రోడ్లు, మౌలిక వసతుల కల్పన వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు ఎమ్మెల్యే రవికుమార్ గుర్తు చేశారు. గ్రామ ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి ఆమదాలవలస నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు మరియు పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## గిరిజన యువతి హత్యకు బాధ్యులైన వారికి కఠినంగా శిక్షించాలి

**సీతంపేట, జూన్ 11 ప్రభాతవార్త**

బర్న సీతంపేట గ్రామానికి చెందిన గిరిజన మహిళ ఉషారాణిని హత్య చేసి చెరువులో పూడ్చి పెట్టిన వారికి కఠినంగా శిక్షించాలని గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిడ్డిక తేజేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ప్రభుత్వం న్యాయం చేసి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏ.మన్మధరావు గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర న్యాయ సలహాదారులు, కే.కాంతారావు రాష్ట్ర కార్యదర్శి, ఎన్.కాంతారావు రాష్ట్ర సభ్యులు, పి.శ్రీనివాసరావు జిల్లా గిరిజన ఐక్యవేదిక కార్యదర్శి పాల్గొన్నారు.

## వ్యవసాయాధికారులు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలి



**పాతపట్నం, జూన్ 11 ప్రభాతవార్త**

ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయాధికారులు ఎల్లవేళలా రైతులకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సూచించారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద గురువారం నిర్వహించిన విత్తనాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొని రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సకాలంలో విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలు అందుబాటులో ఉంచాలన్నారు. అలాగే రైతులుకు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఏఓబి చెక్ పోస్ట్ వద్ద ముమ్మర వాహన తనిఖీలు



**పాతపట్నం, జూన్ 11 ప్రభాతవార్త**

శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పాతపట్నం బోర్డర్ చెక్ పోస్ట్ వద్ద ఎసఐ కె.మధుసూదనరావు తన సిబ్బందితో కలిసి ముమ్మరంగా వాహన తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా సరిహద్దు దాటి వస్తున్న పలు వాహనాలను ఆపి నిశితంగా పరిశీలించారు. వాహనాలకు సంబంధించిన పత్రాలను తనిఖీ చేయడంతో పాటు, వాహనదారులకు బ్రీత్ ఎనలైజర్ ద్వారా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రాణాంతక ప్రమాదాలు జరుగుతున్నాయని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై మధుసూధనరావు సూచించారు. బోర్డర్ చెక్‌పోస్ట్ వద్ద నిఘాను మరింత బలోపేతం చేశామని, నిబంధనలు పాటించని వాహనదారులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని, అలాగే ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు.

## కంటి ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి




**రాజాం, జూన్ 11 ప్రభాతవార్త**

కంటి ఆరోగ్యంపట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, తెర్లాం వైద్యాధికారిణి డాక్టర్ రెడ్డి స్వాతి అన్నారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, విజయనగరం సౌజన్యంతో పుష్పగిరి కంటి ఆసుపత్రి విజయనగరం, ప్రభావతి జాగృతి చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో నిర్వహించిన నేత్ర వైద్య శిబిరంలో ఆమె మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు క్రమం తప్పకుండా బీపీ, షుగర్ పరీక్షలు చేసుకోవాలని, వైద్యుల సూచనలు మేరకు మందులు తీసుకోవాలని అన్నారు. ఈ శిబిరంలో ఆప్తాల్మిక్ ఆఫీసర్, ఏపీ స్టేట్ అల్లైడ్ హెల్త్ కేర్ ప్రొఫెషనల్ కౌన్సిల్ మెంబర్ ఎస్.వసంతరావు కంటి పరీక్షలు నిర్వహించి 23 మందికి నేత్ర శస్త్ర చికిత్సలు నిమిత్తం పుష్పగిరి కంటి ఆసుపత్రి, విజయనగరం తరలించినట్టు వైద్యాధికారి డాక్టర్ స్వాతి తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ కుషాల్ చైతన్య, పబ్లిక్ హెల్త్ నర్స్ ఓ.శాంతికుమారి, హెచఓ. జి.రాధా, ఫార్మసీ ఆఫీసర్ వెంకట లక్ష్మి, లాబ్ టెక్నీషియన్ విజయకిరణ్, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

## హిందీ భాష పరీక్షలతో విద్యార్థులకు మేలు



**కంచిలి, జూన్ 11 ప్రభాతవార్త**

హిందీ ప్రచార సభ హైదరాబాద్, అనంతపురం వారు నిర్వహించు హిందీ భాషా పరీక్షలతో విద్యార్థులకు మేలు చేకూరుతుందని ఎంఈఓ 1 శివరాం ప్రసాద్ ఎంఈఓ 2 చిట్టిబాబులు పేర్కొన్నారు. ఏప్రిల్ నెలలో జరిగిన హిందీ భాషా పరీక్షలకు విజ్ఞాన్ పాఠశాల నుండి 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు. నాగరిబోధ్. ప్రవేశ్, ప్రథమ, మధ్యమ పరీక్షలు వ్రాసిన విద్యార్థులలో అందరూ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులవడం గొప్పదైన విషయమని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆదినారాయణను మండల విద్యాధికారులు కొనియాడారు. ఈ సందర్భంగా ప్రచార సభ నుండి వచ్చిన ప్రమాణ పత్రంలను అందజేశారు. విద్యార్థులకు భాషా పట్ల నైపుణ్యాలు అందజేయాలని విద్యార్థి హిందీ భాషలో మాట్లాడే విధంగా తర్ఫీదు నివ్వాలని పేర్కొన్నారు. రాబోవుకాలంలో ఇంకా ఎక్కువ మంది విద్యార్థులు హిందీ భాష పరీక్షలకు హాజరవాలని కోరారు. కార్యక్రమంలో భాషా ప్రచారకులు నిరంజన్ ఖడంగా పాల్గొన్నారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గడ్డివాము దగ్ధం



**కోటబొమ్మాళి, జూన్ 11 ప్రభాతవార్త**

మండలం శ్రీ జగన్నాథపురం పంచాయతీ కేంద్రంలో ఎన్ని చిన్నవాడుకు చెందిన గడ్డివాము గురువారం సాయంత్రం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దద్ధమయింది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో గడ్డివాముతో పాటు వంట చెరకు ఇతర సామాగ్రి అ రైతు నిల్వ ఉంచుకున్నాడు. అయితే గురువారం సాయంత్రం హఠాత్తుగా నిప్పులు చెలరేగి గడ్డివాముపై పడడంతో ఆ ప్రాంతంలో ఉన్న సామాగ్రి అంతా దగ్ధమైంది. గ్రామస్తుల సమాచారంతో స్థానిక అగ్నిమాపక శకటం సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేసింది. అప్పటికే పూర్తిగా జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఈ సంఘటనతో చిన్నవాడు కుటుంబం లబో దిబోమంటుంది. రోడ్డు సమీపంలో లెవెన్ కె.వి విద్యుత్ వైర్లు కిందన, ఏపీ స్విచ్‌కు ఆనుకొని ఇటువంటి సామాగ్రి నిల్వ ఉంచడం సరికాదని, ఇటువంటి సంఘటనలే చోటు చేసుకుంటాయని సర్వత్రా చర్చించుకుంటున్నారు.

## జగన్ చేసిన వేల కోట్ల స్కామ్‌లు బట్టబయలు : ఎమ్మెల్యే



**ఆముదాలవలస, జూన్ 11 ప్రభాతవార్త**

మెగా డిఎస్సీపై ఆధారాలు లేని ఆరోపణలు చేస్తూ జగన్‌రెడ్డి నిరుద్యోగులను, వారి తల్లిదండ్రుల కష్టాలను అవమానిస్తున్నారని టీడీపీ ఎమ్మెల్యే కూన రవికుమార్ ధ్వజమెత్తారు. మంగళగిరిలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ హయంలో గుజరాత్ నేషనల్ గేమ్స్‌లో పతకాలు సాధించి జగన్ చేత రూ.3లక్షల రివార్డు అందుకున్న షార్ట్‌బాల్ క్రీడాకారులకే నేడు కూటమి ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించిందన్నారు. నాడు సత్కరించి నేడు వాళ్లను ఫేక్ అనడానికి జగన్‌కు సిగ్గుండాలని మండిపడ్డారు. ల్యాండ్ నుంచి మైన్ వరకు జగన్ చేసిన వేల కోట్ల స్కామ్‌లు ఒక్కొక్కటిగా బట్ట బయలవుతుండడంతో ఆ భయంతోనే డీఎస్సీపై అబద్దాలు ప్రచారం చేస్తున్నారని తాము ఎలాంటి చర్చకైనా సిద్ధమని కూన రవికుమార్ సవాల్ విసిరారు.

## కొత్తమ్మతల్లికి ప్రత్యేక పూజలు



**కోటబొమ్మాళి, జూన్ 11 ప్రభాతవార్త**

ఈ ఏడాది జూన్ రెండో వారంలో వచ్చిన వర్షాలు ఇంకా కురవకపోవడంతో రైతులు గురువారం స్థానిక శ్రీ కొత్తమ్మతల్లికి బిందెలతో ముర్రాటలు తీసుకువెళ్ళి అమ్మవారికి చల్లదనం చేసి వర్షాలు కురిపించమ్మ అంటూ ప్రత్యేక పూజలు చేశారు. అలాగే శుక్రవారం నుంచి పాఠశాలలు ప్రారంభం కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అలయ కార్యనిర్వాహాధికారి వాకచర్ల రాధాక్రిష్ణ, ఆలయ పాలకమండలి అధ్యక్షుడు కోరాడ గోవిందరావు, సభ్యులు దేవాది లక్ష్మణరావు తదితరులు మంచినీరు, ఉచిత ప్రసాదం అందజేశారు. అలాగే మధ్యాహ్నం 12 గంటలకు సుమారు 500 మంది భక్తులకు అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు.

## రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**పాతపట్నం, జూన్ 11 ప్రభాతవార్త:**

శనివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 3.00 గంటల వరకూ 11 కేవీ ఏపీ మోడల్ స్కూల్ ఫీడర్ పాత వైరులు మార్పిడి కొరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని టెక్కలి ఎలక్ట్రికల్ ఈఈ ఈ.నరసింహ కుమార్ తెలిపారు. సరాలి పంచాయతీ, రంకిణి పంచాయతీ, తిడిమీ పంచాయతీ, దశరథపురం చంగుడి మరియు కోడూరు పంచాయతీలకు అంతరాయం కలుగుతుంది.

# శ్రీకాకుళం వార్త



## రైతులకు విత్తనాల పంపిణీ



**మెళియాపుట్టి, జూన్ 11 ప్రభాతవార్త**

మెళియాపుట్టి మండలంలో కోసమల రైతు సేవ కేంద్రంలో రైతులకు రాయితీపైన వరి విత్తనాలను స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ సలాన మోహన్‌రావు పంపిణీ చేశారు. రైతులు విధిగా రైతు సేవ కేంద్రాల్లో విత్తనాలు కొరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న విత్తనాలను రైతులందరూ వినియోగించుకోవాలని కోరారు. ముఖ్యంగా సాగు చేస్తున్న ప్రతి రైతుకు విధిగా ఎరువులు అందించాలని ఉద్దేశంతో ఈ విధానాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు క్రాంతి, ఉష మండ టిడిపి నాయకులు నంబల వెంకటరావు, పరమేశ్వర్ రెడ్డి, ధర్మారావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

## ఐసిటిసి , లింక్ ఆర్ట్ కేంద్రాల సేవల పరిశీలన



**పాతపట్నం, జూన్ 11 ప్రభాతవార్త**

స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఐసిటిసి మరియు లింక్ ఆర్ట్ సెంటర్లు ద్వారా అందిస్తున్న సేవలను పరిశీలించుటకు శ్రీకాకుళం జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ కెవిఆర్ శైలజ, పిఈపిఎఫఈఆర్ కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, షేర్ ఇండియా బృందం గురువారం వచ్చారు. ఐసిటిసి మరియు లింక్ ఆర్ట్ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలు పట్ల వారు సంతృప్తి చెంది సామాజిక ఆసుపత్రి డాక్టర్లను, సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐసిటిసి కౌన్సిలర్ జి.బాబురావు, ల్యాబ్ టెక్నీషియన్ ఎస్.పావని, సిబ్బంది పాల్గొన్నారు.

## పాతపట్నంలో వైసీపీ బూత్ లెవెల్ ఏజెంట్ల శిక్షణ



**పాతపట్నం, జూన్ 11 ప్రభాతవార్త:**

మండల కేంద్రములోని కేఎసఎం ప్లాజా నందు వైఎసఆర్ కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్ల శిక్షణ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. వైఎసఆర్సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం, ఏజెంట్లకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ శిక్షణను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ మరియు పార్లమెంట్ పరిశీలకులు కుంబా రవిబాబు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, దుంపల లక్ష్మణ రావు, దాము మన్మధరావు, తదితర నాయకులు విచ్చేశారు. బూత్ లెవెల్ ఏజెంట్లు పార్టీకి వెన్నుముక లాంటి వారని, ప్రతి ఓటరునూ కలిసి గత ప్రభుత్వం చేసిన సంక్షేమాన్ని వివరించాలని, పోలింగ్ రోజున అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని ఈ సందర్భంగా నాయకులు దిశా నిర్దేశం చేశారు. పాతపట్నం నియోజకవర్గ బూత్ లెవెల్ ఏజెంట్లు, మండల పార్టీ అధ్యక్షులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆలయాలకు స్థలాలు కేటాయించండి



**సంతబొమ్మాళి, జూన్ 11 ప్రభాతవార్త**

మూలపేట గ్రామంలో ఎన్ని ఆలయాలు ఉన్నాయో అన్నింటికీ ఆర్ అండ్ ఆర్ కాలనీలో స్థలాలు కేటాయించాలని కోరారు. గురువారం సాయంత్రం మూలపేట గ్రామస్తులతో నౌపడ ఆర్ అండ్ ఆర్ కాలనీలో ఆలయాలకు స్థలాల కేటాయింపుపై తహసిల్దార్ హేమసుందర్ రావు మూలపేట గ్రామస్తులతో చర్చించారు. పాతపట్నం తల్లి ఆలయానికి గ్రామస్తులు కోరిన చోట స్థలాన్ని ఇవ్వడానికి అధికారులు విముఖం వ్యక్తం చేయడంతో గ్రామస్తులు మండిపడ్డారు. పోర్టు కోసం మా గ్రామాన్ని త్యాగం చేశామని, అలాంటిది మాకు కేటాయించిన ఆర్ అండ్ ఆర్ కాలనీలో మాకు నచ్చిన చోట ఆలయాలకు స్థలం ఇవ్వకపోవడం ఏమిటంటూ తహసిల్దార్‌ను ప్రశ్నించారు. గ్రామానికి ఆలయాలే ప్రధానమని వాటి విషయంలో మేము రాజీ పడమని అన్నారు. షాపింగ్ కాంప్లెక్స్, పార్కులు కంటే మాకు ఆలయాలు ముఖ్యమని గ్రామస్తులు తేల్చి చెప్పారు. దీంతో అధికారులు వెనుదిరిగారు.

### ప్రజల విశ్వాసం.. అభివృద్ధి ఫలితం..

## రెండేళ్ల అచ్చెన్న పాలనకు ప్రశంసలు




**కోటబొమ్మాళి, జూన్ 11 ప్రభాతవార్త:**

టెక్కలి నియోజకవర్గం గతం కన్నా భిన్నంగా ఉంటే అది ఒక కొత్త చరిత్రకు కారణం అవుతుంది. కొత్త ఆలోచనకు నాంది అవుతుంది. రెండేళ్ల కూటమి పాలనలో అభివృద్ధి, వికాసం అన్నవి రెండు కళ్లుగా ఉన్నాయి. వికాసం అంటే చదువుకు సంబంధించి అని అర్థం. అభివృద్ధి అంటే సామాజిక అభివృద్ధితో పాటే ప్రభుత్వ ఆస్తుల విస్తరణ వాటి వినియోగం, వాటిలో చేయాల్సిన మార్పులు, కొత్త భవనాల కూర్పు అన్నవి ఎంతో బాగున్నాయి అని కింజరాపు అభిమానులే కాదు నియోజకవర్గ ప్రజలు సైతం చెబుతున్నారు. ముఖ్యంగా రహదారుల కోసం ముఖ్య రహదారుల కోసం కోటబొమ్మాళి, టెక్కలి, సంతబొమ్మాళిలో నిధులు వెచ్చించారు. 7వందల కోట్ల రూపాయల నిధుల వెచ్చింపులో భాగంగా ప్రధాన రహదారుల విస్తరణకు శ్రీకారం దిద్దారు. అలానే రెండు కోట్ల రూపాయలు వెచ్చించి కోటబొమ్మాళి ఎత్తిపోతల పథకానికి సంబంధించి ట్రాన్స్ ఫార్మర్ పునరుద్ధరణకు నిధులు కేటాయించి ఆ రోజు సంబంధిత ప్రక్రియకు ప్రాణం పోశారు. కోటబొమ్మాళిలో చీపుర్లపాడు వద్ద పది కోట్ల రూపాయలతో ఎంఎసఎంఈ పార్కుకు శంకుస్థాపన చేశారు. సంతబోమ్మాళి, టెక్కలి మండలం ఎత్తిపోతల పథకానికి సంబంధించి దృష్టి సారించారు. రూ.7 కోట్ల 88 లక్షలతో కొండపేట, మదన గోపాల సాగరం వద్ద ఎత్తి పోతల పథకం పునరుద్ధణకు నిధులు మంజూరు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా టెక్కలి నియోజకవర్గంలో రెండు అన్నా క్యాంటీన్లకు శ్రీకారం దిద్దారు. రాష్ట్ర వ్యాప్తంగా అమలైనఈ పథకంతో ఐదు రూపాయలకే పేదలకు నాణ్యమైన భోజనం అందేవిధంగా ఏర్పాటు చేయడం ఓ గొప్ప పరిణామం. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి కొనసాగుతోంది. ముగ్గురు అగ్రనేతల ఆశీస్సులు, ప్రజల సహకారంతో అభివృద్ధి ప్రస్థానం మరింత వేగంగా కొనసాగనుంది. ఇప్పటి వరకూ 370 మంది బాధితులకు మూడు కోట్ల 36 లక్షల రూపాయల మేరకు సీఎంఆరఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. దీర్ఘ కాలిక వ్యాధులతో సతమతమవుతూ, వివిధ రోడ్డు ప్రమాదాల కారణంగా మంచం పట్టి ఖరీదైన ఆధునిక వైద్యం అందక అవస్థ పడే వారికి అండగా.. ఒక పెద్దన్నయ్యగా ఆయన నిలుస్తున్నారు. ఇందులో ఎటువంటి సందేహం లేదు. ముఖ్యంగా బాధితుల విషయమై మానవతా దృక్పథంతో పని చేయాలని పదే పదే తన అధికారులకు సూచిస్తున్నారు.

# చెలి

## నిద్రకీ, వయసుకు సంబంధం..



మనందరికీ తెలిసిన విషయం ఒకటుంది. మన అసలు వయసుకంటే మనకి మనం ఫీలవుతున్న వయసు వేరు అన్నది. దీన్నే సబ్జెక్టివ్ ఏజ్ అంటారు. నిత్యం ఉత్సాహంగా ఉండేవాళ్ళు 55 ఏళ్ళలో ఉన్నా 45లో ఉన్నట్టే ఫీలవుతారు. ఆ మాట బయటకు చెప్పకున్నా సరే. అదే ఎప్పుడూ డీలాగా ఉండేవారు 35 ఏళ్ళలోనూ తమకి తాము 40ల్లో ఉన్నట్టు భావిస్తారు. ఈ తేడా ఎందుకొస్తోంది? ఈ భావనకీ నిద్రకీ ఏదైనా సంబంధం ఉందా? అన్న సందేహం వచ్చింది. ఇటీవల స్వీడన్‌లోని కెరోలిన్‌స్కా వర్సిటీ పరిశోధకులకి. దానిపైన 186 మందితో అధ్యయనానికి నడుం బిగించారు. వాళ్లని రెండువారాలు తొమ్మిదిగంటలపాటు నిద్రపోమ్మన్నారు. అదయ్యాక- ఓ రెండురోజుల పాటు నాలుగంటలే నిద్రపోనిచ్చారు. ఆ రెండు సందర్భాల్లోనూ వాళ్ళ ఉత్సాహాన్నీ, చురుకుదనాన్నీ, తద్వారా వాళ్ల సబ్జెక్టివ్ ఏజ్‌నీ అంచనావేశారు. మొదటి రెండువారాలు కంటి నిండా నిద్రపోయినప్పుడు ప్రతిరోజూ తమ వయసు 0.23 ఏళ్లు (దాదాపు రెండున్నర నెలలు) తగ్గుతున్నట్టు ఫీలయ్యారట ఈ అధ్యయనంలో పాల్గొన్నవారు. అదే నిద్ర తగ్గినప్పుడు వయసు నాలుగున్నరేళ్ళు పెరిగినట్టు భావించారట. దీన్ని బట్టి నిద్రకీ సబ్జెక్టివ్ ఏజ్‌కీ చాలా దగ్గర సంబంధం ఉందని రూఢీ అయ్యిందంటున్నారు పరిశోధకులు. □

## చేపల ఫ్రై రుచిగా..



ముందుగా చేప ముక్కలను 20 నిమిషాలు పాలలో నానబెట్టా, తర్వాత పాలు తీసేయాలి. ఇలా చేయడం వల్ల నీచు వాసన తగ్గడమే కాకుండా అదనపు రుచి వస్తుంది.

చేపముక్కలకు మసాలా పట్టించేటప్పుడు కొద్దిగా శనగపిండి లేదా బియ్యప్పిండిని జోడిస్తే.. ఫ్రై కరకలడుతుంది. ఉల్లిపాయల్లో తగినంత తేమ ఉంటుంది కనుక మసాలా పేస్ట్‌ను గ్రైండ్ చేసేందుకు నీళ్ల అవసరం లేదు. దానికి బదులు చెంచా నిమ్మరసం ఉపయోగించవచ్చు.

ఉల్లి, అల్లం, వెల్లుల్లి పేస్టు, పసుపు, కారం ధనియాల పొడి, జీలకర్ర పొడి, గరం మసాలా, ఉప్పు కలిపి ముద్దలా చేయాలి. చేపముక్కలకి ఈ మిశ్రమాన్ని పట్టించి అరగంట ఫ్రిజ్‌లో పెట్టాలి.

4.ఫిష్ ఫ్రై యథాతథంగా చేపలతో చేయొద్దు, చేపలను ముక్కలుగా కోసి చేస్తేనే భాగుంటుంది. దీనికి ఎక్కువ నూనె అవసరం లేదు. నూనె మరీ వేడిగా ఉంటే నానబెట్టిన చేప ముక్కలు పాత్రకు అంటుకుంటాయి. తగినంత సెగలో వేయించాలి. . ఎక్కువ మోతాదులో చేయాల్సి వస్తే అనీ ఒకసారే వద్దు. కొన్ని కొన్ని ముక్కల చొప్పున వేయించండి. ఎక్కువ మొత్తంలో ముక్కలు వేస్తే నూనె ఎక్కువ పీల్చుకుంటుంది. పైగా ముక్కలు సరిగా వేగవు. చేపముక్కలను రెండు వైపులా బంగారు రంగు వచ్చేవరకు వేయించాలి. వహ్వా అనిపించే రుచి రావాలంటే పావుగంట పడుతుంది. □

## చులకన చేయొద్దు !



కొంత మంది దంపతుల్దిరూ నింపాదిగా చర్చించు కోరు ఒకరిపై మరొకరు కోపంతో రగిలిపోతారు. ఒకరినొకరు నిందించుకోవడం మొదలుపెడతారు. ఇటువంటి వాతావరణం కుటుంబ సంతోషాన్ని దూరం చేస్తుందంటున్నారు. కాబట్టి.. ఎదుటివారితో మాట కలపడం ఓ కళ. అందులోనూ జీవిత భాగస్వామితో మరింత అపురూపంగా మాట్లాడాలి. అప్పుడే ఆ వైవాహికబంధం సాఫీగా సాగిపోతుంది. అలా జరగలంటే ఎదుటివారికన్నా తామే ఎక్కువ, నాకే అన్నీ తెలుసనే ఆలోచన భార్యాభర్తల్లో ఎవరికీ ఉండ కూడదు. లేదంటే భాగస్వామిపై చులకన భావం పెరుగుతుంది. అలాకాకుండా అవతలి వారిలోని ప్రత్యేకతను గుర్తించి విలువ నివ్వండి. ఇద్దరి మధ్యా అసమానతలకు చోటుండదు.

**నియంత్రించుకోవాలి....** దంపతులు ఏదైనా విషయంపై చర్చించుకున్న ప్పుడు..ఎదుటివారు చెప్పింది నచ్చకపోతే కోపాన్ని ప్రదర్శించొద్దు. కూల్‌గా ఆ సందర్భాన్ని డీల్ చేయడం నేర్చుకోవాలి. స్వీయ నియంత్రణ ఉండాలి. అవతలి వారెండు కలా మాట్లాడుతున్నారని ఆలోచించాలి. ఇలా ఇరువురూ చేస్తే సమస్య తేలికవుతుంది కోపానికీ తావుండదు.

**మృదువైన మాటలతో..** ఏ విషయాన్నైనా చర్చించాలనుకున్నప్పుడు మృదువైన మాటలతోనే సంభాషణ కొనసాగించాలి. ఎదుటివారి అభిప్రాయానికి విలువనిస్తూ, వారు చెప్పేది పూర్తిగా వినాలి. ఆ తర్వాత మీ ఆలోచననీ మృదువుగా చెప్పగలగాలి. ఇది అవతలివారికి ఒత్తిడి కలిగించదు. పైగా ఒకరికొకరు సానుకూలంగా అభిప్రాయాలను పంచుకునే వాతావరణం ఏర్పడుతుంది. ఇక కోపాలకు తావేది?

**అవతలివారి గురించి ఆలోచించి..** భార్యాభర్తల్లో ఏ ఒక్కరు కోపాన్ని ప్రదర్శించినా ఎదుటివారు దాన్ని తగ్గించడానికి ప్రయత్నించాలి. మీరు బాధపడుతూ కూర్చోక. భాగస్వామికి ఎలా అనిపించిందో అన్న కోణంలో ఆలోచించాలి. వారి స్థానంలో ఉండి ఆలోచించాలి. అవతలివారి అర్థమవడమే కాదు. సమస్యా తీరుతుంది.

## భక్తుల ధర్మం మేళ్లు వారికి చేరడం లేదెందుకని!?

ఈ లోకంలో 'ప్రతి విషయం' దానిదంటూ కొన్ని డిమాండ్స్ కలిగి ఉంటుంది. వాటిని పరి పూర్తి చేసినప్పుడే ఆ విషయం ఆధారంగా కలగ వలసిన 'మేళ్ళు కలుగుతాయి'. లేదంటే అది ఫలరహితమై, వ్యర్థమైపోతుంది. ఉదా: మీరు ఒక విద్యాలయంలో చేరారు. అది ఒక ఈవెంట్ మాత్రమే. అంతమాత్రానికే మీకు ఏమాత్రమూ విద్య రాదు. ఆ తరువాత మరొక ఈవెంట్ ఉంటుంది . అది 'కఠోర శ్రమ'తో విద్యను 'అభ్యాసం చేయటం'. ఈ ఉదా: సకల విషయాలకూ వర్తిస్తుందన్నది గమనార్హం! నేటి అధికశాతం ముస్లింలు, మేము 1.అల్లాహ్ పట్ల, 2.పరలోకం పట్ల, 3.ప్రవక్త పట్ల విశ్వాసం కలిగి, 4. ఆరాధనలు కూడా చేస్తున్నాం. అయినా ఇస్లాం మేళ్ళు మాకు కలగటం లేదేమిటి!?" అనిఆశ్చర్యంగా, విషాదంతో ప్రశ్నిస్తుంటారు. దానికి కారణం ఏమిటంటే రెండవ ఈవెంట్‌ను పాటించక పోవటమే! రెండవ ఈవెంట్ ఏమిటో చూడండి. కేవలం 'అల్లాహ్ పట్ల విశ్వాసం' ఏమాత్రమూ సరిపోదు. దాని 'డిమాండు' అయిన దేవుని 'విధినిషేధాల అనుసరణ'ను కూడా 'కఠోర శ్రమ'తో పాటించాలి. కేవలం పరలోకం పట్ల విశ్వాసం ఏమాత్రమూ సరి పోదు. దాని డిమాండు అయిన 'త్యాగమూ వైరాగ్యము' కూడా 'కఠోర శ్రమ'తో మీ ప్రవర్తనలో తెచ్చు కోవాలి. కేవలం ప్రవక్త పట్ల విశ్వాసం ఏ మాత్రమూ సరిపోదు. దాని 'డిమాండు'అయిన 'సహనమూక్షమాశీలత'లను కూడా 'కఠోర శ్రమ'తో మీ ప్రవర్తనలో తెచ్చు కోవాలి, కేవలం 'ఆరాధనల అమలు' ఏ మాత్రమూ సరిపోదు. దాని 'డిమాండు' అయిన సత్కర్మలను 'కఠోర శ్రమ'తో ఆచరించాలి.

**ఒక అబద్ధం! ఒక నిజం!!**

ధార్మిక విశ్వాసాలు కలిగి, ఆరాధనలు చేస్తే, ఇస్లాం మేళ్ళు కలుగుతాయన్నది ఒక అబద్ధం. అవి కోరే డిమాండులను కూడా పూర్తిచేస్తేనే ఇస్లాం మేళ్ళు కలుగుతాయన్నది ఒక నిజం". ఈ అబద్ధమూనిజమ్మును గుర్తించకపోతే మీ విశ్వా సాలూ ఆరాధనలు ఫలరహితమై, వ్యర్థమై పోతాయి! ఈ పుస్తకం యావత్తూ ఈ విషయం కేంద్రంగానే సాగింది. అల్లాహ్ మొదటి ఈవెంట్ తో పాటు, దాని డిమాండు అయిన రెండవ ఈవెంట్‌ను కూడా ఆచరించే సౌభాగ్యాన్ని కలిగించుగా!

**ముష్తాఖ్ అహ్మద్ అభిలాష్**

## గాజును మెరిపిద్దాం !

ఆరోగ్య స్పృహ, అలం కరణపై శ్రద్ధ.. ఇంట్లో గాజు వస్తువుల వాడకాన్ని పెంచేశాయి. ఇవి చూడ్డానికి ఎంతందంగా ఉన్నా.. ఇవి ఎప్పటికప్పుడు శుభ్రపరచకపోతే దుమ్ము, జిడ్డు వంటి వాటితో మరకలు పడతాయి. అలాగని శుభ్రం చేసేటప్పుడు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా.. అవి పగిలి పోతాయి. అలాకాకూడదంటే ఈ చిట్కాలు పాటించండి మరి..



గాజు వస్తువులను శుభ్రం చేసేటప్పుడు పీచుకి బదులు స్పాంజ్‌ని వాడాలి. దీన్ని వాడేందుకు సబ్బుకి బదులు లిక్విడ్ సోప్ ఎంచుకోవడం మంచిది. చేతులు పట్టని గాజు వస్తువుల్లోకి మెత్తటి ఫోమ్, లేదాకుచ్చుల నబ్రష్‌తో శుభ్రపరిస్తే సరి.. గ్లాస్‌వేర్‌ని క్లీన్ చేయడానికి చన్నీళ్లకు బదులుగా వేడినీళ్లను వాడండి. ఇవి బ్యాక్టీరియాలను సులువుగా తొలగిస్తాయి. గ్రీజు, జిడ్డు మరకల్ని త్వరగా వదలగొడ తాయి. కఠిన రసాయనాలతో కూడిన క్లీనర్లను గాజుపాత్రల్ని కడగడానికి వాడటం మంచిది కాదు. ఇవి వాటికుండే సహజమెరుపుని తగ్గిస్తాయి .బదులుగా వెనిగర్, నిమ్మ, బేకింగ్ సోడా వంటివి వినియోగించొచ్చు. గాజు పాత్రల్ని ఓసారి వేడి నీళ్లలో శుభ్రపరిచి నిమ్మచెక్కలతో రుద్దితే దానిమీదే పేరుకున్న మురికి తొలగిపోతుంది. అంతేకాదు.. ఆహార పదార్థాలు, తేనీటి వాసనలు, మరకలు వంటివీ దూరమవు తాయి. చివరిగా టూత్ పేస్ట్‌ని ఉపయోగించీ గాజు పాత్రల్ని శుభ్రపరచుకోవచ్చు.

## ఒంటరితనాన్ని వదిలించుకుందాం...

**జీవనశైలి, పని ఒత్తిడి కారణాలేవైనా చాలామంది మహిళలను డిప్రెషన్ వేధిస్తుంటుంది. ఇలాంటప్పుడు ఒంటరితనం బాధించ కూడదంటే.. ఈ అలవాట్లు చేసుకోవాలి.**



జీవితం ఎవరికీ పూల పాన్పు కాదు.. ఎదురయ్యే సంఘటనల్ని డీల్ చేసుకునే విధానమే వారిని గట్టెక్కిస్తుంది. అలాకాకుండా అన్నింటికీ ఎవరో ఒకరు తోడు కావాలనుకుకోవడం, మనసుకి నచ్చిన వారు పక్కనుంటేనే అన్నీ చేయగలను అనుకోవడం వల్ల. మీ ఒంటరి తనం పోగొట్టడానికి ఏవవైనా హాబీలను అలవాటు చేసుకోండి. ఉదాహరణకు మీకు మంచి ముగ్గులు పెట్టడమో, వంట చేయడమో వస్తే.. దానిలోనే ప్రత్యేకత సాధించడానికి ప్రయత్నిం చండి. సామాజిక మాధ్యమాల వేదికగా వాటిని ప్రదర్శిం చండి. ఇవన్నీ మీకో గుర్తింపు తేవడమే కాదు.. ఒంటరితనాన్నీ దూరం చేస్తాయి. నలుగురిలో కలవడానికి బోలెడు మార్గాలు.. వ్యాయామం చేయడానికి రోజూ దగ్గర్లోని యోగా సెంటర్‌కో, పార్కుకో వెళ్లండి. కసరత్తులు మీ ఒంటికి శ్రమనూ, మనసుకు సాంత్వననూ అందిస్తాయి. కొత్త స్నేహాలకూ, ఆలోచనలకూ ఇవి వేదిక అవుతూయి. లేదంటే ఉదయమో, సాయంత్రమో వెల్లండి క్రమంగా మీలోని ఒత్తిడి దూరమవుతుంది. మీలో ఒంటరితనం అనే భావన రావడానికి మీ చుట్టూ ఉండే వ్యక్తులూ, సమాజం.. ఏదైనా కారణం కావొచ్చు. నిత్యం ఏదో ఒక ప్రతికూల పరిస్థితితో పోరాడాల్సి రావొచ్చు. అంతమాత్రాన మిమ్మల్ని మీరు తక్కువ చేసుకోవద్దు. ఏ రోజుకారోజు మీలోని ఓ నెగెటివ్ అంశాన్ని అధిగమించాలనే లక్ష్యం పెట్టుకోండి. ఏ విషయంలోనైనా వెనకబడి ఉంటే అందులో పట్టు తెచ్చుకోవడానికి ప్రయత్నిం చండి. ఇవన్నీ మీ ఒంటరితనాన్ని దూరంచేసేవే. □

# తెర

## త్వరలో రిలీజ్‌కు వస్తున్న 'సాజు3'



సరికొత్త కంటెంట్‌తో త్వరలో రిలీజ్‌కు వస్తున్న "సాజు3" సినిమా ప్రేక్షకుల్ని అలరి స్తుంది డైరెక్టర్ కృష్ణమాయ స్రామాట్, డీమోన్ పవన్, లిఖిత (రాను బొంబాయికి రాను సాంగ్ ఫేమ్) హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా "సాజు3". ఈ చిత్రాన్ని లక్ష్మి కృష్ణ ఫిలింస్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం. 2గా నిర్మాత వి.విజయ నిర్మిస్తున్నారు. నటుడు, దర్శకుడు కృష్ణ మాయ ఈ సినిమాను రూపొందిస్తున్నారు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా త్వరలోనే గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. రెబల్ స్టార్ ప్రభాస్ "ఈశ్వర్" సినిమాలో కృష్ణమాయ ఫ్రెండ్ క్యారెక్టర్ లో నటించి పేరు తెచ్చుకున్నారు.యాక్టర్ అదిరే అభి మాట్లాడుతూ నెక్స్ట్ ఇయర్ కు ఈశ్వర్ సినిమా పాతికేళ్లకు చేరుకుంటుంది. అప్పుడు ఓ గెట్ గెదర్ పెట్టుకోవాలని, అందుకు కృష్ణమాయ ఇనిషేటివ్ తీసుకోవాలి కోరుతున్నా. ఈశ్వర్ చిత్రంలో మేము ప్రభాస్ ఫ్రెండ్‌గా నటించాం. ఆ మూవీతో మాకు మంచి గుర్తింపు దక్కింది. ప్రభాస్ ఈ రోజు బిగ్ స్టార్ అయ్యారు. హీరో స్రామాట్ మాట్లాడుతూ ప్రభాస్ మా అందరికీ ఫేవరేట్ హీరో. ఆయన ఈశ్వర్ సినిమా రీ రిలీజ్ కు మేమంతా టీమ్‌గా వెళ్లి థియేటర్స్‌లో సినిమా చూస్తాం. ఈశ్వర్ సినిమా రీ రిలీజ్ సందర్భంగా మా మూవీ ప్రెస్ మీట్ నిర్వహించుకోవడం హ్యాపీగా ఉంది. "సాజు3" సినిమా కంటెంట్ చూసిన ప్రతి ఒక్కరూ మూవీ చాలా బాగుందంటూ చెబుతున్నారు. హీరోయిన్ లిఖిత మాట్లాడుతూ ప్రభాస్ ఈశ్వర్ సినిమా రీ రిలీజ్ సందర్భంగా మా సినిమా నుంచి ట్రిబ్యూట్‌గా ప్రెస్ మీట్ నిర్వహించుకోవడం సంతోషంగా ఉంది. నటి శ్రావణ సంధ్య మాట్లాడుతూ డైరెక్టర్ కృష్ణమాయ నాకు గతంలో రైల్వే స్టేషన్ మూవీలో నటించే అవకాశం కల్పించారు. ఆ సినిమా టైమ్ లో రిహార్సల్స్ చేయించి పర్ఫెక్ట్‌గా వచ్చేలా షూటింగ్ చేశారు.

## NBK111 'ఎంట్రీ ఆఫ్ ఆన్ ఎరా' గ్లింప్స్ రిలీజ్



NBK111 నుంచి బాలయ్య బర్త్ డే సందర్భంగా కింగ్ ఆఫ్ కేయాస్ 'ఎంట్రీ ఆఫ్ ఆన్ ఎరా' గ్లింప్స్ రిలీజ్ గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, సక్సెస్ ఫుల్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని భారీ కాన్వాస్‌పై రూపుదిద్దు కుంటున్న NBK111 చిత్రం కోసం మళ్ళీ జతకట్టారు. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై నిర్మాత వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్, హైవోల్టేజ్ యాక్షన్, గ్రిప్పింగ్ డ్రామా. ఈ స్టార్ డైరెక్టర్ కాంబినేషన్ నుంచి అభిమానులు ఆసక్తిగా ఎదురుచూసే ట్రేడ్‌మార్క్ మాస్ మూమెంట్స్‌తో సినిమా అద్భుతంగా అలరించబోతోంది. బాల కృష్ణకు పుట్టినరోజు శుభాకాంక్షలు బాలకృష్ణ పాత్రను పరిచయం చేసేలా ఈ గ్లింప్స్‌ను రూపొందించారు. 1993 బాంబే అల్లకల్లోల పరిస్థితుల నేపథ్యం లో సాగే ఈ వీడియోలో డార్క్, హింసతో నిండిన ప్రపంచాన్ని చూపించారు. అలాంటి పరిస్థితుల్లో స్టైల్, ఇంటెన్స్, పవర్‌కు ప్రతీకగా బాలకృష్ణ ఎంట్రీ అదిరి పోయింది. డైలాగ్స్ లేకుండానే విజువల్స్ ద్వారా పాత్ర పవర్‌ను అద్భుతంగా చూపిం చారు. దర్శకుడు గోపీచంద్ మలినేని ఈ చిత్రాన్ని భారీ యాక్షన్ సాగాగా మలిచారు. భారీ యంత్రాలు, అగ్నిజ్వాలలు, ప్రాణాంతక ఆయు ధాలు, విధ్వంసకర యాక్షన్ ఎపిసోడ్స్‌తో గ్లింప్స్ అంతా ఉత్కంఠ భరితంగా సాగింది. ప్రతి ఫ్రేమ్ హీరో పాత్ర స్థాయిని మరింత ఎలివేట్ చేసేలా రూపొందిం చారు. ఈ చిత్రంలో బాలకృష్ణ పాత్రను కింగ్ ఆఫ్ కేయాస్‌గా ప్రజెంట్ చేశారు. ఈ గ్లింప్స్ బాలకృష్ణ ఆదరగొట్టేశారు. సరికొత్త మేకోవర్‌లో ఆయన ఎంతో స్టైలిష్‌గా, ఎనర్జిటిక్‌గా, అత్యంత పవర్‌ఫుల్ గా కనిపించారు. ఆయన స్క్రీన్ ప్రెజెన్స్ పాత్రను మరింత ఇంపాక్ట్ ఫుల్‌గా నిలబెట్టింది.

## 'దీవాన' మూవీ ట్రైలర్ లాంచ్



"దీవాన" సినిమాను ఎంత నిజాయితీగా రూపొందించారో ట్రైలర్ తోనే తెలుస్తోంది మాస్ కా దాస్ హీరో విశ్వక్ సేన్..శుభం సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న యంగ్ టాలెంటెడ్ యాక్టర్ హర్షిత్ రెడ్డి హీరోగా నటిస్తున్న కొత్త సినిమా "దీవాన". ఈ చిత్రాన్ని అర్హ మీడియా, వీ స్టూడియోస్ బ్యానర్ పై వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యం పూడి నిర్మిస్తున్నారు. ఈ బ్యూటిఫుల్ లవ్ స్టోరీతో హీరోయిన్ స్మేహ మణిమేగలై, దర్శకుడు శ్రీకాంత్ సంగిశెట్టి పరిచయం కానున్నారు. "దీవాన" సినిమా గీతా ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా ఈ నెల 19న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తోంది. ఈ రోజు ఈ చిత్ర ట్రైలర్ లాంఛ్ ఈవెంట్ ను హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్, మాస్ కా దాస్ హీరో విశ్వక్ సేన్, ప్రొడ్యూసర్ ధీరజ్ మొగిలినేని అతిథులుగా పాలొన్నారు. ఈ సందర్భంగాయాక్టర్ టోనీ మాట్లాడుతూ గీతా ఆర్ట్స్‌లో వచ్చిన ఎన్నో చిత్రాలను థియేటర్ లో చూసి ఎంజాయ్ చేశాను. ఇప్పుడు ఆసంస్థకొలాబ్రేట్ అయిన మూవీలో నటించడం గర్వంగా ఉంది. ప్రొడ్యూసర్ వాసుదేవ్ కొప్పినేని మాట్లాడుతూ చిన్నప్పటి సినిమా అంటే ప్యాషన్ ఉండేది. ఎన్నో చిత్రాలు చూస్తూ పెరిగాను. అరవింద్ గారితో పరిచయం అయ్యాక ఆయనకు ప్రతి రోజూ ఏదో విషయంలో థ్యాంక్స్ చెబుతూనే ఉన్నాను. ప్రొడ్యూసర్ శ్రీదేవి కార్యంపూడి మాట్లాడుతూ నేను ఆహాలో పనిచేశాను. అక్కడ విశ్వక్ గారిని కొన్నిసార్లు కలిశాను. కొత్త వాళ్లతో కూడా ఆయన ఎంతో ఫ్రెండ్లీగా ఉంటారు. "దీవాన" సినిమా గురించి చెప్పాలంటే ఈ చిత్రానికి మా డైరెక్టర్ శ్రీకాంత్, మ్యూజిక్ డైరెక్టర్ ఈశ్వర్, హీరోయిన్ స్మేహ, హీరో హర్షిత్ నాలుగు ఫిల్లర్స్. ఈ ఫిల్లర్స్ కు పునాదిలా నిలబడ్డారు మా ప్రొడ్యూసర్ వాసుదేవ్. ఆయన ఈ సినిమా కోసం ప్రాణం పెట్టారు.

## ఆలియా భట్ 'ఆల్ఫా' టీజర్ రిలీజ్



ఆలియా భట్ ప్రధాన పాత్రలో యశ్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై ఆదిత్య చోప్రా నిర్మిస్తోన్న భారీ యాక్షన్ మూవీ ఆల్ఫా. బుధవారం (జూన్ 10) మేకర్స్ ఈ మూవీ టీజర్‌ను విడుదల చేశారు. ఇందులో ఆలియా భట్ ఓ హంతుకురాలి పాత్రలో నటించింది. టీజర్‌ను గమనిస్తే.. బాబీ డియోల్ తండ్రి పాత్రలో కనిపించారు. తన కుమార్తెను బాబీ చిన్నప్పటి నుంచే హత్యలు చేసే ఓ హంతురాలిగా పెంచి పెద్ద చేస్తాడని అర్థమవుతుంది. అలాగే ఆమె చేసిన భారీ యాక్షన్ సీక్వెన్స్‌లను కూడా మనం ఇందులో గమనించ వచ్చు. త్వరలోనే ఈ సినిమాలో మరో ప్రధాన పాత్రలో నటించిన శర్వారి పాత్రను మేకర్స్ పరిచయం చేయబోతున్నారు. ఆల్ఫా స్వభా వాన్ని అలవరుచు కున్న ఇద్దరమ్మాయిల కథతో తెరకెక్కిన పాప్‌కార్న్ సినిమా. ఇద్దరు హీరోయిన్స్ ప్రధాన పాత్రధారులుగా ఇప్పటి వరకు యాక్షన్ సన్నివేశాలతో రూపొందింది. థ్రిల్లింగ్, ఎమోషనల్, ఫన్నీ ఎలిమెంట్స్‌తో ఎవరూ ఊహించని మలుపులతో రైడింగ్‌లా ఆల్ఫా సినిమాను రూపొందించారు. 'ఆల్ఫా' మూవీని గ్లోబల్ హిట్ సిరీస్ రైల్వే మెన్ ఫేమ్ శివ్ రవాలి తెరకెక్కిస్తు న్నారు. బాబీ డియోల్, అనీల్ కపూర్ కీలక పాత్రల్లో నటిసున్నారు. జూలై 3న ఈ మూవీ వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ రిలీజ్ కానుంది.

## 'అమ్మా... నాకు ఆ అబ్బాయి కావాలి'



జిఎస్ఆర్ మూవీ మేకర్స్ పతాకంపై పవన్ మహావీర్ ను హీరోగా పరిచయం చేస్తూ... ప్రముఖ మహిళా వ్యాపారవేత్త శైలజరెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న వినూత్న ప్రేమకథా చిత్రం "అమ్మా... నాకు ఆ అబ్బాయి కావాలి". శివాల ప్రభాకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో వర్షిక, సుహానా హీరో యిన్లు. సుమన్, రావు రమేష్, రాజీవ్ కనకాల, సత్యకృష్ణ, సుజాత తదితరులు ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రం టీజర్ రిలీజ్ ఫంక్షన్ హైదరాబాదులోని ప్రసాద్ ల్యాబ్ లో అత్యంత ఘనంగా జరిగింది!! ఆంధ్రప్రదేశ్ ఫిలిం డవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ భరత్ భూషణ్, నిర్మాతల మండలి ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్, ఫెడరేషన్ అధ్యక్షులు వల్లభనేని అనిల్, ఫిలిం చాంబర్ ప్రధాన కార్యదర్శి కె అశోక్ కుమార్, దర్శకుల సంఘం అధ్యక్షులు వీఎన్ ఆదిత్య, సీనియర్ ఫిలిం జర్నలిస్టులు ప్రభు, సురేష్ కొండేటి, ప్రముఖ నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ ఈ వేడుకలో పాల్గొన్నారు. "తొలి చిత్రంతోనే అన్ని శాఖల పట్ల అవగాహన పెంచుకున్న శైలుజా రెడ్డి సినిమా నిర్మాణ రంగంలోనూ అసాధారణ విజయం సాధించడం ఖాయమని" అతిథులు ఆకాంక్షించారు."హీరోగా పరిచయమవుతున్న పవన్ మహావీర్‌ను చూస్తుంటే... ఇది అతని తొలి చిత్రం అనిపించ లేదని, అతనిలో అంత ఈజ్ ఉందని" అన్నారు.

## 'కొత్త మలుపు' నా జీవితంలో కొత్త మలుపు': భైరవి ఆర్థ్యా



భైరవిఆర్థ్యాతో మీడియా ప్రతినిధులు స్పెషల్ చిట్‌చాట్

**మీ నేపథ్యం చెప్పండి. అస్సాం నుంచి టాలీవుడ్ వరకు మీ ప్రయాణం ఎలా సాగింది?**

నేను అస్సాంకు చెందిన అమ్మాయిని. మా కుటుంబంలో అమ్మ, నాన్న, చెల్లెలు అందరూ అక్కడే ఉంటారు. చిన్నప్పటి నుంచే సినిమాలు, నటన అంటే చాలా ఇష్టం. తెలుగు సినిమాలు కూడా చూస్తూ పెరిగిన నేను ఒక రోజు నటిగా మారాలనే కల కనడం ప్రారంభించాను.

**కొత్త మలుపు' సినిమాలో అవకాశం ఎలా వచ్చింది?**

నా చదువుతో పాటు ఆడిషన్స్ ఇవ్వడం మొదలుపెట్టాను. అప్పట్లో నాకు తెలుగు అస్సలు రాదు. అయినప్పటికీ వెనక్కి తగ్గలేదు. దాదాపు రెండు మూడు సంవత్స రాల పాటు నిరంతరం ఆడిషన్స్ ఇస్తూ, తెలుగును నేర్చుకునేందుకు ప్రత్యేకంగా ప్రయత్నిం చాను.

**సినిమాలో మీ పాత్ర చెప్పండి.**

ఈ చిత్రంలో నా పాత్ర పేరు వరలక్ష్మి. ఆమె కొనసీమకు చెందిన అమాయకమైన గ్రామీణ యువతి. చాలా స్వేచ్ఛగా, మనసు కు నచ్చినట్టు జీవించే అమ్మాయి. సహజత్వా నికి దగ్గరగా ఉండే అందమైన పాత్ర ఇది. నటిగా నాకు మంచి అవకాశాన్ని ఇచ్చిన క్యారెక్టర్.

**కొనసీమ నేపథ్యంలో నటించడం ఎలా ఉంది?** కొనసీమ ప్రకృతి అందాలు నన్ను చాలా ఆకట్టుకున్నాయి. కొబ్బరి తోటలు, అక్కడి సంస్కృతి, ఆహారం అన్నీ నాకు కొత్త అనుభవం.

**ఈ సినిమాలో మీకు ఎదురైన ప్రధాన సవాళ్లు ఏమిటి?**

భాషే పెద్ద సవాలు. తెలుగు నేర్చుకున్న ప్పటికీ గోదావరి ప్రాంత యాసను పట్టు కోవడం అంత సులభం కాదు. అలాగే వర్షాకాలంలో షూటింగ్ జరగడంతో వాతావరణ పరిస్థితులు కూడా కొంత ఇబ్బంది కలిగించాయి.

**తెలుగు సినీ పరిశ్రమ మీ అభిప్రాయం?**

నేను స్కూల్ రోజుల నుంచే తెలుగు సినిమా లకు అభిమానిని. ముఖ్యంగా ఇక్కడి కథలు, భావోద్వేగాలు చాలా బాగుంటాయి.

**హైదరాబాద్‌లో మీకు నచ్చిన విషయం ఏమిటి?**

హైదరాబాద్ అంటే ముందుగా గుర్తొచ్చేది చికెన్ దమ్ బిర్యానీ. నాకు చాలా ఇష్టం. నగర వాతావరణం, ఇక్కడి ప్రజల ఆతిథ్యం కూడా బాగా నచ్చాయి.

# ప్రజా హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

## "వెన్నుపోటుకు రెండేళ్లు" నిరసన ర్యాలీలను విజయవంతం చేయాలి



విజయనగరం, జూన్ 11 ప్రభాతవార్త:

చిన్న శ్రీను రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో జరిగిన వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "వెన్నుపోటుకు రెండేళ్లు" కార్యక్రమంలో భాగంగా రేపు రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో భారీ నిరసన ర్యాలీలు నిర్వహించనున్నట్లు లివైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, జిల్లా జడ్పీ చైర్మన్, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త శ్రీ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) తెలిపారు. విజయనగరంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసిందని విమర్శించారు. ప్రజల ఆశలను వమ్ము చేస్తూ సంక్షేమ కార్యక్రమాలను బలహీనపరిచిందని, అభివృద్ధి మరియు పరిపాలన రంగాల్లోనూ ఆశించిన ఫలితాలు కనిపించడం లేదని పేర్కొన్నారు. గత రెండేళ్లుగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు సహా అన్ని వర్గాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. ముఖ్యంగా మహిళల భద్రత, ఉపాధి అవకాశాలు, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాల్లో ప్రభుత్వం ఆశించిన స్థాయిలో పనిచేయలేకపోయిందని విమర్శించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారు ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుంటూ, ప్రజా ప్రయోజనాల కోసం నిరంతరం పోరాడుతున్నారని తెలిపారు. ప్రజా సమస్యలపై వైఎస్సార్సీపీ చేపడుతున్న ఉద్యమాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. రేపు నిర్వహించనున్న భారీ నిరసన ర్యాలీల్లో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, సోషల్ మీడియా కార్యకర్తలు, అభిమానులు మరియు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చిన్న శ్రీను పిలుపునిచ్చారుఈసమావేశంలో.. వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శులు కెవి సూర్యనారాయణ రాజు నెక్కల నాయుడు బాబు , జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతగారు, వర్రీ నరసింహ మూర్తి , జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు జైహింద్ కుమార్ , జడ్పిటిసి గార తవుడు పాల్గొన్నారు.

# కొండపాలెం పిడిఓ వేణుగోపాలరావుకు పురస్కారం



గరివిడి ,జూన్11, ప్రభాత వార్త:

కొండ పాలెం (గరివిడి) మేజర్ పంచాయతీ అభివృద్ధి అధికారి గుల్లిపల్లి వేణుగోపాల రావు ఉత్తమ సేవలకు గాను పంచాయతీ రాజ్ శాఖ నుండి పురస్కారం అందుకున్నారు. పంచాయతీ లో పారిశుద్ధ్యం మెరుగు పరచడం లో మెరుగైన,మేలైన సేవలకు గాను పంచాయతీ రాజ్ అడిషనల్ కమీషనర్ ఎం.సుధాకర రావు ప్రశంసా పత్రాన్ని అందించారు. జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి పంచాయతీ రాజ్ సదస్సులో ఆయన ,గుల్లిపల్లి కి ప్రశంసా పత్రాన్ని అందించి సేవలను అభినందించారు. కాగా కార్యక్రమంలో జెడ్పి సి ఈ ఓ ఈ.నాగలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి మల్లిఖార్జున రావు తదితరులు పాల్గొన్నారు. కాగా శానిటేషన్ మెరుగు లో ఉన్నతాధికారులు నుండి ప్రశంసలు అందుకున్న పంచాయతీ అభివృద్ధి అధికారి వేణుగోపాల రావుకి పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. మరిన్ని సేవలతో పంచాయతీ సర్వతో ముఖాభివృద్ధికి పాటుపడాలని ,ఉత్తమ అధికారిగా కీర్తి గడించాలని కాంక్షించారు.

# విద్యుత్ సరఫరాకు అంతరాయం

మక్కువ జూన్ 11 ప్రభాతవార్త:

మావుడి సబ్ స్టేషన్ పరిధిలో (అగ్రికల్చరల్ ) ఫీడర్ నందు విద్యుత్తు లైన్ పక్కన గల చెట్టు కొమ్మలు కొట్టడం వలన శుక్రవారం ఉదయం 7.గం. ల నుండి మధ్యాహ్నం 1గం. వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడును. కావున మావుడి, సీబిల్లి పెద్దవలస, సంబర గ్రామాల్లో గల వ్యవసాయ బోర్లు కు విద్యుత్ సరఫరా అంతరాయం కలుగును అని పార్వతీపురం మన్యం జిల్లా విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి రామ నాయుడు వెల్లడించారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

# సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



దత్తిరాజేరు, జూన్ 11, ప్రభాతవార్త :

ఆపదలో ఉన్న నిరుపేదలను ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమనీ అనారోగ్యంతో బాధపడి హాస్పిటల్లో ఉన్న రోగులకు సీఎం సహాయనిది ఎంతో ఉపయోగపడుతుందని తెలుగు దేశం మండల పార్టీ అధ్యక్షుడుచప్ప చంద్రశేఖర్ అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు గురువారం పంపిణీ చేపట్టారు మండలంలోని ఎం లీంగాలవలస గ్రామానికి చెందిన మీసాల గణేష్.రూ 41.539 దాస్ పేట గ్రామానికి చెందిన బర్నికల జయలక్ష్మి రూ74, 258 గొబ్బిలం గ్రామానికి చెందిన తలె ప్రశాంత్ కుమార్ రూ.76 620 చెక్కులను బాధితులు ఇంటికి వెళ్లి టిడిపి మండల నాయకులు అందజేశారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జి మిత్తి రెడ్డి ఈశ్వరరావు బోడ సింగి సత్యనారాయణ మోహన్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా శుద్ధీకరణే సర్ లక్ష్యం : తహసీల్దార్



రామభద్రపురం..జూన్ 11.. ప్రభాత వార్త

ఓటర్ల జాబితా శుద్ధీకరణ చేయడమే సర్ లక్ష్యమని మండల రెవెన్యూ అధికారి అజారఫీజాన్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గుర వారం సర్వై వివిధ రాజకీయ పార్టీల నాయకులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనర్హుల తొలగింపు, అర్హులను ఓటర్లుగా చేర్చడం, ప్రజాభాగస్వామ్యం పెంచడమే దీని ఉద్దేశ్యమని తెలిపారు. స్వచ్ఛమైన ఓటర్ల లిస్టు తయారీ, శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించడానికి ఎలక్షన్ కమిషన్ తీసుకున్న ఈ సర్వై ఎటువంటి బేదాభిప్రాయాలు తీసుకోవద్దని తెలిపారు. నియోజకవర్గ మాస్టర్ ట్రైనీ కోట అప్పలరాజు మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి జూలై 14 వరకు బీఎల్ వోలు ఓటర్లను కలిసి వారి ఖచ్చితమైన వివరాలు తెలుసుకుంటారని అన్నారు. ఈ సర్వు ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలని ఆయన కోరారు. అయితే జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు మడక తిరుపతినాయుడు మాట్లాడుతూ ఒకే పోలింగ్ కేంద్రంలో వెయ్యి మంది ఓటర్లు ఉండడం వలన ఓటింగ్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తహసీల్దార్ దృష్టికి తెచ్చారు. ఇటువంటి కేంద్రాలను 2 కేంద్రాలుగా విభజించాలని కోరారు.

# ఉపాధి వేతనదారుల సమస్యల పరిష్కారానికి కృషి

## ఎమ్మెల్యే లోకం నాగ మాధవి



నెల్లిమర్ల, జూన్ 11, ప్రభాతవార్త:

ఉపాధి హామీ పథకం వేతన దారుల సమస్యల పరిష్కారానికి తమ కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అన్నారు. మండలంలోని తంగుడిబిల్లి గ్రామంలో ఆమె గురువారం పర్యటించారు. ఉపాధి హామీ పథకం వేతన దారులతో మాట్లాడారు వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మండుటెండల్లోనూ గ్రామాభివృద్ధి కోసం శ్రమిస్తున్న కార్మికుల సేవలను అభినందించారు. గ్రామీణ పేద కుటుంబాలకు ఉపాధి హామీ పథకం ఎంతో ఆసరాగా నిలుస్తోందని పేర్కొంటూ, శ్రామికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ గ్రామీణ కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని తెలిపారు. శ్రామికుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఉపాధి హామీ శ్రామికులు గ్రామాభివృద్ధికి మూలస్తంభాలని వారి శ్రమ ఫలితంగానే గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని అన్నారు. వారి సంక్షేమం కోసం ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లిమర్ల మండల జనసేన పార్టీ నాయకులు చనమల్లు వెంకటరమణ, మండల కోఆర్డినేటర్ కరుమజ్జి గోవింద గారు, ఎడ్ల గోవిందా , అంబళ్ల అప్పలనాయుడు , కోరాడ రమేష్ , రెడ్డి నారాయణరావు , పల్లి శీను , సువ్వాన రమణ , పతివాడ గోవిందు , దుర్గాసి శేఖర్ , నవగట్ల పైడిరాజు , ఎల్లంకి హరి తదితరులు పాల్గొన్నారు.

# శివరాంలో హత్యా సంఘటన ప్రదేశాన్ని పరిశీలించిన డిఎస్పీ



గరివిడి ,జూన్ 11, ప్రభాత వార్త:

మండలం లోని శివరాం గ్రామంలో జరిగిన హత్యా సంఘటన ప్రదేశాన్ని గురువారం చీపురుపల్లి డి ఎస్ పి సూరాడ రాఘవులు పరిశీలించారు. 20 రూపాయల విషయంలో పచ్చిపాల కనకరాజు అనే వ్యక్తి ని ఆయన బావమరిది మజ్జి శ్రీను హత్యకు పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో డి ఎస్ పి రాఘవులు ,చీపురుపల్లి సి ఐ జి.శంకర రావు,గరివిడి ఎస్ ఐ. బి.లోకేశ్వర రావు తో కలసి మృతుడు ఇంటి పరిసరాలను పరిశీలించి మృతుడు కుటుంబం తో మాట్లాడారు. కాగా హత్యకు పాల్పడిన మజ్జి శ్రీను ని ఇప్పటికే అరెస్ట్ చేశారు.

# మిగుల సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం



నెల్లిమర్ల, జూన్ 11, ప్రభాతవార్త

2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి మండలంలోని సతివాడలోని ఏపీ మోడల్ స్కూల్, జూనియర్ కాలేజ్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి 7వ తరగతి నుండి 9వ తరగతి వరకు, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థుల నుండి ఆన్లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఏ. పద్మలత ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈనెల 20వ తేదీ లోగా ఆన్లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. హెచ్ టి టి పి ఎస్ :// ఏ పి ఎం ఎస్. ఏపీ సి ఎఫ్ ఎస్ ఎస్ సమర్పించుటకు. ఇన్ / ఆన్లైన్ వెబ్ సైట్ లో దరఖాస్తు చేయాలని సూచించారు. ప్రవేశ పరీక్ష ఈనెల 24 తేదీన జరుగుతుందన్నారు.

# రీసర్వే భూములు వేగవంతంగా పూర్తి చేయాలి : కలెక్టర్



దత్తిరాజేరు జూన్ 11 ప్రభాత వార్త

మండలంలోని రీసర్వే గ్రామాలకు సంబంధించిన భూములను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్ రామసుందర్ రెడ్డి అధికారులుకు ఆదేశించారు. శుక్రవారం వంగర రెవెన్యూ పరిధిలో ఉన్న రైతులు భూములు మండల రెవెన్యూ అధికారులు రీసర్వే చేపడుతుండగా జిల్లా కలెక్టర్ రామ్ సుందర్ రెడ్డి రీ సర్వే చేపడుతున్న అధికారులును అకస్మాత్తుగా తనిఖీ చేశారు రీ సర్వే అధికారులు ఎలా చేపడుతున్నారని రైతులు భూములు యొక్క హద్దులను ఎలా గుర్తిస్తున్నారని మ్యాప్ ద్వారా వివరించాలని అధికారులకు చెప్పమన్నారు వెంటనే అధికారులు రికార్డులు స్కెచ్ ద్వారా కలెక్టర్కు వివరించారు వంగర రెవెన్యూ పరిధిలో ఉన్న సుమారు మూడు ఎకరాలు ఎర్ర చెరువును ఆ గ్రామ రైతులు ఆక్రమణకు పాల్పడ్డారని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే కలెక్టర్ తాసిల్దార్ , మండల ఇన్చార్జి సర్వేర్ కు ప్రభుత్వ చెరువు ఆక్రమించుకున్న రైతులు వివరాలు సేకరించి మిగతా రైతులకు న్యాయం చేయాలని రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు వెంటనే మండల పరిషత్ కార్యాలయంలో జల ధార జల హారతి పనులకు సంబంధిత అధికారులు తో సమావేశం నిర్వహించారు జల ధార జల హారతి పనులు మండలంలో వెనుకబడి ఉందని 365 పనులు మిగిలినవన్నీ వచ్చే రెండు వారాల్లో పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ క్షేత్రస్థాయి పర్యవేక్షణ పెంచి గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సదుపాయాలు మెరుగుపరచాలని సూచించారు తాసిల్దార్ బి సురేష్ ఏపీ డి ఇన్చార్జి సర్వేయర్ శివకుమార్ ఏవో శివాజీ మండల అధికారులు పాల్గొన్నారు.

# సర్ కార్యక్రమంపై అప్రమత్తంగా ఉండాలి

## పార్టీ అధ్యక్షులు గొంప వెంకటరావు



వేపాడ, జూన్ 12 ప్రభాతవార్త:

తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'సర్' కార్యక్రమంపై కార్యకర్తలు, నాయకులు అప్రమత్తంగా ఉండాలని ,ప్రజలకు అవగాహన కల్పించాలని వేపాడ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గొశిప వెంకటరావు కోరారు. మండల కేంద్రమైన వేపాడలోని రావి చెట్టు వద్ద తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బూత్ లెవెల్ ఏజెంట్లు , క్లస్టర్ ఇన్చార్జ్లు, యూనిట్ ఇన్చార్జ్లకు కార్యక్రమ లక్ష్యాలు, అమలు విధానం, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై వివరించారు. కార్యకర్తలే పార్టీకి, ప్రభుత్వానికి మధ్య వారధులని పేర్కొంటూ, ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ, ప్రజా సమస్యల పరిష్కారంలో క్షేత్రస్థాయి కార్యకర్తల పాత్ర, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు సమర్థవంతంగా చేరవేయడం వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. సమావేశంలో మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళల భద్రతపై అవగాహన



మెరకముడిదాం, జూన్ 11:

మండలంలో బుధ రాయవలస ఎస్సై జై లోకేష్ కుమార్ మరియు పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో బిళ్ళలవలస ,కుంచగుమడాం గ్రామాలను సందర్శించి గ్రామస్తులతో మహిళలపై జరిగే నేరాలు మరియు గంజాయి గురించి ఎక్కువగా అవగాహన పరచడమైనది ,మహిళల పట్ల జరిగే నేరాలపై అవగాహనపరిచి మహిళల భద్రత గురించి పోలీసులు ఏ విధంగా చర్యలు తీసుకుంటున్నారు అనే విషయం అవగాహన పరిచి మహిళలు కొన్ని విషయాల్లో జాగ్రత్తగా ఉండాలని తెలియపరచడమైనది. మరియు మాదకద్రవ్యాల వలన కలిగే అనర్థాలను యువతకు తెలియపరిచారు. యువత అంతా కూడా మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి బంగారు భవిష్యత్తును కాపాడుకోవాలని తెలియజేశారు. అలాగే ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు పట్ల జాగ్రత్తగా ఉండాలని యువతకు తెలియజేశారు. ప్రతి ఒక్కరు కూడా హెల్మెట్ ధరించి ప్రయాణాలు సాగించాలని తెలియజేశారు, అలాగే మహిళలకు మహిళలు భద్రత గురించి ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ గురించి శక్తి యాప్ వల్ల కలిగే ఉపయోగం గురించి, అవగాహన పరిచారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

# వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

## అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు మాధవి డిమాండ్

నెల్లిమర్ల, జూన్ 11, ప్రభాతవార్త

జిల్లాలోని వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని యునైటెడ్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు అల్లు మల్లు మాధవి డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జీవన రాణిని కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఆమె తెలిపారు. నెల్లిమర్లలో ఆమె గురువారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని కాంటాక్ట్ హెల్త్ అసిస్టెంట్ ( మేల్ ) లకు గత ఐదు నెలలుగా జీతాలు చెల్లింపు జరగలేదని తక్షణమే వాటి విడుదలకు చర్యలు చేపట్టాలని మాధవి డిమాండ్ చేశారు. కొత్త పిఆర్సి కమిషన్ వేయాలని. ఐ ఆర్ వెంటనే ప్రకటించాలని, జీవో నెంబర్ 143 రద్దు చేయాలని, పిహెచ్సిలో సూపరేజర్ పోస్టులను పాత విధానాల్లోనే కొనసాగించాలని ఆమె కోరారు. ప్రస్తుతం ప్రమోషన్ లో వస్తున్న సాంకేతిక సమస్యలను తొలగించాలని, వైద్య ఆరోగ్య శాఖలో అన్ని క్యాడర్లకు సీనియారిటీ జాబితాను విడుదల చేయాలన్నారు. ప్రాథమిక వైద్య ఆరోగ్య సేవల కల్పనలో కీలక భూమిక వహిస్తున్న ఎం పి హెచ్ ఎ ఫిమేల్ ఉద్యోగులపై రుద్దుతున్న యాప్ లు ఒత్తిడిని తగ్గించి, క్షేత్రస్థాయిలో వారు ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడానికి వీలైన పరిస్థితులను కల్పించాలని మాధవి అన్నారు. క్షేత్రస్థాయి సిబ్బందికి ఎఫ్ ఆర్ ఎస్ హాజరు నుండి మినహాయింపు కల్పించాలన్నారు. డి ఎం హెచ్ ఓ ను కలిసిన వారిలో తనతోపాటు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జే వి ప్రసాద్ రావు, ప్రతినిధులు ఆర్ జ్యోతి, సత్యనారాయణ, సుగుణ, సిహెచ్ శంకరమ్మ, పాల్గొన్నారని మాధవి తెలిపారు.

# కాలువ పనులు నిలుపుదల చేయాలి

## పంట పొలాలు దెబ్బతింటాయన్న రైతులు



దత్తి రాజేరు జూన్ 11 ప్రభాత వార్త మండలంలోని చౌదంతివలస గ్రామంలో మురుగు నీరు కాలువ పనులు నిలుపుదల చేయాలని రైతులు గేదెల శ్రీను అప్పారావు మురళి మరి కొంతమంది రైతులు ఆవేదన వ్యక్తం చేశారు జిరాయితి భూమిలెల్లి కాలువ పనులు ఎలాగ చేస్తారని టిడిపి నాయకులుని నిలదీశారు విజయనగరం కలెక్టరేట్ స్పందనలో పి జి ఆర్ ఎస్ ద్వారా ఫిర్యాదు చేసామని రైతులు తెలిపారు గ్రీవెన్స్ లో రైతులు యొక్క ఫిర్యాదులును ధిక్కరించి మండల రెవెన్యూ అధికారులు కొలతలు కొలిసి కాలువ తవ్వించారన్నారు జరాయితి భూమి లొల్లి కాలువను ఎలాగ తవ్వుతారని అధికారులను రైతులు నిలదీశారు పంచాయతీ తీర్మానం లేకుండా కాలువ తవ్వుతున్నారని ఆ కాలువ వల్ల ఎవరికి ఎటువంటి ఉపయోగం లేదన్నారు ప్రభుత్వం సొమ్ము కోసం రైతులు కు నష్టం జరిగే పనులు తెలుగు తమ్ములు చేస్తున్నారని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు కాలువ పనులు చేపడితే రైతులు పండించే పంటలుఇంటికి తీసుకురావడానికి రోడ్డు ఉండదన్నారు ఎంతో మంది రైతులకు నష్టం జరుగుతుందన్నారు అధికారులు స్పందించి కాలువ పనులు నిలుపుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

# ప్రభుత్వం ప్రైవేటీకరణ నిర్ణయం తక్షణమే నిలిపివేయాలి

## వర్కర్స్ సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్లాలని మంత్రికి వినతి



సాలూరు జూన్ 11 ప్రభాతవార్త :

రాష్ట్రంలో ఉన్న మున్సిపాలిటీల్లో ఇంకా కార్పొరేషన్లో 14 విభాగాల్లో విధులు అలాగే పౌర సేవలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తక్షణమే నిలిపివేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ వ్యతిరేకిస్తుంది. అందులో భాగంగా గురువారం సాలూరు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు మంత్రి సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతు సుప్రీంకోర్టు ఇంకా హైకోర్టు ఆదేశాలను అనుసరించి కాంట్రాక్టు కార్మికులం దరినీ పర్మినెంట్ చేసేలా లేక ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసు కువెళ్లాలని కోరారు. అలాగే పౌర సేవలు, కార్మికుల విధులు ప్రైవేట్ పరం చేయవద్దని విన్నవిం చారు. అంతేకాకుండా మున్సి పాలిటీలో రిటైరైన అలాగే సర్వీసులో ఉంటు మృతి చెందిన ఇంకా ఖాళీ అయిన స్థానాలకు వెంటనే వారి కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. టి.శంకర్రావు,రాముడు,రవి, వెంకట్రావు,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం పార్వతీపురం మన్యం 25 వార్త

# జరజాపు పేట గ్రామ దేవత పండుగ ఖరారు

## లిలివచ్చే ఏడాది మే నెలలో నిర్వహణకు నిర్ణయం



నెల్లిమర్ల, జూన్ 11, ప్రభాతవార్త

నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని జరజాపు పేట గ్రామంలో వచ్చే ఏడాది మే నెలలో శ్రీ ముత్యాలమ్మ తల్లి గ్రామ దేవత పండుగ నిర్వహించాలని , గ్రామ పెద్దలు, పండుగ నిర్వహణ పెద్దలు, గ్రామస్తులు నిర్ణయించారు. ఇందుకు సంబంధించి ఆ గ్రామంలోని శ్రీ సత్య జ్ఞానానంద ఆశ్రమంలో గురువారం నిర్వహించిన సమావేశంలో తేదీలను కూడా ప్రకటించారు. ప్రముఖ వేద పండితులు బాదంపూడి నాగబాబు (రామభద్రపురం ), వేమూరి సతీష్ శర్మ (విశాఖపట్నం), మంగి పూడి రవికాంత్ శర్మ ( జరజాపు పేట ) గతంలో 2012లో జరజాపు పేటలో గ్రామ దేవత పండుగ తేదీలను సమీక్షించి నూతన పంచాంగం ప్రకారం 2027 మే 24,25,26 తేదీల్లో గ్రామ దేవత పండుగ నిర్వహణకు సరైనదని ప్రకటించగా పండుగ నిర్వహణ పెద్దలు, గ్రామ పెద్దలు, గ్రామస్తుల తో కూడిన గ్రామసభ ఆమోదించారు. ఈ సందర్భంగా ఆ ముగ్గురు వేద పండితులకు గ్రామ పెద్దల చేతుల మీదుగా మర్యాదపూర్వకంగా ఘన సత్కారం చేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ ఉన్నత స్థాయి ప్రజాప్రతినిధులు సహకారంతో గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉందని, ఈ దిశగా గ్రామస్తులు ప్రణాళిక బద్ధంగా అడుగులు వేయాల్సి ఉందని అన్నారు. ఈ సమావేశంలో గ్రామ పెద్దలు, పండుగ పెద్దలు గ్రామస్తులు, యువత ఉద్యోగులు పాల్గొన్నారు.

# యోగాతో ఆరోగ్యం

యోగాంధ్ర కార్యక్రమంలరాష్ట్ర మంత్రి సంధ్యారాణి , ప్రభుత్వ విప్ జగదీశ్వరి



గరుగుబిల్లి జూన్ 11 ప్రభాతవార్త

పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం నియోజకవర్గ పరిధిలోని తోటపల్లి రిజర్వాయర్ వద్ద ఉన్న పర్యాటక ప్రాంతమైన ఐటిడిఏ పార్కులో గురువారం నాడు అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన "యోగాంధ్ర" కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గిరిజన సంక్షేమ, స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి గుమ్మిడి సంధ్యారాణి గారు, ప్రభుత్వ విప్ మరియు కురుపాం నియోజకవర్గ శాసనసభ్యురాలు శ్రీమతి తోయక జగదీశ్వరి గారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ యోగ అనేది భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప జీవన విధానమని పేర్కొన్నారు. శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఆరోగ్యకరమైన జీవనశైలికి యోగ ఎంతో దోహదపడుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో యోగను భాగం చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ ప్రజల్లో యోగపై మరింత అవగాహన పెంపొందించి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. యువతతో పాటు అన్ని వయసుల వారు యోగ సాధన చేయడం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలను దూరం చేసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో మన్యం జిల్లా కలెక్టర్ ఎన్ ప్రభాకర్ రెడ్డి, పాలకొండ సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, ఉమ్మడి విజయనగరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డొంకాడ రామకృష్ణ, జిల్లా స్థాయి అధికారులు, విద్యార్థులు, యోగా సాధకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మన బడి - మన పండుగకు హాజరు కావాలి



రామభద్రపురం.. జూన్ 11.. ప్రభాత వార్త

వేసవి సెలవల అనంతరం పాఠశాల పునః ప్రారంభం నాడు ప్రభుత్వ ఆదేశాలతో పాఠశాలలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న మన బడి - మన పండుగ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలని నాయుడువలస పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె సి రాజు తల్లి తండ్రులను కోరారు. గురువారం ఆయన ఏం డి ఎం పనివారు, పాఠశాల ఆయాతో కలిసి పాఠశాల పరిశుభ్రతా కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా తరగతి గదులు, కూర్చొనే బల్లలు, మరుగుదొడ్లు,వంటగది వంటపాత్రలు, వాటర్ ట్యాంక్, పాఠశాల ఆవరణం శుభ్రపరచారు. అనంతరం ఆయన ఉపాధ్యాయులు,విద్యార్థులతో కలిసి పిల్లల తల్లితండ్రుల గృహాలకు సందర్శించి పాఠశాల నేడు ( 12.6.26 శుక్రవారం) పునః ప్రారంభిస్తున్నామని పిల్లలను పాఠశాలకు పంపించాలని కొరుతూ పాఠశాలలో నిర్వహించే మన బడి -మన పండుగ కార్యక్ర మానికి హాజరు కావాలని తల్లితండ్రులను ఆహ్వానించారు. గ్రామ పెద్దలు,ఎస్ ఎం సి సభ్యులు,తల్లితండ్రులు విద్యార్థులతో పండుగ వాతావరణంలో కార్యక్రమాన్ని ని ర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

# రోడ్డు వేసారు ... నాణ్యత మరిచారు : గిరిజనులు



సాలూరు జూన్ 11 ప్రభాతవార్త :

సాలూరు మండలం సారిక పంచాయితీ పలు గిరిజన గ్రామాలకు అనుసంధానంగా వేసిన బీటీ రోడ్డులో నాణ్యత లోపం ఉందని సీపీఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో గిరిజనులు గురువారం నిరసణ చేపట్టారు. అనంతరం పార్టీ కార్యదర్శి మర్రి.శ్రీనివాసరావు మాట్లాడుతు దండిగాం నుండి నేరళ్లవలస వరకు అలాగే రాజుపేట పంచాయతీ నుండి పునికివలస వరకు కొత్తగా వేసిన బీటీ రోడ్డులో నాణ్యతను లోపం కొట్టొచ్చినట్టు కనబడుతుంద న్నారు. అలాగే ఐటీడీఏ, పంచాయతీరాజ్ శాఖలు అధికారులు ఉదాసీనంగా ఉండడంతో కాంట్రాక్టర్ నిర్మించిన రోడ్డు నాసిరకంగా ఉందని ఆరోపించారు. అందువలన నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు నిర్మాణం చేపట్టిన వారిపై జిల్లా అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జోగయ్య, తిరుపతి, రవి,బోడమ్మ, వెంకటేష్,సన్యాసి,శ్రీను,అప్పయ్య,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# సంతలో మలేరియాపై అవగాహన ర్యాలీ



కురుపాం, జూన్ 11ప్రభాతవార్త.

మలేరియా వ్యతిరేక మాసోత్సవాలలో భాగంగా కురుపాం వారపు సంతలో గురువారం రావాడ రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. జూన్ 1 నుండి 30 వరకు జరిగే ఈ మాసోత్సవాల్లో భాగంగా, ప్రజలందరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు ప్లకార్డులు ప్రదర్శిస్తూ, నినాదాలు చేస్తూ ప్రజల్లో చైతన్యం నింపారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న తరుణంలో దోమల వ్యాప్తి చెందకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.? ఈ కార్యక్రమంలో రావాడ రామభద్రపురం పి ఎహ్ సి డాక్టర్ సుష్మిత, హెల్త్ సూపర్వైజర్ ఇస్తర్ రాణి, ఎంటిఎస్ రాజశేఖర్, ఇతర వైద్య సిబ్బంది మరియు ఆశా వర్కర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కాంక్షిస్తూ తిరుమలలో మంత్రి కొండపల్లి కాలినడక యాత్ర

## - కూటమి రెండేళ్ల పాలనకు స్వామి వారి ఆశీస్సులు



విజయనగరం, జూన్ 11 : ప్రభాతవార్త:

రాష్ట్రాభివృద్ధికి, కూటమి ప్రభుత్వానికి తిరుమల స్వామి వారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం ఆయన ఏపీలో కూటమి పాలన విజయవంతంగా రెండేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో అలిపిరి మెట్లమార్గం ద్వారా తిరుమల శ్రీవారి దర్శనానికి బయలు దేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండేళ్లలో శ్రీవారి ఆశీస్సులతో ప్రజలకు ఎంతో మేలు జరిగిందని... రాష్ట్ర ప్రజల శ్రేయస్సును, రాష్ట్రాభివృద్ధిని కాంక్షిస్తూ కాలినడక యాత్ర చేస్తున్నట్టు తెలిపారు. కూటమి ప్రభుత్వానికి రెండేళ్ల పాటు మద్దతుగా నిలిచిన రాష్ట్ర ప్రజలందరికీ మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గారు రాష్ట్రాన్ని మరింతగా అభివృద్ధి చేసేలా ఆయనకు మరింత శక్తి ఇవ్వాలని శ్రీవారిని కోరుకుంటానని మంత్రి తెలిపారు. భవిష్యత్తులోనూ రాష్ట్ర ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేలా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో ముందుకు వెళతామని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

12-06pg10exHMNWJQE.qxd:12-06pg10exHMNWJQE.qxd 1/1/02 6:08 AM Page 1






### టి20 ముంబయి లీగ్‌లో..
## సిక్సర్లతో శివమ్ వీరంగం

**న్యూఢిల్లీ:** టి20 ముంబై లీగ్‌లో టీమిండియా టీ20 ప్లేయర్ శివమ్ దూబే శివాలెత్తి వీరంగం సృష్టించాడు. ఈ టోర్నీలో అంధేరి ఆర్బ్కు సారథ్యం వహిస్తున్న శివమ్ గురువారం ఆకాశ్ టైగర్స్‌తో జరిగిన తొలి సెమీ ఫైనల్లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టాడు. ఫలితంగా అతడి జట్టు ఫైనల్స్‌కు దూసుకుపోయింది. ఈ మ్యాచ్‌లో తొలుత బంతితో (3-0-16-1) రాణించిన శివమ్ ఆ తర్వాత బ్యాటింగ్‌లో చెలరేగిపోయాడు. ప్రత్యర్థి నిర్దేశించిన 151 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఒంటిచేత్తో తన జట్టును గెలిపించాడు. 26 బంతుల్లో ఒ బౌండరీ, 5 సిక్సర్లతో విరుచుకుపడి అజేయమైన 45 పరుగులు చేశాడు. తద్వారా అతడి జట్టు మరో 9 బంతులు మిగిలిఉండగానే విజయతీరాలకు చేరింది. లక్ష్య ఛేదనలో దూవేకు దివ్యాంశ్ సక్సేనా (34), ప్రసాద్ పవార్ (26), గౌరవ్ జాథర్ (11 నాటౌట్) సహకరించారు. ఈ జట్టు స్టార్ ఆటగాళ్లు ముషీర్‌ఖాన్ (0), అర్జున్ టెండూల్కర్ (13) ఈ మ్యాచ్‌లో నిరాశపరిచారు. అంతకు ముందు ఆకాశ్ టైగర్స్ తరపున ఎవరూ చెప్పుకోదగ్గ స్కోర్లు చేయలేదు. కెప్టెన్ సర్ఫరాజ్ ఖాన్ (34), జయ్ గోకుల్ బిస్తా (35) మాత్రమే ఓ మోస్తరు స్కోర్లు చేశారు. మిగిలిన ఆటగాళ్లలో ఒక్కరు కూడా కనీసం 20 పరుగుల మార్కును తాకలేదు. అంధేరి బౌలర్లల అశుతోష్ 2 వికెట్లు తీయగా, అర్జున్ టెండూల్కర్, ముషీర్‌ఖాన్, శివమ్ దూబే, ప్రసూన్ సింగ్, అజయ్ మిశ్రా తలో వికెట్ తీశారు.

# నేటి నుండి మహిళా టి20 వరల్డ్ కప్




**న్యూఢిల్లీ:** మహిళా టీ20 ప్రపంచ కప్ 2026 కౌంట్‌డౌన్ మొదలైంది. ఇంగ్లండ్ వేదికగా శుక్రవారం నుంచి విమెన్స్ టీ20 వరల్డ్ కప్ జరగబోతున్నది. హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్సీలోని భారత జట్టు తన తొలి మ్యాచ్‌లో పాకిస్థాన్‌తో తలపడనుంది. ఈ నెల 14న బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో రాత్రి 7 గంటలకు భారత్ తమ పోరాటాన్ని మొదలుపెడుతుంది. ఇప్పటివరకు టీ20 ప్రపంచ కప్ గెలవని భారత్, ఈసారి చరిత్ర సృష్టించాలని యోచిస్తోంది. గత కొన్నేళ్లుగా ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా గడ్డపై సిరీస్ విజయాలు సాధించి భారత్ తన సత్తా చాటినప్పటికీ, టోర్నీకి ముందు దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్‌తో జరిగిన సిరీస్‌లలో ఓటమి జట్టు సన్నద్ధతపై కొన్ని ప్రశ్నలను లేవనెత్తింది. భారత్ గ్రూప్ ఎ లో ఉంది. ఇందులో పాకిస్థాన్, నెదర్లాండ్స్, దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్, ఆస్ట్రేలియా వంటి జట్లు ఉన్నాయి. భారత జట్టులో షెఫాలీ వర్మ, స్మృతి మంధాన, యాస్తిక భాటియా, జెమీమా రోడ్రిగ్స్, హర్మన్‌ప్రీత్ కౌర్, రిచా ఘోష్, భారతి ఫుల్మాలి, దీప్తి శర్మ, రాధా యాదవ్, అరుంధతి రెడ్డి, శ్రేయంక పాటిల్, శ్రీ చరణి, క్రాంతి గౌడ్, రేణుకా ఠాకూర్, నందిని శర్మ ఉన్నారు. టాప్ ప్లేయింగ్ ఎలెవన్‌లో షెఫాలీ వర్మ, స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్, హర్మన్‌ప్రీత్ కౌర్, రిచా ఘోష్, భారతి ఫుల్మాలి, దీప్తి శర్మ, అరుంధతి రెడ్డి, శ్రీ చరణి, శ్రేయంక పాటిల్/ నందిని శర్మ, రేణుకా ఠాకూర్ ఉండే అవకాశం ఉంది. మిడిల్ ఆర్డర్‌లో జెమీమా రోడ్రిగ్స్ బాధ్యత తీసుకోనుంది ఇంగ్లాండ్ కండిషన్స్‌లో 130.25 స్ట్రైక్ రేట్‌తో రాణించిన రికార్డు ఆమెకు ఉంది. 21 ఏళ్ల లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్

### 14న భారత్, పాక్ మధ్య హైఓల్టేజ్ మ్యాచ్

శ్రీ చరణి బౌలింగ్‌లో ఖిఎక్స్ ఫ్యాక్టర్‌గా మారవచ్చు. అదే సమయంలో, యాస్తిక భాటియా నెమ్మదైన బ్యాటింగ్, రిచా ఘోష్ ఫామ్ జట్టుకు ఆందోళన కలిగిస్తోంది. స్మృతి మంధాన తన టీ20 అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌లో 4500 పరుగుల మైలురాయిని అందుకోవడానికి మరో 167 పరుగుల దూరంలో ఉన్నారు. అరుంధతి రెడ్డికి 50 టీ20 వికెట్లు పూర్తి చేయడానికి మరో రెండు వికెట్లు కావాలి. మహిళల టీ20 వరల్డ్ కప్‌లో భారత్ లీగ్ మ్యాచ్‌ల షెడ్యూల్ చూస్తే ఈ నెల 14న డ్జ్‌బాస్టన్ (బర్మింగ్‌హామ్)లో రాత్రి 7 గంటలకు భారత్ వర్సెస్ పాకిస్తాన్ మధ్య జరిగే తొలి టీ20 మ్యాచ్ ప్రారంభం అవుతుంది. 17న భారత్ వర్సెస్ నెదర్లాండ్స్, 21న భారత్ వర్సెస్ సౌతాఫ్రికా, 25న భారత్ వర్సెస్ బంగ్లాదేశ్, 28న భారత్ వర్సెస్ ఆస్ట్రేలియా మధ్య మ్యాచ్‌లు జరగనున్నాయి.

## ప్లేయర్ ఆఫ్ మంత్ నామినీస్‌లో బంగ్లాదేశ్ హవా

**న్యూఢిల్లీ:** మే నెలకు సంబంధించి ప్లేయర్ ఆఫ్ ది మంత్ నామినీస్ పేర్ల జాబితాలో బంగ్లాదేశ్ ఆటగాళ్ల హవా కనిపించింది. ఈ మేరకు గురువారం ఐసీసీ నామినీస్ పేర్లను ప్రకటించింది. గత నెలలో బంగ్లాదేశ్ జట్టు పాకిస్తాన్‌పై టెస్ట్ సిరీస్ విజయం (2-0తో క్లీన్ స్వీప్) సాధించింది. ఈ సీరిస్‌లో విశేషంగా రాణించిన వికెట్‌కీపర్ బ్యాటర్ ముష్ఫికర్ రహీం, స్పిన్ బౌలర్ తైజుల్ ఇస్లాం ప్లేయర్ ఆఫ్ ద మంత్ నామినీస్‌గా ఎంపికయ్యారు. ముష్ఫికర్ పాక్‌పై రెండు టెస్టుల్లో 253 పరుగులు చేశాడు. రెండో టెస్టులో 137 పరుగుల భారీ ఇన్నింగ్స్‌తో మ్యాచ్‌ను పూర్తిగా బంగ్లాదేశ్ వైపు తిప్పేశాడు. అలాగే తైజుల్ పాక్‌తో జరిగిన సిరీస్‌లో 13 వికెట్లతో సిరీస్ టాప్ వికెట్ టేకర్‌గా నిలిచాడు. రెండో టెస్టులో మ్యాచ్ విన్నింగ్ స్పెల్ (6/120) ఇందులో హైలైట్‌గా నిలిచింది. మరో నామినీగా నేపాల్ ఆల్‌రౌండర్ దీపేంద్ర సింగ్ ఎయిరీ ఎంపికయ్యాడు. దీపేంద్ర గత నెలలో ఆడిన వన్డేల్లో బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో చెలరేగాడు. యుఏఈపై జరిగిన వన్డేల్లో ఓ సెంచరీ, రెండు హాఫ్ సెంచరీలు (యూఎస్ఏపై) సహా 8 వికెట్లు తీశాడు. అతడి ఆల్ రౌండ్ ప్రదర్శన వల్ల నేపాల్ కీలక విజయాలు సాధించింది. ఫలితంగా ప్లేయర్ ఆఫ్ ద మంత్ వార్డుకు నామినేట్ అయ్యాడు. ఇక మహిళల విషయానికి వస్తే ఇంగ్లండ్ బౌలర్ లారెన్ బెల్, పాకిస్తాన్ ఓపెనింగ్ బ్యాటర్ గుల్ ఫెరోజా, న్యూజిలాండ్ బ్యాటర్ మ్యాడీ గ్రీన్ మే నెల ప్లేయర్ ఆఫ్ ద మంత్ అవార్డుకు నామినేట్ అయ్యారు.




## వన్డే ట్రై సిరీస్‌లో భారత్ ఓటమి

**న్యూఢిల్లీ:** ట్రై సిరీస్‌లో భాగంగా శ్రీలంక వేదికగా అఫ్ఘాన్‌తో జరిగిన వన్డే మ్యాచ్‌లో భారత్ జట్టు ఓటమిని చవి చూసింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 49 ఓర్లలో 349 పరుగులు చేసింది. ఇక వర్షం కారణంగా అఫ్ఘానిస్తాన్ టార్గెట్‌ను 38 ఓవర్లలో 294 రన్స్‌కి కుదించగా 4 పరుగుల తేడాతో డిఎస్‌ఎస్ పద్ధతితో అఫ్ఘాన్ విజయం సాధించింది. శ్రీలంకలోని దంబుల్లా స్టేడియం వేదికగా గురువారం జరిగిన వన్డే మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ఇండియా జట్టు నిర్ణీత 49 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 349 పరుగుల భారీ స్కోర్ చేసింది. వికెట్ కీపర్ ప్రభ్‌సిమ్రాన్ సింగ్ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో 84 పరుగులు చేశగా. కెప్టెన్ తిలక్ వర్మ, రుతురాజ్ గైక్వాడ్ చెరో హాఫ్ సెంచరీతో స్కోర్ బోర్డును ముందు తీసుకెళ్లారు. ఇక తొలిసారి ఇండియన్ టీమ్‌లో చోటు దక్కించుకున్న వైభవ్ సూర్యవంశీ కేవలం 22 బంతుల్లో 44 పరుగులు చేసి అఫ్ఘాన్ ముందు భారీ లక్ష్యాన్ని ఉంచాడు. ఆఫ్ఘానిస్తాన్ బ్యాటింగ్ చేస్తుండగా ఒక్కసారిగా వర్షం కురవడంతో ఇన్నింగ్స్‌ను 38 ఓవర్లకు కుదించింది. 294 పరుగుల టార్గెట్‌ను ఫిక్స్ చేశారు. తర్వాత మళ్లీ బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘానిస్తాన్ 25.5 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 177 పరుగులు చేసింది. మళ్లీ వర్షం రావడంతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో ఆఫ్ఘానిస్తాన్ 4 పరుగులు తేడాతో భారత్‌పై విజయం సాధించింది. ఆఫ్ఘన్ కెప్టెన్ ఇమ్రాన్ మీర్, బాహిర్ షా అజేయ చెరో ఆఫ్ సెంచరీతో తమ జట్టును విజయంలో కీలక పాత్ర పోషించారు.









Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Flat.No. 22, G Block ,Industrial park Auto Nagar , Gajuwaka, Visakhapatnam-530 012, Phones:2706784,2706785,2706786,2706787,2706622, Fax: 2706522, RNI No.64864/96, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. H/SD/337/12-14.